కంచి పరమాచార్య

అమృతవాణి

ప్రథమ భాగము

అద్వైతం



అనువక్త:

దేవరకొండ శేషగిరిరావు

అద్వైతం

అమృతవాణి ప్రథమ భాగము

ఓం జగద్గురుం ప్రణమామ్యహం

జయ జయ జయ జగద్గురుం ప్రణమామ్యహం
శ్రీ చంద్రశేఖర సద్గురుం ప్రణమ్యాహం
చంద్రశేఖర గురుం వందే శుద్ధ సత్వ స్వరూపిణం
కామ కోటి పీఠాధిప సద్గురుం ప్రణమామ్యహం
ఆదిశంకర నమోతేజం అదికారణ కారణం
ధర్మరక్షణ రూపిణం, వేదరక్షణ కారణం
గో రక్షణ దీక్షణం ప్రేమవీక్షణ వీక్షణం
జగత్కుటుంబినీయ సార్థకం జగద్గురుం ప్రణమామ్యహం

శ్రీ శ్రీ శ్రీ చంద్రశేఖర మహాస్వామి, కంచి పీఠాధిపతులు, జగద్గురువులు, బ్రహ్మభూతులు, సర్వదేశకాలవస్తు పరిచ్ఛేదరహిత స్వరూపులు. వారు శుద్ధ సత్వ స్వరూపులు. వారి తేజస్సులో సాక్షాత్తు ఆదిశంకరులు. వారు ధర్మరక్షణ, వేదరక్షణ, గో రక్షణ కోసం అవతరించిన శ్రీమన్నారాయణ స్వరూపులు. వారి వీక్షణం పరిపూర్ణమైన ప్రేమవీక్షణం. వసుధైక కుటుంబం అనే ఉపనిషత్ వాక్యం వారిపట్ల సంపూర్ణ సార్థకం. అటువంటి జగద్గురువులకు మా ప్రణామాలు.

భరతభూమి పుణ్యభూమి, కర్మభూమి. ఎందరో మహనీయుల జన్మకు కారణమై సామాన్య ప్రజానీకాన్ని సన్మార్గంలో నడపటానికి కృషి చేసిన ఆదిశంకరులు, విద్యారణ్యుల కోవకి చెందినవారు 68వ కంచి పీఠాధిపతి శ్రీ పరమాచార్య వారు ప్రాతఃస్మరణీయులు. వారి బోధలు, వారి ఉపదేశాలు - ఆచరణీయములు. అనుసరణీయములు. భక్తుల జన్మకర్మల విధివిధానాలను సరిదిద్దుకునేటువంటి సూచికగా, ప్రత్యక్ష ధర్మనిధిగా సత్యవేద సారమైన, సకల ఉపనిషత్, సకల శాస్త్రముల సారము నుండి నిబిడీకృతమైనది ఈ అమృతవాణి.

ఈ అమృతవాణి ప్రథమభాగము - అద్వైతం తెలుగులోకి అనువదించిన దేవరకొండ శేషగిరిరావు గారిని, ముద్రించి ఆంధ్ర పాఠకలోకానికి అందించిన మహావిద్యాపీఠ నిర్వాహక మండలి వారికి స్వామివారి అనుగ్రహం ప్రసాదించాలని ప్రార్థిస్తూ....

-జి. గోపాలకృష్ణ హనుమత్ ప్రసాద్

గుడివాడ

అనుగ్రహం

అందరికీ అంతో ఇంతో అద్వైతం గురించి తెలుసు. అనుభవం మాట దేవుడెరుగు. అనుభవం లేని వారిమాటలు పెదవుల నుండే, దివ్యానుభూతి కలిగిన వారి మాటలు నాభినుండే వెలువడతాయి. అవి మన హృదయాలను తాకుతాయి. అయితే ఒక్కొక్కరిది ఒక్కొక్క శైలి. శ్రీరామకృష్ణ పరమహంస ప్రవచనాలను చదివినపుడు తల్లి ఒడిలో పిల్ల ఉన్నట్లుగా ఉంటుంది. ఇక వివేకానందుల వారి శైలి శ్రావణ మాసపు గంగ. మనరెండు చెంపలను ఛెళ్ళుమని వాయించినట్లుంటుంది కూడా. కొండనెక్కుతున్న భావన లేకుండా కొండ నెక్కిస్తారు రమణులు. రామతీర్థులు మనకు పరుగు నేర్పిస్తారు. నీ అంతట నీవే తెలిసికో అంటూ భావం పై స్వారి చేస్తారు, శ్రీ జిడ్డు కృష్ణమూర్తి గారు ఇక మన కంచి పరమాచార్యుల బాణీయేమిటి? తల్లి అరటి పండును ఒలిచి పిల్ల నోట్లోపెట్టినట్లుంటుంది. మ్రింగడం కష్టమైతే దగ్గరుండి కంఠాన్ని నిమురుతున్నట్లుంటుంది. ఆయాకాలాలలో మహాత్ములవతరించి మార్గనిర్దేశనం చేస్తారు. తల్లితో ఎందుకుపోల్చినట్లు ? ఎందుకా?

భార్యలున్నారు	సహధర్మచారిణులు లేరు
"మేస్టర్లు"న్నారు	గురువులు లేరు
కొడుకులున్నారు	పుత్రులు లేరు
పరిచయంకలవారున్నారు	మిత్రులు లేరు
శుభాలకేవచ్చేవారున్నారు	బంధువులు లేరు

కాని తల్లిదండ్రులున్నారు, ఉంటారు. అందుకే తల్లితో పోలిక

స్వామి వారి అనుగ్రహభాషణాలను ముందు తమిళంలో ముద్రించగా శ్రీకంచి మహాస్వామి పీఠారోహణ శతాబ్ది మహోత్సవట్రస్టువారు ఏడు

సంపుటాలలో, కొని వేలపుటలతో ఆంగ్లంలో ప్రచురించారు. Voice of God పేరుతో.

చాలాకాలం వెనుక జగద్గురుబోధలనే పేరుతో సాధనగ్రంథ మండలి, తెనాలి వారు పది సంపుటాలను ప్రచురించారు. దీనిననువదించిన శ్రీయం.వి.బి.యస్. శర్మగారికి (విశాఖ) ఆస్తిక పాఠకలోకమెంతో ఋణపడియుంది.

వాటిల్లో లేని విషయాలను తెనిగించడానికి పూనుకొనగా, సంస్కృతి, సంప్రదాయాల పట్ల విశేషాదరణ కలిగిన సహృదయులు శ్రీవావిలాల ఉమపతి C.A. గారు ప్రోత్సహించారు. స్వామి వారి అద్వైత సాధనకు, 'గురుసంప్రదాయా'నికి నేను చేసిన అనువాదాలు ఇదివరకే ప్రచురించారు ప్రస్తుత గ్రంథాన్ని ప్రచురించుటకు ముందుకు వచ్చారు. వారికి జేజేలు.

జగద్గురుబోధలలో అద్వైతాన్ని గూర్చి కొన్ని వ్యాసాలే ఉన్నాయి. పూజ్యులగు శ్రీచల్లా విశ్వనాథశాస్త్రి గారు ప్రచురించిన సనాతన ధర్మములోనూ కొన్నిపుటలు అద్వైతం గురించియున్నాయి.

పై ఆంగ్ల గ్రంథంలోని 1,2,4 సంపుటాలలో ఉన్న అద్వైతాన్ని యథాశక్తి అనువదించాను. ఆంగ్లంలోనే సుమారు 400 పుటలుంది.

ఇందుపునరుక్తులుంటాయి. వివిధ ప్రదేశాలలో ప్రసంగించడం వల్లగాని, లేదా శ్రోతలలో విషయం బాగానాటాలనే భావంతోగాని చెప్పినది చెప్పినట్టు కన్పిస్తుంది. వేదమంత్రాలలో పునరుక్తి దోషం లేదని అంటారు. స్వామి వారు మాటలు మంత్రాలు కావా? ఇంతకూ స్వామివారు నన్ను పట్టుకొన్నారా? నేనే స్వామివారిని పట్టుకొన్నానా ? తెలియదు. తెలియక పోవడంలోనూ ఆనందం ఉంది.

ఓం గణాధిపతయే నమః

ఓం శ్రీ సద్గురు పరబ్రహ్మణే నమః
సదాశివ సమారంభాం వ్యాస శంకర మధ్యమాం ।
అస్మదాచార్య పర్యంతం వందే గురు పరంపరాం ॥

ఎందరో మహానుభావులను కన్న పుణ్యభూమి మన భరత భూమి. మాయామోహితులై సంసార లంపటంలో పడి కొట్టుమిట్టాడుతున్న వారిని ఉద్ధరించటానికి ఆదిశంకరులు, మధ్వాచార్యులు, బుద్ధుడు, రమణ మహర్షి, నాయన వంటివారెందరో అవతరించారు. ఆ కోవలోనివారే జగద్గురువులు, నడిచే దైవం శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు. ఇలాంటి మహనీయులు నడయాడిన పుణ్యభూమిలో పుట్టడం నిజంగా భారతీయులు చేసుకున్న పూర్వజన్మ సుకృతం. పరమపూజ్యులు శ్రీ కంచి స్వామివారి అనుగ్రహభాషణాన్ని అమృతవాణి –1 అద్వైతం పేరున సులభగ్రాహ్యమైన చక్కటి తెలుగులో శ్రీ దేవరకొండ శేషగిరిరావు పాఠలోకానికి అందించారు. ఆస్తికలోకానికి, ముముక్షువులకు ఉపయుక్త గ్రంథమిది.

సంసారాన్ని మాయాతీత దృష్టితో చూస్తూ విశ్వమంతా పరమాత్మ స్వరూపంగా భావించాలి అని అద్వైతం బోధిస్తుంది. అద్వైతభావనలో సుఖదుఃఖాలుండవు. స్వయం ప్రకాశమైన ఆత్మయే అన్నిటికీ శరణ్యం. సత్కర్మ, జ్ఞానాల వల్ల మనలో పాపాలు నశిస్తాయి. అది ధ్యానం వల్లనే సాధ్యం. దుఃఖాలన్నిటికీ కారణమయిన కోరికను ఎదుర్కొనడానికి అద్వైతమే సాధనమని పరమాచార్యుల ఉవాచ. వారి దృష్టిలో బంధాలకు కారణమైనవి, నా దృష్టికి వచ్చినవి కొన్ని:

కోరిక: దుఃఖం కల్గినపుడు మాత్రమే దైవం గుర్తుకు వస్తుంది. సుఖంగా ఉన్నప్పుడు దైవాన్ని పక్కనబెట్టి మనసు సుఖానికై వెంపర్లాడుతుంది. సుఖం శాశ్వతం కాదు. కోరికలకు బానిసైతే దుఃఖం వెన్నంటే వుంటుంది. కోరిక ఉత్తమ గుణాలను హరింపజేస్తుంది. ఆత్మకంటే భిన్నమైన మనస్సే కోరికలకు మూలం.

అది తృప్తి పడకపోవడమే కోరిక. కోరిక అనేక అనర్థాలకు కారణం.

బాధలు: ఇష్టమైనది దూరమయినా, మనకు దక్కకపోయినా క్రోధం కలిగి తప్పులు చేస్తాం. అసలు కోరికే లేకపోతే పాపం చేయవలసిన అవసరమే ఉండదు. మనకన్నా భిన్నంగా మరొకటున్నదని భావించడం వల్లే బాధలన్నీ అభేదంగా, అద్వైతంగా భావిస్తే అంతా సుఖమే. చూసేది, చూపబడేదీ ఒకటైనపుడు శతృత్వము, భయమూ రెడూ ఉండవు. మనం చూసేవన్నీ అసత్యమనీ, అన్నీ ఈశ్వర స్వరూపాలేనని వేదాంతం అంటున్నది. ఆ జ్ఞానం లేకపోవడం వల్లే బాధలు.

ఆత్మహత్య: మనస్సు తృప్తిపడక జీవితంపై విరక్తితో కొందరు ఆత్మహత్యకు పాల్పడుతూ ఉంటారు. బాధలనుండి విముక్తికి ఆత్మహత్య పరిష్కారం కాదనీ అది మరొక పాపమనీ, అలా ఆత్మహత్య చేసుకున్నవారు దయ్యమై ఆకలిదప్పులతో అలమటిస్తూ ఏ శరీరాన్నో ఆవహించి ఇతరులను బాధిస్తారు. చివరకు మరో జన్మ ఎత్తి ఆత్మహత్య ఫలమనుభవించాలని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి.

బంధ విముక్తికి స్వామివారు చూపిన పరిష్కారం:

సత్కర్మ: కర్మలు ఏకాగ్రతకు దోహదం చేస్తాయి. సత్కర్మలు మనలోని దుష్టభావాలను పోగొడతాయి. చిత్తశుద్ధితో స్వార్థ భావనలు లేకుండా చేసే పనులే కర్మయోగమంటారు. కోరికలతో చేసే పనులు మరుజన్మకు కారణాలవుతాయి. స్వార్థ భావన లేక ఆత్మలో ఐక్యమవడమే అకామమని ఉపనిషద్సూత్రం. శంకరులు స్మార్త సంప్రదాయాన్ని పునఃప్రతిష్ఠించారు. పూజ కర్మలు చేయడానికి ముందు సంకల్పము నేర్పాటు చేసిన శంకరులు పూజా విధిని పరమేశ్వర ప్రీత్యర్థం చేయాలని, చేసిన పని చిన్నదైనా పెద్దదైనా ఈశ్వరార్పణ బుద్ధితోనే చేయాలని కట్టడి చేసారు. ఈ భావన మనలో అద్వైతానికి పాదుకాగలదు.

ఆత్మ: ఇంద్రియ మనో బుద్ధ్యాత్మలలో ఉత్తరోత్తరమైన ఆత్మయే శ్రేష్ఠమైనది. ఆత్మయే మహోత్కృష్టమైనది. అదియే సత్యము. బుద్ధికి ఆధారభూతమయిన ఆత్మయే ఉన్నతమైనది. అది తత్ సత్. తత్ అనగా ఎన్నడూ మారనిది.ఒకే విధంగా ఉండేది. ఆత్మ మంచి చెడులకు అతీతమైనట్టిది. జీవుని నిజమైన, శాశ్వతమైన

స్వరూపం ఆత్మ. అందుకే ప్రకృతికి అతీతుడయిన ఈశ్వరుని ప్రేమతో, శక్తితో ఆరాధించాలి.

సగుణ – నిర్గుణ బ్రహ్మ: సమస్త కల్యాణ గుణములు కలిగిన సగుణ బ్రహ్మ ఈశ్వరునే శైవ, విశిష్టాద్వైతులు అంగీకరిస్తారు. అద్వైతులుమాత్రం భగవంతునికి సగుణ నిర్గుణ రూపాలుంటాయని నిర్గుణ బ్రహ్మము నిష్క్రియమని సగుణ బ్రహ్మమే సృష్టికార్యాన్ని నడుపుతోందని చెబుతారు. సత్యమైన వస్తువునందే జగత్తున్నదని అద్వైతం చెబుతోంది. ఆ సత్యమే ఆత్మ బ్రహ్మ, ఈశ్వరుడూను. ఈశ్వరుడు సర్వవ్యాపి. భాగవతం కూడా అదే చెబుతుంది. ఇందుగలడందులేడని సందేహము వలదు. ఆ సర్వవ్యాపిమైన ఈశ్వరునిలోనే మనమూ లీనం కావాలి. అపుడు భేదభావం ఉండదు.అంతటా ఈశ్వరుని చూసినపుడు మనసులో ఆందోళన, కోరిక, పాపస్పర్శ, పునర్జన్మ ఉండవు. ఇలా ప్రతి వస్తువుకు ఆధారం బ్రహ్మమని తెలుసుకోవడమే అద్వైతం. భగవంతుని పట్ల అచంచల విశ్వాసం, భక్తి కలిగి ఉండాలనీ, ఈశ్వరానుగ్రహం ఉంటేనేగానీ అద్వైతం పట్టుబడదనీ అద్వైతశాస్త్రం అంటోంది.

ఆచరింపవలసినవి: సత్కర్మలు చేస్తూ భక్తి వినయములతో భగవంతుని భజించండి. నిర్వికార చిత్తంపై దృష్టినిలిపి ప్రశాంతతో నిష్క్రియమైన ఆత్మను ధ్యానించండి. క్రమంగా బంధాలు తొలగుతాయి. అసురవృత్తులకు దూరంగా ఉంటూ సగుణారాధన నుండి నిర్గుణారాధనకై యత్నించండి. ఇలా కర్మ భక్తి సాంఖ్య యోగములలో అసుర ప్రవృత్తులకు దూరంగా ఉంటూ పోరాటాలు లేని పరమశాంతి స్థితిని చేరుకోవాలనే ఆకాంక్షతో ఈ గ్రంథాన్ని ముగించారు. అస్తు.

పరమాచార్యులు తమ అనుగ్రహ భాషణం ద్వారా అందించిన ఇలాంటి సర్వులకు అనుసరణీయములయిన, అమృతతుల్యములయిన సూక్తులెన్నో ఈ గ్రంథంలో ఉన్నాయి. ఇంతటి మహద్గ్రంథం తెలుగులో రావడానికి ప్రోత్సాహాన్నిచ్చి ముద్రించి మనకందించిన శ్రీ వావిలాల ఉమాపతిగారు ధన్యులు.

ఎందరో మహానుభావులు. అందరికీ నమస్సులతో...

– చెబుఫు శ్రీరాజరాజేశ్వరి

విషయ సూచిక

అద్వైతం-1, ఇది అదే-4, భగవానుని ఎందుకు పూజించాలి?-6, అద్వైతం - అణుశాస్త్రం-11, అపవిత్రతను పోగొట్టుకోవడం ఎట్లా-13, అల్పం - అధికం-14, అఖండానందం-15, కృష్ణుడు చెప్పినదే కంబమహాకవి మాటలలో-15, ఎక్కడ ఆనందం?-18, భగవానుడు ఒక అడుగు ముందుకు వేస్తాడు-20, మాయ-21, అంతరం - బాహ్యం-23, దుఃఖభారాన్ని సడలించే మార్గం-23, యోగి-24, దుఃఖానికి విరుగుడు-25, ద్వైతం + బౌద్ధం = అద్వైతం, శంకరుల ఆదేశం-30, అద్వైతసత్యం-31, ఈ ప్రపంచం మాయ ఎట్లా అవుతుంది-35, భిన్నంగా ఉన్నవి భిన్నమెట్లు అయ్యాయి?-38, వేదాలననుసరించే శంకర భాషణములు-40, శంకర సంప్రదాయం-47, అద్వైతమైనా ద్వైతమైనా అమ్మచేతిలోనే-62, మూడవ మార్గం-67, యుద్ధం తరువాత శాంతి -74, అసురప్రవృత్తి ఎందుకు లేస్తోంది?-76, ద్వైతమే భయానికి కారణం-76, అద్వైతమే అభయం-77, అభయం - మోక్షం, భయం - సంసారం-78, నరక భయం-79, మనస్సే బంధానికి కారణం-79, మనోరహితమైన ఆత్మ-80, మనస్సు లేనపుడు "నేను"-80, నిజమైన ప్రేమ-81, మనస్సు లేకుండా ఎఱుక-82, ఆత్మను తెలిసికొనుట - మనస్సుతో జీవించుట-83, మనస్సు - ఆత్మకంటె భిన్నం-85, తనను తాను తెలిసికొనుటయే అభయమోక్షం-86, కర్మ బంధాన్ని వదులుచేసే ధర్మం-87, ప్రేయస్సు - శ్రేయస్సు-87, కర్మరోగానికి ధర్మౌషధం-88, ధార్మికకర్మలు మోక్షానికి ప్రత్యక్షకారణం కావు-89, మానసిక తృప్తి కోసం ధర్మకర్మ ఒక్కటే సరిపోదు-90, ప్రేమ - భక్తి-91, సత్కర్మకు వెనుక సద్భావాలు-92
సత్కర్మతో మనస్సును విభజించుట-92, క్రియ - ధ్యానము-94, కర్మ యోగం -

నిస్సంగత్వం-96, మంచి కర్మ ఎందుకు ఫలించదం లేదు-98, భయం తగ్గడానికి అవకాశం-99, మృత్యువెదురుగా నున్నా స్వధర్మానుష్ఠానం-100, లోక కల్యాణం ప్రత్యక్షఫలం-101, జగన్నాటకం - ప్రలయం-102, మామూలు జీవితంలో కొంత లాభం-104, ప్రాపంచిక జీవితంలో ఒక పద్ధతి-104, ఇతరుల ధర్మాన్ని ఆచరించ వచ్చా?-106, పాపం చేయడానికి ఏది కారణం? -107, కామక్రోధాలు-109, అన్ని దోషాలు కోరికనుండే-110, సంతోషమే ప్రయాసానికి కారణం-112, సంతోషం - ఆనందం-113, కోరికలు - సుఖదుఃఖాలు-113, ఐదు ఇంద్రియాలవల్ల మానవ పతనం-114, కోరిక వల్ల శాశ్వత సుఖం లభిస్తుందా ?-115, పరిస్థితుల ప్రభావం-116, ఒక కోరిక మరొక కోరికను ముంచేస్తోంది-116, తన శరీరతృప్తికే భిన్నమైన కోరికలు-117, ఆత్మ - ఇంద్రియాల మధ్య మనస్సు-118, మానసిక సుఖము శాశ్వతం కాదు-119, అలసిపోయాడు కాని విసర్జించలేదు-120, అద్వైతం మినహా అన్నిచోట్ల దుఃఖమే-121, ఇతరులను బాధపెట్టి కూడా సంతోషించడం-121, ఉన్నత గుణాలను హరించే కోరిక-122, అవిచ్ఛిన్న ఆనందం మనస్సుకి లభిస్తుందా ?-123, యుద్ధం ముగియాలంటే ముందు కోరికను చంపాలి-124, మృత్యువు కోరికను అంతం చేయగలదా ?-124, అసలు పుట్టుకయే శిక్ష-125, వేప పండు తీపితనం-125,

నిరంతర ప్రయత్నమే చేయాలి-126, కోరిక ఏం చేస్తుంది? -126, అర్జునుని కష్టం-127, కృష్ణుడు చెప్పిన విరుగుడు-128, మార్పు లేనిది ఆత్మ-128, నిజమైన ఆత్మ - తొడుగువంటి మనస్సు-130, ఆత్మద్వారానే మనోవ్యాపారం-131, మాయ-131, ఉన్నస్థితి - చేయుస్థితి-132, ఆకలి, కోరిక వల్ల కలిగే ఫలాలు-133, పొందడం - విడిలిపెట్టడం-133, అయితే నిద్రయే పరమ గమ్యమా?-135, వైరాగ్యం - అభ్యాసం-136, ఆనంద మయం-137, ఆత్మానందలేశమే బాహ్య సుఖం-139, శాంతంతో కూడిన ఆనందం మనస్సుకి పట్టుబడదు-140, పరాశక్తి యొక్క ఆనందం కూడా శాంతాత్మలోనే-141, గాఢనిద్ర-144, కలలుగనే స్థితి-145, మనస్సు

ఆత్మవశమెప్పుడౌతుంది?-146, ఈశ్వరానుగ్రహం-147, తర్కాతీతం-148, అనేక సాక్ష్యాలు-148, జీవన్ముక్తులు-150, ఆత్మనుండే ఆనందం-150, కర్తయే-151, కోరిక యొక్క లక్ష్యం-152, ఆత్మను పొందడానికి అసురసైన్యాన్ని పరిమార్చడమే-154, దుఃఖ కారణం-154, ఇంద్రియాలు గుర్తింపబడ్డాయి-156, ఆత్మయే సత్యం-159, ఆత్మస్థితికి క్రమక్రమంగా-160, ఆత్మను ఆత్మతో మచ్చిక-162, ఈశ్వరానుగ్రహం గురించి ఎందుకు చెప్పలేదు ?-163, ద్వైతానికి అద్వైతానికి మధ్య ఈశ్వరుడు వంతెనగా-165, అద్వైతం - ఈశ్వరానుగ్రహం-166,

బ్రహ్మము - ఆత్మ - ఈశ్వరుడు-167, జీవుడు - ఈశ్వరుని నుండే-168, విముక్తి ప్రసాదించువాడు ఈశ్వరుడే-169, మాయను తొలగించేదీ ఈశ్వరుడే-169, జీవ - ఈశ్వరుల భేదం-170, ద్వైతం నుండి అద్వైతం వైపుకి-171, మధ్య దశలు-172, సాధకుల స్థాయిని బట్టి భిన్నఉపదేశాలు-174, ఈశ్వర కృత్యానికి శాస్త్రమేల ?-176, గీతలో సత్యప్రకటన-176, ఆదిశంకరులు ఈశ్వరకృపను పేర్కొన్నారా ?-178, గుర్వనుగ్రహానికి ప్రాధాన్యం-182, మాయాశక్తి కూడ జ్ఞాన ప్రదాత్రి-183, బంధవిముక్తులకు కారకుడుఈశ్వరుడే -184, ఈశ్వరుని గురించి సూచన-186, ఆత్మజ్ఞానమే కామనల నాశానికి హేతువు-186, ఇక్కడే మోక్షము-187, బుద్ధునికి ముందే తత్త్వజిజ్ఞాస-188, మనస్సు ఆగిన తరవాత-189, ఆత్మనెరుగుటయే నిజమైన జ్ఞానము-189, మనస్సు ద్వారా బ్రతుకుటలో లోపం-191, మనస్సు పోవాలి, శరీరం కాదు-191, పుట్టుక - ముక్తులకు చెందిన భావాలు-192, విముక్తికై ప్రయత్నం తప్పనిసరి-194, సంసారానికి అంతముందనడంలో ఏకాభిప్రాయం-195, అద్వైతం - ద్వైతస్థాయులను అంగీకరిస్తుంది-196, సత్యానందములు అద్వైతంలోనే-199, భయం కోరికనుండే-200, ద్వైతమంటేనే భిన్నవస్తువులని-201, మనస్సు ఒంటరిగా ఉండదు-201, ఆత్మ, ఏకాంతముగా నుండుట-203,

విద్యుత్తుతో పోలిక-203, పరమాత్మ జీవాత్మలు-204, పరమాత్మ - అంతర్యామి-204, ఈశ్వరుడు - సగుణబ్రహ్మము-206, వేదాంతంలో ఈశ్వరుడు శివుడుకాదు-207,

ఈశ్వర పూజ-208, సత్యాన్వేషణ - జీవదృష్ట్యా, జగత్ దృష్ట్యా-209, జీవ - ఆత్మ - ఈశ్వర - ఆత్మ-210, ద్వైత విశిష్టా ద్వైతాలలో జీవాత్మ, పరమాత్మలు-213, రెండు ఆస్తిత్వాలకు సంబంధం ఉంది-215, 'ఈశ్వరాత్మ అనుటకు బదులు పరమాత్మ అనుట ఏమిటి ?-216, కొన్ని అద్వైత సిద్ధాంతాలు-216, జీవుడు, ఈశ్వరుడు కాలేదు-218, ద్వైతజీవునకు ఈశ్వరునితో సంబంధం-221, ఈశ్వరుడు - జీవుడు, అవిద్య - అంతఃకరణం-222, ద్వైతమోక్షం - ప్రకృతి-224, ద్వైతంలో దుఃఖం తప్పదు-227, పవిత్రమగుటకు ప్రయత్నం - పాత్రనుతోమినట్లు-228, రవసెల్లా పోలిక-230, మంచితో కలిసిన చెడును తప్పించడం-231, ప్రేమకున్న నామాలు ప్రేమకు నిర్వచనం - భక్తి-232, భక్తిద్వారా అద్వైతముక్తి-233, భక్తిలో ప్రేమ తప్పనిసరి-235, ఆత్మసాక్షాత్కారం పొందినవారు-237,

మనమార్గం-241, మిగతా మార్గాలతో సంబంధం-241, పరిపక్వత దానంతట అదే-242, ధర్మమే మందు-243, అనవసరపు నింద-243,

ధర్మా ధర్మములు - అద్వైతి-245, జ్ఞాని - కర్మఫలాలు-246, ధర్మం - ప్రేమ-252, మనస్సు మటుమాయం కావాలంటే ప్రేమయే శరణం-254, ఉత్తమ లక్ష్యం లేకపోతే ఉన్నతస్థితిరాదు-255, దేవశక్తులు నొప్పించేవే-257, మనలక్ష్యాన్ని బట్టి ఈశ్వరకృప-258, తిరుమూలర్, తిరువళ్లువార్ అమృతవాక్కులు-259, మొదటి నుండి అద్వైత భావం-260, బాధలే బంధం నుండి విముక్తినిస్తాయి-261, భారం అని కాకుండా పనులు చేయుట-262, మొదటి నుండిమూడు మార్గాలు-263, అయితే గీతలో అద్వైతానికి పునాది ఎక్కడ పడింది ?-265, ఈరోజు నుండి మొదలు పెట్టండి-267, మంచికీ మించి యుండాలి-267, ఆత్మధ్యానం అందరికి తప్పనిసరి-268, తీవ్రాలోచనతో తెలిసికోవాలి-269,

అద్వైతం

అద్వైతాన్ని ఆదిశంకరులు పునఃప్రతిష్ఠించారని అందరికీ తెలుసు. అద్వైతం అంటే ఏమిటి? సంస్కృతంలో ద్వి యనగా రెండు. ఆంగ్లంలో టూ (Two) అనే పదం కూడ ద్వి నుండి వచ్చిందే. రెండుండేది ద్వైతం, రెండులేనిది అద్వైతం.

రెండు లేనిదానిలో రెండున్నవి ఏమిటి? జీవులు, బ్రహ్మమని భావిస్తాం కదా! ఇట్టి ద్వంద్వ భావం పనికిరాదు. ఉన్నది బ్రహ్మమే, రెండవది దానికి భిన్నంగా లేదని చెప్పేది అద్వైతం, ఉన్న ఒక సత్యమే మాయవల్ల అనేక జీవులుగా కన్పిస్తోంది. నటుడెన్ని వేషాలు వేసినా ఉన్నవాడొకడేకదా! పెక్కు జీవులున్నట్లు కనబడినా అందున్న పరమాత్మ ఒక్కడే. పరమాత్మయని, జీవాత్మయని రెండుభిన్నమని వ్యవహరిస్తూ ఉంటాం. కాని ఉన్నది ఆత్మఒక్కటే ఇట్లా భావింపగలిగితే భ్రాంతి తొలగింపబడి జ్ఞానోదయమై పూర్ణమైన అఖండమైన ఆత్మస్వరూపులం కాగలం. ఈతత్వాన్ని అందించినవారు, లేదా స్థిరపరచినవారు ఆదిశంకరులు.

ఈ ఆత్మానుభవం ఒంటబట్టినపుడు దుఃఖము, శత్రుత్వము, బంధమూ ఉండవు. మనకంటె మరొకటి ఉన్నదని భావిస్తే పైగుణాలు మనకు సంక్రమిస్తాయి. మనకంటె మరొకటి లేదని భావించగలిగినపుడు బంధింపబడే వాడు లేడు, బంధము లేదు. మనకంటె ఒకటి ఉంటేకదా! ఈ పైబంధాల నుండి దూరం కావడమే ముక్తి లేదా మోక్షం.

ఈ బంధాతీత స్థితి ఎక్కడో వైకుంఠంలోనో, కైలాసంలోనో, భవిష్యత్కాలంలోనో వచ్చేది కాదు. ఈ జన్మలోనే ఇప్పుడే కలగాలి. నిజం చెప్పాలంటే మోక్షమనేది క్రొత్తగావచ్చేది కాదు. బంధాతీత స్థితియే బ్రహ్మము. అదే అఖండ సత్యము. ఆకాశము అన్నిటా వ్యాపించి శరీరాలనే ఘటాలలోనూ వ్యాపించింది. అనంతాకాశము, ఈ ఘటాకాశమూ ఒక్కటే కుండకొక ఆకారం

ఈ శరీరమనే కుండకూ ఒక ఆకారం ఉంది. కుండపగిలితే అందలి ఆకాశం అనంతాకాశంలో లీనంకావడం లేదా? భిన్నభిన్నమైన కుండలుగా ఉన్నాం. రూపాలుపోతే మిగిలేది ఆకాశమే కదా!

అట్టి భావనరావడానికి, ధృడపడడానికి అనేక కర్మకాండలు, పూజాపద్ధతులు ఏర్పడ్డాయి. అంతిమ లక్ష్యాన్ని చేరుకోవడానికి అనేకమైన మెట్లను ఏర్పాటు చేసారు శంకరులు. అంతా ఒకటే అనే భావన, సాధన చేయగా చేయగా ఎప్పుడో ఒకప్పుడు పట్టుబడుతుంది. అది వెంటనే పట్టుబడకపోయినా ఆసత్యమున్నదని మొదటి నుండి భావన చేయగలగాలి.

లోకంలో మనకంటె అన్నీ భిన్నంగా ఉండడం కనిపిస్తూ ఉంటే అంతా ఒకటని ఎట్లా భావించగలం?

చూడండి - మనకు మూడవస్థలున్నాయి. మేలుకొన్న (జాగ్రత్), కలలుగన్న (స్వప్న) గాఢనిద్రలో నుండుస్థితి (సుషుప్తి) అనేవి ఉన్నాయి. కాని అన్నిటిని అనుభవించేవాడొకడే కదా! అపైన కలలుగనే స్థితికి మేల్కొన్న స్థితికి సంబంధమేలేదు. అయినా నిద్రబోయేవాడు, మేల్కొన్న వాడు ఒక్కడే అట్లాగే సమస్త ప్రాణివర్గంలో ఉన్నది ఒక్కడే. ఆ ఉన్న ఒక్కడే తానని భావించగలగాలి.

ఒకమాటు శాంతంగా, ఒకమాటు కోపంగా ఉంటాం. రెండు స్థితులనూ అనుభవించేది ఒక్కడే కదా! శరీరంలో మార్పులు, రావడం వల్ల శిశువే వృద్ధుడవుతున్నాడు. ఇట్లా మేల్కొన్న దశలోనే మార్పులు కన్పిస్తూ ఉంటే ఇక కలల ప్రపంచం గురించి చెప్పేదేముంది ? కలలో మన మనస్సు ఎన్నిటిని సృష్టిస్తుందో కదా! మనం చేయకూడదనుకొన్న వాటినీ కలలోచేస్తున్నాం. అయినా ఒక్కడే అంతా చేస్తున్నాడు. ఇక సంధి మొదలైన రోగస్థితిలో మనం చేసే వాటికి విరుద్ధంగా చేస్తున్నాం. ఒక పుస్తకం వ్రాసిన వాడు దీనినే ఆ స్థితిలో చింపేస్తున్నాడు.

అట్లాగే ప్రపంచమొక కల. భ్రాంతి యనే జ్వరం పట్టుకొని సంధి స్థితిలో ఉన్నామని భావించగలిగితే అంతా ఒకటే అనే భావన కల్గుతుంది. మన మనస్సు కలలో చిత్రవిచిత్రవస్తువులను సృష్టిస్తున్నట్లుగానే ఒక సమష్టి మనస్సూ (Cosmic Mind) దాని ప్రతిబింబాలైన సమస్తవస్తువులను సృష్టించిందని భావించగలం. పుస్తకం వ్రాసినవాడు, దానిని చింపిన వాడూ ఒక్కరే అనే భావన కల్గుతుంది. ఎవడైనా మనల్ని కొట్టినపుడు ఎవడో కొట్టాడని భావించడు, తనను తానే కొట్టుకొన్నానని భావిస్తాడు.

ఈపైమాట సత్యం కాకపోతే బ్రహ్మము కంటె మరొకటి ఉందని చెప్పవలసి వస్తుంది. అట్టిది ఉంటే అది ఎక్కడి నుండి వచ్చింది ? అది దేనితో నిర్మింపబడింది? ఎవరు నిర్మించారనే ప్రశ్నలుదయిస్తాయికదా!

రెండు వర్గాలున్నాయి. ప్రాణీ వర్గమని, జడమని; జడమైనదానిని మనం సృష్టించడం లేదు. బుద్ధిలేని జడవస్తువు తనంతట తానేమి పనిచేస్తుంది? ఆపైన జడమైనది, బుద్ధికలిగిన ప్రాణిని సృష్టించగలదా ? అయినా ఆప్రకృతి జడమైనా, బుద్ధిలేనిదైనా ఒక క్రమపద్ధతిలో ఉంటోంది. దానికి కారణం విశ్వవ్యాప్తమైన సమష్టి మనస్సు యొక్క చెప్పుచేతలలో ఉండడంవల్లనే! ఈ ప్రకృతిని సృష్టించడాని మరొక వస్తువు యొక్క సహకారాన్ని కోరాడంటే అది ఒక్కడినుండి వచ్చిందని మరల ప్రశ్నవేస్తాం కదా! కనుక విశ్వవ్యాపియైనవాడే ప్రకృతిగా కన్పిస్తున్నాడు. ఇక జీవుల మాటేమిటి? మనంతట మనము ప్రత్యక్షమయ్యామా ? భిన్న భిన్న ఆకారాలతో అనేక ప్రాణులున్నా అవి కూడా తమంతట తాము ఆవిర్భవించినవికావు కనుక ఈ చరాచర వస్తుప్రపంచాన్ని నిర్మించిన ఈశ్వరుడున్నాడని, మానవునిలోని బుద్ధిశక్తికి అతడు కారణమని భావించాలి.

జీవులకు అన్నవస్త్రాలను ప్రకృతి ప్రసాదిస్తోంది. జీవులు అనేక ఇంద్రియాలద్వారా వాసన, రుచి, మొదలైనవాటిని గ్రహించగలుగుతున్నారు.

ప్రపంచంలో జడచేతనములకు దగ్గర సంబంధంఉంది. ఈ బాంధవ్యాన్ని జీవుడు కల్పించలేదు. తనకాహారము, వస్త్రము, ఇల్లు జడమైన వాటి నుండి కావాలని జీవుడు భావించాడా? ఇతని భావాను గుణంగా జడమైన ప్రకృతి అందిస్తోందా? సర్వవ్యాపియే జడచేతనాలకు సంబంధం కల్పించాడు. జడాన్ని ఒకడు చేతనాన్ని మరొకడు సృష్టించగలిగితే జడచేతనాల మధ్య సంబంధం ఉండి ఉండేది కాదు. కనుక జడచేతనాల సృష్టికర్త ఒకడే అని నిర్ధారించాలి. ఆ సృష్టించడం కూడా తనకు భిన్నమైన దాని నుండి కాక తన నుండే సృష్టించాడని చెప్పాలి. అతడే ప్రకృతిగా కన్పిస్తున్నాడు. భిన్నంగాకనబడే వాటిని సృష్టించే వాడొక్కడే. అ ఒక్కడే భిన్నభిన్నంగా కనబడగలడు. ఇట్లా కనబడేది అతని మాయాశక్తి వల్లనే. ఒకే ఒకటి భిన్నంగా కనబడడాన్ని మాయయని అద్వైతం అంటుంది.

అంతా ఒకటని భావించడాన్ని సాధన చేయగలగాలి. అంతా ఒకటైనపుడు భేద భావాన్ని చూడం. శరీరంలోనే భిన్న భిన్న అవయవాలున్నా మొత్తం ఇదంతా నా శరీరమని ఎట్లా అంటున్నామో ప్రపంచం అంతా తనదేనని సాధకుడు భావిస్తాడు. అట్టి జ్ఞానమే నిజమైన జ్ఞానం. ఆస్థితిలో ఒకడు ఎక్కువా కాదు, ఒకడు తక్కువా కాదు. ఇదే మనీషాపంచకంలో వ్రాసారు శంకరులు. అదే ఆనందంతో కూడిన మోక్షం. అట్టి స్థితిని ఈ జన్మలోనే సాధించగలమని అద్వైతం చెబుతుంది.

ఇది అదే

ఒక వడ్రంగి ఒక కర్ర ఏనుగను తయారుచేసాడు. మరొక వడ్రంగి తన కొడుకుతో అక్కడకు వెళ్లాడు. పిల్లవాడు దానిని చూసి భయపడ్డాడు. తండ్రి సమీపిస్తుండగా వద్దునాన్నా, ఏనుగని అన్నాడు. ఇది కర్ర ఏనుగు, నన్నుభయపెట్టదని ఊరడించాడు.

పిల్లవాడు దానిని నిజమైన ఏనుగని భావించాడు. ఇది సజీవంగా ఉన్నట్లు కన్పించినా తండ్రి భయపడలేదు. తిరుమూలర్ అనే తాత్త్వికుడు తన తిరుమందిరంలో ఈ విషయన్నిట్లా చెప్పాడు.

"ఏనుగు బొమ్మ తనలో కర్రనుదాచి తాను ఏనుగుగా చూపించింది. ఇక కర్ర, ఏనుగునుదాచి కర్రనేచూపింది" ఎందుకిట్లా తిరుమూలర్ చెప్పాడు? మాములు జనానికి పంచభూతాలతో ఏర్పడిన ఈ ప్రపంచం సహజ రూపమైన పరమాత్మ స్వరూపాన్ని కనుమరుగుచేస్తోంది. కాని జ్ఞానులకు ప్రపంచం పరమాత్మగానే కనిస్తోంది.

ఈపై ఉదాహరణవల్ల ఏనుగు, కర్రభిన్నమైనవి కావని, ప్రపంచమూ పరమాత్మ ఒక్కటే అని ఋజువుచేస్తోంది. పిల్లవాడు బొమ్మలో కర్రను చూడనట్లే పరమాత్మ అనే కర్రను ప్రపంచంలో చూడలేకపోతున్నాం. జ్ఞానికి బొమ్మకనబడడంలేదు. అనగా పంచభూతాలు కనబడడంలేదు. అంతా పరమాత్మగానే భాసిస్తోంది.

ఎందుకీ కథ? మాకు సుఖజీవితం ఉంటే చాలని, ఎందుకీ ప్రపంచం, పరమాత్మ చర్చ అని కొందరడుగవచ్చు.

అందరూ ధనవంతులయ్యారని భావిద్దాం. అయితే వారందరూ శాంతితో, నిర్భయంగా, ఆందోళన లేకుండా ఉండగలరా? ఇంకా ధనం కావాలని ఆరాటం. ఇతరుల కంటె తానింకా గడించాలని తనను మించిన వాడు మరొకడు ఉండకూడదని రకరకాల పోటీ మనస్తత్వాలు పొటమరిస్తూ ఉంటాయి. అన్నీ ముందు నాకు, నాకనే మనస్తత్వం ప్రబలిపోతుంది. అంతవరకూ ఎందుకు ? ఈ మఠంలో తీర్థ ప్రసాదాలిస్తూ ఉంటారు. ఒక వరుసలో నిలబడకుండా ముందునాకు, నాకని ఎగబడతారు కదా! ఇట్టి స్పర్థ ఉన్నంత కాలం వరకూ శాంతి ఎక్కడ? తృప్తి అంటూ ఉందా?

తన కంటె మరొకడున్నాడని భావించినపుడే ఈ పోటీ, రెండవది ఉన్నదని భావించినపుడే అశాంతి. జ్ఞానోదయం కానంత వరకూ అశాంతియే! అందుకే

ఆధ్యాత్మిక సాధన నిరంతరం కొనసాగుతుండాలి. ఇదంతా శివంగా భావించనంతవరకూ ఎంత ఆర్థికాభివృద్ధి సాధించినా అంధకారంలో ఉన్నట్లే. చీకటిని తరుమనంత వరకూ చీకటిలో మ్రగ్గవలసిందే. మామూలు సూర్యుడు లేక పోయినా 'కర్రయే ఏనుగు, ప్రపంచము బ్రహ్మమే' అనే జ్ఞాన సూర్యుడు మనలో ఉదయించవలసిందే.

భగవానుని ఎందుకు పూజించాలి ?

ఆస్తికులు, ఈ ప్రపంచాన్ని భగవానుడు సృష్టించాడని, ఒక క్రమపద్ధతిలో ఉంచాడని విశ్వసిస్తారు. ప్రతిచర్యకు ఒక ఫలమని, మనకర్మానుగుణంగా ఫలాలనందిస్తాడని నమ్ముతారు. భగవంతుడుంటే ఉండనీయండి, మనం ఎందుకు పూజించాలని కొందరడుగుతారు. మనలనడిగి సృష్టించాడా? ఆపైన ఆయన సృష్టించాడు కనుకనే ఈ సమస్యలు వస్తున్నాయని, ఎందుకు పూజించాలని ప్రశ్నిస్తారు.

అతడు మన సమస్యలను పరిష్కరిస్తాడు. అందువల్ల అతని పట్ల భక్తి చూపించాలని ఆస్తికులంటారు. మన బాధలను పొగొట్టే వానిని పూజిస్తే బాధలను తొలగిస్తున్నాడని మీరంటే అతడు దయాసముద్రడని ఎట్లా పిలవగలం అని, మనకర్మలకు తగిన ఫలాలనందిస్తున్నాడంటే, మన పాపాలకు తగ్గశిక్ష విధిస్తున్నాడంటే ఆ బాధలను లేకుండా చేయుమని అడగడంలో అర్థం ఉందా అని ప్రశ్నిస్తారు.

అనందసాగర స్తవంలో నీలకంఠ దీక్షితులు "అమ్మామీనాక్షీ! నీతో ఏదీ చెప్పనవసరంలేదు అన్నీ నీకు తెలుసు. నా సమస్యలను నీకు తెలియపరచ్చకపోతే ఏదో బాధ హృదయంలో పీడిస్తోంది. నా బాధను వెళ్లగ్రక్కడంలో ఏదో ఒక ఊరట లభిస్తోంది. అందువల్ల నీకన్నీ తెలిసినా నా బాధలను ఏకరువు పెడుతున్నానమ్మా" అని అన్నారు.

మన సమస్యలను ఇతరులకు చెప్పడం కంటె భగవానునికే నివేదించడం మేలు. మనం అడుగక పోయినా మన సమస్యల నతడు తీర్చవచ్చు, లేదా అతడు మన కర్మలకు తగ్గ ఫలాలనదించవచ్చు, లేదా శిక్షించవచ్చు, లేదా మనలో ధైర్యాన్ని నింపవచ్చు, అయినా వేడుకొంటే కొంత మనశ్శాంతి లభిస్తుంది.

ఈశ్వరుణ్ణి వేడుకొంటున్నామంటే సమస్యను పరిష్కరిస్తాడనో, సుఖమయ జీవితాన్ని ప్రసాదించి నందులకు కృతజ్ఞతను వెల్లడించాలనో కాదు. అందుకోసమే అని అంటే మీరొక ప్రశ్న వేయవచ్చు. మొక్కనాటిన వాడు నీరు పోయవలసిందే, పుట్టించినవాడు మంచి జీవితాన్ని ప్రసాదించవలసిందే ! అది అతని బాధ్యత. ఇక కృతజ్ఞత చెప్పవలసిన అవసరమేమిటని ప్రశ్నించవచ్చు.

కనుక ఆసందర్భంలో భక్తిని గూర్చి మాట్లాడడం లేదు. దుఃఖం, సంతోషం అనేవి రెండు, మనస్సును కల్లోలపరుస్తున్నాయి. శాంతమైన మనస్సు కలిగిపుడే నిజమైన ఆనందాన్ని జీవుడు పొందుచున్నాడు. నిద్రలోనూ, మనస్సు పనిచేయని వానికి దుఃఖము లేదు. సంతోషము లేదు. ఆస్థితిలో సంతోషంగా ఉన్నామని తెలియదు. మనస్సు ఆందోళనలేనపుడు, సంతోషిస్తున్నామనే ఎఱుక ఉన్నపుడే శాంతిని పొందగలం. మనస్సు స్తిమితం కానంతవరకు మనము జీవులమని, పరమాత్మ కంటె భిన్నులమని భావిస్తాం. పరమనిశ్చలంగా ఉన్నపుడు భేదభావాలుండవు. దానికి నిశ్చలత్వం వచ్చిన కొద్దీ అద్వైతానుభవం కల్గుతుంది. ఆ ఒక్కదానిపట్లే మన మనస్సును లగింప చేయ గలిగితే అదే అవుతాం. ఇదినేటి సైన్సు అంగీకరిస్తోంది. అఖండానందానికి ఆశ్రయుడు పరమాత్మయే అని అనుభవంలోకి వస్తుంది.

అతడు స్థాణువు. అంటే కర్రలా ఉంటాడని అర్థం. జడునిగా కన్పిస్తున్నా చైతన్యం తొణికిసలాడేవాడే! ఆ(మోడుకు అమ్మవారనే లతపెనవేసి

కొనియుంది. ఆమెకు 'అపర్ణ' అనిపేరు. అనగా ఆ లతకు ఆకులు లేవు. స్పందశక్తితో ఉండి భావప్రకటనచేయకుండా జీవం ఉండి జీవం లేనట్లు కనబడే మ్రోడును చుట్టుకొని యుంది. పరతత్త్వాన్ని భావించినపుడు శాంతి, జ్ఞానస్వరూపునిగా భావిస్తాం. అవి మనకు సొంతం కావాలంటే ఆ సగుణబ్రహ్మకు అనగా కల్యాణగుణాలు కలిగిన వానిని భక్తి భావనతో అర్చించవలసిందే.

సుఖమయజీవితం కావలన్నా, కృతజ్ఞతను వెల్లడించాలన్నా, బాధలనుండి తప్పించుకోవాలనుకొన్నా అతణ్ణి నిరంతరం భావిస్తున్నకొద్దీ మన సమస్యలను మరిచిపోతాం. అన్నీ అతని ఆజ్ఞకు లోబడే జరుగుతున్నాయని భావిస్తాం. సుఖశాంతులు కల్గుతాయి. అది శాశ్వతత్త్వాన్ని చేరుకోవడానికి దారి చూపిస్తుంది.

ఆత్మవిచారణ, ధ్యానం, యోగం మొదలైన వాటివల్ల మనస్సు నిలకడగా ఉంచి పూర్ణభావనతో ఉండగలం. ఇవి చెప్పకుండా భక్తిని గురించి చెబుతున్నారేమిటని ప్రశ్నించవచ్చు. శంకరులు క్రియ, భావం, తుదకు భక్తి భావం లేని స్థితినే మోక్షమని అన్నారు కదా! అటువంటప్పుడు భక్తితో ఉండండని ఎందుకంటున్నాను? ఈ సందర్భంలో మోక్షానికి ప్రబలమైన సాధనంగా భక్తిని గుర్తించారు. ఆ భక్తిని వారెట్లు నిర్వచించారో చూడండి. ఆత్మను విచారించడమే, అందులీనం కావడమే భక్తియని చెప్పారు. అనగా ఆత్మానుసంధానమే. అది ధ్యానము యోగముతో కూడినదే కాని లోగడనేను చెప్పినట్లు మనకంటె భగవానుడు భిన్నుడని, అతని పట్ల ప్రేమ చూపించాలని అనడమే భక్తియని అనడం వంటిదికాదు.

అయితే ఇట్లా చెప్పిన శంకరులు మఠాలలో చంద్రమౌళీశ్వర పూజను చేయాలని ఎందుకువిధించారు.? చేరుకోవలసినది నిరాకార నిర్గుణ పరబ్రహ్మమే అని చెప్పి ఎందుకీ సగుణారాధనను విధించారు? అంతేకాదు

వారు షణ్మత స్థాపకులు కదా! ఆసేతు హిమాచలం పర్యటించి అనేక దేవ దేవతా స్తోత్రాలను ఎందుకు వ్రాసారు? అంటే ఈ సగుణారాధనను వారంగీకంచినట్లే కదా!

ఈనాటి విద్యాధికులు జ్ఞానం సర్వోత్తమమని, ఆత్మవిచారణ, ధ్యానము, యోగము ఉత్తమమైన సాధనాలని, పూజాదులు, తీర్థాటనలు వాటికంటె తక్కువని ఒక అభిప్రాయాన్ని వెల్లడిస్తారు. అంతేకాదు ఈ కర్మకాండ మూఢమని, భక్తి భావోద్రేకానికి చెందినదని చిన్నచూపుచూస్తారు.

శంకరులు ఆత్మనిష్ఠలో ఉండి భక్తితో కూడిన పూజను ఎందుకు ప్రోత్సహించారు! మనం అనేక సమస్యలతో సతమతమౌతున్నాం. అనేక బాధలు వెన్నంటే ఉన్నాయి. ఈతరంగాలు ఉవ్వెత్తునలేస్తున్నాయి, పడుతున్నాయి. ఇట్టి పరిస్థితులలో మనస్సును ప్రశాంతంగా ఉంచుకోమని చెప్తే సాధ్యం అవుతుందా!

ఎందుకీ బాధలు! పూర్వకర్మలు వెంటాడుతున్నాయి. ప్రతి పుట్టుకలోనూ ఏవో చెడ్డ పనులనుచేస్తున్నాం. ఆ పాపఫలాలనను భవించడం కోసం జన్మలనెత్తుతున్నాం. ఎట్లా దీనిని రూపుమాపడం? మంచికర్మలను అనుష్ఠించడం వల్లనే. కొన్ని పాపాలైనా తీర్చుకొంటాడని, పుణ్యకార్యాలు చేస్తాడని మరల మరల జన్మను ప్రసాదిస్తున్నాడు. అయినా ఇంకా ఎక్కువ పాపాలను చేస్తున్నాం. పాపాల సంఖ్యను తగ్గించడానికే శంకరులు కర్మకాండను, భక్తితో కూడిన పూజను ప్రోత్సహించారు. వీటికి జ్ఞానానికి అంగాలుగా పరిగణించారు.

పాపాలను శరీరంతో మనస్సుతో చేస్తుంటాం. పాపకృత్యాలను మంచి పనుల ద్వారా, చెడు భావాలను మంచి భావాల ద్వారా త్రోలగలగాలి.

మంచిపని అంటే ఏమిటి? వేదాలతో చెప్పబడిన ధర్మాలే. సంఘజీవనం సరిగాసాగాలంటే మానవుని బుద్ధిబలం, పాలకుని విధులు, వర్తకుల కృత్యాలు,

శ్రామికులనడవడి ఒక దానికి ఒకటి పోషకంగా ఉన్నపుడు మాత్రమే సాధ్యమౌతుంది. అందుకే వేదశాస్త్రాలు వివిధ వర్ణాలను వివిధవిధులను విధించాయి. ఏదైనా ఒక పని పాపానికి ఎట్లా దారి తీస్తుంది? స్వార్థపూరితంగా ప్రవర్తించినపుడు తప్పుదారులను త్రొక్కవలసివస్తోంది. దానితో శత్రుత్వం, భయం, దుఃఖం మొదలైనవి పుట్టుకొని వస్తున్నాయి. వేదధర్మం ప్రకారం బహుజనహితం కోసం, బహుజనసుఖం కోసం చేసినపుడు ఆత్మతృప్తితో పుణ్యకార్యాలఫలం వస్తుంది. దానివల్ల ఉన్నపాప ఫలాలను తొలగించడమూ జరుగుతుంది.

భావం, చేసే క్రియ ఒకదానికొకటి సంబంధించి ఉంటాయి. సోమరికి దుష్టభావాలు మూగుతాయి. "An idle mind is the devil's workshop" అనే సామెత ఆంగ్లంలో ఉంది కదా! కనుక ముందు మనస్సును శుభ్రం చేయాలి. దానిని నిలకడగా ఉంచగలిగితే ఆత్మ జ్ఞానం పట్టుబడుతుంది. అందుకే ముందుగా వేదచోదిత కర్మలను చేయాలన్నారు శంకరులు.

ఇతరులకు సాయం చేయుట, త్యాగబుద్ధివల్ల పాపపు ఆలోచనలు దరిచేరవు. దానినే సాధారణంగా ప్రేమ అని అంటారు. చరాచరవస్తు ప్రపంచాన్ని సృష్టించిన పరమాత్మ పట్ల ఈ ప్రేమ ప్రసరించినపుడు దానినే భక్తియని అంటారు. గతజన్మల పాపాలు పోతాయి. మనస్సునకు ఏకాగ్రత లభిస్తుంది. మనస్సు పూర్తిగా నిర్మూలనం కావాలంటే ముందీ పద్ధతిని అనుసరించగలగాలి. అది అతని యందు లీనం కాగలిగినపుడు అఖండానందప్రాప్తి.

మనస్సును దువ్వి ధ్యానయోగంలో ప్రవేశపెట్టాలంటే ఈ కర్మ, భక్తులు తప్పవు.

స్తోత్రాలతో, పూజలతో, తీర్థయాత్రలతో ఆరంభింపబడిన భక్తియాత్ర పరమాత్మకు చేరువౌతుంది. గాఢనిద్రలోనున్న ఆనందంకంటె ఈమార్గం

ద్వారా తెలిసి మెలకువగానున్నపుడు పూజించుట ద్వారా అఖండానందం ప్రాపిస్తుంది. అందుకే భక్తికి బాటలు వేయాలి.

అద్వైతం అని వట్టి వాచావేదాంతాన్ని వల్లించడం కాదు. ప్రాథమిక దశలో నిరాకార నిర్గుణ పరబ్రహ్మాన్ని ధ్యానించడం కంటె సగుణ సాకారమూర్తిని అర్చించడం సబుబు. అదే చివరి మెట్టును చూపిస్తుంది. ఆ భక్తి ప్రపంచ దుఃఖాలను తొలగించుకోవడం కోసం కాదు. మనలను మనం తెలిసికోవడానికే అని మనం మరిచిపోకూడదు.

అద్వైతం - అణుశాస్త్రం

మనకంటె వేరొకటి భావించనపుడే అద్వైతజ్ఞానం పట్టు బడుతుంది. ఒక తేలు, ఒక పాము, మనలను కుట్టో కరిచో బాధపెడతాయి. మనమేవాటిగా మారినపుడు తమను తాము కుట్టిచంపుతాయా? అందరిలో నేనున్నాననే తీవ్రభావన లేదా ఎఱుక కలిగినపుడు అంతా ఆనంద స్వరూపంగానే కన్పిస్తుంది. అదే మోక్షం దేహం నశించిన తరువాతనో, ఏదోలోకంలోనో అనుభవించడం కాదు. ఈ జన్మలోనే, ఇప్పుడే అనుభవించదగిందని అద్వైతం చెబుతుంది.

అంతా ఒకటని ఎట్లా చెబుతారు? భిన్నభిన్నవస్తువులను చూస్తున్నాం కదా! మనం చూసేదైనా సత్యంకావాలి, లేదా వేదాంతులు చెప్పేదైనా సత్యం కావాలి కదా! ఏది సత్యం?

ఏది సత్యమైందో, అది అఖండానందాన్ని శాంతిని, తృప్తిని ప్రసాదిస్తుంది. మనమామూలు జీవితంలో ఇవి కనబడతాయా? మనం కలలో చాలా వాటిని చూస్తాం. మెలకువ వచ్చినపుడు ఇవన్నీ ఉన్నాయా? మేల్కొన్నవాడొక్కడే ఉన్నాడు. అట్లాగే ఈ ప్రపంచాన్ని ఒక కలగా భావిస్తాడు జ్ఞాని.

ఆధునిక శాస్త్రం కూడా భిన్నభిన్నంగా ప్రపంచం కనబడినా ఒకటేఅట్లా కన్పిస్తోందని అంటోంది. కొన్ని భిన్నమూల పదార్థాలవల్ల ప్రపంచం ఏర్పడిందని, చాలా కాలం వెనుక నిర్ధారించారు. కాని నేడు అన్ని మూలపదార్థాలతోను ఒకే ఒక శక్తి ఉందని నిర్ధారిస్తున్నారు. పదార్థము, శక్తి ఒకటే అని నిర్ధారించారు. కనుక ఏది వేదాంతం చెప్పిందో దానినే నేటి సైన్సు ఋజువుచేస్తోంది. ఐన్‌స్టైన్, సర్‌జేమ్సు జీన్సు వంటి మేధావులు అద్వైతానికి చేరువగా వస్తున్నారు.

పదార్థం మిథ్యఅని అద్వైతులంటే ఏ అర్థంతో వాదారు? అదివ్యావహారిక సత్యమనే అభిప్రాయంలోనే బ్రహ్మ సత్యంతో పోలిస్తే ఈ జగత్తు నిత్యసత్యం కాదనే అభిప్రాయంలోనే. బ్రహ్మమే విశ్వోత్తీర్ణమైనదని అనగా విశ్వాతీతమని, కనబడే ఈప్రపంచం ఈక్షణంలో ఉండి మార్పు చెందేదనే అర్థంలోనే వాదారు అద్వైతులు. దానినే శాస్త్రజ్ఞులు ప్రపంచం సాపేక్షికమైనదని (Relative) నిత్యసత్యముకాదని నిర్ధారించారు.

అట్లా చెప్పినవారే అణుబాంబులు తయారు చేయడం చాలా దురదృష్టకరం. బౌద్ధికమైన స్థాయిలోనే అద్వైతానికి సైన్సుకి పోలిక ఉంది. ఇట్లా బుద్ధితో భౌతికప్రపంచంతోనే ఆగిపోకుండా ప్రజల మనస్తత్వంలో మార్పును, ఎఱుకను తీసికొనిరాలేకపోయింది. కాని అద్వైతమట్లా కాదు. సాధకులలో అఖండ శాంతిని, జ్ఞానాన్ని కల్గిస్తుంది.

అపవిత్రతను పోగొట్టుకోవడం ఎట్లా?

సుజ్ఞానంతో వీక్షించగలిగితే అంతా ఆ ఆనందం అఖండం, అద్వితీయం. అట్లాగే జ్ఞానము కూడా. అది వ్యాపించనిచోటు అంటూ ఏదీ లేదు. పరిమితాలు లేనివి రెండుండవు. కనుక ఆనందము. జ్ఞానము ఒక్కటే

ఆనందమే బ్రహ్మమని ఉపనిషత్తులంటున్నాయి. అంతా సత్ + చిత్ ఆనందమయమే అని ఘోషిస్తున్నాయి.

ఒక పువ్వును గులాబీ 'యని, ఒక దానిని ఉమ్మెత్తయని పిలుస్తాం. జ్ఞానంతో వీక్షించినపుడు ఈ రెండూపువ్వులు. ఆనందమయంగానే కన్పిస్తాయి. ముందెందుకు విడివిడిగా ఉన్నట్లు కన్పడ్డాయి? మనమనస్సు కళంకితమవడం వల్లనే. ఒకటి ఇంపుగా, మరొకటి మరోరకంగా కనబడింది. అద్దాన్ని కదుపుతూ ఉన్నా, అది దుమ్ము కొట్టుకొనియున్నా ప్రతిబింబాన్ని సరిగా చూపించగలదా! అట్లాగే అపవిత్రంతో కూడిన మనస్సు వస్తుతత్వం అనందమే అనిగ్రహించలేక పోతోంది.

మనిస్తిమితం లేనివానికి దండనిచ్చి కొద్దిసేపు పట్టుకొని ఉండమంటే పట్టుకోగలడా? మనం పట్టుకోగలం. ఇట్లాపట్టుకొన్న ఒకే వస్తువుపై మనస్సును నిలపాలని చెబితే ఉంచగలమా? మనస్సు గిరగిర తిరుగుతోంది. మతిస్తిమితంలేని వానిని మనమెట్లా చిన్నచూపుతో చూస్తామో జ్ఞాని కూడా అట్లా మనలను చూస్తాడు. మనస్సు నిలబడనంత వరకూ మనమందరమూ పిచ్చివారమే.

ఈ అపవిత్రతను గెంటేయడం ఎట్లా? అసలు మన శరీరాన్ని ధరించడమే ఒక అపవిత్రత. ఈ శరీరం ఎట్లా వచ్చింది? పాపం నుండే. పాపం ఎందుకు చేస్తున్నాం? కోరిక వల్ల! పాపం దేనితో? మన ఇంద్రియాల ద్వారా, శరీరం ద్వారా చేస్తున్నాం. ఒక త్రాటితో ఒకదానిని కట్టినపుడు ఒక పద్ధతిలో త్రాటిని త్రిప్పుతూ కడతాం. దానికి విరుద్ధంగా త్రిప్పితే వస్తువు విడుదలౌతోందికదా! అట్లాగే మనపాపాలను అట్లా విడుదల చేయగలగాలి. ఈ శరీరం, మనస్సుతోనే ఎట్లా? శాస్త్రకర్మలు, భక్తిభావన, దానాదులు, పూజాదులద్వారా కట్టిన త్రాటిని విరుద్ధంగా త్రిప్పి మనలను మనం విడుదల చేసికోనగలగాలి. తరువాత జ్ఞానాన్ని సంపాదించాలి.

అల్పం - అధికం

సూర్యుడొక్కడే. నేలపై నీళ్లను చిలుకరిస్తే అనేక సూర్యప్రతి బింబాలు కన్పిస్తాయి. ఇంతమంది సూర్యులులేరు. ఉన్నది ఒక్క సూర్యుడే! అట్లే మనలో తొటికిసలాడే జీవచైతన్యం లేదా బుద్ధియందే పరమాత్మ ప్రతిబింబిస్తున్నాడు. విశ్వాతీతమైన ఏశక్తి అన్నిటికి ఆధారమైయుందో అదే మనలో లవలేశంగా కన్పిస్తోందని బ్రహ్మసూత్రభాష్యంలో శంకరులన్నారు. అదే తత్. అనగా అది. అది అని ఎప్పుడైతే అన్నామో అది మనకు దూరంగా ఉంది. మన వ్యవహారంలో అది దూరంగా ఉన్నా, దగ్గరగా ఉన్నా ఆతత్ యే నీవైయున్నావని చెబుతోంది. తత్ + త్వమ్ + అసి.

నిత్యసత్యమైన పరమాత్మను పట్టుకోవాలన్నమాట. మనమేమో అల్పులం, అల్పత్వం, అధికత్వంతో కలిసినపుడు అల్పత్వమూ అధికత్వమౌతోంది.

ముందుగా అతడు కల్యాణరూపుడని భావించి నిర్గుణబ్రహ్మమును లక్ష్యంగా చేసికొని సాధన సాగాలి.

ఉపనిషత్తు అనే చెట్టునుండి ఈ అద్వైతఫలాన్ని అందించారు శంకరులు. మొగ్గ – పువ్వు – కాయ వరుస కదా! ఆ కాయపక్వమైతే అదే పండు. పండయ్యే వరకూ ఓపిక వహించాలి. పక్వంకాని కాయతో ఈ శరీరాన్ని పోల్చి రామలింగస్వామి, ఇది ఇంకా పండుకాలేదని చింతించాడు. అట్టి భయమూ మనకుండాలి పక్వదశవచ్చేవరకు పూజ, జపం, ధ్యానం, తపశ్చర్యలు సాగవలసిందే!

అఖండానందం

కృతయుగంలో భృగువు తన తండ్రియైన వరుణుణ్ణి సమీపించి ఏది పరిపూర్ణమైనదని ప్రశ్నించాడు. తపస్సు చేసి తెలిసికో, అని తండ్రి అన్నాడు. శరీరమే గొప్పదని భావించాడు కొడుకు. మళ్లీతపస్సునకై ఆదేశం. శరీరం

ఏనాటికైనా నశించి పోతుందికదా, అందులో ఉన్న ప్రాణమే గొప్పదని కొడుకు అన్నాడు. తరువాత మనస్సు గొప్పదని, తరువాత బుద్ధిగొప్పదని చెప్పి మళ్లీ తపస్సుచేసి ఆనందానుభవమే గొప్పదని తీర్మానించాడు.

అప్పుడుపుడు అనుభవించే ఆనంద లేశాలకంటె ఆ ఆనందమే పరిపూర్ణమైనపుడు అఖండానందమంటామని, అది దేశకాలతీతమని; శరీరం, ప్రాణం, మనస్సు, బుద్ధికంటె అతీతంగా ఆత్మఉందని, అట్టి ఆత్మ అనుభవంలోకి రావడమే సంపూర్ణానందమని అన్నాడు తండ్రి.

అపుడపుడు ఆనందలేశాన్ని అనుభవిస్తాం. దట్టమైన చెట్టు క్రింద కూర్చున్నపుడు సూర్యకిరణాల కాంతిని అనుభవించలేం. గాలి వల్ల కొమ్మలూగినపుడు సందుల నుండి కాంతి పడుతోంది. అట్టిది ఆనందలేశం. ఆనందం అంతటా ఉన్నా, చెడ్డ కర్మలవల్ల కలుషితమైన మనస్సు వల్ల ఆ ఆనందం కనుమరుగైపోతుంది. అనందలేశం అనుభవించి మురిసిపోతూ ఉంటాం. దానిని పొడిగించగలిగితే అఖండానందప్రాప్తి.

కృష్ణుడు చెప్పినదే కంబమహాకవి మాటలలో

అన్నిటికీ ఆధారం ఆత్మ. అది అన్నిటికి అతీతమని చెప్పినపుడు ఎట్లా అని సందేహం. కృష్ణుడు చెప్పిన మాటలలో అనేక సందేహాలు కల్గుతూఉంటాయి.

ఉదా:- నేను అన్ని చోట్ల ఉన్నాను. అన్నీ నాలో ఉన్నాయని ఒక చోట:-

"యో మామ్ పశ్యతి సర్వత్ర, సర్వంచమయిపశ్యతి"

అన్నీ అతనిలో ఉన్నాయని చెప్పినపుడు అన్నిటికి అతడాధారమని తెలియవస్తోంది. అన్నింటిలోనూ తానున్నానని చెప్పినపుడు ఇవన్నీ అతణ్ణీ నిలబెడుతున్నాయా అని సందేహం కలుగుతోంది కదా!

అన్నింటిలోనూ ఉన్నాడంటే అవి అతనికి ఆధారంకావు. అతడుండడం వల్లనే వాటికొక ఆకారం ఉన్నట్లు, ప్రాణవంతంగా ఉన్నట్లు కన్పిస్తున్నాయని అర్థం. అతడు లేకపోతే వస్తువులకు అస్తిత్వమే ఉండదు! అన్నింటిలో అతదుండి అన్నిటిని త్రిప్పేవాడతడే:-

ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశే అర్జునతిష్ఠతి

భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా

మరొక సందేహాన్ని కల్గిస్తున్నాడు. మరొక మూల నాలో ఏదీ లేదు, నేను దేంట్లో లేనని అంటాడు :-

నచ ఆత్మస్థాని భూతాని

అనగా ఆత్మ అన్నిటికీ అతీతమని అర్థం వస్తోంది. ఏమిటయ్యా ఈ గందరగోళం అని అడిగితే అందరూ నన్నర్థం చేసికోలేరంటాడు:-

నాహం ప్రకాశఃసర్వస్య

ఇదంతాయోగమాయ యని అంటాడు:-

యోగమాయా సమావృతః

ఏమిటి పొంతనలేని మాటలని సందేహం. ఆలోచిస్తే సందేహాలుండవు. ఎవ్వరూ నన్నర్థం చేసికోలేదని అంటే వేయిమంది ఉంటే వేయిమంది అర్థం చేసికోలేరని అర్థం వస్తోంది. దానికి బదులు అందరూ 'అర్థంచేసికోలేరం'టే వేయికి 999 మంది అర్థం చేసికోలేరని ఎవడో ఒకడు మాత్రమే అర్థం చేసి కొంటాడనే అర్థం వస్తోంది. కదా! ఈ రెండవ అర్థాన్ని గ్రహించాలి.

ఎవరీ కొంతమంది? జ్ఞానులే. అట్టి వారే నేను అన్నిటిలోనున్నాను. ఏదీ నాలో లేదనే వాక్యాలను సమన్వయించగలరు. చీకట్లో పూలమాలను చూసి పామని జనాలరిచారు. అంటే పూలమాలయే సర్పంగా కనబడింది. కాసేపు పోయిన తరువాత ఇది పట్టి పూలమాలయే అని గ్రహిస్తాదు. పాము

అని అనుకోవడానికి ఏది ఆధారమైంది? పూలమాలయేకదా!

ఈ విశ్వంలో ఉన్నా ఈ విశ్వం నాలో ఉందని చెప్పినపుడు అర్థం ఏమిటి? పాము పూలమాలలో ఉంది, పూలమాల పాములో ఉందనే కదా! రెండు సత్యములే కదా!

పాముపామని అరిచేవానికి పాము ఈ పూలమాలను మ్రింగేసినట్లేకదా! అతనికి పాముగానే కనబడింది. అది పూలమాల అని తరువాత తెలిస్తే పూలమాల తనలో పామును దాచిపెట్టినట్లేకదా! ఇపుడు పూలమాలే కన్పించింది.

అట్లాగే మాయలో కొట్టుకుపోయినవాడు ప్రపంచమే సత్యమని భావిస్తాడు. కాని ఆలోచిస్తే ఆవిశ్వం వెనుక ఉండి దానికి ఆధారభూతమైన వాడు పరరమాత్మయేకదా!

ఇట్లా విశ్వాన్ని చూసినవానికి తనతో కలిపి ఈ విశ్వం అంతా పరమాత్మ స్వరూపంగానే తోస్తుంది. సమాధిలో విశ్వం ఉన్నట్లు అణుమాత్రం అతనికాభావన ఉండదు! అది భ్రాంతిగా కూడా కనబడదు. అట్టి స్థితిలో అనగా విశ్వ భావనలేనపుడు విశ్వం పరమాత్మలో ఉందనడం, లేదా అతడు విశ్వంలో ఉన్నాడనడం అసందర్భంకదా! అట్టి పరిస్థితిలో ఏదీనాలోలేదు, నేనీ విశ్వంలో లేననే మాట భగవానుడన్నాడు. ఒక అజ్ఞాని పూల మాలను పాముగా భావించడం వల్ల పాము పూలమాలలో ఉందని, పూలమాల పాములో ఉందని చెప్పినంత మాత్రంచే అది నిజమౌతుందా ?

కంబమహాకవి తన సుందరకాండలో ఈ విషయాన్నే చెప్పాడు. పూలమాలలో పాముందని అనడం ఎటువంటిదంటే పంచభూతాలు కలిసి విశ్వం అనే భ్రాంతిని కల్పించాయని అంటే పాముని; పరమాత్మయైన రాముడు పూలమాలనే చూస్తున్నాడని అనగా ఈశ్వరుణ్ణి దర్శిస్తున్నాడని అంటాడు.

కంబడువైష్ణవుడే, నమ్మాళ్వర్ అనే భక్తుణ్ణి నుతించినవాడే! కాని ఇక్కడ అతని అద్వైతభావనను గమనించండి.

ఎక్కడ ఆనందం ?

మనం కోరిన దానిపై మనకు లభించిన దానిపై మమకారాన్ని బ్రతికియుండగనే విదులు కోగలిగితే ఎంతో ఆనందం లభిస్తుంది. మనకోరికలనే పగ్గాలతో మనల్ని మనమే కట్టుకొంటున్నాం. మనం పశువుల కంటే అధికులమని విఱ్ఱవీగుతాం. అవి చేసే పనులకు మనకు పెద్దతేడా ఏమి లేదు. అఖండానందాన్ని పొందాలనడమే సరిమైన జ్ఞానం.

నిజమైన ఆనందాన్ని అజ్ఞానం వల్ల గుర్తించలేకపోయినా ఒకదానిని మనదిగా భావించినపుడు మనకు ఆనందం కల్గుతోంది. పొలం తనదని భావించినపుడు అది పంటలు పండినపుడు ఆనందం. దిగుబడి తగ్గితే దుఃఖం. ఒకనికి దీనినమ్మిగా అతనికి బాగా పంట పండినపుడు ఈ అమ్మినవాడు సుఖపడుతున్నాడా? అపుడూ ఈర్ష్యాద్వేషాలు కల్గుతాయి. చూడండి ఎంత మార్పువచ్చిందో?

మానసిక బాధ పడే కొడుకు గలిగిన ఒక తండ్రి మరొక వివాహం చేసికొన్నాడు. ఆ సవతి, ఇతని కొడుకుపై మమకారం చూపించ లేకపోయింది. పిల్లవాణ్ణి విడిచి రెండవభార్యతో కాపురం ఉంటున్నాడు ఒక రోజు అతడు నాదగ్గరకు వచ్చి మాకుర్రవాడు నా భార్యకు చేతబడి చేసాడని అది తిరిగి వాడికే తగిలిందని సంతోషంతో చెప్పాడు. ఎందుకిట్లా జరిగింది? తనకు పుట్టిన వానిని తనవాడు కాదని భావించడం వల్లనే కదా!

నాది, నేను అనుకోవడం వల్ల సంతోషం కల్గుతూ అంటే ఆ నేనే దేనితోనూ సంబంధం లేనప్పుడు అదే ఆనందస్వరూపం కదా! ఒక చేదు పొట్లకాయను బెల్లంతో వండినపుడు కొంతతియ్యగా ఉంటుంది. అసలు

బెల్లమే తీపికదా! ఆ తీపికై ప్రయత్నం చేయకుండా ఆ నేసును దుఃఖంతో కూడిన సంసారంతో కలిపి సంతోషపడుతున్నాం. తిన్నగా ఆ బెల్లాన్ని తినినపుడు పూర్తి ఆనందమేకదా! లోనున్న ఆత్మకాంతి ఇంద్రియాల ద్వారా ప్రసరించినపుడు కొంతసుఖపడుతున్నాం. చిల్లులున్న కుండలో దీపం పెట్టి ఆచిల్లుల నుండి వచ్చే వెలుతురును చూసి సంబరపడుతున్నాం. మాయయనే కుండను బ్రద్దలు కొడితే సంపూర్ణ కాంతియనే ఆనందాన్ని అనుభవించవచ్చు కదా!

ఎట్లా బ్రద్దలు కొట్టడం? కోరికలను నియమించడం వల్ల అంటే మనస్సును స్తిమిత పరచగలగాలి. స్తిమితపరచడమే అన్ని శక్తులకు మూలం ఏదైనా ప్రవాహానికి ఒక చోట అడ్డుకట్ట వేస్తే అది ఇంకా తీవ్రవేగంతో ఉంటోంది కదా! కనుక ఇంద్రియాల ఉరవడిని తగ్గించగలిగితే అన్ని శక్తులు ఒకచోట కేంద్రీకరింపబడతాయి. అట్టి వారివల్ల లోకోపకారం జరుగుతుంది. ఋషులట్లా కేంద్రీకరించి శక్తులను సాధించారు. మంత్రాలను వినగలిగారు గోళాలలో సంచరించేశక్తినీ సంపాదించగలిగారు అట్టి శక్తి అవతరించుగాక!

భగవానుడు ఒక అడుగు ముందుకు వేస్తాడు

నిశ్చలంగా ఉన్నపుడు సముద్రంపై గాలివీస్తే బుడగలు వస్తాయి. మరొకవైపు నుండి గాలి వీచినపుడు బుడగలు బ్రద్దలౌతాయి. అందుండే మాయ అనేగాలి వల్ల జీవులనే బుడగలు పుట్టుకొనివస్తున్నాయి. ఆచార్యుని కటాక్షాలనే మంచిగాలి వీస్తే ఈ జీవులనే బుడగలు బ్రద్దలై పరమాత్మఅనే సముద్రంలో కలిసిపోతాయి.

సముద్రపు నీటికి తగ్గుదల లేదు. అది ఆవిరిగా మారి వర్షరూపం ధరించినా సముద్రం ఎండిపోదు సముద్రం వల్ల ఏర్పడినదులు గ్రహించిన నీరు ఎండిపోవచ్చు అందు వరదలూ రావచ్చు. అట్టి వరదలు సముద్రానికి

లేవు. సృష్టి ఆరంభ దశలో అది ఎట్లా ఉందో ఇప్పటికి అట్లాగే ఉంది.

సముద్రంలోని నీటిమాదిరిగా పరమాత్మలో ఎట్టి మార్పులేదు. ఈ నీటితో పోలికను చెప్పినపుడు నదులగురించి చెప్పాలి. ఉత్తరదేశంలో ఒక నదిపేరు శోణం. అది ఎర్రనేలలో ప్రవహించడం వల్ల దానికాపేరు వచ్చింది. కృష్ణ నలుపు, గంగ తెలుపు. ఎరుపు రజోగుణాన్ని, తెలుపు సత్వ గుణాన్ని, నలుపు తమోగుణాన్ని సూచిస్తాయి. అట్లాగే జీవుని మనస్సు దేనియందు లగ్నమైందో ఆరంగుతో అనగా ఆ గుణంతో ఉంటాడు. కాని అన్ని నదులు, అన్ని రంగులు సముద్రంలో చేరవలసిందే!

Water finds its own level అని ఆంగ్లంలో సామెత. కొండలపై పడిన వర్షం ప్రవహించడం వల్ల నదులేర్పడి పెద్దరొదచేస్తాయి. నేలపై ప్రవహించినపుడు పెద్ద శబ్దం ఉండదు. చివరకు సముద్రంలో కలిసినపుడు అసలు శబ్దమే ఉండదు. అది పైసామెతకు అర్థం, శాంతి కావాలంటే ఒక లెవెల్‌కి రావాలన్న మాట. అది రానంత వరకూ రణగొణధ్వనులే. నిశ్శబ్దమైన నదికి సముద్రం ఆహ్వానం పల్కుతుంది. వినయంతో నది సముద్రంలో కలుస్తుంది. అట్లాగే వినయంతో సముద్రమనే పరమాత్మను చేరితే అతడూ, ఒకఅడుగు ముందుకు వేసి స్వాగతం పల్కుతాడు.

మాయ

బౌద్ధులు చెప్పినట్లుగా అంతామాయయని, అసలు సత్యమేలేదని అద్వైతులనరు. ప్రపంచం మాయ అని అంటూ ఆ మాయకు ఆధారం బ్రహ్మమని, అదే జగత్తు ఉండడానికి ఆధారమని చెబుతుంది.

మాయ అంటే అసలు లేక పోలేదు, ఉన్నది కాదు. ఉన్నట్లు కనిపించేది. కుందేలుకి కొమ్ములున్నాయని, గొడ్రాలునకు పిల్లలున్నారని చెప్పడాన్ని పూర్తిగా

వ్యతిరేకిస్తాం కదా! ఇది పూర్తి అసత్యం. మాయ అట్టిది కాదు. కాని ఎండమావుల వంటిది. వాటిని దూరంగా చూసి అందునీళ్లుంటాయని భ్రాంతి కల్గుతుంది. కాని అందునీళ్లుండవు. దాహం తీరదు. అట్లా జగత్తు మాయయని జ్ఞానులు భావించినా అది కన్పిస్తోంది కాని పరమసత్యం కాదని నమ్ముతారు.

త్రాటిని పామని కొంతసేపు భ్రాంతి పడతాం. అది పామని భావించినంత కాలం భయంపుడుతోంది. అట్లాగే జగత్తునిత్యసత్యం కాకపోయినా నిత్యసత్యమని, జ్ఞానం రానంతవరకు భావిస్తాం. అది సత్యమని భావించిన నపుడు లోకవ్యవహారం సాగుతోంది. అది పాముకాదు, త్రాడేయని యని భావించినపుడు దానినుండి భయం లేదు. ఈ జగత్తునకు బ్రహ్మమే ఆధారమని, అదేపరమసత్యమని అనుభవంలోకి వచ్చినపుడు అన్ని క్రియాకలాపాలు పోతాయి. ఇదే వ్యావహారిక సత్యం.

కలలు కనేటపుడు స్వప్నావస్థ నిజమే అని భావిస్తాం. మేల్కొన్న తరువాత అబద్ధమని తెలిసికొంటాం అట్లాగే జ్ఞానం కలుగనంతవరకూ జగత్తు సత్యమని, కలిగిన తరువాత అసత్యమని తెలిసికొంటాం.

అట్లాగే జగత్తు పరమసత్యమా! కాదు, అంతమాత్రంచే సత్యమూ కాకపోదు. ముత్యపుచిప్పను చూసివెండి యనే భ్రాంతి కల్గుతోంది. దీనినే ఆభాస అని అంటారు. ఇట్టి జ్ఞానాన్ని ప్రాతిభాసిక సత్యమని అంటారు. బ్రహ్మను ఆశ్రయించిన మాయాశక్తి వల్ల లేనిది ఉన్నట్లు కన్పిస్తోంది. అనగా బ్రహ్మప్రతిబింబంవల్ల.

జ్ఞానికి మాయ శూన్యమే, సున్నయే. జ్ఞాని కానివానికి తానొక సంఖ్యనని ఈ సున్నను తన ప్రక్కన ఉంచుకొంటాడు. అపుడు సంఖ్యకు విలువ పెరుగుతోంది. 10, 20 మాదిరిగా ఇట్లా మాయ అజ్ఞానిని చేరివిలువను పెంచుతోంది.

పంచదారతో వివిధ మధురపదార్థాలు తయారుచేసి రకరకాల పేర్లు పెడతాం. నామరూపాలతో కూడిన పదార్థాలకు బ్రహ్మమనే పంచదారయే కారణం. ఆపదార్థం కాకరకాయ ఆకారంలో ఉంటే పిల్లవాడు అది చేదని దగ్గరకు రావడం లేదు. కాని అన్నీ మధుర పదార్థాలని, అంతా ఆనందమయమని జ్ఞాని భావిస్తాడు. ఏది చీకటో అది జ్ఞానికి వెలుగు. ఏది పగలని జనులు భావిస్తారో అది జ్ఞానికి చీకటి. 'ఇట్లా ఎందుకు జరుగుతోంది'? మాయ కూడ బ్రహ్మను ఆశ్రయించి ఉందికదా! అందు బ్రహ్మము యొక్క కాంతి ప్రతిబింబిస్తోంది. ఆ ప్రతిబింబించిన దానిని చూసి నిజమని భ్రమిస్తున్నాం. అక్షరాలు కనబడాలంటే కొంత వెలుగుకావాలి. తీవ్రమైన వెలుగులో అసలు కనబడవు. మాయలో ప్రతిబింబించిన బ్రహ్మకాంతి వల్లనే లోకవ్యవహారం సాగుతోంది. జ్ఞాని యొక్క స్వయంప్రకాశమైన వెలుగులో ఈ జగత్తు కనబడదు. అందువల్లనే అతనికేదిపగలో అది మనకు రాత్రియని చెప్పడం.

ఆంతర్యం - బాహ్యం

కోరికలకై ఆరాటం. ఒకటి లభిస్తే తృప్తి ఉందా? ఇంకా కావాలి. బాహ్యమైనది మనచెప్పు చేతలలో ఉంటుందా? లభించినా శాశ్వతంగా మన దగ్గర ఉంటోందా?

లోపల అఖండానందం ఉండగా ఎందుకిట్లా పరుగులు తీస్తున్నాడు? అతడానందస్వరూపుడని తెలియక పోవడం వల్లనే! బాహ్యానందం ఒకనీటి బొట్టైతే లోనున్న ఆనందం సముద్రం వంటిది. ఎన్నినదులు కలిసినా అది చెలియలి కట్టదాటదు. అందుకే సముద్రాన్ని ఆ పూర్యమాణం అచలం ప్రతిష్ఠం అన్నది గీత. అట్లే జ్ఞాని అఖండానంద ప్రవాహంలో ఎట్టి మార్పును చెందకూడా శాంతంతో ఉంటాడు. ఇంద్రసుఖం కూడా అతనికి ఒక నీటిబొట్టే.

శంకరులు మనీషా పంచకంలో ఇట్లా అన్నారు. "యత్ సౌఖ్యాం బుధిలేశలేశత ఇమే శక్రాదయో నిర్వృతా"

బాహ్య వస్తువుల వల్ల కలిగే ఆనందం లోలోపలే ఉంది. పైవాటి వల్ల వచ్చే ఆనందాన్ని లోపలికి రానీయండి. ఏదీ రాకపోతే మనకు వచ్చే నష్టం ఏదీ లేదు. బాహ్యానందం ఒక నీటి చుక్కవంటిదనే భావన లేదా జ్ఞానం ఉంటే చాలు.

దుఃఖ భారాన్ని సడలించే మార్గం

బాహ్య వస్తువుల వల్ల శాశ్వత సుఖం లభిస్తోందా? ఏ ఆకులు కదిలినపుడు సూర్యకాంతిని అనుభవించగలమో అవే దట్టంగా ఉండి కదలనపుడు ఆ సూర్యకాంతి కనబడడంలేదు కదా! అట్లాగే కొద్దిపాటి సుఖం లభించి అంతర్ధానమౌతోంది.

పోనీ ధనవంతులు, అధికారులు సుఖపడుతున్నారా? డబ్బు సంపాదించిన కొద్దీ అధికారం ఎక్కువైన కొద్దీ వారు పొందే సుఖం కంటె అది పోతుందనే భావన వల్లనే ఎక్కువ దుఃఖపడతారు. నిజాయితీ పరునికీ బాధలు తప్పుతున్నాయా? లేదు.

కాని ఈ దుఃఖాలను సహించే మార్గం, శాంతి పొందే మార్గమూ ఉంది. ఉన్నకర్మలకు అదనంగా బరువు వేయకుండా, రాబోయే కర్మలు మీద పడకుండా చూసుకొనే మార్గం పై జ్ఞాన మార్గంలో ఉంది.

మతి తప్పినపుడు ఒక జడునిగా ప్రవర్తిస్తూ దుఃఖాన్ని అనుభవించడు. అంతమాత్రంచే అతడు ఆనందాన్ని అనుభవిస్తున్నాడా? లేదు. గాఢనిద్రలో దుఃఖం లేని మాటనిజమే. అపుడు సుఖంగా ఉన్నట్లు ఆదశలో తెలుస్తోందా? కాని జ్ఞాని మాత్రం నిత్యం జాగరూకుడై శాశ్వతానందాన్ని అనుభవిస్తాడు

అతని రోగ బాధలు లేవా? రోగాలున్నా అతని మనస్సులో దుఃఖ భావన ఉండదు.

నీళ్ల నూతిలో చేదవేయగా అదినీటితో నిండి నీళ్ళ లోపలే ఉంటే అది బరువుగా ఉందని అనం. పైకి లాగినపుడు మాత్రమే బరువు ఉంటుంది. పెద్ద చెట్టును కదిలించడం కష్టం. కాని ప్రవాహంలో సులభంగా కదులుతాయి. అట్లాగే మన దుఃఖాలను జ్ఞానమనే నీటిలో ముంచినపుడు తేలికౌతాయి. అయినా దుఃఖ కారణం మిగిలే ఉంటుంది.

యోగి

దుఃఖ స్పర్శలేనివాడు యోగి. ఎట్లా అతణ్ణి గుర్తించగలం? పరమాత్మతో అనుసంధానం చేసికొన్న వ్యక్తి ఇతర విషయాలను పట్టించుకొంటాడా? ఏ క్రియా చేయడు కదా! అతని స్థితి ఏమిటి?

నదికి మూలం సముద్రం. సముద్రంలోని నీరు ఆవిరై నదిగా మారి అది చివరకు సముద్రంలో కలుస్తోంది. కలిసిన తరువాత దానికి ప్రత్యేక వ్యక్తిత్వం ఉండదు. జ్ఞానులు, యోగులు సమాధిలో వారి మనస్సులనట్లా పరమాత్మలో లీనం చేస్తారు. సమాధిలో ఉన్నట్లు మన కోంట్లకు కనబడకపోయినా ఆత్మానుభవాన్ని పొందుతూ ఉంటారు. ఏదీ కోరడు. ఏదైనా కోరితే అతడు యోగియని అనిపించుకోడు.

మరొకలక్షణం. దుఃఖం వచ్చినా చలించడు. నిశ్చలంగా, సంపూర్ణ చైతన్యానుభవంతో ఉంటాడు.

అతనిలో ప్రేమ పెల్లుబుకుతుంది. తనవల్ల ఏప్రాణి బాధ పడకూడదని భావిస్తాడు. ఏదైనా పనిచేస్తున్నా నేననే అహంకారంతో ఉండడు. కొన్ని పనులు క్రూరంగా ఉన్నట్లు కనబడినా లోపల ప్రేమయే.

పరమేశ్వరుడు లయకర్తకదా! ఇదే భావనతో ప్రాణులను లీనం చేసికొంటాడు ప్రాణులను చంపడంకాదు. జీవులను నిద్రబుచ్చుతున్నట్లుగా అతని సంహారలీల ఉంటుంది. నిద్రలో విశ్రాంతి తీసికొని మెళకువరాగానే పనిచేస్తూ ఉంటాం కదా! అట్లాగే శరీర పతనానంతరం మరొక శరీరంలో జీవుడు ప్రవేశించడం మధ్యలో పరమేశ్వరుడు విశ్రాంతిని ప్రసాదిస్తాడు. అయితే జననమరణ ప్రవాహం నుండి తప్పించుకోవాలంటే నియమాలు, తపస్సు, కర్మకాండలు మొదటినుండే సాగవలసిందే. ఇట్లా ఒక్కొక్క మెట్టుఎక్కి గమ్యాన్ని చేరుకొన్నవాడే యోగి. అతని వల్ల మొత్తం మానవాళికే లాభం.

దుఃఖానికి విరుగుడు

ఎవరికైనా రోగం వస్తే వాతపిత్తకఫ ప్రకోపం వల్ల రోగం వచ్చిందని ఆయుర్వేదవైద్యుడంటాడు. మరోకారణం చెబుతాడు ఇంగ్లీషు వైద్యుడు. మానసిక వైద్యుడు మరోకారణం అంటాడు. దైవాపచారం జరిగిందని మంత్ర వేత్తలంటారు. గతజన్మ కారణాల వచ్చిందని ధర్మశాస్త్ర కారులంటారు.

ఇట్లా అనేక కారణాలు చెప్పినా ఆరోగాల విరుగుడుకై వారివారి చిత్తసంస్కారాలను బట్టి ప్రయత్నిస్తూనే ఉంటారు.

పూర్వజన్మకర్మ అనే మూలం దగ్గరకు వెడతాం. వర్షం వచ్చినపుడు భూమి చల్లబడడం, కప్పలు బెక బెక కమని అనడం, చెట్లు నవనవలాడడం, కొన్ని నశించడం మొదలగునవి ఎన్నో జరుగుతాయి. అన్నిటికీ వర్షమే కారణం. రోగానికి కర్మయే మూలకారణం. దానిని మంత్ర పఠనం వల్ల, లేదా వైద్యం ద్వారా ఎదుర్కొనాలి. ఇంకా మనకున్న అనేక సమస్యలకు మూలం కర్మయే. ప్రతికార్యానికి ఒక కారణముంటుందని నేటి సైన్సు కూడా చెబుతోంది. మన చర్యలకు ప్రతి చర్యలు తప్పవనీ అంటోంది. భౌతిక శాస్త్రం.

మనకర్మలే కాదు, ఇతరుల కర్మలూ మనకు సుఖ దుఃఖాలను కల్గిస్తున్నాయి. ఒక పిల్లవానికి రోగంవస్తే అది తల్లిదండ్రుల పాపకర్మల ఫలమంటారు. తల్లిదండ్రులు క్రుంగిపోతున్నారు.

కర్మ – దాని ఫలమే మానవుల సుఖదుఃఖాదులకు ప్రబల కారణం. గ్రహగతులు, దైవాపచారాలు, రోగాదులకు తరువాత ప్రాధ్యానం ఉంటుంది. ఆ ఫలాలు శాంతించినపుడే పైవన్నీ పనిచేస్తాయి. అన్నిటిని పరమేశ్వరుని ఇచ్ఛకు సంపూర్ణంగా విడిచిపెట్ట గలిగి ప్రశాంతంగా ఉండగలిగితే అది విరుగుళ్లకంటే అది పెద్ద విరుగుడు.

గత జన్మ కర్మలకు అదనంగా కర్మల భారం వేయకుండా, తాను పాపకర్మలు చేయుకుండా ఉండేటట్లు చేయవలసినదిగా పరమేశ్వరుని ప్రార్థించడం మేలు. ఈ జన్మలోని దుఃఖానికి ధ్యానమేగతి అద్వైత భావనలోనే సుఖదుఃఖాదులుండవు. స్వయం ప్రకాశమానమైన ఆత్మనే శరణుపొందాలి.

ద్వైతం + బౌద్ధం = అద్వైతం

బృహదారణ్యక ఉపనిషత్తులో శాంతిమంత్రం ఇట్లా ఉంటుంది. :-

"ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే

పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావ శిష్యతే"

అనగా బ్రహ్మము పూర్ణము. విశ్వమూ పూర్ణమే. పూర్ణమైన విశ్వం పూర్ణమైన బ్రహ్మమునుండి వచ్చింది. బ్రహ్మము పూర్ణంగానే ఉంది. రెండు వస్తువులు పరిపూర్ణ మెట్లా అవుతాయి? పూర్ణమైన వస్తువు నుండి పూర్ణమైన వస్తువును గ్రహించడమెట్లా?

ఈ మంత్రం యొక్క సారాంశమేమిటి? బ్రహ్మమునుండి ఈ విశ్వం విడిగా రాలేదు. బ్రహ్మమే విశ్వంగాకన్పిస్తున్నాడు. ఏదో ఒక సాధనాన్ని

అలంబనంగా తీసుకొని ఈ విశ్వాన్ని బ్రహ్మము సృష్టించలేదు. బ్రహ్మము విశ్వంగా పరిణమించనూ లేదు. చీకట్లో పూలమాలను చూసి పామనుకొన్నాం. ఆ పూలమాల పాములా కన్పిస్తోంది. నిజంగా పూలమాల పామయిందా? పూలమాల పామును సృష్టించలేదు. దానిని పాముగా భావించినపుడు సంపూర్ణంగా పాముగానే కనబడింది. అది పాము కాదు, పూలమాల అని తెలిసినపుడు అది పరిపూర్ణంగా పూలమాలయే. అనగా పూర్ణమైన పాము పూర్ణమైన పూలమాల నుండి వచ్చినట్లు పూర్ణమైన విశ్వం పూర్ణమైన బ్రహ్మనుండి వచ్చినట్లు కన్పిస్తోంది. మరొక విధంగా చెప్పాలంటే ఒక దశలో పూలమాల పూర్ణము, మరొక దశలో పాము పూర్ణము కనుక రెండు పూర్ణములు ఒకేదశలో ఉండవు. ఒకే ఒక పూర్ణము రెండు విడివడి పూర్ణములుగా భిన్నకాలాలలో కన్పిస్తోంది. పూలమాల పాముగా కనబడినపుడు దాని బరువేమైన పెరిగిందా? లేదు. పాముకాదని, ఇది పూలమాలయే యని నిర్ధారించినపుడు పూలమాలయొక్క బరువేమైనా తగ్గిందా? లేదు. పెరగడం, తరగడం అంటూ ఏదీ లేదు. అట్లాగే ఈ విశ్వాన్ని బ్రహ్మములో చేర్చినా, బ్రహ్మమునుండి తీసివేసినా బ్రహ్మము పూర్ణంగానే మార్పులేకుండా ఉంది. కంబదు తన రామాయణంలో ఈ ప్రపంచం పాముగా కనబడే పూలమాలలా ఉందని అన్నాడని పేర్కొన్నాను కదా! అందుపాము అనే భావనను తొలగిస్తే అది పూర్వపు పూలమాలయే అవుతుంది. ఇట్లా పూర్ణం నుండి పూర్ణం తీసి వేసినా పూర్ణంగానే ఉంటుంది.

పూలమాల ఇట్లా ఎందుకు కన్పించింది? చీకటివల్ల మాయ అనే చీకటి వల్ల బ్రహ్మము ప్రపంచంగా కనబడింది. మాయయనగా ఏది లేదో అది. ఏదికాదో అది (Not). లేనిది ఇట్లా చేయగలదా? లెక్కల రూపంలో సమాధానం ఇస్తాను.

అన్ని సంఖ్యలకు సంకేతాలున్నాయి. అనంతానికి సంకేతం ఏమిటి?

భాస్కరాచార్యులు ఒకటిని లవంగాను, పూజ్యాన్ని హారంగాను గ్రహించి ఒక భిన్నం చూపితే అది అనంతానికి సంకేతం అవుతుందన్నారు. (1/0). రెండును రెండుతో భావిస్తే విభక్తం ఒకటవుతుంది. (2÷2=1). 2ను విభాజ్యంగా తీసికొని 1, 1/2, 1/4 సంఖ్యలను విభాజకాలుగా తీసికొని భాగిస్తే 2, 4, 8 సంఖ్యలు విభక్తాలవుతాయి. (2÷2=1; 2÷1/2=4; 2÷1/4=8). ఇట్లే 16ను 1/8గా భాగిస్తే విభక్తం 128 అవుతుంది. విభాజకం పెరిగే కొద్దీ విభక్తం పెరుగుతుంది. విభాజకము అత్యంత కనిష్ఠమై అణుపరిమాణమై సూక్ష్మాతి సూక్ష్మమైతే విభక్తం అనంతమవుతుంది. సున్న అతి సూక్ష్మ సంఖ్య అనగా ఆకాశము, పూజ్యము. హారమనగా భాగించుట. సున్నను విభాజకంగా తీసికొని ఎంతటి పెద్ద సంఖ్యనైనా సరే భాగిస్తే వచ్చే విభక్తం ఒకటవుతుంది. ఖహారమంటే ఇదే.

ఏ సంఖ్యనైనా భాగించేవేళ మనం కనుగొన్న విభక్తం సరియైనదో కాదో తెలుసుకోవడానికి విభాజకాన్ని విభక్తంతో గుణించి విభాజ్యం వస్తున్నదా లేదా అని పరిశీలిస్తాం. ఈ ఖహారంలోనూ అంతే. ఏ సంఖ్యనైనా సున్నతో భాగించే దానిలో విభాజ్యం ప్రపంచతుల్యం అవుతుంది. నానా రూపాలతో అనంతంగా ఉన్న ఈ విశ్వమే విభాజ్యం, సున్నలేక, పూజ్యం. గణిత పరిభాషలో అనిర్వచనీయం. అనగా దాదాపు లేనిది. అదే వేదాంత పరిభాషలో మాయ. ఈ విశ్వాన్ని ఏమీలేని మాయచే భాగిస్తే వచ్చే ఫలము లేక జవాబు. అనంతము, సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ అని మంత్రము. ప్రపంచాన్ని సృష్టించడానికి (ప్రపంచం = విభాజ్యం) బ్రహ్మ అనగా విభక్తము తన్ను మాయతో = విభాజకముతో గుణించుకొంటూ ఉంటుంది. సున్నచే ఏ సంఖ్యను భాగించినా వచ్చే విభక్తం ఒకటే. ఒకటి, రెండు, మూడు మొదలైనవి భేదసంఖ్యలు. అవి ప్రపంచము యొక్కనానాత్వాన్ని సూచిస్తాయి. ఏకమే అనంతమైనది. ఆ అనేకం కావడంవల్ల అనగా మాయా సంపర్కంచేత, అనంతుడైన పరమాత్మ మాయా సంపర్కంతో తన్నుగుణించుకొంటు ఒకటి,

రెండు, మూడు అని అసంఖ్యాక నామరూపాలతో ఒప్పారుచున్నాడు. అయితే ఏవిభక్తాన్నైనా సున్నతో పెంచితే సున్నయే వస్తుంది. కనుక అనంతాన్ని మాయతో గుణిస్తే వచ్చేది మాయయే. అనంతుడు గుణ్యము, మాయ గుణకము. ప్రపంచములబ్ధము. ఈహారంలో విభాజ్యం ప్రపంచం యొక్క నానాత్వమే. అనగా నానాత్వం లోని ఏకత్వమే. విభక్తం అంటే బ్రహ్మ, అనగా సత్యము, శాంతి మంత్రంలో పూర్ణం అదః అంటే విభక్తం; అద్వితీయమ్మైన అనంతం. పూర్ణం ఇదం అంటే విభాజ్యము, నామరూపాత్మకమైన అనంతం. అద్వైతానందాన్ని పూజ్యంతో గుణిస్తే ద్వైతానందం లభిస్తుంది. ద్వైతానందాన్ని ఖహారం చేసి, సున్న లేక మాయచే భాగించి దాని నానాత్వాన్ని తొలగిస్తే అద్వైతానందం లభిస్తుంది. అనంతానికి రూపంలేదు. మాయ దానిని గుణించి నానావిధరూపాలను ధరిస్తూ ఉంది. ఉన్నది ఒక్కటి, దానికే విలువ. నానాత్వం మాయాకార్యం కనుక ఈ నానాత్వం కూడా ఏమిలేనిదే. అంటే విలువ లేనిది అందుచే మాయతో గుణించినా భాగించినా ఆబ్రహ్మలో ఏవిధమైన మార్పు ఉండదు. ప్రపంచంలో సృష్టి ప్రలయాలు ఆ అనంతునిలో ఏవిధమైన మార్పును కల్గించ లేకపోతున్నాయి."

అద్వైతం బ్రహ్మ మనంతం కనుక అదే పరమ సత్యమని చెబుతుంది. విశ్వం కూడా అనంతంగా కన్పిస్తోంది కనుక అదీ సత్యమే అని చెబుతుంది, ద్వైతం. బ్రహ్మము, విశ్వమూ రెండూ లేవి కనుక శూన్యమే అని చెబుతుంది బౌద్ధం. అనగా మాయయని, చెప్పేది.

బౌద్ధం × మాయ = విశ్వము

అద్వైతం × బౌద్ధం = ద్వైతం

ద్వైతం ÷ బౌద్ధం = అద్వైతం

శంకరుల ఆదేశం

శంకరులు పీఠాధిపతులను నిరంతరంధ్యానం చేయాలని, ఇతరులు చేయునట్లుగా ప్రబోధించాలని మాకాదేశించారు. ఎందుకు ధ్యానం చేయాలి? పైవాడు మనలో ఉన్నాడని, మన స్వభావమే అతడని తెలిసి కోవడం కోసమని. మనమెవరమని ఎట్లా తెలిసికోవడం? నాకు తెలియదని నీవన్నా కల్యాణగుణాలు కలిగిన ఈశ్వరుణ్ణి ముందు ధ్యానించు. అతడు, మనమూ ఒకటే కనుక (మన) నిజరూపాన్ని అతడు తెలియపరుస్తాడు. అపుడు సగుణస్థితిపోయి నిర్గుణ స్థితి వస్తుంది. ఇదే సాధనకు పరమార్థం.

ఒకణ్ణి జాగరూకతతో చూడని చెప్పినపుడు, అవతలి వాడు సరిగా ప్రవర్తించకపోతే ఈ రక్షకుణ్ణి తప్పుపడతాం కదా! ప్రజలు చేసిన పాపాలు రాజునకు, భార్య చేసిన పాపాలు భర్తకు, శిష్యుడు చేసిన పాపాలు గురువునకు చెందుతాయని సూక్తి ఉందికదా! కనుక జగద్గురువువనే పిలువబడే వానికి బాధ్యత లేదా! ప్రజలు ధ్యానం చేయకపోతే వారి కోసం మేము చేయాలని ఆదేశించారు. మీ కోసం నేను ప్రార్థిస్తున్నా. నిరంతరం మీరు చేస్తే నా భారం కొంత తగ్గుతుంది. అందుకే మీరు చేసేటట్లు మేము బోధించాలి. తీరికలేదని కుంటిసాకులు చెప్పకండి. సంకల్పం ఉంటే తీరిక అదే దొరుకుతుంది.

తాము చేస్తూ చేయండని ప్రేమతో ఇతరులకు చెప్పండి. మనలోని మురికిని కడగడానికి పవిత్ర స్థలాలు, నదులు, ఇట్లా ఎన్నో అవకాశాలున్నాయి. ఈదేహాన్ని విడిచినపుడు పాపభారం లేకుండా ఉండాలి. కన్నడంలో మాలో పాపులను కూడా పరమాత్మగా పరమాత్మ మారుస్తాడని సామెత ఉంది. ముందు సత్కర్మ, తరువాత జ్ఞానం వరసలో సాగాలి.

అద్వైత సత్యం

అద్వైతం ఒక సిద్ధాంతంగా ఉండిపోవడమా? తెలిసికోవడం వల్ల ప్రయోజనమేమిటి?

ఎందుకీ జన్మలు వస్తున్నాయి? గత జన్మల పాపపుణ్యాల ఫలమే. అయితే ఆత్మకు పుణ్యపాపలంటుతాయా? అంటవు. అది నీటి చేత తడపబడదు. అగ్ని దానిని కాల్చలేదు. కర్మను అనుభవించడానికి శరీరం కావాలి పైఫలాలననుభవించడానికి ఈశరీరాన్ని భగవానుడిచ్చాడు. ఈ శరీరం నాదే అనే భావన కల్గిస్తాడు. ఎందుకీ పాపపుణ్యాలను చేస్తున్నాం? ఒక చెట్టును ఎదుగుదల లేకుండా చేయాలంటే కొమ్మలు, రెమ్మలు నరికితే సరిపోతుందా? మూలం నరకాలి. ఎందుకు నరకలేకపోతున్నాం? శీఘ్రలాభం కోసం దొడ్డి దారులు త్రొక్కుతున్నాం. అదొక పాపం. దానికి కారణం కోరిక. అన్ని దుఃఖాలకు అదే కారణం. ఎట్లా దీనినెదుర్కొనాలి?

వేదాంతం దీనికి సమాధానం చెప్పింది. ఇష్టమైనది మననుండి దూరమైనా, విడిగా ఉన్నా మనలో కోరిక, తీరకపోతే క్రోధం కల్గుతాయి. కోరికలేనపుడు తప్పుచేయడానికి అవకాశమే లేదు. పాపమూరాదు. మన కంటె మరొకటి భిన్నంగా ఉందని భావించినపుడు పై బాధలన్నీ. అభేదం సిద్ధిస్తే అద్వైతం పట్టుబడితే అంతాసుఖమే. అందంగా ఉంటే అదికావాలని కోరిక. చూసేది, చూడబడేది ఒక్కటైనపుడు శత్రుత్వం లేదు. భయములేదు. అద్వైతం అట్టి భయాన్ని పోగొడుతుందని, నీకంటె మరొకటి భిన్నంగా ఉందని భావించినపుడు మాత్రమే భయమని ఉపనిషత్తు:-

ద్వితీయా ద్వై భయం భవతి

– బృహదారణ్యకం

ఈ ద్వంద్వ భావం పోగొట్టడం ఎలా? మనం చూసేవి భ్రాంతులని వేదాంతం అంటోంది. అన్నీ ఈశ్వర స్వరూపమే అంటున్నది. అట్లా

చూడగలుగుతున్నామా? మనం చూసేవే నిజమని భావిస్తే సర్వవ్యాపియైన ఈశ్వరుడు నిజం కాకుండా పోతాడు. ఈ జ్ఞానం లేకపోవడం వల్ల బాధలు పడుతున్నాం. సత్యమైన వస్తువునందే జగత్తు ఉందని చెబుతుంది అద్వైతం. ఆ సత్యాన్నే ఆత్మయని, బ్రహ్మమని, ఈశ్వరుడని పిలుస్తారు.

అంతా ఈశ్వరుడైనపుడు మనం భిన్నంగా ఉంటామా? అతనిలో మనమూ లీనం కావాలి. అపుడు భేదభావం ఉండదు. అంతటా ఈశ్వరుని చూచినపుడు మనలో ఆందోళనలుండవు. అపుడు కోరిక ఉండదు. కోరిక ఎప్పుడైతే లేదో పాపస్పర్శలేదు. పాపం లేకపోతే మరొక శరీరాన్ని ధరించడమూ లేదు. ఇట్లా ప్రతి వస్తువును బ్రహ్మముగా, ప్రతివస్తువునకు ఆధారం బ్రహ్మమని తెలిసికోవడమే అద్వైతం.

లోగడ అవస్థాత్రయాన్ని గూర్చి చెప్పాం. మెలకువ, నిద్ర మధ్యలో కలలుగనే స్థితి ఎందుకు? తానన్నింటా ఉన్నానని చెప్పడం కోసం ఈ కలలుగనే స్థితిని ఈశ్వరుడు కల్పించాడా? ఒక కలగన్నానని మేల్కొన్న తరువాతనే చెప్పగలడు. మన మానసిక భావాలే భిన్నవ్యక్తులుగా వస్తువులుగా కలలో కన్పిస్తాయి. మేల్కొన్నపుడు అవి ఏమీ ఉండవుకదా! జ్ఞానికి ఈ ప్రపంచమే ఒక కలగా కన్పిస్తుంది. కలలో కనబడిన వస్తువులను మేల్కొన్న తరువాత భ్రాంతులని మనం అన్నట్లుగా అసలీప్రపంచమే ఒక కలగా భావిస్తాడు జ్ఞాని. ఇది అద్వైతం.

అయితే ఈ అద్వైతస్థితి మనస్సుకు, వాక్కునకు అందదని ఉపనిషత్తులన్నాయి:-

యతోవాచో నివర్తంతే అప్రాప్య మనసా సః

– తైత్తిరీయ ఉపనిషత్తు

మనస్సుతో కూడా భావించలేనపుడు ఎట్లా భావించగలం? ఈ మంత్రానికి అర్థంఏమిటి? పరమాత్మ తెలిసికొనబడే వాడైతే తెలిసికొన్న

వాడు తెలిసికొనబడే వాడు ఇద్దరవుతారు. ఇది సరికాదు. పరమాత్మను తెలిసి కొనేవాడు జీవాత్మ అనడం ద్వైతం. ఇద్దరూ ఒక్కటే అనడం అద్వైతం. అందుకే కేనోపనిషత్తు పరమాత్మను తెలిసికొన్నానని చెప్పిన వానికి అతడు తెలియబడడని, నాకు తెలియదని చెప్పినవాడే తెలిసికొంటాడని చెప్పింది:-

యస్య అమతం తస్యమతం
మతం యస్యనవేద సః

అది తెలిసి కొనబడేది కాదనడం ఏం చెబుతోంది? మనకంటె భిన్నమైనది తెలియబడలేదని. ఒక దీపాన్ని చూపించడానికి మరొక దీపం అవసరం ఉందా? అట్లాగే బ్రహ్మజ్ఞానం కూడా. జ్ఞానమే స్వయం ప్రకాశమానం మన పరిమిత జ్ఞానంతో తెలియబడేది కాదు, తేవారం, తిరువాచకం, తాయుమానవార్ పాటలు మొ॥వి ఈశ్వరుణ్ణి జ్ఞానమనే కీర్తించాయి. "అదివురువే" అని. తెలిసికోదలిచిన వాడు అజ్ఞానంలో లీనమైపోతాడు. కారణమేమంటే అతడు తెలిసికొనలేడు కనుక.

మనస్సు ఏది ఆలోచించినా అది భ్రాంతియే. మనస్సును ఏది ఆలోచింపచేస్తుందో అది సత్యము :-

యన్మనసాన మనుతే ఏనాహుర్మనో మతం

- కేనోపనిషత్తు

చూసే బుద్ధి మాత్రం సత్యం. కలలు భ్రాంతులు కదా! అనేకమైన వాటిని చూస్తాడు. కలలో వచ్చినవాడు మనస్సుతో ఆలోచనతో. కలగనేవానిని గుర్తిస్తున్నాడా? కనుక మనకంటె ఆలోచనతో కలగనేవానిని గుర్తిస్తున్నాడా? కనుక మనకంటె మరొకటి భిన్నంగా ఉన్నపుడే తెలిసికొనడం. అందుకే అద్వైతసత్యం వాక్కులకు మనస్సునకు అతీతమని చెప్పబడింది.

ఈ తత్వం పట్టుబడడానికి వైదిక వాఙ్మయం, పూజ, సంఘసేవ, స్వధర్మానుష్ఠానం దోహదం చేస్తుంది. ప్రాపంచిక సుఖాలకై కొన్నిటిని త్యాగం

చేస్తున్నాం కదా! ఆత్మజ్ఞానానికి ఇంకా ఎక్కువ త్యాగం చేయగలగాలి. జనకునకు యాజ్ఞవల్క్యుడు జ్ఞానోపదేశం చేయగా విదేహరాజ్యాన్నిస్తానని, తనను తాను అర్పించుకొంటానని అన్నాడు:-

విదేహాన్ దదామిమామ్ చాపిసహదాస్యాయ -

-బృహదారణ్యకం

ఈ స్థితి పట్టుబడాలంటే భక్తి సులభోపాయమని అప్పయ దీక్షితుల వారంటారు. అట్టి భక్తిని కల్గియుందాం.

ఈ ప్రపంచం మాయ ఎట్లా అవుతుంది ?

(ఈ విషయాన్ని లోగడ ఆచార్యులు వివరించారు. ఇంకా విపులంగా చెబుతున్నారు.)

అన్నిటా వ్యాపించిన ఆత్మయే అసలు సత్యమని, అదే బ్రహ్మమని, దానిలో మార్పులు లేవనుట సిద్ధాంతం. కనబడే ప్రపంచం నిత్యం మారడం లేదా? కనుక దీనిని సత్యమని చెప్పలేదు.

అయితే అసత్యమని గట్టిగా చెప్పారా? అసలు ఎప్పుడు లేదనీ చెప్పలేదు. అనగా ఇది సత్యమూ కాదు, అసత్యమూకాదు. అపుడు దీనిని మిథ్య అని అన్నారు. ఈ మిథ్య నిత్య సత్యం, నిత్య అసత్యం మధ్యలో ఉంటుంది. సత్యాన్ని మూడు రకాలుగా విభజించి వీటికి విరుద్ధమైనది అసత్యమన్నారు.

1. పారమార్థిక సత్యం
2. వ్యావహారిక సత్యం
3. ప్రాతి భాసిక సత్యం
4. అసత్యం నాల్గవది పై మూడింటితో చేరదు.

అద్వైతంలో పారమార్థిక సత్యం బ్రహ్మమే. వ్యావహారిక సత్యమనగా మన జీవనంలో జరిగే సంఘటనలను సత్యంగానే భావిస్తాం. ఇక వెలుతురులో ముత్యపు చిప్ప వెండిలా క్షణకాలం కన్పిస్తుంది. అట్లాగే మనకలలూ. దీనిని ప్రాతిభాసిక సత్యమంటారు. ఈ మూడింటికి భిన్నమైనది అసత్యం. యోగశాస్త్రం దీనిని వికల్పమన్నది:-

శబ్ద జ్ఞానానుపాతీ వస్తుశూన్యో వికల్పః

అనగా ఒక శబ్దం ఉండి దానికి అర్థమైన వస్తువుందనపుడు దానిని వికల్పమంటారు. ఉదా:- గొడ్రాలికి కొడుకు ఈమాట చెవిపడగానే అసత్యమని తెలుస్తోంది కదా!

ఒక గడ్డి వెంటి, చీకట్లో పాముగా కన్పిస్తుంది. దానిని పామని చెప్పుట అసత్యం. పాముగా కనబడుట సత్యం. ఈ సందర్భంలో సత్యము, అసత్యము కలిసియున్నట్లుగా ఉంటుంది. దీపం తీసికొనివస్తే అసత్యమని తోస్తోంది కదా! దీనిని ప్రాతి భాసిక సత్యమంటారు.

అసలు సత్యంతో పోల్చినపుడు ఈ వ్యావహారిక సత్యము, ప్రాతిభాసిక సత్యము, అసత్యములే. నిజమైన జ్ఞానం లేనపుడు సత్యంగా కనబడేదానిని వేదాంతం, మిథ్య అని చెప్పింది. అసలే కనబడనిది మాత్రం అసత్యం.

ప్రాతి భాసికం:- భానం అంటే కాంతి. ప్రతిభానం అనగా ప్రతిబింబించిన కాంతి. సూర్యకాంతి ముత్యపుచిప్ప పైబడి వెండిలా కొంతసేపు కనబడింది. కనుక పూర్తిగా అసత్యం కాదు. పోనీ అ కనబడిన వెండితో ఆభరణాలు చేయించుకోగలమా?

ఇట్లా నిజంగా కన్పింపచేసే శక్తియే మాయాశక్తి. బ్రహ్మము, ప్రపంచంగా కనబడడము దీనివల్లనే.

బ్రహ్మము ప్రపంచంగా కనబడింది. జ్ఞానం కలిగిన తరువాత బ్రహ్మముకంటె మరొకటి లేదని, బ్రహ్మమునుండి ఈ జగత్తు విడిగా లేదని

భావిస్తాం. దీపం తీసికొని చూడగా పాముకాదని గడ్డి వెంటియేయని నిర్ధారిస్తాం కదా! పాముగా కనబడదానికి ఆధారం గడ్డి వెంటియేకదా!

అయితే నిత్యవ్యవహారంలో మనం చూసే వస్తువులు కొంతకాలం ఉంటున్నాయి కదా! ఇది కేవలం అసత్యమని భావిస్తే వ్యవహారమే సాగదు. విమల జ్ఞానం రానంతవరకూ ఈ వ్యావహారిక, సత్యాన్ని అంగీకరించారు శంకరులు.

పరమార్థ సత్యాన్ని 'సత్యతరం' అన్నారు. అనగా ఒక సత్యం కంటె మిన్నయని. వ్యావహారిక సత్యం ప్రాతిభాసిక సత్యం కంటే సత్యమైనది కనుక దీనిని సత్యతరమన్నారు. వ్యావహారిక ప్రాతిభాసికములు మిథ్యలు.

మన శరీరం ఇంతకుముందులేదు, కొంత కాలం తరువాత ఉండదు. కనుక ఇది పరమసత్యముకాదు. ఇది కొంతకాలం ఉంది కనుక కేవలం అసత్యముకాదు. నిత్యసత్యమైతే ఎల్లపుడూ ఉండాలి కదా!

వెలుతురులో ముత్యపుచిప్ప వెండిలా కనబడింది. వెండి కాదు. ముత్యపుచిప్పలో వెండి ఉన్నదనే మాట వ్యవహారంలో ఉంది. ఉన్నదని ఎప్పుడైతే అంటున్నామో అది కేవలము అసత్యము కాదు. సూర్యకాంతి లేనపుడు వెండి ఉన్నదనే మాట అనం. వెండి మరుగైనా చిప్ప ఉంది. ఇట్లా అసత్యాన్ని సత్యంలా కన్పింపచేసేదే మిథ్య. కాని మిథ్యకు ఆధారం సత్యమే సుమా! సత్యమైన ముత్యపు చిప్ప ఉంటేనే వెలుతురులో వెండిగా కనబడింది. అట్లాగే ఆ ప్రపంచానికి, మిథ్యాలోకానికి బ్రహ్మమే ఆధారం. వెండి లేకుండా ముత్యపు చిప్ప చివరకు మిగిలినట్లు ప్రపంచం కనుమరుగైనా బ్రహ్మము మాత్రము ఎల్లవేళలా ఉంటుంది. కనుక సత్యబ్రహ్మము మిథ్యాలోకంగా చూపించేది మాయ.

మాయను, అనిర్వచనీయమన్నారు శంకరులు. అనగా అది సత్యము కాదు, అంతమాత్రంచే అసత్యము కాదు. దానిని నిర్వచింపలేము.

పోనీ ఇది పరమాత్మకు భిన్నంగా ఉందా? పరమాత్మ కంటె భిన్నమైనది ఏదీలేదు కదా! కనుక కుదరదు. పరమాత్మ మాయయని అందామా? అదీకుదరదు. జ్ఞానం కలిగేటంతవరకు మాయ. కలిగిన వెంటనే అంతర్ధానమౌతోంది. ఇది బౌద్ధుల చెప్పే శూన్యం కాదు.

పారిభాషిక పదాలతో చెబుదాం. పాములా కనబడడానికి గడ్డి వెంటియే కారణం. దానినే అధిష్ఠానమంటారు. పామును ఆరోప్యమంటారు. అధిష్ఠానం స్పష్టంగా కన్పించినపుడు ఆరోప్యం కనుమరుగౌతోంది. ఇట్లా కనబడడమే ప్రాతి భాసికం. మనము అనే మాట. ఎప్పుడు పోతుంది, మనమునకు ఆధారమైన బ్రహ్మానుభవం కలిగినపుడు. ప్రపంచానికి ఆధారమైన బ్రహ్మను భావించినపుడు ఈ సూర్యచంద్రాదులు కనబడరు. కనుక ప్రపంచం మిథ్య. మనమనే మాట కూడా మిథ్యయే. ఈ వ్యవహార సత్యాన్ని అంగీకరించిన శంకరులను, కొందరు సరిగా అర్థం చేసి కోకుండా శంకరులపై దండెత్తుతూ ఉంటారు. మిథ్య అనే పదాన్ని గమనిస్తే సంఘర్షణలేదు.

భిన్నంగా ఉన్నవి భిన్నమెట్లా అయ్యాయి ?

నీవు బ్రహ్మమెట్లా అయ్యావు? అన్నీ భిన్నంగా కన్పిస్తున్నాయి కదా! అంతా బ్రహ్మమైనపుడు విడివడి జీవులు కనబడడమేమిటి? జీవుడు శివుడవడమేమిటి? ఈ ప్రశ్నలకు అద్వైతి రెండు పద్ధతులలో సమాధానాన్ని చెబుతాడు.

సూర్యుడుండగా నీళ్లను తీసికొని నేలమీద పోస్తే ఆ నీటి బుడగలలో అనేక ప్రతిబింబాలు కన్పిస్తాయి. పెక్కు మంది సూర్యులను చూస్తాం. వస్తువును బట్టి అతని ఆకారమూ మారుతుంది. ఒకే చైతన్యము భిన్న వస్తువులుగా, భిన్నభిన్న ప్రాణుల బుద్ధులలో ప్రతిబింబించినపుడు కన్పిస్తోంది. సూర్యుడొక్కడే, చైతన్యమొక్కటే. ఇట్లా చెప్పడాన్ని బింబప్రతిబింబవాదమని అంటారు.

నీటి బుడగలను రూపుమాపినపుడు ప్రతిబింబాలుండవు. మన బుద్ధులలోనే భిన్నత్వం ప్రతి బింబాలుగా కన్పిస్తోంది. పవర్‌హౌస్‌లో విద్యుత్తును ఉత్పత్తి చేసే జనరేటర్ వల్ల విద్యుత్తు పుట్టి వెలుగేర్పడుతోంది. దానిని ఆపుచేస్తే వెలుగులేదు. ఆ జనరేటర్ వంటి మనస్సు నాపితే మనస్సులేదు. అనగా ప్రతి బింబాలు లేవు. మనబుద్ధులనే నీటి బుడగలలో సూర్యచైతన్యం ప్రతిబింబిస్తే భిన్నభిన్నంగా కన్పిస్తున్నాం. నీటి బుడగలను తొలగిస్తే ఈ ప్రతి బింబాలులేవు. అనగా పరమాత్మ అంతఃకరణ మనే ఉపాధిలో ప్రతిబింబిస్తాడు. అనగా ఈ మనస్సు లేకపోతే ఈ ప్రతిబింబం ఉండదు.

అయితే మరొక ప్రశ్న. బుడగలుపోతే ప్రతిబింబాలు పోతాయని చెబుతున్నారు కదా, అవి సూర్యబింబాలవుతాయా అని సందేహం. అద్వైతం మరొక పదాన్ని అంగీకరించింది. అదే అవిచ్ఛిన్న వాదం. నూతిలో నీళ్లను చేదవేసి తోడుతున్నాం. చేదలో నున్న నీరు, నూతిలోనున్న నీరు ఒక్కటేకదా! అయితే చేదతో తోడినపుడు భిన్నమనే భావంతో ఉంటాం. అనగా ఉపాధి భేదాన్ని బట్టి అనగా మనస్సు యొక్క వ్యత్యాసాన్ని బట్టి పరమాత్మ వ్యత్యాసంగా కనిపిస్తూ ఉంటాడు. ఆకాశం అంతటా ఉంది. కుండలలో ఖాళీ ఉంది. కుండలను బ్రద్దలు కొట్టినపుడు ఈ ఖాళీఏమైంది? మహాకాశంలో కలిసింది. అవి బ్రద్దలు కానపుడు విడివిడిగా ఆకాశం ఉన్నట్లు కన్పిస్తోంది. కుండల ఆకారాన్ని పరిమాణాన్ని బట్టి ఎక్కువ ఆకాశం, తక్కువ ఆకాశమని అంటున్నాం. పెద్ద కుండలో ఎక్కువ నీరు చిన్నకుండలో తక్కువ నీరు పడుతుంది కదా! వీటిని బ్రద్దలు కొట్టినపుడు భేదాలుండవు. అట్లాగే మనస్సు మటుమాయమైతే భిన్నంగా చూసే మనస్తత్వము అంతర్ధానమౌతుంది. ఇదే అవిచ్ఛిన్నవాదం. పరమాత్మ జీవాత్మ'గా కనబడడాన్ని ఈరెండు పద్ధతులలో వివరించారు.

సూర్యుడు నీటి బుడగలో ప్రతిబింబించినపుడు మరొక సూర్యుడు వచ్చి

ప్రతిబింబించాడని అంటున్నామా? మన అజ్ఞానం పోనంతవరకూ ఒకే ఒక పరమాత్మ జీవాత్మగాతోస్తున్నాడనే భావం గట్టిపడదు.

నీళ్లలో సూర్యుడు ప్రతిబింబించినట్లు ఘటంలో మహాకాశం ఉన్నట్లు, నూతినీరే పాత్రలో ఉన్నట్లు ఒకే పరమాత్మ ఉన్నాడని, భిన్నంగా కనబడేవి భిన్నంకావని, ఒకే పరమాత్మ వీటికి ఆధారమని ఆ ఒకటే తాననీ గుర్తించడమే తత్త్వమని చెప్పేది అద్వైతం.

వేదాల ననుసరించే శంకర భాష్యములు

వేదాంత పదానికి రెండర్థాలు. వేదాల అంతమని, చివరి గ్రంథమని ఒక అర్థం. వేదాల సారమని దాని నిశ్చయార్థమని రెండవ అర్థం. నీ నిర్ణయమేమిటని ఒకర్ని అడిగా మనుకోండి, నీవు చెప్పినదే సరియని అవతలి వాడంటాడు కదా! వేదాల అంతమే నిశ్చయార్థాన్ని బోధిస్తుంది. ఉపనిషత్తులను వేదాంతమని అంటారు.

సంహిత, బ్రాహ్మణం, ఆరణ్యకమని వేదం మూడుభాగాలుగా ఉంటుంది. ఆరణ్యకం చివర ఉపనిషత్తులుంటాయి. కర్మ, ఉపాసన పై మూడింటిలో ఉండగా ఉపనిషత్తులు తత్త్వోపదేశం చేస్తాయి.

వేయికి పైబడి ఉపనిషత్తులున్నా శంకరులు పదింటికే భాష్యాలు వ్రాసారు. అవే ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, తైత్తిరీయ, ఐతరేయ, ఛాందోగ్య, బృహదారణ్యకములు.

వేదాలసారం అద్వైతమే అని శంకరులనగా, విశిష్టాద్వైతమే అని రామానుజులు, ద్వైతమేయని మధ్వాచార్యుల వారన్నారు.

లోగడ బృహదారణ్యకంలోని శాంతి మంత్రాన్ని పేర్కొన్నాను కదా! అది ఈశావాస్యంలోనూ ఉంది. పూర్ణమైన ప్రపంచము పూర్ణమైన బ్రహ్మము నుండి వచ్చినా బ్రహ్మము పూర్ణముగానే ఉందని అర్థం కదా! బ్రహ్మమును

అదిగా, జగత్తును ఇదిగా, అనగా దూరంగా ఉన్నది, దగ్గరగానున్నదనే అర్థంలో అదః ఇదంలు వాడబడ్డాయి. మనం సాధారణంగా బ్రహ్మ ఎక్కడో ఉన్నాడని భావిస్తాంకదా! ప్రపంచమే మనకు దగ్గరగా నున్నట్లు అనుభవం.

చూపుడు వ్రేలుతో దూరంగానున్న దానిని చూపిస్తాం. మనిషిని చూపించే వ్రేలనే అర్థంలో తమిళంలో దీనిని ఆల్‌కాట్టి విరల్ అంటారు. ఇక్కడ భగవానుని చూపించే వ్రేలందాం. సంస్కృతంలోభయ పెట్టేదనే అర్థంలో దీనిని తర్జని అంటారు. దానికి బదులు మనిషిని చూపించేదనే అర్థంలో వాడుదాం.

పరమసత్యాన్ని తెలిపేదనే అర్థంలో ధర్మశాస్త్రంలో దీని వాడుక ఉంది. అనేక ముద్రలున్నాయి. తర్జనిని సాచిబొటన వ్రేలును వంచి ఆత్మను చూపించునట్లుగా పట్టే ముద్ర ఉంది. బైట ఉన్నాడనే పరమాత్మ జీవునిలోనూ ఉన్నాడని ఆముద్ర సూచిస్తుంది. *(ఈ ముద్రను చిన్ముద్ర, జ్ఞానముద్ర అని అంటారు)*

తద్దూరే తదం తికే అని ఈశావాస్యం చెప్పింది. అనగా దూరంగా ఉన్నదే దగ్గరగానూ ఉందని తమిళంలోని తేవారమూ అట్లా అంది.

పైశాంతి మంత్రంలో అది అనగా బ్రహ్మము, ఇది యనగా జగత్తని అర్థం. ఇదియనగా ఇక్కడ జీవుడని కాదు.

పరమాత్మ కనబడకపోవడం వల్ల. ప్రపంచం సత్యమని భావించడం వల్ల ఈ ప్రపంచము పూర్ణమని చెప్పబడింది. ఇది పూర్ణమా? జగత్తే కనుక పూర్ణమైతే చెప్పబోయేది సాధ్యం కాదు. పూర్ణంలోంచి పూర్ణం తీస్తే సున్నయే మిగులుతుంది. కాని పూర్ణం నుండి జగత్తును తీసివేస్తే పూర్ణమే మిగులుతుంది. కనుక జగత్తు శూన్యమని, సున్నయని అర్థం. సున్న, లేని దానిని సూచిస్తుంది. అందుకే దానిని మాయ అన్నారు. ఉన్నట్లు కనబడి చివరకు లేకుండా పోయేది మాయయని శంకరులన్నారు. ఉన్నట్లు

కనబడేదానిని వ్యావహారిక సత్యమన్నారు. ఆ సందర్భంలో జగత్తు పూర్వమనే చెప్పింది ఉపనిషత్తు. దీనిని తప్పించుకొని పారమార్థిక సత్యాన్ని పట్టుకోవాలన్నారు. బ్రహ్మములో లీనం కావాలన్నారు. జగత్తును ప్రక్కన పెట్టి ఆ బ్రహ్మమును తత్‌అని అన్నాయి. ఇది అనగా జగత్తు పోతే అదే మిగులుతుంది. కనుక అది యగుటకు మనం ప్రయత్నం చేయాలి. ఉపనిషత్తులలో మొదటి చివరి మంత్రాలు మాయసిద్ధాంతాన్నే బలపరుస్తాయి.

ఇవేకాకుండా శ్వేతాశ్వతర కౌషీతకి, నృసింహతాపిని ఉపనిషత్తులు కూడా ఈ గమ్యాన్నే చేరుస్తాయి.

బ్రహ్మమే జీవజగత్తులుండుటకు కారణమని, కార్యకారణములైన జీవజగత్తులు రెండూ భిన్నముకావని, ఇవి బ్రహ్మము కంటె భిన్నము కావని చెబుతాయి. జీవుడు, సత్యమని భావింపబడే జగత్తును గెంటివేసి ఆత్మవిచారణ చేస్తే శరీరాదులు నావికావని తాను బ్రహ్మమేనని గ్రహిస్తాడు. చివరకు పరమాత్మ జీవాత్మను సృష్టించడమూ ఒకరకమైన మాయయే అని గ్రహిస్తాడు. జీవాత్మ పరమాత్మలు విడిగాలేరని ఉన్నది ఆత్మయేయని గ్రహిస్తాడు. అ-ద్వైతము=అద్వైతం.

ఇది కాదని తమ సిద్ధాంతాలే ఉపనిషత్తులలో ఉన్నాయని మిగతా ఆచార్యులంటారు.

అయితే అద్వైతం, ప్రాథమిక దశలో ద్వైతాన్ని, విశిష్టాద్వైతాన్ని అంగీకరిస్తుంది. ఇట్లా అంగీకరించిందని గుర్తిస్తే అద్వైతంతో పేచీ యుంటుందా?

కొన్ని మంత్రాలు మూడు సిద్ధాంతాలను, సమర్థిస్తున్నట్లు కన్పిస్తాయి. ఒకచోట జీవాత్మ వేరు, ప్రపంచంవేరు, పరమాత్మ వేరని ఉంటుంది. ఇవికొన్ని నేనే పరమాత్మను, సర్వవ్యాపిని లోపల బయటా ఉండేది. నేనే అంటుంది. మరొక చోట అన్నీ ఒకటే అంటుంది. ఇందు తమకనుకూలమైనదానిని గ్రహిస్తారు.

పరస్పరం అంగీకారానికి వచ్చే వాక్యాలను ఘటకశ్రుతులని అంటారు. దాని వల్ల ఒక వాక్యానికి, మరొక వాక్యానికి పొంతన కుదురుతుంది.

ఆత్మయే బ్రహ్మము, నేను బ్రహ్మను, నీవు బ్రహ్మము – అని అద్వైతాన్ని సమర్థించే వాక్యాలలో అక్షరాలను, పదాలను అటూ ఇటూ త్రిప్పి క్రొత్తఅర్థాలు చెబుతూ జీవాత్మ పరమాత్మలకు అభేదాన్ని అంగీకరించరు.

ఆ పరిస్థితి అద్వైతికి రాదు. ప్రాథమిక దశలో ద్వైతాన్ని అంగీకరిస్తాడు కదా! ప్రపంచం భిన్న భిన్నంగా కన్పిస్తోంది కనుక ఆదశలో వారి మాటలను అంగీకరించాలి భిన్నంగా కనబడినా అన్నిటిలో ఒకచైతన్యం ఉండడంవల్ల అంతర్యామిగా ఉన్నాడనే విశిష్టాద్వైతాన్ని అంగీకరిస్తారు. అంతేనేకాని ద్వైత, విశిష్టాద్వైతాలను సమర్థించే మాటలకు బలవంతంగా అర్థాలు మార్చడు అద్వైతి.

బృహదారణ్యకంలో (3.7) అంతర్యామి పదం వస్తుంది. ఇది విశిష్టా ద్వైతానికి అనుకూలం. ఎవడు పృథివిలో ఉండి, పృథివికి కూడా లోపల ఉన్నాడో, ఎవనిని పృథివీ దేవత ఎరుగదో, ఎవనికి పృథివీ దేవతా శరీరమే శరీరమైయున్నదో, ఆయా పనులను ప్రేరేపణ చేయిస్తున్నాడో అతడే అంతర్యామియని ఆమంత్రంలో ఒక భాగానికి అర్థం. తేలికగా చెప్పాలంటే అతడు సమస్త జీవులలో ఉన్నాడని, సమస్తప్రాణులు అతని శరీరమని, వారిలోపల ఉండి నియమిస్తున్నాడని అతడే అంతర్యామియని, నీ ఆత్మయని, అమృత స్వరూపమనే మాటలున్నాయి.

ఇట్టి మంత్రాలను చూసి ఇదే సిద్ధాంతమని, ఇది అద్వైతాన్ని బోధించదని వాదిస్తారు. తరువాత మంత్రాలను చూస్తే అద్వైత సిద్ధాంతం గోచరిస్తుంది. వారి సిద్ధాంతం ప్రకారం అంతర్యామి, జీవాత్మలు భిన్నులు తరువాతి మంత్రం ప్రకారం ఏషత ఆత్మా అంతర్యామీ అనగా ఆత్మయే అంతర్యామియని చెబుతుంది. అవిరెండూ వేరుకావని చెబుతుంది. ఏకమనే ఒక దశలో ఆత్మయే జీవాత్మగా కన్పిస్తోందని అదే అందున్న అంతర్యామియని చెబుతుంది.

అట్లే ద్వైతాన్ని సమర్థించే వాక్యాలను చూసి తరువాతి వాక్యాలు చూడకుండా ద్వైతమే పరమార్థమని వాదిస్తారు.

మాండూక్యంలో అద్వైతం స్పష్టంగా ప్రతిపాదింపబడింది. అది మూడవస్థలకు అతీతమైన, ప్రపంచం లయింకాబడిన స్థితినే శివం అని అద్వైతం అని ఘోషించింది. ఇది తెలిసి కొన్నవాడే తెలిసికొనిన వానిగా పరిగణింపబడతాడని అంది ఇక్కడ ద్వైతప్రస్తావన ఉందా? లేదుకదా!

ద్వైతమనే మాట బృహదారణ్యకంలో ఉంది. ఒక దానితో చూస్తాడు, ఒకదానితో వాసన చూస్తాడు, ఒక దానితో తెలిసికొంటాడని. అన్నీ ఆత్మయైనపుడు (ద్వైతం పోయినపుడు) ఎవడు దేనితో చూస్తాడు? దేనితో వాసన చూస్తాడు? దేని చేత అంతా తెలియబడుతూ ఉంటే దేనితో తెలిసికొంటాడని (2-4.14, 4-5-15).

ద్వైత స్థితిలో అంతటా వ్యాపించిన ఆత్మను తెలిసి కొనలేదని అద్వైత స్థితికి ప్రయత్నించాలని చెబుతోందికదా! లోక వ్యవహారంలో ద్వైతస్థితే ఉంటుందన్నా అది నిజం కాదు. అందుకే యత్ర హి ద్వైతం భవతి అని వాడబడింది. ద్వైతమైతే నిజమే. ద్వైతంగా కనబడేది సత్యం కాదని అర్థం వస్తోందికదా! ద్వైతం కంటె మరొకటి ఉంటే అది అద్వైతమే.

యత్రవా అస్య సర్వ మాత్మైవా భూత్ సందేహం లేకుండా ఆత్మయే అన్నీ అవుతున్నాడని ఉంది "ఏవ" అనే పదాన్ని గమనించండి. అదే అని అర్థం కదా! 'ఇవ' పనేపదం వాడితే అది ఆభాసకాని, సత్యం కాదని అర్థం వస్తుంది కదా! అతని వలె ఉన్నాడని అంటే 'అతడు కాదని అర్థం కదా! అతనిలా మాత్రమే కన్పిస్తున్నాడు. ద్వైత భావనతో లోకంలో చూస్తున్నాం. కాని అది తప్పని శాస్త్రం చెబుతోంది.

ఇక్కడ వాడబడిన ఆత్మను, పరమాత్మయని ఎందుకు చెప్పలేదు? పరమాత్మ అని చెబితే అల్పాత్మ ఒకటి ఉండాలని అర్థం వస్తోంది. ద్వైత

స్థితిలో పరమాత్మ అని, జీవాత్మయని వారు విడివిడిగా నున్నట్లు వాడుతాం. అద్వైత స్థితిలో ఆత్మయనే వాడుతాం.

మోక్ష స్థితి యంటే భయరహితమైనదని అర్థం. ఎక్కడ ద్వైత ముంటుందో అక్కడ భయం ఉంటుందని బృహదారణ్యం (1.4.2.) అంటోంది. అట్లే తైత్తిరీయం (2.7) చెప్పింది. ఏ మాత్రం భయం చూపించినా భయమే అని అన్నాయి. రెండుంటే ఒక దానిని మరొకటి కోరడం, కుదరకపోతే దుఃఖం, క్రోధం కల్గుతాయి.

మన కిష్టమైన వాడుపోతే దుఃఖం. మనమేపోతే దుఃఖమేమిటి? అందర్నీ తనగా భావించినపుడు బాధలేదు. మననుండి ఒకడు వెళ్లిపోతున్నాడని ద్వైతస్థితిలో బాధపడతాం. విడిగా భగవంతుడున్నాడని భావించినా విరహం వల్ల బాధ తప్పడం లేదు. కనుక అతడే మనమైనపుడు దుఃఖం ఎందుకుంటుంది? కోరిక, శత్రుత్వాలు ఉండవు కనుక అభేదస్థితియే మోక్షం. శంకరులందించిన భాష్యదీపమదే!

ఇక ఆరాధనలో జీవుడు, దేవుడు విడివిడిగానున్నట్లు భావించడమా? బృహ. (ఉప. 1.4.10)లో తనకంటె భిన్నంగా భగవానుడున్నాడని భావించినవాడు పశుసమానుడని చెప్పింది. ఈ మాటకు వైష్ణవులు ఇట్లా అర్థం చెబుతారు. అన్యం దేవతాం ఉపాస్తే అనగా శివుని కంటే విష్ణునికంటె మిగిలిన దేవతలను పూజించువాడు పశువని అర్థం చెబుతారు. ఆ ఇద్దరి దేవతల వల్లనే మోక్షమని శైవులు శివుణ్ణి, వైష్ణవులు విష్ణువును పరమ దేవతగా భావిస్తారు.

ఈమంత్రాన్ని ఎట్లా అర్థం చేసికోవాలి? అన్యో సావన్యో౽హమస్మీతి అన్యః అహం అస్మిఇతి అని ఉంది కదా! అనగా ఎవడు ఈ దేవత నాకంటె భిన్నుడు, నేను ఈ దేవతకంటె భిన్నుడను, ఒకరి నుండి మరొకరు భిన్నులనే భావనతో పూజిస్తే అతడు పశుసమానుడని అర్థం. ఒక దేవత మరొక

దేవత అనికాదు. ఉపాసకుడు ఉపాసించే వానిని భిన్నంగా చూస్తే అతడు పశుసమానుడని చెప్పాలి. కనుక ఇక్కడ కూడా అద్వైత మోక్షమే చెప్పబడింది. ఇందు భగవంతునకు భక్తునకు భేదం లేదు. దేవతకు ఉపాసకునకు భేదం లేదు.

ప్రధానంగా శైవమని, వైష్ణవమని మన మతం వింగడించింది. మా దేవత గొప్పదంటే మా దేవత గొప్పదని చాలా కాలం నుండి కొట్లాటలున్నాయి. జీవబ్రహ్మలను అభేదంగా చూడాలని చెప్పిన శంకరులు, శివ కేశవుల పట్ల భేదం చూపిస్తారా? కాని మిగిలిన ఆచార్య పురుషులు భేదభావాన్ని చూపారు. కొందరు శివుడని, కొందరు విష్ణువని అన్నారు.

దశోపనిషత్తులు భేదాన్ని చూడలేదు. విష్ణువనే మాట ఒకచోట, శివుడనే మాట ఒకచోట వస్తుంది. మాండూక్యం అద్వైతస్థితిని శివం అని చెప్పింది. ఇక్కడ శివం అనగా పరమాత్మ తత్త్వమేకాని సగుణుడైన సాకారుడైన శివుడని కాదు. కేనోపనిషత్తు (3-9) ఎవడు వివేకంతో బుద్ధిని సారథిగా, మనస్సును పగ్గాలుగా ఇంద్రియాలను గుఱ్ఱాలుగా చేసి ప్రయాణించేస్తే సంసారాన్ని దాటుతాడని, మోక్షద్వారాన్ని సమీపిస్తాడని అదే పరమపదమని విష్ణువని చెప్పింది.

తద్విష్ణోఃపరమంపదం అని ఉంది ఇదే సంహితలోనూ ఉంది. సంహితలోని విష్ణుసూక్తంలో సూరులైన జ్ఞానులు పరమ పదాన్ని చూస్తారని, అదేవిష్ణువని ఉంది. వైష్ణవులు ఈ మంత్రాన్ని చూసి ఇక్కడున్న విష్ణువును సాకార సగుణమూర్తిగా, శంఖచక్రగదాధారిగా భావిస్తారు. పరమ పదమంటే వైకుంఠమని చెబుతారు. అది విష్ణువు యొక్కపదమని వారనగా, విష్ణువే పరమపదమని అద్వైతులంటారు. ఈ అద్వైత వ్యాఖ్యను అంగీకరించకపోతే విష్ణువున్నచోటును చూస్తారని, విష్ణువును కాదనే అర్థం వస్తుంది. ఇక్కడ చూడడం అంటే అనుభవించడం. ఆత్మ ఒక్కటే అని భావించడం.

ఈశావాస్యంలో అద్వైత దృష్టి సందర్భంలో 'పశ్యతి' అనే పదం వాడబడింది. ఎక్కడ చూస్తున్నా ఆత్మనే చూస్తాడని (అనుపశ్యతి) లోపలా ఆత్మగానే చూస్తాడని (ద్వేషం కాని ప్రేమ కాని లేకుండా, దుఃఖం లేకుండా) అర్థం.

నేను అద్వైత దృష్టి గురించి మాట్లాడుతున్నా కేవలం చూపు అనే అర్థంలో కాదు, అనుభవం అనే అర్థంలోనే. అట్లాగే విష్ణోఃపరమం పదం సదా పశ్యంతి అనే మంత్రానికి విష్ణువును అనుభవిస్తున్నారని అదే పరమ పదమని అనగా బ్రహ్మమని అర్థం చేసికోవాలి.

విష్ణువును ఆత్మగా చూసేవానికి, అనగా విడిగా కాకుండా ఉంటే విష్ణువును పరమాత్మతత్వం గానే చూస్తాడు. మాండూక్యంలోని శివం, ఇక్కడ విష్ణువూ ఒక్కరే. శంకరులు పరమపదం అంటే ఉన్నత స్థానం అన్నారు 'చోటనే' అర్థంలో కాదు. భావంలో ఉన్నతస్థానం అది ప్రదేశమే అనుకొంటే మిగతా స్థలాలలో ఉండడనే అర్థంవస్తుంది. అతడు సర్వవ్యాపి కదా! శంకరులు విష్ణుపదానికి 'వ్యాపనశీలి' అని అర్థం వ్రాసేరు. అట్టివాడు శంఖచక్రాదులతోనే ఉంటాడా? కనుక అది పరమతత్వము. ఒక రూపానికి పరిమితం చేస్తే ఎట్లా?

సారాంశం – కనుక శివం అన్నా విష్ణువన్నా అది పరమపదమే కనుక జీవుడు, బ్రహ్మమూ ఒక్కటే. జగత్తుమాయయే. శివకేశవులలో భేదం చూడకూడదు. అనే శంకర సిద్ధాంతాలు వేదాంతానికి అనుగుణమే.

శంకర సంప్రదాయం

శంకరసంప్రదాయంతో ఉన్న అద్వైతులను స్మార్తులని అంటారు. ఇది అనుసరించేవారికే తెలియదు. అద్వైతులను అయ్యర్‌లని తమిళదేశంలో అంటారు.

వైష్ణవులను అయ్యంగార్‌లని అంటారు. ద్వైతులను రావు లని లేదా వీరి పేరు చివర్ ఆచార్ అని ఉంటుంది. వీరు మధ్వాచార్యులను అనుసరిస్తారు కనుక వీరిని మాధ్వులని అంటారు. వీరు విష్ణుభక్తులు.

చాలా మంది వైష్ణవులు రామానుజుల అనుయాయులు. వీరి పేరు చివర ఆచార్య లేదా అయ్యంగార్ అని కూడా ఉంటుంది. మధ్వాచార్యులను అనుసరించేవారు మాధ్వులని పిలువబడునట్లుగా రామానుజశంకరులను అనుసరించేవారు వారి వారి ఆచార్య పురుషనామంతో పిలువబడరు. (శంకరాద్వైతులని ఆంగ్ల గ్రంథాలలోనే ఉంటుంది. వాడుకలో లేదు).

స్మార్తులలో పేరు చివర శర్మ శాస్త్రి, దీక్షితపదాలుంటాయి. (చిదంబరంలోని దీక్షితులు మరొక కోవకు చెందినవారు.)

తాముస్మార్తులమని చాలా మందికి తెలియదు. సమస్త దేవతలు పరమాత్మ స్వరూపాలని శంకరులనినట్లుకూడా చాలా మందికి తెలియదు. శివుణ్ణి ఉపాసనామూర్తిగా గ్రహించారు. కనుక వీరందరు తాము శైవులమని అనుకొంటూ ఉంటారు.

ద్వైతులు, విశిష్టాద్వైతులు విష్ణువును పూజిస్తారు కనుక అద్వైతులైన స్మార్తులు శైవులుగా పరిగణింపబడ్డారనే మాటవాస్తవం కాదు.

నన్నుచాలా మంది శైవాచార్యుడని అనుకొంటారు. హాజీమేనాకమూర అనే జపాన్‌దేశస్థ ఆచార్యుడు నన్నీ విధంగా ప్రశ్నించాడు. శంకరుల ప్రస్థానత్రయంలో శివప్రస్తావన లేకపోయినా మీరెట్లా శైవాచార్యులయ్యారని అడిగాడు.

ఎందుకట్లా అనుకొంటున్నావని అడిగా, మీరు విభూతిని ధరిస్తారు, చంద్రమౌళీశ్వరుని పూజిస్తారు కదా! మీ శంకరాచార్యులందరూ శైవులే కదా! శంకరులు శివవిష్ణు భేదం చెప్పకపోయినా, భస్మను ధరించడం శివపూజలేమిటని ప్రశ్నించాడు.

గత చరిత్ర చూడండి. శంకరులవతరించక ముందు ఏ మతాలున్నాయి? శంకర విజయాలు చూస్తే ముందు సనాతన ధర్మమే ఉందని, అదే వైదికమని, భిన్న ఆచారాలతో కూడిన 72 మతశాఖలున్నట్లుగా తెలుస్తుంది. కాని బౌద్ధం వేదమతానికి విరుద్ధంగా ఉంటుంది. కనుక వైదిక ధర్మం, బౌద్ధంమాత్రం ఉన్నాయని చెప్పవచ్చు.

ఆ వేదమతాన్ని అనుసరించే వారే స్మార్తులు అనగా స్మృతులను పాటించేవారని. సంఘంలో ఎట్లా ప్రవర్తించాలో చెప్పేవే ఆ ధర్మశాస్త్రాలు. పుట్టిన దగ్గర నుంచి పోయే వరకు ఏయేవిధులను, నియమాలను పాటించాలో చేప్పేగ్రంథాలవి. అని పాటించేవారే నేటి హిందువులు.

ఫలానా దేవతనే పూజించాలని ధర్మశాస్త్ర గ్రంథాలు చెప్పవు. వేదంలోని సమస్త దేవతలకు సమానస్థాయియేయుంది. "ఆదిత్యం, అంబికాం, విష్ణుం, గణనాథం, మహేశ్వరం" అని ఉందికదా! కనుక స్మార్తులు ఈ పంచాయతనను పూజచేస్తారు. ఇందు ఇష్టదేవతను మధ్యనుంచుతారు. కుటుంబంలో అన్నగారు శివుణ్ణి, తమ్ముడు విష్ణువుని పూజించవచ్చు. అంతమాత్రంచే ఇంట్లో శైవులు, వైష్ణవులున్నారని అనం. పూర్వకాలంలో శైవులకు వైష్ణవులకు వివాహ సంబంధాలుండేవి. (అప్పయ్య దీక్షితుల కాలం వరకూ ఉండేదని స్వామివారే మరొక సందర్భంలో అన్నారు.) వేదం అందరికీ ప్రమాణమే. అందుచెప్పిన కర్మానుష్ఠానం అందరికీ శిరోధార్యమే!

యజ్ఞకర్మానుష్ఠానం చేసి హోమం చేయగా మిగిలిన భస్మను విష్ణువును ఇష్టదేవతగా భావించేవారు కూడా ధరించేవారు. వైష్ణవులు, మధ్వులు ఆ హోమ భస్మను ధరిస్తారు.

U ఆకారంతోనూ, పాదంతోనున్న నామంతోను నుదుట ధరించాలనే నియమాలు తరువాత తరువాత వైష్ణవులు పెట్టిన అచారం. మాధ్వుల చందనంబొట్టు పెట్టుకొని మధ్యలో నల్లని చుక్కను ధరిస్తారు. వేదంలో

చెప్పిన భస్మధారణనే స్మార్తులూ ఆచరిస్తున్నారు. దీనిని ధరించేటపుడు ప్రత్యేక మంత్రం ఉంది.

స్మార్తులు విభూతిని ధరించిన మాత్రంచే శైవులనే వ్యవహారం తరువాత వచ్చింది. స్మార్తులు ధరించిన విభూతికి శివునకు సంబంధంలేదు. ఇది వేదకర్మలకు చెందింది.

రామానుజ సంప్రదాయానికి ముందున్న వారు విష్ణుభక్తులైనా విభూతినే ధరించియుండియుండాలి. సన్యాసి యజ్ఞాలు చేయడు కనుక భస్మను ధరించక పోయినా ఇబ్బంది లేదు. అయినా ధరిస్తున్నాడు.

పాంచరాత్ర దీక్షలో ఈనాటికీ వైష్ణవులు హోమభస్మను ధరిస్తారు.

ఇక బౌద్ధులు కర్మకాండకు దూరులు కదా! ఆనాడు కూడా మనలో కొందరు ఈశ్వరుడున్నా లేకపోయినా ఇబ్బందిలేదని, వేదంలో విధింపబడిన కర్మలు మాకు చాలనే మీమాంసకులుండేవారు. వారు భక్తి జ్ఞానాలను తలపెట్టరు. ఆత్మావ లోకనం, ధ్యానం, పరమార్థ సత్యం మొదలైన మాటలనరు. వీరిలో గొప్పవాడు కుమారిల భట్టు. ఇతడే బౌద్ధ ధర్మాన్ని ఎదుర్కొని వైదిక కర్మల గొప్పదనాన్ని చాటాడు.

అట్లాగే ఇతని మాదిరిగా బౌద్ధాన్ని ఎదుర్కొన్న వ్యక్తి ఉదయనాచార్యుడు. న్యాయ శాస్త్రంలో మహావిద్వాంసుడు. ఈశ్వరుడొ కడున్నాడని అతడే సృష్టికర్తయని గట్టిగా సమర్థించాడు.

ప్రతి చరిత్రపుస్తకం బుద్ధునితో మొదలుపెట్టబడుతుంది. హైమహోత్ముల పేర్లను ఏ చరిత్ర ఉచ్చరించదు. దొరలకాలంలో చరిత్రవ్రాయబడి ఏదో విధంగా వైదిక మతాన్ని తక్కువగా చూపించి క్రైస్తవాన్ని వృద్ధిచేయాలని వారి తలంపు. హిందువులను పూర్తిగా క్రైస్తవుల మాదిరిగా మార్చలేకపోయినా హిందువులు తమను తాము తక్కువ వారని అనిపించుకొనేటట్లు చేస్తే చాలని కుతంత్రాలువన్నారు. అందుకే వేదమతానికి విరుద్ధంగా బుద్ధుడు

ప్రవర్తించాడనే మాటలతో చరిత్ర పుస్తకాలు వ్రాసేరు! కనుక వేదమతోద్ధారకుల గురించి సామాన్యులను తెలియకుండా పోయింది. పై ఇద్దరు కర్మ భక్తి మార్గాలకు బాటలు వేయగా శంకరులు జ్ఞానమార్గాన్ని పునఃప్రతిష్ఠించారు.

జ్ఞాన మార్గంలో బౌద్ధులకు అద్వైతులకు పెద్దతేడా లేదని అద్వైతులను ప్రచ్ఛన్న బౌద్ధులని ఇతర సంప్రదాయాలవారు ఈసడిస్తూ ఉంటారు. అనగా పైపైన అద్వైతం, లోలోన బౌద్ధమని. చిట్టచివర దశలో ఈశ్వరారాధన కూడా అద్వైతికి ఉండదు. ఈ కారణం వల్ల అట్లా ఈసడించారు.

ప్రపంచం అస్థిరమని, పరమార్థసత్యం కాదని అన్నారేకాని బౌద్ధుల మాదిరిగా శూన్యమని అనలేదు శంకరులు. పూర్ణ బ్రహ్మమే పరమార్థ సత్యమని అన్నారు. బౌద్ధులకు మోక్షమంటే నిర్వాణమే. అనగా శూన్యమే సచ్చిదానంద స్థితిని అనుభవించుట అద్వైత లక్ష్యం కనుక రెండు మతాలను కలపకూడదు.

వేదాలు పనికిరావని బౌద్ధులంటే వేదాలను అధ్యయనం చేయాలని, అందరికర్మలను ఆచరించాలని శంకరులన్నారు.

వేదోనిత్యమధీయతాం తదుదితం కర్మస్వనుష్ఠీయతాం

ఇది వారి ఉపదేశసారంలోని మొదటిమాట. భక్తిని ప్రోత్సహించారు. ఇంకాముందు కర్మలను చేయడం వల్ల మనస్సులోని మాలిన్యం పోతుందన్నారు. అట్టి శుద్ధచిత్తం ఏర్పడగా భక్తి బీజాలని నాటాలని, తరువాత జ్ఞానోదయమని, ఇట్లా కర్మ, భక్తి, జ్ఞాన సమన్వయం చేసారు శంకరులు.

పై సిద్ధాంతాలతో బాటు బౌద్ధుల ధ్యానపద్ధతి శంకరుల అద్వైతంలో ఉంటాయి. పూర్వమీమాంసకులతో మీరు చేసే కర్మలు తమంతట ఫలమీయవని ఫలదాత ఈశ్వరుడని అంటారు. లోకక్షేమం కోసం విధింపబడిన కర్మలను దుర్వినియోగం చేయరాదని, కేవలం కోరిక

తీర్చుకోవడం కోసం కాదని, నిష్కామ భావనతో కర్మలు చేయాలని, దాని వల్లనే చిత్తశుద్ధి ఏర్పడుతుందని అన్నారు.

ఇక న్యాయ సిద్ధాంత వేత్తలతో కేవలం ఈశ్వరుడున్నాడని చెప్పడంతోటే ఆగిపోరాదని, నిత్య జీవితంలో అతని కంటె మరొకడు లేడనే భావం రావాలని తుదకాభక్తి ఆత్మాను సంధానానికి దారి తీయాలని అన్నారు.

ఏది సత్యం? నేనెవర్ని? ఏది దుఃఖం? అని బౌద్ధుల మాదిరిగా విచారణ చేస్తే బుద్ధుని మాదిరిగా జ్ఞానం గురించి ఒక స్పష్టత వస్తుందని అన్నారు.

కొందరేమంటారంటే బుద్ధుడు తిన్నగా ఈశ్వరుని ప్రస్తావించ లేదని, నిర్వాణమని అనలేదని ఈశ్వరుడున్నాడని గాని లేదని గాని చెప్పలేదని అంటారు. అట్లా ఐతే అతనికీ అద్వైతజ్ఞానం పట్టుబడియుండాలి కాని అతడు చెప్పలేదు.

ధ్యానం చేయడం, ఆత్మవిచారణ చేయడం అందరికీ కుదురుతుందా? అందుకే కర్మ భక్తులను విధించాయి. వేదాలు. తరువాతనే తత్త్వవిచారణ సాధ్యం. అదీ కర్మ ఉపాసనలతో వారి వారి స్థాయిని బట్టే. వీటినన్నిటిని గుర్తించలేదు బౌద్ధం. వేదధర్మాన్ని ప్రక్కన పెట్టి అందరూ ధ్యానం చేయాలని, అంతఃపరీక్ష చేసికోవాలని బౌద్ధం చెప్పడం వల్ల గందరగోళ పరిస్థితి ఏర్పడింది. బుద్ధుని వంటివారు ఏ కొద్దిమందో ఉంటారు అందువల్ల శంకరులు బౌద్ధాన్ని ఖండించవలసి వచ్చింది. ఇట్లా కుమారిల భట్టు, ఉదయయనుడు, శంకరులు బౌద్ధాన్ని ఎదుర్కొనడం వల్ల బౌద్ధం క్షీణించింది. కనుక స్మార్త సంప్రదాయం అవిచ్ఛిన్నంగా సాగింది.

కనుక అద్వైతం మార్గం అందరికీ పట్టుబడుతుందా? అందుకే కర్మమార్గంలో కర్మచేయడానికి ముందు మనం చెప్పే సంకల్పంలో పరమేశ్వర ప్రీత్యర్థం అంటున్నాం. అనగా పరమేశ్వర ప్రీతికోసమని ఈ సంకల్పాన్ని ఏర్పాటు చేసారు శంకరులు వారి ముందీ సంకల్పం లేదని గుర్తించండి.

ఎవరు కర్మ చేస్తారో వారే ఫలాన్ని పొందుతారని, ఈశ్వర కృపలేక పోయినా ఫలం వస్తుందని ప్రజలు భావించరాదని అట్లా ఏర్పాటుచేసారు. చిన్న కర్మ నుండి పెద్ద కర్మ వరకూ ఈశ్వరర్పాణ బుద్ధితోనే చేయాలని కట్టడి చేసారు. పూర్వమీమాంసకుల వల్ల వచ్చిన ఇబ్బందిని ఈశ్వరర్పాణ బుద్ధితోనే చేయాలని నియమించారు.

వేదాలలో సమస్త దేవతలకు సమమైన ప్రాధాన్యం ఉందనే లోగడ చెప్పాను. ఒకే ఒక పరమార్థాన్ని పెక్కునామాలతో పిలుస్తారని చెప్పడం వేద ప్రత్యేకత

ఏకం సత్ విప్రాః బహుధా వదంతి

అయితే స్మృతులు, వేదాలు ఇష్టదేవతను సమర్థించాయి. అందుకే పంచాయతన పూజలో ఇష్టదేవతను ప్రాధాన్య మిచ్చి ఇతర దేవతలను పూజిస్తారు.

శంకరులవతరించి స్మార్తధర్మంలో సమన్వయాన్ని తీసికొని వచ్చారు. తాను క్రొత్తమార్గాన్ని సృష్టిస్తున్నానని అనలేదు. పంచాయతనానికి సుబ్రహ్మణ్యుని జోడించారు. ఇతడు అగ్నికి ప్రతీక. అగ్నితోనే వైదిక క్రియలు కదా! కనుక పంచాయతనంలో ఇతణ్ణి ప్రత్యేకంగా చేర్చలేదు.

ఇది స్మార్త సంప్రదాయం కనుక దీనిని శంకర సంప్రదాయమనడం సబబు కాదు.

పాత మతాలను ఖండించడం కోసం రాలేదు, వాటిని పరిపూర్ణం చేయడానికే తాను వచ్చానని జీసస్ అన్నట్లు స్మార్త సంప్రదాయాన్ని పునః ప్రతిష్ఠించారు శంకరులు.

పంచాయతన పూజచేయక పోయినా తమ ఇష్టదేవతనే పూజించేవారున్నారు. అయినా వేదాంత విషయం వచ్చే సరికి అద్వైతాన్ని సమర్థించే వైష్ణవులూ ఉన్నారు. నేటికీ ఉన్నారు. అట్టివారు నన్ను ఆచార్యునిగా

భావిస్తారు. నామాన్ని విభూతిని ధరించకపోయినా గంధాన్ని అలదుకొంటారు. ఒక్క గీతతో కూడిన నామాన్నే ధరించి అద్వైతం పట్ల మ్రొగ్గు చూపించే వారున్నారు. అయినా రామానుజ మధ్వమతస్థులకన్నా వీర వైష్ణవులు. రామానుజమతస్థులు శివాలయాలకు వెళ్ళరుగాని పైవారికి ఆపట్టింపులేదు. వీరశైవులలో కూడా అద్వైతులున్నారు. తత్త్వం దగ్గరకు వచ్చేటప్పటికి అద్వైతాన్ని అంగీకరించినా శివరాధననే చేస్తారు.

రానురాను అద్వైతులు శైవులనే అభిప్రాయం ఏర్పడింది. దానికొక కారణం. రామానుజులు జీవబ్రహ్మలొక్కటి కారని, జీవుడు బ్రహ్మమును అంతర్యామిగా గుర్తిస్తాడని, మోక్షదశలో జీవబ్రహ్మలు భిన్నులరని, బ్రహ్మకూడా నిరాకార నిర్గుణ నిష్క్రియ స్వరూపుడు కాదని సగుణ బ్రహ్మమైన విష్ణువునే పూజించాలని కట్టడిచేసారు. రామానుజులకు ముందు అందరూ స్మార్తులనే మాటను విస్మరించవద్దు.

తరువాత వచ్చిన మధ్వాచార్యులు జీవ పరమాత్మలు వేరని, జీవునిలో పరమాత్మ అంతర్యామిగా ఉండదని, విష్ణువునే పూజించాలన్నారు. తరువాత వల్లభ, చైతన్యాది మహాత్ములవతరించి ఆవిష్ణువును కృష్ణరూపంలో అర్చించాలని అన్నారు. ఎవరే సంప్రదాయనికి చెందినా వీరికి ముందు అందరూ స్మార్తులే కదా! కనుక వైష్ణవుల సంఖ్య ప్రబలింది.

స్మార్తులలో విష్ణువు ఆరాధించేవారు తక్కువై శివుణ్ణి ఆరాధించే వారెక్కువైనారు. అందువల్ల అద్వైతులంటే శైవులనే అభిప్రాయం ఏర్పడింది. తెల్ల దొరల కాలంలో వీరిని శైవులుగా లెక్కించారు.

మరోమలుపు చూడండి. రామానుజుల కాలంలో శ్రీ కంఠాచార్యులు చెప్పినది విశిష్టాద్వైత సంప్రదాయానికి దగ్గరగా ఉంటుంది. కాని ముక్త దశలో అద్వైతానికి చేరువగా ఉంటుంది. ఉపాసనలో శివుణ్ణే పూజిస్తారు. అందుచేత వీరి సిద్ధాంతాన్ని కొంత మంది స్మార్తులనుసరించారు.

ఇవి ఏమి తెలియకుండా అద్వైతులంటే శైవులనే నమ్మకం ప్రబలి పోయింది.

అయితే మఠాలలో చంద్రమౌళీశ్వర పూజనెందుకు చేస్తున్నారు? పరమేశ్వరుడే ఐదు స్ఫటికలింగాలను శంకరులకీయగా అందు రెంటిని శృంగేరిలో కంచిలో ఉంచారు. మిగిలినవి నేపాల్, కేదార్‌నాథ్, చిదంబరంలో ఉన్నాయి. మిగిలిన శంకరమఠాలలోనూ ఈ చంద్రమౌళీశ్వరలింగం ఉంటుంది. లక్ష్మీనృసింహుడు కూడా శంకరులకు సాలగ్రామాన్నిచ్చాడు. దానినీ పూజించారు శంకరులు.

బదరీనాథ్‌లో నారాయణుణ్ణి ప్రతిష్ఠించారు. అందు శంకరమఠం ఉంది. వైష్ణవక్షేత్రమైన పూరీజగన్నాథ్, ద్వారకలలో వీరిమఠాలున్నాయి. శంకరులు శివసహస్రనామాలకు భాష్యం వ్రాయలేదు. విష్ణు సహస్ర నామాలకే భాష్యం వ్రాసారు. పురాణాలలో శివగీత, దేవీగీతలున్నా కృష్ణుడు చెప్పిన భగవద్గీతకే భాష్యం వ్రాసారు. సమస్త దేవతలపై స్తోత్రాలు వ్రాసారు. పైవాటినేమి గమనించకుండా శంకరులను శైవుడనడం బాగుందా?

మఠాలలో శివపూజ ఒక్కటే ఉండదు. పంచాయతన పూజ ఉంటుంది. ఒక్క శివరాత్రినే కాదు, శ్రీరామనవమి, గోకులాష్టమి, నృసింహజయంతులను జరుపుతారు.

మా శ్రీముఖంలో ఏదైనా ఎవరైనా మంచి పనిని తలపెట్టినపుడు నిర్విఘ్నంగా సాగాలని నారాయణునిస్మరిస్తాం క్రియతే నారాయణ స్మృతిః ఇక్కడ శివుని ప్రస్తావన ఉందా? ఎవరైనా మాకు నమస్కరిస్తే నారాయణ అని అంటాం. నారాయణుడు జగత్పాలకుడు కదాయని అందరూ సన్యాసులు అట్లాగే అంటారు.

ఇక కొంత మంది, భాష్యాలలోకూడా నారాయణుని స్మరించారని శంకరులు విష్ణుపక్షపాతియని వాదించేవారున్నారు. నారాయణుడు జగద్రక్షకుడు కదా, అందుకని పేర్కొన్నారని సమాధానం.

ముత్తుస్వామి దీక్షితులు దేవతలతో బాటు మరియమ్మ, అయ్యనార్, నవగ్రహాలపై కూడా కీర్తనలు వ్రాసారు. అద్వైతులలోనే అప్పయ్య దీక్షితులు శివభక్తులు. లీలా శుకులు కృష్ణభక్తులు. కనుక ఇతర దేవతా నిందలేకుండా ఇష్టదేవతారాధన సాగాలి.

ఇట్లా పరదేవతానిందలేకుండా సాగేది స్మార్త సంప్రదాయం. ఇది దీని విశిష్టత. ఇది వ్యాసుడందించిందే. భీష్ముని మాటలు:-

సాంఖ్యం యోగః పాంచరాత్రం వేదాః పాశుపతం తథా

ఇందు వేదాలనగా వైదిక మతం. అదే తరువాతి కాలంలో స్మార్తమతం. ఇందు కర్మ భక్తి, జ్ఞానాలు, సాంఖ్య తత్త్వం, యోగసాధనకూడా ఉంటుంది. దీనినే శంకరులుద్ధరించారు. ద్వైత, విశిష్టాద్వైతాలను ఒక దశలో అంగీకరిస్తూ సౌందర్యలహరి, శివానందలహరి వంటిస్తోత్రాలను వ్రాసారు. విష్ణువుపై షట్పదీ స్తోత్రం వ్రాసారు. సాంఖ్యులు చెప్పిన 24 తత్వాలను వివిధ సందర్భాలలో వ్యాఖ్యానాలలో పేర్కొన్నారు. పాతంజల యోగధోరణులు వారి యోగతారావళిలో ఉంటాయి. ఇక భీష్ముడు చెప్పిన దాంట్లో పాంచరాత్ర, పశుపతాలు మిగిలాయికదా! పాంచరాత్రం విష్ణువే పరమదైవమనగా పాశుపతం శివుడే అంటుంది. ఈ రెండు మిగిలిన దేవతలను చిన్నచూపుచూస్తాయి. వ్యాసుని దృష్టిలో అవి వేదానికి చెందినవి కావు. అందుకే వేదాలను విడిగా చెప్పి వీటిని విడిగా చూపించాడు. సాంఖ్యం, యొక తత్వం మాత్రమే ఇందు కర్మభక్తులుండవు. యోగం గొప్పదైనా అందు వైదికమైన ఉపాసన, కర్మలుండవు. జ్ఞానమున్నా ఉపనిషత్తులు చెప్పిన జ్ఞానముండదు. కనుక ఈ నాలుగు అసంపూర్ణంగా ఉంటాయి. అందుకే వేదాలను విడిగా పేర్కొన్నాడు.

మరొక మహాత్మునిగురించి చెబుతా. అమ్మవారి శాపం కారణంగా ఒక గంధర్వుడు మానవరూపం ధరించి ఈశ్వరభక్తుడయ్యాడు. చివరకు

కైలాసప్రాప్తి. అతని పేరే పుష్పదంతుడు. శివమహిమ్నస్తోత్రకర్త ఇతడు వివిధమతాలను పేర్కొన్నాడు.

త్రయీ సాంఖ్యం యోగః పశుపతి మతం వైష్ణవమితి

ఇక్కడ త్రయి యనగా వేదమే. ఇతడు వైష్ణవమంటే వ్యాసుడు పాంచరాత్రమన్నాడు. ఐదు మతాలనే ఐదునదులు పరమేశ్వరుడనే సముద్రంలో కలిసేవే. ఇతర దేవతలను నిందించే పాశుపత, పాంచరాత్ర మతాలను గుర్తించాడు. అయినా ఈ రెంటినీ వేదమతంలో కలుపలేదు. గమనించండి. విడిగా చూపించాడు.

ఇక ఒక మహాకవి చెప్పిన మాటలను గుర్తించండి. అతడే శ్రీహర్షుడు నైషధకర్త.

దమయంతి స్వయంవరంలో నలుని మెడలో పూలమాల వేయాలి. ఇంద్ర, వరుణ, అగ్ని యమదేవతలూ ఈమె నలుని కోరుతోందని తెలిసి నలవేషాలతో ప్రత్యక్షమయ్యారు. అసలైన నలుని దమయంతి ఎట్లా గుర్తుపడుతుంది?

ఐదు మతాలలో అద్వైతమే సత్యమైనా నలుని గుర్తించలేక దమయంతి అట్లా ఉందిట.

పంచమకోటి మాత్రే

శ్రద్ధాందధే నిషధరాడ్వి మతే మతానాం

అద్వైత తత్త్వ ఇవ సత్యతరేఽపి లోకః

అన్ని మతలలో సత్యతరమైన అద్వైతాన్ని ఎట్లా గుర్తించలేకుండా ఉన్నారో ఆ ఐదుగురు నలులలో అసలైన నలుణ్ణి కనుగొనడానికి దమయంతి తటపటాయించిందని వ్రాసేదు ఇక్కడ అద్వైతాన్ని సత్యతరం అన్నాడు. మిగిలిన మతాలను అసత్యములని చెప్పలేదు. సత్యతరం అనగా ఉన్న

సత్యాలలో శ్రేష్ఠమని చెప్పడమే కదా! అనగా అదే పరమార్థ సత్యాన్ని బోధిస్తుందని అర్థం. వ్యాసుని అభిప్రాయమూ, పుష్పదంతుని అభిప్రాయమూ అదే.

భారతంలో అద్వైతం అని వాడకుండా వ్యాసుడు వేద శబ్దాన్ని వాడాడు. పుష్పదంతుడు త్రయియని అన్నాడు. అతడు అద్వైతమని అనలేదు. ఆ వేద మతాన్నే అద్వైతమని ఘంటాపథంగా చెప్పినవాడు శ్రీహర్షుడు.

అద్వైతులు శైవులనే అపప్రథ రాను రాను ఏర్పడినా అద్వైతులది పూర్ణవేదమతమే. ఇప్పటికీ అద్వైతులను స్మార్తులనే అంటారు.

స్మార్తుడనే పదానికి అద్వైత వేదాంతాన్ని నమ్మినవాడని ధాతువుని బట్టిరాదు. లేదా శంకరుల అనుయాయి అనే అర్థమూ రాదు. వేద స్మృతులను అనుసరించేవాడనే అర్థం. స్మార్తులపేరు చివర శర్మ ఉంటుంది. బ్రాహ్మణుని పేరుచివర శర్మ, క్షత్రియుని పేరు చివర వర్మ అని ఉండాలని స్మృతులే నిర్ణయించాయి కదా! పేరుచివర శర్మ అని లేకపోయినా శర్మపదం చేర్చుకొని ఉపనయనంలో వటువు నమస్కరిస్తాడు కదా! అనగా అద్వైతియొక్క పేరు శర్మాంతంగానే ఉంటుంది. అనగా అతడు పూర్ణవేదమతస్థుడని తేలింది.

సాధారణంగా వైష్ణవుల, మాధ్వుల పేరు చివర శర్మ ఉండదు.

ఇక అయ్యంగార్ కుటుంబంలోనో రావు గారి (మాధ్వుల) కుటుంబంలోనో పిల్లలు పుట్టినంత మాత్రంచే వారిని వెంటనే వైష్ణవులుగా, మాధ్వులుగా పరిగణించరు. వారికి ముద్రాధారణం తప్పని సరి వారి శరీరంపై శంఖచక్రాలను వేస్తారు. ఇది వైష్ణవులలో ఒక్కసారే ఉంటుంది. మాధ్వులలో వారి ఆచార్యులను కలిసినపుడల్లా పంచముద్రధారణ ఉంటుంది. ప్రతివానికి మంత్రోపదేశం ఉంటుంది. అట్లే శైవులలో ముద్రాధారణం లేకపోయినా ఉపదేశం తప్పని సరి అనగా పంచాక్షరిని ఉపదేశించుట.

దానిని దీక్ష అని అంటారు. తమిళంలో దీనిని దీక్షై అంటారు. పుట్టుక, నమ్మకం ఒక్కటే కాదని వైష్ణవులని, మాధ్వులని పిలువబడడానికి ప్రత్యేక సంస్కారాలు కావాలంటారు.

ఇవేమి లేని వారిని ఏమని పిలుస్తారు? సంప్రదాయం, వారిని స్మార్తులనే అంటుంది. ఈవిషయాన్ని చాలా మంది గుర్తించరు.

ఒక హిందువు క్రైస్తవునిగా మారినపుడు అతనికి బాప్తిజమ్ ఇస్తారు. అనగా జ్ఞాన స్నానమనే ప్రక్రియ. అట్లాగే పైప్రక్రియలు.

క్రైస్తవ మతం పుచ్చుకొంటే ఇక వేదశాస్త్రాలకు మంగళం పాడినట్లే. కాని అద్వైతానికి భిన్నంగా మిగిలిన సిద్ధాంతాలకు అనుసరించినా మనవాళ్లు వేదశాస్త్రాలను విడిచి పెట్టరు. వారి ప్రత్యేక సంప్రదాయలను విడిచి పెట్టరు. లేనిచో శంకర అనుయాయులై పోతారని భావిస్తారు. శంకరులట్టి ప్రత్యేక సంప్రదాయాలను విధించలేదు. దీనిని ఒక ప్రత్యేక మతంగా తీర్చి దిద్దలేదు. కనుక ప్రత్యేక సంస్కారాలు లేని వారందరూ వారి అనుయాయులే.

దీక్ష, ముద్రాధారణం, సమాశ్రయణం మొదలైన వాటిని వేదాలు విధించలేదు. మొదటి మూడువర్ణాలకు ఉపనయనం ఉందని, గాయత్రిని ఉపదేశించారు. నాల్గవ వర్ణం వారికి ఉపనయనం లేకపోయినా వేదధర్మానికి చెందినవారే.

మాకు ప్రత్యేక సంస్కారాలు లేవని స్మార్తులు బాధపడనవసరం లేదు. రామునకు, శ్రీకృష్ణునకు పై ముద్రలు, సమాశ్రయణాలు, శైవదీక్షలున్నాయా? వారు అవతార పురుషులు కనుక అక్కర్లేదని చెప్పినా అది సరియైన జవాబు కాదు. రామాదులకు ఉపనయనం జరిగినట్లుంది కృష్ణుడొక బ్రాహ్మణునితో కలిసి సాందీపని దగ్గర చదివినట్లుంది కదా! పై వారు వాదించినట్లు మరి అవతార పురుషులకు వేదాధ్యయనం ఎందుకని అంటున్నామా? రాముడు అస్త్రశస్త్రభ్యాసం చేసినట్లు బల, అతిబల విద్యలను విశ్వామిత్రుని నుండి

సంపాదించినట్లుంది కదా! మామూలు జనులు కూడా వారిని ఆదర్శంగా తీసికొంటారనే ఉద్దేశ్యంతోనే అట్లా అభ్యసించారు. కనుక వేద శాస్త్రాలు చాలునని శంకరులు మనకు మార్గం చూపించారు.

ఇతర సంప్రదాయాలకు చెందిన ఆచార్యులు శాస్త్రనియమాలతో బాటు ప్రత్యేక పద్ధతులను ప్రవేశపెట్టగా అనుయాయులు శాస్త్రాలలో చెప్పిన వాటిని విడిలేస్తున్నారు. చూసారా పరిస్థితి?

కాని శంకరులు శాస్త్రాలకు అదనంగా ఏమీ చేర్చవద్దని అనాది నుండి వచ్చు సంప్రదాయాలనే అందించారు. అంతేకాదు, మధ్యలో వచ్చిన పిచ్చి ఆచారాలను తొలగించి ప్రాతవాటిని పునరుద్ధరించారు.

వీరిని అవతార పురుషులుగా పురాణాలు కీర్తించాయి. అధర్మం నుండి ధర్మాన్ని ఉద్ధరించడం కోసం ఈశ్వరుడు శంకరులుగా అవతరిస్తాడని ఉంది:-

కరిష్యతి అవతారం స్వం శంకరో నీలలోహితః

శ్రౌతస్మార్త ప్రతిష్ఠార్థం భక్తానాం హితకామ్యయా

శంకరుని నుతించే శ్లోకమూ ఇట్లాగే ఉంది:-

శ్రుతి స్మృతి పురాణానాం ఆలయం కరుణాలయం

నమామి భగవత్పాదశంకరం లోకశంకరం

ఈ శ్లోకంలోనూ అద్వైతం గురించిలేదు. వేద, శాస్త్ర, పురాణాలకు వారునిలయమైనట్లు నుతించారు.

కనుక పైశ్లోకంలో గాని, కూర్మపురాణంలో గాని అద్వైతమని కాని, షణ్మత స్థాపనమని గాని లేదు. ఉన్నది వేద ధర్మ ఉద్ధరణమే.

అద్వైతంలో ఒక భాగమే షణ్మతం. అద్వైతమని అంటూ ప్రత్యేకంగా షణ్మతాన్ని చెప్పనవసరం లేదు. జీవబ్రహ్మాలు ఒకటే అని చెబుతూ ఉండగా

దేవతలలో అనైక మత్యం, ఆధిక్యం గురించి అద్వైతం చెబుతుందా?

అద్వైతంలో షణ్మతం ఎట్లా భాగమో అద్వైతం స్మార్తమతంలో ఒక భాగమే. అద్వైతం అంటేనే వేదధర్మం. అద్వైతం అనడానికి బదులు వేదం అని శ్రీహర్షుడు పేర్కొనియుండవలసింది.

ఒక మాటను గుర్తించండి. శంకరుల పరమగురువులైన గౌడపాదులు తమ మండూక్య ఉపనిషత్ కారికలలో అనేక సిద్ధాంతా లున్నాయని, ఒకరితో ఒకరికి పడదని, మా అద్వైతం ఎవరితోనూ శత్రుత్వం వహించదని వ్రాసేరు.

కనుక ప్రాథమిక స్థాయిలో ద్వైత, విశిష్టాద్వైత సిద్ధాంతాలను ఆమోదించారని ఇట్టి సంఘర్షణరహిత మార్గాన్నే అన్నివేళలా మనం అనుసరించాలని వారి ఉపదేశం. అందర్నీ ప్రేమిస్తూ శంకరుల మార్గాన్ని అనుసరిద్దాం.

అద్వైతమైనా ద్వైతమైనా అమ్మ చేతిలోనే

వివిధ ప్రాంతాలలోనున్న నీటి కంటె సంపూర్ణమైన నీటిని సముద్రంలో చూస్తాం కదా! అట్లాగే అమ్మవారు జ్ఞానానికి దయకు సముద్రంవంటింది.

మనలో కొద్దిపాటి ప్రేమ, జ్ఞానముండగా తక్కువ స్థితిలో జంతువులలో ఉండగా, అధికంగా దేవతలలో ఉంటాయి. మనలోని జ్ఞానులు, మహాత్ములందరూ దయాళువులే. అగణనీయమైన దయ, జ్ఞానము పరమేశ్వర, లేదా పరాశక్తిలోనే ఉంటుంది.

ఈ అఖండ జ్ఞానము అన్నిటి చేత తెలియబడేది కాదు. అదిపూర్ణము, ఏకము.

అట్లా అయితే పెక్కుమంది జీవులున్నట్లు ఆశక్తి నుండి విడివిడియున్నట్లుగా కన్పిస్తున్నారేమిటని శంక, మాయయేకారణమని, పై

వేషాలు తొలగిస్తే పూర్ణత్వం, ఏకమైనదే ఉంటుందని వివరించాము కదా!

దీనినే తాయుమానవార్ అనే కవి అది పూర్ణముకనుక ఇకతెలిసి కొనవలసినది ఏమీ లేదన్నాడు. తనను తాను తెలిసికొనేదే జ్ఞానము.

జీవాత్మను పరమాత్మయనే సముద్రం ముంచినపుడు, అందుకరిగినపుడే పూర్ణత్వం. ఆ పూర్ణత్వం కంటె ఈ జీవుడు భిన్నంగా ఉన్నాడని భావిస్తే ఇతని పూర్ణత్వానికి హాని జరుగదా?

కనబడేదంతా ఆపురుషోత్తముడే అని మంత్రం ఇదం సర్వం పురుష ఏవ ఇట్లా జీవుడు పూర్ణత్వం పొందుటే అద్వైతం.

ఈ భావానికి భిన్నంగా భిన్న ప్రపంచంలో వ్యవహరిస్తున్నాం. భిన్నత్వం లేదంటే నిత్యకృత్యాలకు ఆటంకంవస్తోంది. ద్వైతభావనలేకపోతే పనులు జరుగుతాయా?

తేలిందేమిటి? నిత్యకృత్యాలు సాగునంత వరకూ అద్వైతం అనడం కుదరదు. పనియున్నంత కాలం ఈ భేదం. పనిలేనపుడు పూర్ణత్వం ప్రకాశిస్తోంది. అయితే ద్వైత భావనలో పనులు చేస్తున్నా ఏకత్వ భావనతో నిర్వహించగలగాలి. అంతా ఒకటే, ఆ అంతలో మనమూ ఉన్నామనే భావన కలిగియుండాలి. అన్నిటిని ఆత్మ స్వరూపంగా భావించగలగాలి. భేదాలున్నట్లు కనబడినా మనప్రేమను విభజింపనవసరంలేదు. ప్రేమను విస్తరించిన కొద్దీ ఈ ఏకత్వం పట్టుబడుతుంది.

ఇకమనస్సు ఆలోచించినంత కాలం అద్వైతం పట్టుబడదు. ఆలోచనలో కూడా ఆలోచించేవాడు, ఆలోచన అని రెండున్నాయి కదా! ఆలోచనా రహిత స్థితిలోనే అద్వైతం చిక్కుతుంది. కాని అద్వైతమనే పునాదిని ముందు మనస్సులో నిర్మించాలి. నిష్క్రియమైన అద్వైతం సిద్ధించనంత వరకూ పనులు సాగుతూ ఉంటాయి.

అయితే ఏం చేయాలి? మన మనస్సుతో కొన్ని పనులు చేస్తున్నట్లే ఈ అఖిల ప్రపంచాన్ని నడిపే ఒక సమష్టి మనస్సున్నట్లు నిర్ణయానికి వస్తాం. ఈ మాయాశక్తి పరబ్రహ్మకు భిన్నంగా ఉందా? కలిసే ఉందా? అనే ఆలోచనలను కాసేపు రానీయకండి. అది మన కంటె భిన్నంగా ఉన్నా మన గురించి సంపూర్ణంగా దానికి తెలుసు. ఆపరాశక్తి సృష్టికర్తి. జ్ఞానసముద్రమే కాదు దయా సముద్రం కూడా. మనమొకరి పట్ల దయ చూపిస్తున్నామంటే ఇది పరాశక్తి నుండి వచ్చిన లక్షణమేకదా! కనుక మన లోటుపాట్లను ఆ దయాసముద్ర రూపిణికి విన్నవిద్దాం. మన భావతీవ్రతకు అనుగుణంగా పూర్ణత్వాన్ని ప్రసాదిస్తుంది.

ఇట్లా ప్రార్థించడం సబబుగా ఉందా? అన్నీ తెలసినవానికి ఫలానాది తొలగించుమని ప్రార్థించాలా? నాకు అద్వైతాన్ని ప్రసాదించుమని అడగాలా? వీటినేమీ పట్టించుకోకుండా ఆమెపట్ల అచంచల భక్తి ఉంటే చాలు ప్రశాంతత, పరిపూర్ణదయ, సంశయరాహిత్యం ఆమెకుందని మనం భావిస్తే ఆ భావన మనకు సంతోషాన్ని ప్రసాదించదా? ఏది మనం పొందగిన యుంటుందో అది ఆమె నుండి లేదా అతని నుండి వస్తుందనే దృఢవిశ్వాసం ఉండాలి.

మనస్సు చంచలంగా ఉందని బాధపడడం కంటె, పరాశక్తి యొక్క పరిపూర్ణ దయను, అమేయ సౌందర్యాన్ని భావిద్దాం.

మనస్సు లేనపుడే పరిపూర్ణ స్థితి కదా! మన మాస్థితిలో ఉన్నామా? అట్టి స్థితి రావాలని ఇప్పుడే అనుకొని లాభమేమిటి? ప్రస్తుత పరిస్థితులలో పరమాత్మ ఉంచినందులకు తృప్తిపడుతూ వైదిక కర్మలను చేస్తూ భక్తితో ఉంటేచాలు. అతడు విడిగానున్నాడని భావించినా సరే! మనలో కరిగిపోయేడని భావించిన సరే! కావలసింది అతని పట్ల అచంచల విశ్వాసం, భక్తి మాత్రమే. అద్వైతమోక్షం ఇచ్చేది లేనిదీ అతడు చూసుకొంటాడు. మనకేమి?

మనం అతని కంటె భిన్నులుగా ఉన్నామని ప్రస్తుతం తెలుసు. కానీయండి. అది అతని సంకల్పమేమో! ఈదశలో భక్తియే శరణ్యం.

ప్రస్తుతం సగుణమూర్తినే భజిద్దాం. అది ద్వైతం కావచ్చు అతడు అణువులో అణువైయుండగా మనం కొలిచే మూర్తిలో ఉండడా? అతడు సర్వం వ్యాపించియున్నడనే భావనతో ఉన్నపుడు అట్టి భావనను మనలో పూర్తిగా కల్గించడా? ఆపనిచేయనీ చేయకపోనీ, అది అతని పని మనకు చింత ఏల?

అతని నిర్గుణ స్థితిని ప్రస్తుతం అర్థం చేసికోలేం. అనంత సౌందర్యంతో, అపారమైన దయతో అఖండ జ్ఞానంతో ఉన్న సగుణమూర్తినే ప్రస్తుతం పట్టుకొందాం. ప్రస్తుతం భక్తియే ఇకగీతా సందేశం వినండి :

భక్త్యా మామ్ అపి జానాతి యావాన్ యశ్చాస్మి తత్త్వత
తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనం తరం

అనగా నిరంతర భక్తిని నాపట్ల చూపిస్తే అతడు నన్ను అర్థం చేసికొనగలడు, నా కల్యాణగుణాలను తెలిసికొనగలడు. అతడు నాలో ప్రవేశిస్తాడు, నాకు విడివడియుండడని.

అతడు మనకంటె భిన్నుడని భావించునంత కాలం అతని పట్ల భక్తిని చూపించగలం. అతనిలో మనం ప్రవేశిస్తే అతనిలో ఏకం కామా? అపుడు విడి విడిగా నున్నారనే మాటే కుదరదు కదా! అనగా అద్వైత స్థితియేకదా! ఇది ఎప్పుడు జరుగుతుంది! నాతత్వాన్ని తెలిసికొనినపుడు మాత్రమే అని అన్నాడు.

తతః అనగా తరువాత మనం చేయవలసినది భక్తిని చూపించుట. తరువాత కాలమే నిర్ణయిస్తుంది. భక్తిని చూపించినపుడు నా నిజరూపాన్ని చూపించి నాలో కలుపుకొంటానని అన్నాడుకదా!

తత్త్వతః అని రెండుసార్లన్నాడు. భక్తిలో ఉన్నపుడు అతని నిజరూపం తెలియదు. భక్తివల్ల అతడు నిజరూపాన్ని చూపిస్తాడని అర్థం.

మనకు తెలియని వాడిపట్ల భక్తినెట్లా చూపించగలం? పూర్తిగా అతడు తెలియదని కాదు. అతని పూర్ణరూపం మాత్రమే తెలియదని అర్థం. నిజరూపమనగా పూర్ణాద్వైతరూపం. పరిపూర్ణస్థితిలో భగవానునకు భక్తునకు భేదం ఉండదు. అయితే భగవానుడు వేరు, భక్తుడు వేరని భావించినపుడు మాత్రమే భక్తికుదురుతుంది. అంటే ఆ స్థితిలో భగవానుడు భక్తుణ్ణి తనలో లీనం చేసికోవడం లేదు. అందువల్ల అది అపూర్ణము. అయితే ఎపుడు అతనిలో ఇతణ్ణి లీనం చేసికొంటాడో తెలుస్తుందా? తెలియదు కాబట్టి సగుణ సాకారభక్తిని పొడిగించవలసిందే. దయతో ఎప్పుడో నిజరూపాన్ని చూపిస్తాడు.

భక్తిలో ఉండగా అతని నిజరూపాన్ని గురించి చింతించం. అతని నిజరూపాన్ని తెలిసికోవాలంటే భక్తికంటె మరొక మార్గంలేదు. భక్త్యా మామ్ అపి జానాతి అని అన్నాడు. అనగా సంపూర్ణంగా అనగా అతని నిజరూపాన్ని అని అర్థం. అపుడు భక్తుడు అతనిలో లీనమౌతాడు.

ఇది తరువాతి దశ. వెంటనే పట్టుబడదు కనుకనే ఈశ్వరానుగ్రహం ఉంటేగాని అద్వైతవాసన పట్టుబడదని అద్వైత శాస్త్రం అంటోంది:-

ఈశ్వరానుగ్రహాదేవ పుంసాం అద్వైతవాసనా

అంటే జీవునిలో అద్వైతం పట్ల రుచిని కల్గిస్తాడని కదా! తనకంటె జీవుడు భిన్నుడని ఈశ్వరుడు భావించినపుడు మాత్రమే అనుగ్రహాన్ని చూపగలడు. కనుక ఈమాయా నాటకంలో జీవుడు, పరమాత్మకంటె భిన్నుడని భావించినట్లు గానే పరమాత్మకూడా తన కంటె జీవులు భిన్నులని భావిస్తాడు.

ఈ జీవుడు తనంతటతాను అద్వైతాన్ని కోరడం లేదు. ఈశ్వరుడే అతనిలో ఈకోరికను పుట్టిస్తున్నాడు అపుడు ద్వైతమే అవుతుంది కదా!

అతడు స్వతంత్రంగానే ఉండి జీవునిలో అద్వైతవాసనను కల్గిస్తాడు.

వాసనను పుట్టించినవాడు పూర్తిచేయకుండా ఉంటాడా? పోనిండు, అతడనుభూతిని కల్గించడం, కల్గించకపోవడం అతనివంతు, మనకేల?

తత్వాన్ని కల్గించడం అతని వంతు. అట్లా కల్గించేటట్లు అతనిని మార్చలేం. మనశక్తికి మించినపని. ప్రస్తుతం సగుణ రూపంలో అర్చిద్దాం.

అట్టి ద్వైతాన్ని ప్రస్తుతం మనం ఆశ్రయిస్తే ఇంకా తెలిసికోవలసిన దానిని అతడే తెలుపుతాడు. అంతవరకూ అణువులో అణువుగానున్న వానిని ప్రాణంలో ప్రాణంగా ఉన్నవానిని (అంతర్యామిని) భజిద్దాం. ఇక అపుడు భేదం ఉండదు. అపుడు ఇద్దరూ ఒక్కటై అద్వైతానుభవం కల్గుతుంది.

అద్వైత సత్యం ముందే పట్టుబడదు. ఒక పురుగుగా పుట్టినా నిన్ను మరువని స్థితిని ప్రసాదించుమని అప్పర్‌స్వామి ఒక పాటలో అంటాడు. అట్టి భగవత్ స్మరణను సాధకుడు ముందుగా కోరాలి. అట్టి భావమే ఆనందాన్నిస్తుంది. ఏమిటీ శరీరం? ఏమిటీ మనస్సు? ఇవి ఎందుకు పోవు? ఎపుడాత్మ ప్రకాశిస్తుందనే మాటలను ప్రస్తుతం మాట్లాడవద్దు.

శివానందలహరిలో శంకరులు నాకు క్రిమి జన్మవచ్చినా నిన్ను తలిస్తే చాలని అనలేదా? భక్తికి ప్రాధాన్యం ఈయలేదా:-

నరత్వం, దేవత్వం, నగవనమృగత్వం మశకతా
పశుత్వం కీటత్వం భవతు విహగత్వాదిజననం

అని అనలేదా? దోమగా పుట్టించినా సరే అని అనలేదా?

మానవ శరీరం ధరించి భక్తితో ఉండి, కర్మలను చేస్తూ సమస్త ప్రాణులను ప్రేమిస్తూ ఉండగా నాకీ జన్మ అక్కరలేదు, పునర్జన్మవద్దని ప్రార్థించడమేల?

ఆ జగదంబను వేడడమే మనవంతు. ఆమెయే జ్ఞానమనే పాలనిస్తుంది. మన మనస్సులోని దుమ్మును తుడిచేది ఆమెయే.

ఆమె మనల్ని ద్వైతంలో ముంచనీ! లేదా విశిష్టాద్వైతంలో ముంచనీ! అద్వైతస్థితిని ప్రసాదించనీ! అంతా ఆమె చేతిలోనే.

మూడవ మార్గం

ఏ పని చేసినా దానిని సరియైన రీతిలో చేయాలి. లేకపోతే అనేకమైన చిక్కులు వస్తాయి.

అట్లాగే పరమేశ్వరుని చేరడానికి రెండు మార్గాలను నిర్దేశించారు. మర్కటకిశోరన్యాయం, మార్జాలకిశోరన్యాయమని.

పిల్లికి పిల్ల పుట్టినపుడు అది నడిచేటంత వరకు తల్లి తన నోటితో కరిచికొని తీసికొనివెడుతుంది. అట్లాగే పెద్దపులి కూడా. పులికి మేనమామ పిల్లి అనే మాట వింటుంటాం. వేటాడడం మొదలగునవి పిల్లి దానికి నేర్పిందని అంటారు. అన్నీ చెబితే మంచిది కాదని చెట్టునెక్కడం నేర్పలేదట. అందుకే పులి చెట్టు ఎక్కదట.

ఆడపులి ఎట్లా పిల్లలను నోటితో కరిచి తీసికొని వెడుతుందో అట్లా వేదమంత్రాలను జగరూకతతో చదవాలన్నారు. పిల్లకు హాని చేయకుండా జాగరూకతతో తీసికొని వెళ్లినట్లు మంత్రాలనంత జాగరూకతతో ఉచ్చరించాలని అన్నారు. పిల్ల భారాన్ని తల్లే మోస్తుంది. అట్లాగే సర్వార్పణ భావంతో భక్తుడుండగా భగవానుడే అన్నీ చూస్తాడని చెప్పేది మార్జాల కిశోర న్యాయం.

ఇక పిల్ల కోతి తల్లిని కౌగలించుకొని గట్టిగా పట్టుకొని యుంటుంది. తల్లి కోతి గెంతినా పిల్ల పడిపోతుందని పట్టించుకోదు. పిల్లకోతికి ఆపట్టును ప్రసాదించాడు భగవానుడు. కోతి పట్టు అనికూడా వ్యవహారంలో ఉంది. అట్లాగే భగవానుని దయకోసం నిరీక్షించకుండా గట్టిగా అతణ్ణి పట్టుకొంటాడు. అతడు విదిలించినా వీడు వదలడు. గట్టిగా పట్టుకొన్నానని మాణిక్యవాచకులు గానం చేసారు. భక్తి అనే వలలో చిక్కాడని కూడా అన్నారు. భగవంతుణ్ణి మనం పట్టుకోవాలా? అతడు మనలను పట్టుకోవాలా అని భక్తులలో సందేహం కల్గుతుంది.

వైష్ణవులలో వడగలై, తెంగలై అని రెండు సంప్రదాయాలున్నాయి. ఈ రెండూ శరణాగతి విషయంలో ఏర్పడ్డాయి. మర్కట కిశోరన్యాయం అనుసరించాలని వడగలై వేదాంత దేశికులనగా, తెంగలై సంప్రదాయానికి చెందిన మనవాళముని, పిళ్లైలోకాచార్యులు మార్జాలకిశోరన్యాయం పాటించాలన్నారు. నుదిటి పైనామాలు ధరించిన ఆకారాన్నిబట్టి ఈ భేదాలను గుర్తిస్తాం. U, Y ఆకారంలో నామాలుంటాయి కదా! ఈ భేదం శరణాగతి తత్వంపై ఆధారపడింది శరణాగతియే ప్రపత్తి

సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ

అని గీతలో ఉంది కదా! ఇదే శరణాగతి శాస్త్రానికి తారకమంత్రం. విభీషణుడు రాముని దగ్గరకు వచ్చినపుడు నేను నీవాణ్ణి, నన్ను రక్షించమని ఎవరు వచ్చినా రక్షించే బాధ్యత నాదని రామాయణంలో రాముడన్నట్లుంది కదా!

సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే

అభయం సర్వ భూతేభ్యో దదామి ఏత ద్వ్రతం మమ

వైష్ణవులు గీతను, రామాయణాన్ని శరణాగతి శాస్త్రాలని అంటారు.

అన్నీ పైవాడికి అర్పించి నమ్మకంతో ఉండడం సామాన్యులకు సాధ్యమౌతుందా? అట్టి వైరాగ్యం లేదా భక్తి మనలో సంపూర్ణంగా ఉందా? అదిలేనపుడు నిరంతరం భగవంతుణ్ణి గట్టిగా పట్టుకోగలమా? అదీ కుదరదు. ఇట్లా రెండు పద్ధతుల్ని సంపూర్ణంగా అచరణలో పెట్టలేం. అయితే మనం ఏం చేయాలి? ఇక మూడవ మార్గం చెప్పేవారున్నారు?

పై శరణాగతులు భక్తితో కూడియున్నాయి. అదీ చిక్కదు. జ్ఞానమార్గానికి శంకరులున్నారు. భక్తుడులేడు, భగవానుడులేడు, బ్రహ్మములో ఉండిపో అని అంటే అదీ కుదురుతుందా?

ఆ రెండు భక్తిమార్గాలు. కర్మమార్గం కూడా జ్ఞానమార్గానికి దారితీస్తాయని శంకరులన్నారు.

శివానందలహరిలో ఈ మూడవ మార్గాన్ని సూచించారు.

మనస్సును ఒక కోతితో పోల్చారు. ఒక కొమ్మ మీద నుండి మరొక కొమ్మమీదకు దూకే కోతిలా ఒక భావం నుండి మరొక భావానికి మనస్సు గంతులు వేస్తుంది. తల్లిని పట్టుకొనే కోతిపిల్ల మాదిరిగా మన మనస్సుండదు. అందువల్ల భగవానుడే దిగివచ్చి ఈమనస్సనే కోతిని నియమించి తనను పట్టుకొనేటట్లు చేయాలి. అపుడు ఈ మనస్సనే కోతి మంచి మార్గంలోనూ కొంతసేపుంటుంది. మరొక సందర్భంలో వెంటనే పట్టుసడలించుకొని దట్టమైన అరణ్యాలలో తిరుగుతూ మార్గం తెలియక బాధపడతూ ఉంటుంది. అట్టికోతిని అదుపులో పెట్టేవాని చేతిలో పెడితే అతడు దానిని నియమిస్తాడు. కోతికి రక్షణ కూడా ఉంటుంది. కోతినాడించే భిక్షువునకు జీవనోపాధి దొరకుతుంది.

శంకరులు, శంకరునితో ఇట్లా అంటారు. నీవేమో బిచ్చగాడివి, నీకు ఒక కోతి దొరికితే నీవు జీవనం కొనసాగించవచ్చు కదా! ఇక ఆ కోతి నీ అదుపు అజ్ఞలలో ఉంటుంది. అట్టి కోతి వంటి మనస్సు నాదగ్గరుంది ఇది చిన్న కోతి పిల్ల వంటిది. అదినీవు తల్లియని తెలియక నిన్ను గట్టిగా పట్టుకోలేదు. పోనీ పిల్లి పిల్ల అయితే నీవు దానిని నోట కరుచుకొని తీసికొని వెళ్లేవాడివి. కాని ఇది కోతి అయిపోయింది. ఇక నీవు కూడా తల్లి పిల్లివి కాదు, భిక్షుకుడివి. కనుక ఈమనస్సనే కోతి పిల్లను త్రాటితో కట్టి నియమించు. ఏత్రాటితో? ప్రేమ అనే త్రాటితో?

కపాలిన్! భిక్షోమే హృదయకపి మత్యంత చపలం
దృఢం భక్త్యా బద్ధ్వా శివ! భవదధీనం కురువిభో

అట్లా ప్రార్థించారు.

ఇక్కడ ఫలానా వస్తువు కావాలని పరమేశ్వరుణ్ణి ప్రార్థించడం లేదు. అతనికి ఉండి మనకు లేని దానిని అడగడం లేదు. మన సహజరూపమైన ఆనందం తెలియడం లేదు. దీనిని గుర్తించక బాధపడుతున్నాం.

ఇట్లా ప్రార్థించాలి. సహజరూపాన్ని గుర్తించేటట్లు చేయవయ్యా! ఈమనస్సు నిజరూపాన్ని గుర్తించకుండా చేస్తోంది. దీనిని నీవు ప్రేమ అనే త్రాటితో కడితే చాలు. అట్లానియమించి దానిని తిరిగి నాకియ్యి.

మన స్థితి ఎట్లా ఉంది? పిల్లకోతులు మాదిరిగా ఉండి పిల్లికూనల మాదిరిగా రక్షణను కోరుతున్నాం. కనుక శంకరుల మార్గాన్ని అనుసరిద్దాం. అయ్యా నీదయ వల్ల నా మనస్సును నియమించమంటున్నాం.

ఇట్లా నిరంతరం ప్రార్థించగలమా? ఎట్లా ప్రార్థించాలి?

నేనన్ని విధాల కోతిని గాను. మిగతా విషయాలనాలోచించినపుడు మాత్రం కోతినే, నిన్ను ధ్యానించేటపుడుగాను, అనే మాట ఎట్లా ఉందంటే పిల్లవాడు ఆయుర్దాయం. మినహా సలక్షణంగా ఉన్నాడని చెప్పడం వంటిది. ఈ పరిస్థితిలో నీవు పిల్లి తల్లిలా ఉండి సాయం చేయి, నేను పిల్లకోతినై ఉండి నిన్ను పిల్లి తల్లిలా ఉండమనడం సబబు కాదు. అంతపెద్ద అనుగ్రహానికి అర్హుణ్ణికాను. నన్ను సంపూర్ణంగా నీవశంలో ఉంచుకొని మార్గం చూపించని అడగడం లేదు. ఇంత చంచలంగా ఉన్నా ఇపుడు ఒక క్షణమైనా వేడుకొంటున్నాను కదా! ఇట్టి ప్రార్థనను గట్టి చేయి. భక్తి అనే త్రాటితో కట్టుత్రాడు కట్టకపోతే పరుగెత్తి కొని పోతాను. పెద్ద త్రాటితో కడితే అటూ ఇటూ తిరిగినా ఒక పరిధిలోనే తిరగ వలసివస్తుంది. మరల నిన్ను చేరే అవకాశమూ వస్తుంది. మర్కట కిశోరన్యాయం మాదిరిగా సంపూర్ణ విశ్వాసమున్నా సరే, లేదా నన్ను ఏమీ పట్టించుకోకుండా మార్జాల కిశోరన్యాయంలో ఉంచినా సరే! నేనీక్షణంలో పిల్ల కోతిలా ప్రార్థిస్తున్నా, దానికి బదులు తల్లిపిల్లిలా అనుగ్రహం చూపించు. నీపట్ల ప్రేమ. భక్తి క్రమ క్రమంగా నాలో వృద్ధి పొందుగాక ఇట్లా ప్రార్థించి చూడండి.

ప్రస్తుతం భక్తిని ప్రసాదించని ప్రార్థించాలి. శంకరుల మార్గంలో పైరెండు న్యాయాలు ఉన్నాయి. మనం ఎంత వరకూ ప్రార్థిస్తున్నామో అంత వరకూ పిల్లకోతిలా ఉన్నాం. అయితే మనపట్టు గట్టిగా లేదు. ఎప్పుడైనా జారిపడే రీతిలో ఉన్నాం. ఇట్టి పరిస్థితిలో తల్లి పిల్లి మాదిరిగా పై వాడు మనపై అనుగ్రహం చూపించాలి. "భక్తి అనే త్రాటితో కట్టు, అందువల్ల నాకు పతనముండదు" అని ప్రార్థించాలి.

అనుగ్రహమనే త్రాటితో కట్టుమని శంకరులు ప్రార్థించడం లేదు. అట్లా చెబితే తల్లి పిల్లి మాదిరిగా 'భగవానుడుండి అతని అధీనంలో మనలను పెట్టినట్లౌతుంది. శంకరులేమంటున్నారు? నా భక్తియనే త్రాటితో కట్టమంటున్నారు. నీ అనుగ్రహంతో కట్టుమని అంటున్నారు. భక్తియనే వలలో నీవు చిక్కావని మాణిక్య వాచకులన్నట్లు అనలేదు. అట్లా అంటే భగవానుడు మనలనుండి దూరమై పరుగెత్తుకొని పోయినట్లు, మనం వలలో అతణ్ణి బంధించినట్లౌతుంది. అప్పుడది మర్కట కిశోరన్యాయమై పోతుంది. పై రెంటిన్యాయాలను కలిపారు. మనం మన భక్తితో అతణ్ణి కట్టలేం. కనుక అతడు మనకు ముందుగా భక్తిని ప్రసాదించాలి. మనం భక్తిమార్గంలో లేకుండా ముక్తిని వెంటనే ఈయడు. ఆ కోరికను మనకు అర్హత లేదు. కనుక భక్తినిమ్ము, అదే నీ అనుగ్రహం అనాలి. అతని దయవల్ల అతని పాదాలను ఆశ్రయిస్తున్నానని మాణిక్య వాచకులంటారు. కనుక తిన్నగా మోక్షాన్ని కోరడానికి బదులు అట్లా ప్రార్థించాలి. ఇట్లా మన భక్తిపట్ల అతడు కరిగి మోక్షాన్ని ప్రసాదించుగాక. ఇట్లా మానవ ప్రయత్నం, అతని అనుగ్రహం కలిస్తే, దారి సుగమమౌతుంది. ప్రేమ లేదా భక్తియనే త్రాటిలో మనం కట్టబడాలి. ఈ త్రాటితో అతనిని కడతామా ,కట్టమా అని ముందు ఆలోచనవద్దు. ప్రస్తుతం మన భక్తి అనే త్రాటిలో అతడు కట్టుగాక, అందువల్ల అతణ్ణి విడిచిపెట్టం. ఇదీ శంకరులు చెప్పినది.

పై న్యాయాలలో ఏది గొప్పఅని వాదులాటలు బుద్ధికి సంబంధించినవి. వాదబలాన్ని పెంచేవి. కనుక పూర్తి శరణాగతి అయ్యేపని కాదు, భక్తునకు పూర్తి స్వతంత్రత లేదు. భక్తి అనే వరాన్ని ప్రసాదించు తండ్రీ అని వేడుకోవడమే శరణ్యం.

పై రెండు మార్గాలు కాకుండా శంరులందించిన జ్ఞానమార్గాన్ని శంకరుడందిస్తాడా? అది అతని ఇష్టం ఏ మార్గమైనా ఏనదియైనా తుదకు సముద్రంలో చేరవలసిందే కదా!

మనస్సును కట్టి నీ అధీనంలో ఉంచుకో అని శంకరులన్నారు. మనలోని భక్తి భావమే ఈశ్వరానుగ్రహమన్నారు. వారి వాఖ్యనాలలో ఈశ్వరారాధన గురించే చెప్పారు. ఈశ్వరానుగ్రహం వల్ల మనలో భక్తి అంకురిస్తుందని వారి వ్యాఖ్యానాలలో లేదని గుర్తించండి. ఆ వ్యాఖ్యానాలు పరిపక్వతతో కూడిన వారికే. సామాన్య జనులనుద్దేశించి పై భక్తి మార్గాన్ని శివానంద లహరిలో చెప్పారు. భక్తి లేదా ఉపాసనతో మనస్సును కట్టాలని జ్ఞానవిచారం చేసే గ్రంథాలలో అన్నారు. కాని శివానందలహరిలో మాకు భక్తినిమ్ము, మనస్సును కట్టుము అనే మాటలు వ్రాసి ఈశ్వరునకే వదిలిపెట్టారు.

హృదయకపిని గూర్చి – ముందీశ్వరుడు ఒక పెద్ద త్రాటితో కడితే ఇతడు చెప్పినట్లే కోతి గంతులేస్తుంది. ఒక ప్రదేశంలోనే దానినుంచుతాడు. అది నిశ్చలమైతే దానిని గంతులు వేయించేటట్లు చేయడు. అపుడు మనస్సులయమౌతుంది. అదే అద్వైతమోక్షం. ఆత్మ ప్రకాశం. అతని చేతిలో త్రాడుంది. ఈ శ్లోకం భక్తినుద్దేశించినా పరమాత్మ జ్ఞానమోక్షాన్ని ఈయగలడని తెలుతుంది.

తరువాతి శ్లోకం పై అభిప్రాయాన్ని గట్టి పరుస్తోంది ఈ మదించిన మనస్సనే ఏనుగును ధైర్యమనే అంకుశంచే అనగాసాధనంతో లోబరుచుకొని భక్తియనే గొలుసుతో నీ పాదం అనే నిట్రాడుకు కట్టు:-

హృదయమదేభం బధాన చిద్యంత్రైః

మొదటి శ్లోకంలో భక్త్యా బద్ధ్వా అన్నారు. ఇప్పుడు జ్ఞానంతో కట్టుమంటున్నారు. ఇదంతా పరమాత్మ ప్రసాదమే. అనగా అతడు భక్తిని ప్రసాదిస్తే అందుండగా జ్ఞాన మోక్షాన్ని ప్రసాదిస్తాడని అర్థం వస్తోందికదా!

పూర్ణ శరణాగతికి జ్ఞానమార్గానికి భేదం లేదు. జ్ఞాన మార్గంలో కేవలం ఆత్మ విచారం ఉంటుంది. శరణాగతిలో భక్తియుంటుంది. అయితే ఎవరికైనా ముందుభక్తియే ఆధారం.

యుద్ధం తరువాత శాంతి, దేవాసురులెవరు ?

ఛాందోగ్యంలో దేవతలు ఒకానొక సందర్భంలో యుద్ధం చేసారని ఉంది. శంకరులు భాష్యం వ్రాస్తూ ఇక్కడ దేవతలనగా వేదకర్మలను ఆచరించడం వల్ల శుద్ధమైన ఇంద్రియాలని, అట్లా సంస్కరింపబడని ఇంద్రియాలు అసురులని వ్యాఖ్యానించారు. అంటే అవి మామూలు కోరికలతో కూడినవని అర్థం. దేవాసుర ప్రవృత్తిని ప్రతిసామాన్య వ్యక్తి అనాదిగా అనుభవిస్తున్నాడని ఇంకా స్పష్టంగా వ్రాసారు:-

సర్వప్రాణిషు ప్రతి దేహం దేవాసుర సంగ్రామః అనాది కాలప్రవృత్తః

బాహ్యవిషయాలపై వెంటబడు ఇంద్రియాలే అసురులని, అంతర్ దృష్టిని సారించేవారు దేవతలని అన్నారు కూడా. ఈ రెంటి సంఘర్షణమే దేవాసుర యుద్ధం.

ఆధునికులంటున్నట్లు పురాణకథలు అబద్ధాలని ఇవన్నీ ప్రతీకాత్మకంగా (Symbolic) ఆలంకారికంగా ఉంటాయని అన్నట్లుగా శంకరులు చెప్పలేదు. దేవతలకు విజయాన్ని ప్రసాదించాడని కేనోపనిషత్తులో ఉంది. అక్కడ దేవతలను ప్రతీకలని చెప్పలేదు. వారు బ్రహ్మసూత్ర భాష్యంలో దేవతాధికరణం గురించి వ్రాస్తూ మనమెట్లా భూలోకంలో ఉంటున్నామో

దేవతలూ దేవలోకంలో ఉంటారని వ్రాసేరు. ఈ దేవతలూ ఇంద్రియసుఖాల వెంటబడడం, ఓటమి, దాని వల్ల బాధలు, ఈర్ష్య మొదలగువానిని అనుభవిస్తూ ఉంటారు. మనలో కొందరికి విరక్తి కలిగి బ్రహ్మ జ్ఞానం కోసం ఎట్లా ప్రయత్నిస్తూ ఉంటామో వీరూ అంతే!

అయితే వీరిని గురించి అలంకారికంగా చెప్పిన సందర్భాలూ లేకపోలేదు. ఇట్లా చెప్పడాన్ని అర్థవాదలంటారు. అనగా కథ, కథ కోసం కాదని ఒక ఉన్నతమైన విలువను అందించడానికే అని. ఇట్లా చెప్పబడిందే ఛాందోగ్యంలోని కథ. ఇక్కడ దేవతలనగా భౌతిక సుఖాల ననుభవించే ఇంద్రియాలు కాదని జీవులను వాటి నుండి విముఖులను చేసి నడిపే శక్తులని వారు దేవతలని అర్థం. గీతలో దేవాసుర సంపత్ విభాగయోగమనే అధ్యాయం ఉంది. అందు దైవిక, అసుర గుణాల వివరణ ఉంటుంది. నిర్భయత్వం, పవిత్రత, పవిత్రభావన, దానం, తపస్సు, ఋజుత్వం, అహింస, సత్యం, త్యాగం, శాంతి, క్రోధరాహిత్యం, ఈర్ష్యలేకపోవుట, క్షమాగుణం మొదలైన దైవీగుణాలని పేర్కొన్నాడు. దైవీసంపత్ అనగా దైవిక గుణాలనే సంపద. వీటినే అలంకారికంగా దేవగణాలని, పై గుణాలకు వ్యతిరేకమైన వాటిని అసుర గణాలని వీటికి పరస్పర సంఘర్షణ ఉంటుందని పేర్కొన్నాడు భగవానుడు. దంభాదులు అసురగణాలు ఏవి మనిషిని మోక్షం వైపుకి తీసికొనివెడతాయో అదంతా దైవీ సంపత్ అని. మనిషిని బంధించేవి, మరల మరల జన్మనెత్తునట్లు చేసేవి అసుర సంపదయని వింగడించాడు. నీకు దైవీసంపదయేయుందని అర్జునుణ్ణి వీపుతట్టి ప్రోత్సహించాడు. కనుక ఈ శక్తులు జీవునితో అనుబంధం కల్గియుంటాయి.

మనలో ఈ యుద్ధం జరుగుతోందని అందరికీ తెలుసు. అసుర ప్రవృత్తి మనలనులాగుతూ ఉంటుంది. మళ్ళీ తప్పటడుగు వేస్తాం. మళ్ళీ తప్పు తెలిసికొంటాం. మంచి మార్గం వైపుకి మన ప్రయత్నం ఎట్లా ఉంటుందంటే ఒక స్తంభానికి నూనె రాసి ఎక్కడం వంటిది. మాటి మాటికి క్రిందపడడమే

కదా! అయినా ప్రయత్నం చేస్తూ ఉండవలసిందని మనలో ప్రేరేపిస్తూ ఉన్నట్లుగా ఉంటుంది. ఈ అంతరాత్మ ప్రబోధము, దుష్టమనోవృత్తుల కోలాహలము – ఈ రెంటి మధ్య సంఘర్షణ ఎప్పుడూ ఉండేదే!

వృత్తి అనగా ప్రవాహం చిత్తవృత్తి అనగా ఆలోచనల ప్రవాహం. ఇందు 90 ప్రవృత్తులు మనిషిని అధోలోకంలో తీసికొని పోయేవే! మంచి ప్రవృత్తులుకొన్నే వాటినే దేవతలంటారు.

అసుర ప్రవృత్తి ఎందుకు లేస్తోంది?

90 పాళ్లు అసురులదే జయం. పది సార్లు దేవతలు జయించినా సంతోషిస్తాం. చీకటి–వెలుగులు సాగుతూ ఉంటాయి అయినా చాలా సార్లు లోనున్న జీవునకు అసంతృప్తి. ఏదో దుఃఖం. అరెరె! మనం పవిత్రతను కోల్పోయేమోనని బాధ. తప్పు చేయకూడదనే సంకల్పానికి దృఢత్వం వస్తే విరుద్ధమైన వీటిని అడ్డుకొనగలం. అయినా పాపాల చిట్టా పెరిగిపోతూ ఉంటుంది. కారణం అసుర ప్రవృత్తుల అధిక్యం అడుగడుగునా కన్పించడం వల్లనే!

ఎవరోపట్టి లాగినట్లుగా ఇట్లా ఎందుకు జరుగుతోందని అర్జునుడు శ్రీకృష్ణుణ్ణి ప్రశ్నించాడు.

అథకేన ప్రయుక్తోఽయం పాపం చరతి పూరుషః

అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః

ద్వైతమే భయానికి కారణం

సమాధానమిది–ప్రతివ్యక్తి, చివరకు జ్ఞానికూడా సహజ ప్రవృత్తి ప్రకారమే నడుస్తూ ఉంటాడు. జీవుడు ప్రకృతి నుండే వచ్చాడు కదా! కనుక దానినుండి దాటడం ఎట్లా? మానవ స్వభావానికి అనుగుణంగా అనేక వృత్తులు,

వర్ణాశ్రమాలకు అనుగుణంగా అనేక విధులూ ఏర్పడ్డాయి. వారి స్వభావానికి అనుగుణంగా పనులను చేస్తూ క్రమక్రమంగా ఉన్నత స్థితిని పొందడానికి ఈ విధులు దోహదం చేస్తాయి: ఈ సందర్భంలో ఒకని ధర్మం మరొకని ధర్మం కంటె ఉన్నతంగా ఉన్నట్లు కన్పిస్తుంది. స్వధర్మాన్ని విడిచి పరధర్మాన్ని స్వీకరించినపుడు అతని ప్రకృతి లేదా స్వభావం క్రొత్త వృత్తిలో అట్లా చేయనీయదు. అపుడు సంఘంలో గందరగోళ పరిస్థితి ఏర్పడుతుంది. కనుక స్వధర్మం బాగాలేక పోయినా ఇతరుల ధర్మాన్ని స్వీకరించడం కంటె స్వధర్మాన్నే అనుసరించడం మేలని కృష్ణుని బోధ.

క్షత్రియ ధర్మాన్ని విడిచి బ్రాహ్మణ ధర్మాన్ని స్వీకరించి బిచ్చమెత్తుకొని బ్రతకుతానంటున్నావు కదూ! స్వధర్మం ఆచరిస్తూ మరణించినా మేలే! ఇతరుల ధర్మాన్ని అనుసరించడం భయానికి కారణమౌతుందని హెచ్చరించాడు కృష్ణుడు.

నీకేం జరుగుతుందోనని భయం. ఏదీ జరుగదని, నన్నేదీ కదిలించలేదని భావిస్తే భయం ఇతణ్ణి బాధించదు. ఆందోళనలేని ప్రశాంత స్థితికావాలి. అట్టి ప్రశాంత స్థితి మోక్షం లోనే. మనకంటె మరొకటి ఉందని భావించునంత కాలం ఈ అశాంతి మన వెంటనే ఉంటుంది. ఇట్లా భేదదృష్టియే ద్వైతం. ఆత్మయందే దృష్టిని పెట్టినవానికి భయం పరుగులు తీస్తుంది.

ప్రస్థానత్రయంలో మోక్షమనగా ఈ అభయస్థితియే యని శంకరులు ప్రతిపాదించారు. అద్వైతమే అభయమని నొక్కిచెప్పారు.

అద్వైతమే అభయం

ఉపనిషత్తులు దీనిని చర్చించాయి. ఉన్నది ఒక్కటేయని, మరొకటి విజాతీయమైనది ఉందనడం వల్లనే భయమేర్పడుతోందని తైత్తిరీయం చెప్పగా, అదే మాట బృహదారణ్యకమూ చెప్పింది. విజాతీయమైనది ఒకటిలేనపుడు

భయపడనేల అని ప్రజాపతి అన్నట్లుగా ఉంది.

ఏదో అనుమాన ప్రమాణంతో చెప్పి ఊరుకోకుండా ప్రత్యక్షంగా అద్వైతమే అభయమని కంఠోక్తిగా ప్రవచించాయి. తైత్తిరీయం బ్రహ్మానందాన్ని గూర్చి చెప్పింది. అది వాక్కునకు, మనస్సుకు అందదని అట్టి ఆనందాన్ని అనుభవించువాడు భయపడడని చెప్పింది. అందున్న అనందవల్లినిముగిస్తూ ముందుగా కాలాన్ని సూచిస్తూ 'కదాచన' అన్నది. అనగా ఏకాలంలోనూ భయపడడని, తరువాత స్థలాన్ని నిర్దేశిస్తూ 'కుతశ్చన' అని వాడింది అంటే ఎక్కడైనా అని. ఇవి రెండూ దేశకాలాలకు చెందినవే. దేశకాలాలపైనే నేటి భౌతిక శాస్త్ర నియమాలన్నీ ఉన్నాయి. అట్లే బృహదారణ్యకం నాల్గవ అధ్యాయం నాల్గవ భాగంలోని చివరి మంత్రాలలో నున్న శారీరిక బ్రాహ్మణంలో అత్మ లక్షణాలను వర్ణిస్తూ ఇట్లా వివరించింది. అదే బ్రహ్మము. 'అజరం' అనగా వయస్సుతో నిమిత్తం లేదని. 'అమరమ'ని అనగా మృత్యురహితమని, అమృతం అని, అభయమని చెప్పి ముగిస్తూ అభయమే బ్రహ్మమని నుడివింది. తన ఆత్మను బ్రహ్మముగా గుర్తించినవాడు భయరహితుడని రెట్టించింది.

అభయం - మోక్షం; భయం - సంసారం

భయం, మోక్షాలు పరస్పర విరుద్ధాలు, మోక్షమనగా విడుదలయైన దశ! విడుదల కానిది భయం. అనగా బంధం. కనుక బంధం - మోక్షం అనే జంటను వాడతాం. సంసార బంధమని వాడుక. జన్మ అంతమైతే శరీరం పోతుంది. శరీరంపోతే మోక్షమా? కాదు. మరల జన్మనెత్తుతున్నాం. ఆ మళ్లీ జన్మకూడా ఎక్కువ భయాన్ని కల్గిస్తోంది. **మహత : భయం** అని భగవానుడన్నాడు. (గీత 2.40). ఏ సందర్భంలో వాడాడు? శాస్త్రంలో చెప్పిన కర్మలను పాటిస్తూ ఫలాలనాశించకుండా నిష్కామంగా ఆచరించాలని

చెప్పే సందర్భంలో అట్లా చేస్తే పెద్దభయం నుండి రక్షిస్తుందనే సందర్భంలో వాడాడు:–

స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్

అనగా కోరికతో చేసే కర్మలు బంధిస్తాయని, నిష్కామకర్మలు బంధించవని, అవి పెద్ద భయం నుండి రక్షిస్తాయని చెప్పాడు. శంకరులు భాష్యం వ్రాస్తూ సంసార భయం నుండని వ్రాసేరు.

నరక భయం

మరల జన్మవస్తుందనే భయం వెంటాడుతోంది. ఈ భయం అనే మొలక మరణానంతరం నరకంలోకి తోసివేస్తుందనే భయానికి కారణమౌతోంది. మామూలు కర్మలే మరల జన్మఎత్తడానికి కారణ మౌతున్నాయి కదా! ఎక్కువ పాపాలు చేస్తే నరకం వస్తుందనే భయం ఇంకా పెద్దది. ఆనరక బాధలను శరీరం తట్టుకోగలదా? కనుక అట్టివాడు మరణానంతరం యాతనాశరీరం ధరించి నరకంలో బాధపడతాడు.

సంసారం కొద్ది భయాన్నిస్తే నరకం రెండింతలు భయాన్నిస్తోంది. భయం అనే మాటకు నరక భయం అని వ్రాసేరు శంకరులు.

మనస్సే బంధానికి కారణం

దేని నుండి విముక్తుడౌతున్నాడు ?

సంసారం నుండి

దేని వల్ల ఈ సంసారంలో బంధింపబడ్డాం ?

కర్మల వల్ల

కర్మలెందుకు చేస్తున్నాం ?

మనకోరికలను తీర్చుకోవడం కోసం

కోరిక పుట్టడానికి కారణమేమిటి?

మనస్సే కారణం. ఇంద్రియాల ద్వారా, అవి చేయు క్రియల ద్వారా మన కోరికలను తీర్చుకొంటున్నాం. కనుక సంసారం నుండి విడివడాలంటే మనస్సు నుండి విడివడాలని అర్థం వస్తోందికదా! అవును.

మనోరహితమైన ఆత్మ

మనస్సుపోతే మనం దేనినీ తెలిసికోలేం. అదిపోతే మోక్షానందాన్ని అనుభవించేవాడెవడు? మోక్షం అంటే కేవలం జడమైన స్థితియా? లేక గాఢనిద్రలో పొందే ఆనందం వంటిదా?

కాదు. శాశ్వతానందం. అదే బ్రహ్మానందం, ఆత్మానందం. మామూలు జీవితంలో ఆనందం కలిగినపుడు బ్రహ్మానందంగా ఉందని అంటున్నాం కదా! తైత్తిరీయంలో బ్రహ్మకోసం భృగువుతపస్సు చేసాడు. ప్రతిసారి బ్రహ్మానందమని భావించాడు. సాధన పొడిగించిన కొద్దీ చివరకు బ్రహ్మమే ఆనందమని భావించినట్లు లోగడ చెప్పాను.

అనుభవించేమనస్సు లేనపుడు ఆనందాన్ని దేనితో అనుభవిస్తాం స్వామీ అని మీరడుగవచ్చు.

ఇక్కడే ద్వైత - అద్వైతచర్చ వస్తుంది. తనకంటె భిన్నమైన దానిని మనస్సు గ్రహించగలదు. తనను తాను అది చూడలేదు. తనను తాను తెలిసికోవడంలో అది చతికిలపడుతుంది. బాహ్యమైన వాటినే తెలిసికొనగలదు. దానిని ఒక్కక్షణమైనా ఆపగలరా? ఒకమాటు శాంతం, మరొకమాటు అశాంతం. మరి ఏమిటి దీని తత్వం? తెలియదు ఇది "నేను" అనుకొని ఈ జీవుడు పనులు చేయడం, అలసట చెందినపుడు నిద్రించడం, అందేమీ తెలియక పోవడం జరుగుతోంది.

మనస్సులేనపుడు "నేను"

గాఢనిద్రలో ఏమీ తెలియడంలేదు. అట్టి స్థితిలో మనమున్నట్లే మనకు తెలియదు. తెలియనంత మాత్రంచే అసలే లేకుండా ఉన్నావా? అట్లా లేకపోతే నిద్ర నుండి ఎట్లా మేల్కొనగలుగుతున్నావు? లేచిన తరువాత పనులెట్లా చేస్తున్నావు! నిద్ర వచ్చినపుడు నీవున్నావు. దాని ముందూ ఉన్నావు. మెలకువ వచ్చినపుడూ ఉన్నావు. ఇంతకు ముందు అనుభవించినవన్నీ నీకళ్లముందు కన్పిస్తున్నాయి. అదేశరీరం ఇప్పుడు ఉంది. రక్తప్రసారం, ఒంటిలోని వేడి, శ్వాస, అన్నీ ఉన్నాయి. అన్ని దశలలో. కనుక నీ మనస్సు పని చేయకపోయినా నీవున్నావు. మనస్సు పనిచేసే మేల్కొన్నదశలోనూ ఉన్నావు.

నిజమైన "నేను"

అన్ని ఆలోచనలూ మనస్సుపై ఆధారపడియున్నాయి. ఇవి లేకపోతే జీవుణ్ణి జడుడని పిలుస్తాం. అందువల్ల మనస్సే నేనని భావిస్తాం. మనస్సు లేనపుడు ఏదో మనలను నిలుపుతోంది. అదే అసలైన నేను, శరీరం నుండి ప్రాణం పోయినపుడు శరీరంలో ఆలోచనలుండవు. శవానికి మనస్సుంటుందా? ప్రాణశక్తి పోయిందంటున్నాం. అది పూర్తిగా పోయిందా? అదే జీవనం. శరీరం పోవచ్చు. అది పూర్తిగా కనుమరుగౌతోందా? కర్మఫలాలను అనుభవించడం కోసం జీవుడు మరొక శరీరాన్ని ఆశ్రయించినపుడు ఈ ప్రాణశక్తి పనిచేయడం మొదలు పెడుతోంది. అంటే ఒక శరీరాన్ని విడిచి మరొక శరీరంలో ఈ ప్రాణశక్తి ప్రవేశిస్తోంది. అట్లాగే మనస్సు కూడా. అనగా ప్రాణశక్తి మనస్సుతో జత కట్టి మళ్లీనాటకాన్ని మొదలు పెడుతోంది.

గాఢనిద్రలో మనస్సు పనిచేయకపోయినా ప్రాణం ఉంది కదా! ప్రాణరహితమైన శరీరంలో మనస్సుండదు. కనుక ప్రాణశక్తి వల్లనే మనస్సు,

శరీరం పనిచేస్తాయని, తమంతట తాము పనిచేయవని తేలింది. ప్రాణశక్తి మరొక శరీరంలో ప్రవేశించినపుడు మాత్రమే మనస్సు పనిచేస్తోంది కనుక మనస్సు ప్రాణశక్తిపై ఆధారపడింది.

మనస్సు లేకుండా ఎఱుక

మనస్సుతో సంబంధంలేకుండగా కేవలం ఏకాంతస్థితియే అద్వైతమోక్షం, జడస్థితికాదు.

గాఢనిద్రలో జడంగా పడుకొని ఉంటున్నాం కదా! మనస్సుతో అపుడు సంబంధం లేదు కదా!

నిజమే మనస్సుతో అపుడు సంబంధం లేదంటే ముఖ్యప్రాణం నుండి తాత్కాలికంగా అది విడిపోయింది. అపుడు మనస్సు జడమైంది. అయినా శరీరంలో ప్రాణం ఉంది. అందువల్లనే రక్తప్రసారాదులు సాగుతున్నాయి. భగవానుని మాయవల్ల మానసిక భావాలను మాత్రమే గుర్తిస్తున్నాం. మానసిక పరిధిలోనున్న వాటిని మనకు చెందినవని భావిస్తున్నాం. ఏ మనస్సు సాయంతో భావిస్తున్నామో అది అణిగినపుడు ఎట్లా జీవనం ఉంటోందని ఊహించలేకపోతున్నాం. మనం కళ్ళుమూసినపుడు ఎట్లా బాహ్య జగత్తు కనబడదో మనస్సును బంధించినపుడు ఆలోచనశక్తియే ఉండదుకదా! అయితే కళ్ళుమూసికొన్నంత మాత్రంచే ప్రపంచమే పోతుందా? గడియారం పనిచేయనపుడు కాలం అంతాస్తంభించిందా?

అట్లాగే మనస్సుతో సంబంధంలేని ప్రాణశక్తికూడా అనుభవించగలదు. అట్టి అనుభవమే సత్యము, శాశ్వత చైతన్యం లోగడ చెప్పిన చైతన్యము, జ్ఞానమూ ఇదే. దానికి జ్ఞానం ఉందని చెప్పకూడదు. అదే జ్ఞానము, చైతన్యము, చిత్ స్వరూపం, చిన్మాత్రం. అంగ్లంలో మనస్సును సూచించినపుడు 'c' అని చిన్న అక్షరాలలో, ప్రాణశక్తిని సూచించినపుడు 'C'

అని పెద్ద అక్షరాలలో చూపిస్తారు **Consciousness.**

ఆ పెద్దనేను చైతన్యం, చిన్న నేను మనస్సు. పెద్దనేను, మనస్సులేకుండా ఉంటుంది. ఆపెద్దనేను లేకపోతే గాఢనిద్రలో మనం లేకుండా పోతాం.

ఆత్మను తెలిసికొనుట - మనస్సుతో జీవించుట

కనుక మనలో ముఖ్యమైన నేను ఉంది. అది ఎట్లా శుద్ధజ్ఞాన స్వరూపమో, ఆనంద స్వరూపమో తెలియడం లేదు. కారణం? మాయనుండి వచ్చిన మనస్సనే తెర అడ్డంగా ఉండడం వల్లనే! ఈమాయ, జీవునికి మానసిక అనుభవాలను మాత్రమే అందిస్తోంది.

ఆముఖ్యమైన నేనును తెలిసికోవాలంటే తపశ్చర్య, ఆత్మవిచారణ, భక్తివల్లనే మాయ అనే తెరతొలగి మనస్సులీనమై పోయినపుడు మాత్రమే అనుభవంలోకి వస్తుంది. మనస్సులేక పోవడం వల్ల గాఢనిద్రలో ఏ ఆనందం అనుభవించామో అది జ్ఞానోదయమైనపుడు అట్టి దివ్యానందాన్ని అనుభవించగలం. అట్లా తెలిసికొనుటయే ఆనందం. మనం అదే కాగలం.

ఇప్పుడు తనను తాము గురించి తెలియని మనస్సుతో సంబంధం కల్గియున్నాం. ఆత్మానుభవంకలిగినపుడు నిజరూపం తెలిసికొని తనకంటె మరొకటి లేదనే ఎఱుక కల్గుతుంది. ఇట్టి ఎఱుక తాను కళ్లు మూసికొనినపుడు ఇతరులకు కనబడి తనకు కనబడని ప్రపంచం లేదని చెప్పడంవంటిది కాదు. జీవుని మనస్సు, అది పనిచేసే తీరు, జగత్తు, ఇవన్నీ మాయకల్గించే భ్రాంతులని, ఆ మాయ కూడా లోనున్న ఆత్మనే, ఆధారం చేసికొని నాటకం ఆడుతోందని తెలుస్తుంది.

భ్రాంతులు సత్యమౌతాయా?

ఒకవేషం వేసి మరొకనిలా మనలను చూపిస్తున్నపుడు ఆవేషం మనం కాదుకదా! వట్టి వేషమేకదా! ఆ వేషం దేనిపైవేస్తున్నాం? దానికి ఆధారం

మన శరీరమే కదా! ఇట్లా ఒక దానిపై మరొక దానిని ఆరోపించడాన్ని అధ్యాసమని శంకరులన్నారు దానికి ఆధారాన్ని అధిష్ఠానమన్నారు. కనుక జగత్తు, మనస్సు ఆత్మపై అధారపడ్డాయి. అధిష్ఠానం లేకపోతే అధ్యాసలేదు. వేషం వేయబడేవాడొకడు, వేషం వేరు. వేషంలో భాగం కాదతడు. వేషం తొలగిస్తే వేషంలో ఉన్నకథ తొలగిపోతుంది. వేషం తొలగిపోతుంది. వేషం తొలగించినా అసలు వ్యక్తి ఎప్పుడూ ఉంటాడు. వేషం తీసివేసినపుడు వేషం వేసికొన్న వ్యక్తిని తొలగించడం లేదుకదా!

కనుక జీవులు, జగత్తు ఆత్మపై ఆధారపడి వేషంలా ఉండి కొంత కాలం ఉంటున్నారు. అన్ని భూతాల ఉనికి నానుండే, వాటిల్లో నేనుండడం లేదని గీత సందేశం:

మత్ స్థాని సర్వ భూతాని నచాహం తేషు అవస్థితః

నేనుండడం లేదంటే జీవునిలో జగత్తులో ఆత్మలేదు. జీవునిలో ఆత్మ లేదంటే అనగా జీవుడు తనసహజరూపమైన ఆత్మను మాయ వల్ల విడిచి విడిగానున్నట్లు, జీవత్వంలో ఉన్నట్లు అర్థం వస్తుంది. ఇట్టివ్యక్తిత్వము సత్యం కాదు. కల్పన అంటే నిజము కాదని అర్థం. ఆత్మనెరుగని వ్యక్తి దేనితో ఉంటున్నాడు? మనస్సుతో అని అర్థం చెప్పాలి. ప్రస్తుతం వెదుకగా వెదుకగా మనస్సును మించి జీవత్వం ఉందని తేలింది. ఇది నిత్యజీవితంలో ఉపకరించడంలేదు, మనస్సునే నేనని అనుకొంటున్నాం.

జీవనం అంటే ఏమనుకొంటున్నాం? తినడం, తిరగడం, వృత్తి మొదలైనవి జీవనంగా చెలామణి అవుతున్నాయి. ఇవన్నీ మనస్సులో పుట్టాయి. ఆమనస్సే ఇంద్రియాలను పనులు చేయించునట్లు చేస్తోంది. అనగా మనస్సును కేంద్రంగా చేసికొని విడిగానున్న వ్యక్తి జీవనాన్ని సాగిస్తున్నాడు. పై భావాలు క్రియలవల్ల ఏర్పడిన జీవనానికి ఆత్మకు సంబంధంలేదు. ఆత్మ నిష్క్రియం. భావాతీతం. అయితే సారాంశం ఏమిటి? జీవనం, జీవితం

మనస్సుపై ఆధారపడ్డాయి. జీవునిలో జగత్తులో ఆత్మలేదని భగవానుడు చెప్పడాన్ని బట్టి మనస్సులో లేదని అర్థం.

మనస్సు - ఆత్మకంటె భిన్నం

ఆత్మ, మనస్సులో లేదంటే ఆత్మ, మనస్సు విడివిడిగానున్నట్లే కదా! మనస్సు రెండవది. అనగా ద్వితీయం. ఆత్మకంటె భిన్నం.

మరి ఆత్మకంటె భిన్నమైనది ఏదీ లేదని ముందుచెప్పారు కదా!

ఇంతకుముందు చెప్పినదే చెబుతున్నా ఒకడు వేషం వేసికొని మరొకనిలా కనబడ్డాడు. అసలు వ్యక్తి, ఈ వేషంలోన్ను వ్యక్తి ఒక్కడేనా? ఇద్దరు వ్యక్తులా? ఒక్కడే భిన్నంగా ప్రస్తుతం కన్పిస్తున్నాడు. ఒక రామస్వామి రాజు వేషం వేసాడు. ఆ ఒకడు లేకపోతే ఈ వేషం కట్టడం ఉండదు. ఈ వేషం అసలు వానిపైనే ఉంది. వేషం విడిగా ఉండదు. అట్లా చెప్పడం అద్వైతం. అయితే ఆ రామస్వామి నిజమైన రాజా? కాదు. అసలు రాజు భార్య, పిల్లలు ఇతనితో సంబంధం పెట్టుకొంటారా? లేదు. రాజువేషంలో ఎన్నో హావభావాలు ప్రదర్శిస్తాడు. ఇవన్నీ రామస్వామికి చెందుతాయా? రామస్వామికి రాజు యొక్క లాభనష్టాలతో పనియుందా? రామస్వామి, వేసుకొన్నవేషం తీసివేస్తే అతనిలో ఏమార్పు ఉండదు. రామస్వామి, రామస్వామియే కనుక వేషం వేసికోవడం ద్వితీయం. ఆ విధంగా మనస్సు ఆత్మ విడివిడిగా ఉంటాయి.

రజ్జుసర్ప భ్రాంతి తెలిసిందే. చీకటిలో త్రాడు, పాముగా కనబడింది. అట్లాగే మాయవల్ల ఆత్మ జీవునిలా కనబడింది. అట్లే మనస్సుగా కనబడింది. ఆమనస్సునే జీవుడు నేనని అనుకొంటున్నాడు. అసలు త్రాడంటూ లేకపోతే పాముందనే తలంపురాదుకదా! పాము త్రాటిపై ఆరోపింపబడింది. త్రాడు, నిజంగా పామా? కాదు. త్రాడును త్రాడుగా చూస్తే పాముగా కనబడడం అంటూ ఉండదు. పామని అనుకొనడం వల్ల భయం పుట్టింది. త్రాడు,

తనంత తాను ఇట్లా భయపెడుతోందా? పాము దానిపై ఆరోపింపబడి త్రాటి బరువేమైనా మారిందా? దీపం తీసికొనివస్తే త్రాడే అని పాము కాదని తేలింది. అట్లే జ్ఞానం వల్ల మనస్సు అదృశ్యమై ఆత్మయే మిగిలింది. పాము లేనపుడు త్రాటి బరువు తగ్గనూలేదు. *(లోగడ పూలమాల గురించి ఇట్లాగే స్వామి వివరించారు.)*

మరొకటి చేరుస్తాను. మనస్సు తనకంటె భిన్నమైన దానిని చూపించడమేకాదు, మనస్సు ఆత్మయైపోక ఆత్మకుభిన్నంగా ఉన్నట్లు కన్పిస్తోంది. ఇట్టి స్థితిని కల్పన, వేషం, అధ్యాసం, అధ్యారోపం - ఇట్లా ఏదో ఒకటనండి మనస్సును కేంద్రంగా చేసికొని మనము చేయుపనులున్నంత వరకూ, మనస్సునేనని భావించునంతవరకూ ఆత్మనుండి వేరుగానే ఉంటుంది.

ప్రస్తుతం ఆధ్యాతిక విషయం గురించి మాట్లాడుకొంటున్నాం కదా! ఇప్పుడు భూమి కంపించినా భయపడతాం. భూకంపం గురించి మాట్లాడినా భయపడతాం ఇది మనస్సు యొక్క స్వభావం.

మనస్సు తనకంటె భిన్నమైన దానిని ఎట్లాగూ చూపిస్తుంది. ఆత్మకంటె మనస్సు భిన్నమని భావించడమే అన్ని భయాలకు మూలకారణం. ఆత్మనుండి విడివడిన మనస్సే మొదటి ద్వైతం. ఇదే మొదటి భయం. దీనిననుసరించి సంసార భయం, నరక భయం మొదలైనవి అనేకం వస్తాయి. ఇవన్నీ భిన్న భిన్న భావనలవల్లనే.

తనను తాను తెలిసికొనుటచే అభయమోక్షం

మనస్సు విడివడడమే సరియైన మోక్షం. ఆత్మయే మోక్షానికి నిలయం, ఆనందమయం, అభయం, అద్వైతం. మనస్సునుండి విడివడి ఆత్మగానే ఉండిపోతుంది. జీవాత్మ మనస్సు యొక్క ఆకారమని భావిస్తాం. జీవుని

ఆంతరస్థితి ఆత్మయేకదా! జీవాత్మ అనే వేషం వేయబడింది. ఇపుడు ఆత్మగా నెరుగుట, నిలకడగా అందే నిలబడుట అనేది జడస్థితికాదు. ఆస్థితిలో అఖండానందమే, అఖండజ్ఞానమే. మనస్సు తనకంటె భిన్నమైనదానిని చూచినట్లు భావించినట్లుగా కాకుండా, ఆత్మతనను తాను తెలిసికొని ఆనందంతో కూడియుంటుంది. అట్టి జ్ఞానం లేనపుడు మామూలుగా సుఖదుఃఖాలుంటాయి. కాని ఆత్మ జ్ఞానంలో అంతా ఆనందమే.

మనస్సుతో కలిసి జీవునిగానుండుట బంధస్థితి. ఈ బంధం మనస్సుయొక్క ఆలోచనల వల్లనే రాలేదు. కోరికల వెంటబడు ఇంద్రియాల వల్లకూడా బంధమేర్పడింది. దీనిని వదులు చేయాలంటే ధర్మకర్మలను ఆచరించవలసిందే.

కర్మబంధాన్ని వదులు చేసే ధర్మం

కట్టెల మోపు – దానిని ఒక త్రాటితో కట్టుట – మరల మరొక త్రాటితో గట్టిగా కట్టినపుడు మొదటి త్రాడు, వదులగుట అనే ఉపమానాన్ని లోగడ చెప్పాను కదా! ఆ రెండవ బంధంవంటి ధర్మకర్మలు మనలను బంధించినా చెడ్డ పనులు చేయకుండా మనలను కాపాడుతుంది.

రుచిని కోరే నాల్క కోసం అవీ ఇవీ తింటాం. దాని వల్ల రోగాలు వచ్చినపుడు, చేదుమందులు వాడి ఆహారంలో నియమాలను పాటిస్తున్నాం. అయినా వైద్యుణ్ణి సంప్రదిస్తాం. మరల పూర్వ ఆరోగ్యం కోసం నియమాలను పాటిస్తాం కదా! ఆమందులు, పథ్యం వంటివే సత్కర్మలు.

ప్రేయస్సు - శ్రేయస్సు

మన కోరికలు తీర్చేవి కొన్ని, మనకు క్షేమాన్ని కలిగించేవి కొన్ని కర్మలుంటాయి. వాటినే వరుసగా ఉపనిషత్తులు ప్రేయస్సని, శ్రేయస్సని

అన్నాయి. దేనిని మనం ఇష్టపడతామో దానిని ప్రేమిస్తాం. అందువల్ల అది ప్రేయస్సు. ఈమాట వాడుకలో లేదు. ఆశీర్వదించే సమయంలో సకల శ్రేయస్సులు సమకూరుగాక అని అంటారు. అంటే నిజమైన భాగ్యం కలగాలని ఆశీర్వదిస్తారు. ప్రియం నుండి ప్రేయస్సు. శ్రియం నుండి శ్రేయస్సు శ్రీ అంటే లక్ష్మియని, ధనదేవతయని అందరికీ తెలుసు ఏది ఆత్మకు సరియైన భాగ్యాన్ని ప్రసాదిస్తుందో అదే నిజమైన సంపద అదే నిత్యశ్రీ.

కొన్ని శబ్దాలు వినడంతోనే మంగలాన్ని కల్గించేవిగా ఉంటాయి. కాళిదాసు రామనామాన్ని జగత్ ప్రథమ మంగలం అన్నాడు. రామనామం మొదటి మంగలమట. రా–మ అనే అక్షరాలే శ్రేయస్సు. దాని నాదమే శుభకరం. దక్షుడు శివ అనే పేరు వినడాన్ని ద్వేషించేవాడు. పవిత్రమైన మంగలకరమైన శివపదాన్ని ద్వేషిస్తున్నావు, నీవు శివేతరుడవని అశివుడవని అమ్మవారు తండ్రితో చెప్పింది.

శ్రేయస్సుపై దృష్టిపెట్టం. ప్రేయస్సే మనకిష్టం. బాధలను తెచ్చుకొంటాం. ఈ దశలో మనకు విరుగుడు కావాలి. అనగా ఒక చేదుమందు. ఇష్టమైన వాటిని రోగాలు వచ్చేవరకూ మెక్కుతూ ఉంటాం. మన కోరిక, రోగాలకు దారితీస్తుంది. చేదు మందులు వాడడానికి ముందిష్టపడకపోయినా వాడి రోగ విముక్తులమౌతున్నాం. ఇప్పటి నుండి ఆరోగ్యం పట్ల అధికశ్రద్ధ చూపుతాం. ఇష్టమున్నా లేకపోయినా ఈనియమాలను పాటించవలసిందే.

కర్మరోగానికి ధర్మౌషధం

విచ్చల విడిగా చేసిన కర్మల వల్ల వచ్చిన బంధాలను వదులు చేయాలంటే ధర్మశాస్త్రమనే గట్టికట్టును అనగా లోగడచెప్పిన రెండవ కట్టు కట్టవలసిందే. మనస్సు పరిపక్వమైన కొద్దీ ఈ రెండవ కట్టూ సడలిపోతుంది. అయితే ఆత్మజ్ఞానం త్రాళ్లతో బంధింపబడేది కాదు. అపుడు వర్ణా శ్రమ ధర్మాలుండవు.

అపుడతడు అతివర్ణా శ్రమి అని పిలువబడతాడు. *(ఉదా:- రమణమహర్షి)*

రోగం - మందు పోలిక కొంతవరకు నప్పుతుంది. కేవలం మందువేసికొంటే రోగం కుదరవచ్చు. కాని కర్మ అనే రోగం చాలాకాలం నుండి ఉన్నరోగం. దీనికి చాలా కాలం మందువాడాలి. రక్తపుపోటు, మధుమేహం వంటి రోగాలకు జీవితకాలం మందులు వాడాలి కదా! అట్లే కర్మరోగానికి ధర్మం అనే మందు దీర్ఘకాలం వాడాలి. శాస్త్రీయకర్మలను కొన్నాళ్లు చేసి మానకూడదు.

చేదు మందును తినడానికి అలవాటు పడితే పెద్ద ఇబ్బంది ఉండదు. కాని శాస్త్రకర్మలు అట్టివి కావు. మనం ఆచరిస్తున్న కొద్దీ వాటి పట్ల ఒకరుచి ఏర్పడుతుంది. మనంతటమనం చేయాలని బుద్ధిపుడుతుంది. ఈనాడు కూడా కొన్ని వ్యసనాలకు లోబడి వాటిని విసర్జించిన వారు కర్మలను చేయడం మొదలుపెడితే శ్రద్ధగా చేస్తూ ఉంటారు. అది వాటి గొప్పదనం. అట్టివారికి చేదుమందు, తియ్యని కూష్మాండ లేహ్యంలా ఉంటుంది. పిత్తదోషం కలవారికి, పాముకాటుతో బాధపడేవారికి తీపి వస్తువులు చేదుగా నున్నట్లు ముందు శాస్త్రీయకర్మలు మనస్సు యొక్క దోషంవల్ల వెగటుగానే ఉంటాయి. పాము విషం ఎక్కిన వారికి చేదు వస్తువులు తియ్యగానున్నట్లు కన్పిస్తాయి కదా! అట్లాగే భౌతిక సుఖాలనే విషం ఎక్కినవారికి దుష్టకర్మలనే విషం తియ్యగానే ఉంటుంది. మనిషి మారాలని భావించినపుడు శాస్త్రకర్మలనే మందు రుచికరంగానే ఉంటుంది. కనుక ఈ సంసారరోగం పోవాలంటే దీర్ఘకాలం, శాస్త్రీయ కర్మలనే మందు సేవించవలసిందే. రానురాను అది తీపిగా ఉంటుంది కూడా.

ధార్మిక కర్మలు మోక్షానికి ప్రత్యక్ష కారణం కావు

ఒక విషయం స్పష్టంగా చెప్పదలుచుకొన్నా స్వధర్మకర్మ ఒక్కటే మనస్సునే

శృంఖలాల నుండి ఆత్మను విడదీయలేదు. అట్లాగే నిష్కామకర్మ కూడా.

మోక్షం అంటే మనస్సు లేకపోవడమే కదా! ఆ స్థితిలో ఆలోచనలే పనికిరావు. ఆలోచనలు ఎప్పుడైతే లేవో కర్మలూ ఉండవు. కనుక కర్మలు తిన్నగా మోక్షానికి దారి తీయవు.

మానసిక తృప్తి కోసం ధర్మ కర్మ ఒక్కటే సరిపోదు

మనిషిని బంధించేవి కర్మలు. ఆపైన అతని ఆలోచనలను బంధిస్తాయి. ఇక కర్మయోగం, ఒక మోపుకు కట్టిన త్రాటిని వదులు చేసేది. ఫలాన్ని ఆశించకుండా చేసేది మన ఆలోచనా విధానం అనే యోగంపై ఆధారపడింది. అంతవరకు మనస్సునిది శుద్ధి చేస్తుంది. ఈ శుద్ధి ఎట్టిదంటే ఉన్న అపవిత్రతను మాత్రమే పోగొడుతుంది కాని ఈమనస్సును సుందరతరంగా మాత్రం తీర్చిదిద్దదు. ముందు ఇంటిని గోమయంతో శుద్ధిచేస్తాం. తరువాత రకరకాల అలంకరణ వస్తువులను ఉంచుతాం. అగరు ధూపాలు వేస్తాం. అందువల్ల నిష్కామకర్మవల్ల ముందు శుద్ధి పొందుతుంది. అంతటితో ఆగిపోకూడదు. సత్ సంకల్పాలతో దీనిని నింపగలగాలి ఇట్లా తీర్చిదిద్దడం కర్మలవల్ల కాదు.

చిట్టచివర దశలో మనస్సును పూర్తిగా గెంటివేసినపుడు మాత్రమే ఆత్మానుభవం కల్గుతుందికదా! అట్టిది కేవలం మనస్సును శుద్ధి చేసినంత మాత్రంచే కాదు. స్వధర్మకర్మ వల్ల దుష్టకర్మలు తొలగబడతాయి. అనేక జన్మలనుండి వచ్చిన దుష్టసంస్కారాలు లేదా వాసనలు కూడా సద్భావాల వల్ల తొలగబడతాయి. దుర్భావాలను తొలగించే సద్భావాలు కర్మ వల్లనే ఏర్పడవు. అది బలవంతంగా కాయనుకోసి ముగ్గవేయడం వంటిది. మనస్సును సద్భావాలతో నింపకుండా గాలికి వదిలేస్తే అట్లా అపరిపక్వ స్థితికి దారి తీస్తుంది. అది సహజంగా సాగాలి. ఒక మొలక, దాని నుండి

పుష్పు - దాని నుండి కాయ, దాని నుండి పండు మాదరిగా ఉండాలి.

జీవుడు తన కోరికలను నెరవేర్చుకోవడం కోసం తన మనస్సును, ఇంద్రియాలను వాడి కర్మలను చేయడం వల్ల వచ్చే ఫలాలను తొలగించడం కోసం కర్మయోగం లేదా కర్మనుష్ఠానం తోడ్పడుతుంది. చెడ్డభావాలను ఆపడంలో గాని, వాటిని సరిదిద్దడంలో గాని సత్కర్మలు తిన్నగా ఉపయోగించవు. వాటంతట వాటికి బలం లేదు. అట్లా ఉండడం వాటి స్వభావం కర్మ, మరొకకర్మతోనే కలిసియుంటుంది. ఫలాలనొసగే కర్మలను సరిదిద్దాలంటే శాస్త్రీయమైన కర్మల ద్వారానే! మానసిక భావాలను సరిదిద్దాలంటే కర్మల వల్ల ఎట్లా సాధ్యమౌతుంది?

ప్రేమ - భక్తి

చెడ్డ కర్మలు పోవాలంటే మంచి కర్మలను చేసినట్లే చెడ్డ భావాలు పోవాలంటే మంచి భావాలు కల్గియుండవలసిందే. అక్కడే ప్రేమ యొక్క అవసరం ఏర్పడుతుంది. మంచి భావాలలో ప్రేమ సర్వోత్కృష్టమైనది. ఆ ప్రేమ సమస్తప్రాణుల పట్ల చూపగలగాలి. పరమాత్మ పట్ల భక్తిని చూపిస్తాం కదా! ఆ పరమాత్మ సమస్త ప్రాణులకు ఆధారం కదా! అతడు వేరువంటివాడు. మొలకలవంటివారు జీవులు. ఈ మొలకలపైనే ప్రేమను చూపించడం కాకుండా తల్లివేరైన భగవంతునిపై భక్తిని చూపించగలగాలి. అపుడు మనస్సునుండి పుట్టిన చెడ్డ భావాలు మటుమాయమైపోతాయి. కనుక భక్తియే తొలగించగలదు.

మనస్సు వెనకాల ఉంటూ శరీరంతోచేసే కర్మబంధాలను సత్కార్మాలు తొలగించగలవు. మానసికంగా చేసే పాపాలను భక్తి తొలగించగలదు. భక్తియనగా భావగతి. అది మనస్సువల్లనే జరుగుతుంది. సత్కర్మలు మొదట కట్టిన త్రాటిని ఎట్లా వదులు చేస్తుందో అట్లాగే ఇది కూడా పాత భావగతిని

తొలగించివేయగలదు. భక్తిని అభ్యసించినకొలదీ పరిపక్వస్థితికి వచ్చిన కొలదీ విడిగా తానున్నానని, విడిగా తనకొక మనస్సుందని భక్తుడు భావించకుండా ఉండుగాక! అట్టి జీవుణ్ణి మనస్సునుండి విముక్తుణ్ణి చేసి బంధాలను సడలిస్తాడు. తనలో లీనం చేసికొంటాడు.

చంచలమైన మనస్సును దువ్వడం మాటలా? అందు ప్రేమను నింపడమూ తేలిక కాదు అందుకే ముందు శాస్త్రకర్మలను విధించారు.

సత్కర్మకు వెనుక సద్భావాలు

పనియైన తరువాత కర్మ ముగియదు. మంచి చెడు సంస్కారాలు మనస్సులో పుడతాయి. అందువల్లనే మానసిక భావాలు లేకుండా వట్టి యంత్రంగా మనం ఏ పనులు చేయం. కర్మఫలాలు పైకి కన్పిస్తున్నా దాని వెనుక భావగతి తప్పక యుంటుంది. సాధారణంగా చెప్పాలంటే కోరికలవల్ల మనస్సు చెప్పినట్లు చేసిన కర్మలకు మూలం భావాలే. శాస్త్రీయ కర్మలు రెండు భావాల గతులపై ఆధారపడ్డాయి. జన్మ జన్మలనుండి వచ్చే కర్మ పరంపరను కడిగివేసి జ్ఞానాన్ని సముపార్జించాలని చేసేవి కొన్ని. ఒక క్రమపద్ధతిలో సమష్టి శ్రేయస్సుకై సాగాలని ఒక ప్రేమ భావంతో కూడినవి కొన్ని. సంఘం నిర్వహించే పనులలో పరస్పరం సంఘర్షణ లేకుండుగాక!

సత్కర్మతో మనస్సును విభజించుట

ఒకే ఒక పనిచేస్తున్నా దానికి అనుబంధంగా కొన్ని పనులు చేస్తూ ఉంటాం. ఉదా:- పూజ చేసేటపుడు దానికి సంబంధించిన అనేక భావాలు పుడతాయి. ఇపుడు తులసి, ఇపుడు బిల్వం, ఇపుడు దీపం అంటూ ఒక క్రమపద్ధతిలో సాగుతుంది. దీని వెనుక ఉన్నది భక్తి భావనయే దానికి అంగములుగా వివిధ క్రియాకలాపాలుంటాయి. అట్లాగే ప్రతిపనికి దానికి

అనుగుణమైన పనులను చేస్తూ ఉంటాం. అంటే మనం చేసేపనికి భిన్నమైన పనులలో మనస్సు లగ్నం కాకుండా ఒక విషయానికి సంబంధించిన వాటినే చేస్తూ ఉంటాం. లేకపోతే మనస్సు చెల్లాచెదరైపోతుంది. ఇట్లా అంగములతో కూడిన ఒకే పని చేయగలిగినపుడు మనస్సు నియమింపబడుతుంది. అది పూర్తి మనోనిగ్రహం కాకపోవచ్చు. కొంత వరకు కృతకృత్యులం కాగలం.

ఏ పని చేయకుండా ఉంటే మనస్సును నియమించడం కష్టం. పరి పరి విధాల పరుగెత్తుతూ ఉంటుంది. ఏ కర్మకాండ చేయకుండా ఈశ్వరునిపై ధ్యానం చేద్దామని కూర్చున్నామనుకోండి. నిలవగలమా? కాని పూజచేసేటపుడు దానికి సంబంధించిన పనులు చేస్తూ ఉంటే మరొక భిన్నమైన పనిమీద లగ్నం కాకుండా కొంతసేపైనా ఉండగల్గుతోంది. అపుడు కూడా మనస్సు అటూ ఇటూ పరుగెత్తినా కొంత అదుపులో ఉంటుంది కదా!

ఈ పద్ధతి ఒక్క పూజలోనే కాదు. ఎవడే పనిని ఏకాగ్రంగా చేసినా మిగితా వాటిని పట్టించుకోడు. ఇష్టమైన ఆటలాడే పిల్లవానిని, తల్లి తినుబండారాలను పెడతానని అన్నా పట్టించుకోడు కదా!

అయితే శాస్త్ర కర్మల గొప్పదనమేమిటి? శాస్త్రీయమైన మంచిపనులు చేయడానికి, మంచి భావాలను కల్గించడానికీ దోహదం చేస్తాయి. దుర్భావాలనుండి మనిషిని దూరం చేస్తాయి.

ఒక పనిని తీవ్రంగా చేస్తూ ఉండగా మనస్సు ముందున్నట్లు కనబడకుండా అనగా రెండవదైనట్లు ముఖ్యంకానట్లుగా ఉంటుంది. ఇక సత్కర్మల వల్ల మనస్సులాభపడుతుంది. సత్కర్మలు చేస్తూ ఉంటే సద్భావాలు క్రమక్రమంగా నాటుకొంటాయి. ఒక వేళ సద్భావాలు గట్టిగా నాటుకోకపోయినా కనీసం దుర్భావాల నుండైనా దూరంగా ఉంటాడు కదా! ఆ మాత్రంచాలు.

క్రియ - ధ్యానము

దేవాలయాన్ని శుభ్రంచేసే పనిని భావించండి. ఆ పనిని భక్తితో కృతజ్ఞతా భావంతో చేసి చూడండి. అన్నిటా ఉన్న పరమేశ్వరుణ్ణి మనం చూడలేమని ఈ మూర్తిలో అవతరించాడని దానిని శుభ్రం చేస్తే మనహృదయాలలోని చెత్త తొలగించిన వాళ్ళమౌతాము. మనతో బాటు నల్గురూ తలో చేయివేస్తే అందరి మనస్సులలోని చెత్త దూరమౌతోంది కదా! పరస్పర సహకారం, ద్వేషరాహిత్యం ఏర్పడుతున్నాయి. అయితే సత్ చింతన చాలా కాలం ఉంటోందా? కేవలం కర్మలు చేయడం వల్ల ఏకాగ్రత సిద్ధించదు. దానిని అంగీకరించాలి. కాని ఏకాగ్రతకు కర్మలు దోహదం చేస్తాయి. పూర్తి ఏకాగ్రత లభించకపోవచ్చు. కర్మకు సద్భావన తోడ్పడితే సత్ఫలితాన్ని అందిస్తుంది.

అయితే చిత్తాన్ని ఏకాగ్రం చేయవలసివస్తే కర్మను, భక్తితో, కృతజ్ఞతతో చేయాలంటారా? కర్మలు లేకుండా ఏకాగ్రతతో ధ్యానం కుదరదా అని ప్రశ్నించవచ్చు.

అయితే చేసి చూడండి చూద్దాం. ఇప్పుడు నామాట విని ధ్యానం చేస్తున్నారు కదూ! మధ్యలో ధ్యానం చేస్తున్నారా అని అడిగాననుకోండి నేనిట్లా ప్రశ్న వేయడం వల్ల మీకు ఆటంకం కల్గుతోందా? అబ్బే, లేదండి, మా మనస్సు దానంతటదే చెల్లాచెదరైపోతోందని అంటారు. మొట్టమొదట సత్ చింతన కలిగి మీకు శాంతి ఏర్పడుతోంది కదా! అపుడు మీరేమనుకొంటారు? కర్మకంటె భక్తి, ధ్యానమే గొప్పదని భావిస్తారు. ఇంకా మీరేమనుకొంటారు? ఒకమూల స్వామి, అద్వైతం గురించి చెబుతూ ఈకర్మలను పట్టుకొని వేళ్ళాడమంటారేమిటనే ప్రశ్న మీలో ఉదయిస్తుంది. శంకరులు, కృష్ణుడూ కూడా కర్మలు చేయాలని అంటారేమిటని శంకిస్తారు. ఇంకా మనస్సు చెల్లా చెదరై రాజకీయాలు, ఎవరికి ఓటు వేయాలి? నిలబడిన వ్యక్తి మన కిష్టం లేకపోతే అతణ్ణి నిందించడం మొదలైనవి ఆరంభమౌతాయి.

ఇట్లా మానసికంగానే సాగుతుంది. అపుడేమనుకొంటారు? ఆలయం శుభ్రం చేయడానికి వచ్చి దాని కంటె ధ్యానం గొప్పదని కూర్చొన్నా, అయినా ఇంకా ఎక్కువ చెత్తను పనికిమాలిన ఆలోచనలు చేసి ప్రోగుచేసికొంటున్నానని పశ్చాత్తపబడి ఈ ధ్యానం కంటె ఆలయాన్ని శుభ్రం చేయడమే మంచిదని నిర్ణయానికి వస్తారు కదా! అంటె ఈ కర్మలేంచేసాయి? సత్ చింతన లేకపోయినా దుర్భావాలు మనస్సులో రాకుండా ఉండడానికి ఇవి పనికివస్తున్నాయి కదా!

ఆలయం శుభ్రం చేసేటపుడు అనుబంధంగా ఎన్నోపనులు చేస్తున్నాం. నీరుతోడుట, పాత్రలను సిద్ధం చేయుట, మురుగు కాల్వలను బాగుచేయుట మొదలగునవి ఎన్నో ఈ అన్ని పనులు సత్ చింతనకు కొంతవరకూ ఆటంకం కల్గించవచ్చు. మనస్సు పరిపక్వతకు వచ్చేవరకూ ఇట్టి పనులు చేస్తూ ఉండడంవల్ల కొంతకాలానికి పరిపక్వతవస్తుంది. కనుక వట్టి ధ్యానమే లక్ష్యంగా పెట్టుకోకుండా ఇట్టి సత్కర్మలకు ముందు చేయాలి. ఇట్టి పనులు దుర్భావాలను గెంటివేస్తాయి. ఇదీ వీటి ప్రధాన ప్రయోజనం.

అంత మాత్రంచే ధ్యానం పనికిరాదని చెప్పడం లేదు. ఏకాగ్రత, ధ్యానం వెంటనే సిద్ధిస్తాయా? ముందు పరిపక్వం కాని మనస్సుతో పనులు చేయాలి. చేయగా చేయగా పరిపక్వత తనంతట తానేవస్తుంది.

ఒక బలహీనమైన మనిషి యోగాభ్యాసం వల్ల బలవంతుడౌతాడు. అతనికి యోగప్రక్రియలు కష్టమనిపించవచ్చు. అంతమాత్రంచే యోగవ్యాయమం చేయనంటే ఎలా? అభ్యాసం చేసినకొద్దీ లక్ష్యాన్ని చేరుకోడా? అట్లాగే ఆత్మ, అద్వైతం గురించి మీతో చెప్పినపుడు మీరు కొద్ది కొద్దిగా ప్రయత్నంచేస్తారు. సత్కర్మలు చేసి మనస్సును శుద్ధిచేసికోండని చెబుతున్నా. చిత్త శుద్ధి తరువాత ఏర్పడుతుంది. తరువాత ధ్యానానికి వీలు పడుతుంది. చిట్టచివరకు ధ్యానం చేయాలనే తలంపు కూడా ఉండదు. చివరకు జ్ఞానానుభవమే మిగులుతుంది.

కర్మయోగం - నిస్సంగత్వం

చిత్తశుద్ధికోసం, స్వార్థభావన లేకుండా చేసే పనులనే కర్మయోగమని అంటారు. కోరికతో చేసే ఏపనియైనా అది జన్మకు కారణమౌతోంది. అనేక కష్టనష్టాలు వస్తున్నాయి. చిత్తశుద్ధికి తద్వారా ఆత్మానందానికి నిష్కామకర్మలు దోహదం చేస్తాయి. ప్రధానంగా కర్మభక్తి జ్ఞానమార్గాలున్నాయి. ఇవి మోక్షకారణాలు. అవి భిన్నమైనవా? ఒకదానికొకటి దోహదం చేస్తాయా? అనే చర్చ ఇపుడు వద్దు. అందు కర్మ మార్గ మొకటి. అంటే మనకు ఇష్టం వచ్చిన పనిని చేయడం కాదు. శాస్త్రాలు చెప్పిన పనులను మనకిష్టం ఉన్నా లేకపోయినా చేయడమే మనవంతు. దాని వల్ల లాభం వస్తుందా? విజయం సాధిస్తామా? అని కూడావద్దు ఇదే నిష్కామ కర్మ అంటే. నిర్లక్ష్యంతో అని కాదు. అంటే మన ఇష్టానిష్టాలను వాటికి అంట బెట్టడం కాదు.

అయితే వీటి లక్ష్యమేమిటి? అసలు ఏ కోరికే కోరిక? అసలైన కోరికయే ఆత్మకామమని ఉపనిషత్తులన్నాయి. ఆ మాట వెంటనే 'అకామం' అనికూడా మంత్రంలో ఉంది. ఆత్మతో ఐక్యమవ్వడమే అకామమని, కోరికలులేని స్థితియని చెప్పబడింది. ఇక మామూలు కోరికలతో చేసేవి ఇంద్రియతృప్తి కోసమే. మనస్సు ఆత్మతో కలసినపుడు దానికేమి ప్రత్యేక లాభం లేదు. తనను తానుపోగొట్టు కోవడం కోసం ఆత్మతో కలుస్తుంది. కర్పూరంలా ఆహుతి కావడమే. ఆత్మయే వెలుగొందుగాక అనే స్థితి అయితే ఇది కోరిక కాదా? ఇదేమీ తప్పుకోరిక కాదు. ఇట్టి కోరికలుంటేనే మిగిలిన కోరికలు దరిచేరవు.

స్వార్థ భావనలేని కోరిక ఇదని, ఇంత కంటె అధికం లేదని గీతావాక్యం:-

యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః

అట్టి ఆత్మలాభం కల్గితే ఏంలాభం? ఇది ఎప్పుడుసిద్ధిస్తుంది? మనస్సు మటుమాయమైనపుడు. ఇంతకంటె లాభమేముంది?

శాస్త్రీయమైన కర్మలు చేయడం వల్ల మనస్సు శుద్ధమై ఆత్మలో లీనం కావడానికి దోహదం చేస్తాయి తప్ప మనస్సును తృప్తిపరిచేవికావు. అనగా శాస్త్రకర్మలు, కర్మబంధాలను సడలింపచేస్తాయని మరల మరల చెబుతున్నా.

మామూలు కర్మలు మనస్సును పాడుచేస్తున్నాయి, ఒకపుడు బాగుచేస్తున్నాయి. కర్మబంధమనేది ఈనాటిది కాదు. అనేక జన్మలవాసనల లేదా సంస్కారాల ఫలమే. ఇవి మనస్సులో నిలువచేయబడి వచ్చే జన్మలకు కారణమౌతున్నాయి. తీవ్రమైనకోరిక ఎప్పుడైతే మనమనస్సులో నాటిందో తీవ్ర ద్వేషము ప్రవేశించి రెండూ మనస్సులో తిష్ఠవేసికొనియుంటాయి. వెల్లుల్లిని తిననపుడే కాదు, అది త్రేణపు వచ్చినపుడూ వాసనవేస్తోందికదా! అట్లాగే శరీరం పోయినా సూక్ష్మశరీరాన్ని ఈవాసనలు అంటి పెట్టుకొనియుంటాయి. అవే వాసనలు, లేదా విషయవాసనలు ఇంద్రియాలు అనుభవించేవే ఈ శబ్ద, స్పర్శ, రూప, రస గంధాలు. ఇవే వాసనలు. ఇవి రెచ్చగొట్టడం వల్ల కర్మలను చేస్తున్నాం. ఇంద్రియ తృప్తికోసం కాకుండా కర్మలను చేస్తే అదే యోగమని పిలువబడుతుంది. అపుడు కర్మ చిక్కిశల్యమౌతుంది. అదే కర్మ యోగం. ఇందు ఇంద్రియాలకై తృప్తియుండదు సరికదా, ఉత్తమ ప్రయోజనమైన సంఘశ్రేయస్సు కూడా ఉండదు.

ఇట్లా అంటారేమిటని ప్రశ్నించవచ్చు ఆత్మలాభం కోసం ధార్మికకర్మలు చేస్తే సంఘశ్రేయస్సు సిద్ధించదా? సిద్ధిస్తుంది. సందేహం లేదు. లోకకల్యాణం కోసం చేస్తున్నామని స్వార్థం కోసం కాదని జీవుడు కర్మలు చేస్తూ ఉంటే తప్పక ఈశ్వరానుగ్రహం కల్గుతుంది ముక్తిలభిస్తుంది. కాని స్వధర్మకర్మలు చేస్తూ ఇవీ లోకానికి ఉపయోగమే అంటూ వాటి ఫలాలను లెక్కపెడుతూ కుర్చోకూడదు. మహోత్తమ ప్రయోజనం కోసం స్వార్థాన్ని విడిచి కర్మలు చేసే మహానుభావులుంటారు. అందుకొంత మంది కృతకృత్యులు కాక పోవచ్చు. కనుక అట్టి మహోన్నత స్థితిలో కూడా లాభనష్టాలను బేరీజు

వేయకూడదు. అట్టి పరిపక్వమైన మానసిక స్థితిలోనే అలసట, ఓడిపోయామనే భావనను గెంటి వేయగలం. ఇంత నిస్స్వార్థంగా చేసాం, ఏమిటీ కలియుగం? మనపనేమిటో మనం చేసికొందాములే అనే భావాలు ఒక్కొక్కప్పుడు చోటు చేసికొంటాయి, కనుక ఆత్మలాభమనే లక్ష్యంతో సంఘశ్రేయస్సు లభించినా నేను శాస్త్రకర్మలను చేయడం వల్లనే ఇది లభించిందనే భావనను మనస్సులోకి రానీయకూడదని సారాంశం. లేకపోతే ఇంత చేసినా నిర్వేదమే మిగులుతుంది.

మంచికర్మ ఎందుకు ఫలించడం లేదు?

లోకశ్రేయస్సు కోసం స్వధర్మకర్మలు ఎందుకు ఫలించడంలేదని శాస్త్రాలు అబద్ధం చెబుతాయా అని మీరు ప్రశ్నించవచ్చు.

దాని అర్థం అది కాదు. చెడ్డ పనుల వల్ల మనిషి ఎట్లా ఫలాన్ని అనుభవిస్తాడో అట్లాగే మొత్తం సంఘం చెడునడవడికలో ఉంటే చెడ్డ ఫలితాన్నే అనుభవించాలి కదా! అపుడు మనంచేసిన మంచికర్మలు ఫలించినట్లు కనబడవు. ఫలించినట్లు అనే మాటను గుర్తించండి. అసలేపని చేయవని కాదు. సత్కర్మల వల్ల తిన్నగా సత్ఫలాన్ని అనుభవిస్తున్నట్లుగా కనబడకపోవచ్చు. కాని సమష్టిపాపం, సత్కర్మలవల్ల క్షీణింపబడుతుంది. అదనంగా చేసే కర్మలవల్ల సమష్టిపాపం వృద్ధిపొందడం గాని, క్షీణించడం గాని జరుగుతుంది. కనుక శాస్త్రం తప్పుచెప్పిందా? ఎందుకుఫలించడం లేదనే ప్రశ్న ఉదయించదు.

మనపూర్వ పాపాలగురించి గాని, మొత్తం సంఘం చేసిన పాపాలను గురించిగాని, సత్కర్మల పుణ్యఫలం గురించిగాని, ఎంత పాపక్షయం అయినది దాని గురించిగాని మనకు తెలియకుండా చేస్తాడు ఈశ్వరుడు. కనుక ఫలాలు కనబడడం లేదని విసుగు చెందకూడదు. అట్టి చిట్టావర్జాలు చూసే పనిమనది కాదు, అది ఆయన చూసుకొంటాడు అని నిశ్చయించుకొని మన విధ్యుక్త

ధర్మం మనం నిర్వహిస్తేచాలు. ఫలాలు గురించి ఎప్పుడైతే వెదకడం మొదలుపెట్టామో, ఈపని వద్దులే అని ముగిస్తాం. ఇంకా సులభమైన మార్గాలకై అన్వేషిస్తాం, అధర్మమార్గాలు త్రొక్కుతాం.

భయం తగ్గడానికి అవకాశం

మొదట అసలు మంచిమార్గంలో నడవాసులనుకొంటే చెడ్డమార్గం త్రొక్కడానికి చాలా వరకూ అవకాశం ఉండదు. క్రమక్రమంగా చిత్త శుద్ధి ఏర్పడిన కొద్దీ మనస్సుతో ధ్యానిస్తాం. అటూ ఇటూ పరుగెత్తనీయం. క్రమక్రమంగా మనస్సు నిలబడుతుంది. ఈశ్వరానుగ్రహం కలుగుతుంది. కర్మలు చేయడానికి విడిగా ఇక జీవుడుండడు. ఆ జీవుడే తనను ఆత్మగా గుర్తిస్తాడు. మోక్షాన్ని పొందుతాడు.

అపుడు భయకారణమైన ద్వైతం తొలగిపోతుంది. కర్మచేస్తున్నా, ధ్యానం చేస్తున్నా, ఈద్వైతం ఉండనే ఉంటుంది. కాని ధార్మికమైన పనులు చేసినపుడుగాని, ధ్యానంలో గాని, మామూలు కర్మలు చేసినపుడు కలిగే భయం మాత్రం ఉండదు. ఈశ్వర భావన ఉన్నపుడు భావించేవాని కంటె భిన్నంగా మరొకతత్త్వం ఉందని భావిస్తాం. ఇంద్రియవిషయాలు వెంటబడి మనలను భయపెట్టినట్లుగా మనకంటె ఈశ్వరుడొకడున్నాడనే ద్వైతభావన భయాన్ని కల్గించదు. అయినా మనస్సు లయం కానంత వరకూ భయం వెంటాడుతూనే ఉంటుంది. కాని ఆ భయం మరొకరకంగా ఉంటుంది. ఏమిటది? ఏమిటీమాయ? భక్తులనుండి తప్పించుకొంటున్నాడే! బాధపడుతూ ఉంటే వింతగా చూస్తున్నాడే! ఉపేక్షవహిస్తున్నాడే! మనస్సుకు అందినట్లే ఉండి అంతలోనే మాయమౌతున్నాడే! అనే ప్రశ్నలతో కూడిన భయమది. అది ఒకరకమైన భయమే ఐనా భయమేకనుక తనకంటె మరొకటి ఉన్నంతవరకూ అనగా ఈ ద్వైతం ఉన్నంతవరకూ అభయస్థితి రాదు. భక్తిలో పైవిధమైన భయముంటుంది.

ధార్మిక కర్మలలోనూ ఇంతే. కొన్నిటిని చేస్తూ ఉంటే ముడిసడలడానికి, బదులు ఇంకా బిగుసుకొనిపోయే స్థితిరావచ్చు. కర్మలు చేస్తున్నపుడు బాహ్యవస్తువులు, ఇతర వ్యక్తులపై ఆధారపడతాం కదా! అనేక సందర్భాలలో భయం, విసుగు, దగా మొదలైనవి ఉంటాయి. కర్మలఫలాలను ఆశించనంత వరకూ పైవి మనలను బాధించవు. ఏది ఎట్లా ఉన్నా మనవిధ్యుక్త ధర్మాన్ని మనం నిర్వహిస్తే చాలనే దృఢనిశ్చయం ఉన్నంత వరకూ ఇబ్బంది ఉండదు.

అయినా ధర్మ భక్తి మార్గాలలో భయం వెంటాడుతూనే ఉంటుంది. అయినా అద్వైత మార్గంలోని అభయాన్ని చేరుకోవాలంటే పైధర్మ, భక్తి మార్గాలను అనుసరించవలసిందే! అందున్న భయం ఎల్లపుడూ కలిగే భయం వంటిది కాదు. అది అభయాన్ని చేరుస్తుంది. అందుకే స్వధర్మం ఆచరిస్తూ చనిపోవడమైనామేలని, ఇతరుల ధర్మాన్ని ఆచరిస్తే, భయానికి కారణమౌతుందని గీతలో అన్నాడు. ఇక్కడ భయానికి అర్థం సంసారభయం. జననమరణ ప్రవాహాలలో గిరగిరా తిరగడం:-

స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః

నిధనమనగా మరణం.

మృత్యువెదురుగానున్నా స్వధర్మానుష్ఠానం

మరణం దేనికి? శరీరానికే! అందున్న ప్రాణం మాటిమాటికీ క్రొత్త శరీరాలను ధరిస్తూనే ఉంటుంది. ఎంతవరకూ? కర్మ ముగిసేటంతవరకు. సంసారంలో చిక్కుకొన్నంత వరకూ జీవితం అంతం లేనిదే అవుతుంది. నిజస్థితిని గుర్తించనంతవరకు ఇంతే. దానిని గుర్తించదానికి మొదటి మెట్టు స్వధర్మానుష్ఠానమే ఇదే బంధాలను సడలిస్తుంది. దీనిని చేస్తూ చేస్తూ ఉండగా మృత్యువు కబళించినా మేలే. స్వధర్మానుష్ఠానం చేస్తూ ఉంటే కర్మక్షయం అవుతూనే ఉంటుంది.

లోకకల్యాణం ప్రత్యక్షఫలం

స్వధర్మాలను నిష్కామ భావనతో చేయడం వల్ల శరీరంలో ఉన్న మనస్సునకెట్టి లాభంలేదు అదేనిష్కామ్యం. ఆమనస్సే ఆత్మను జీవునిగా చూపించేది. కోరడం మనస్సు యొక్క ధర్మం. కోరికలను తీర్చుకోవడానికే అన్ని కర్మలూ ఉన్నాయి. అయితే నిష్కామకర్మవల్ల మనస్సు యొక్క ధర్మమైన కోరికను మనం తీర్చడంలేదు. అయితే అన్నిటిని కోరికలతో చేస్తాం కదా! ఫలాన్ని ఆశించడం తప్పవుతుందా? స్వధర్మకర్మలను ఎందుకు చేయాలి? కోరికలను తగ్గించడం కోసం, మనస్సును అదుపులో పెట్టడం కోసమే! కర్మలవల్ల అతనికి ప్రత్యక్షలాభం లేకపోయినా అసలు ఫలమే ఉండదా? ఏ ఫలం ఉండదని శాస్త్రాలు చెబుతాయా? కర్మలుచేయడం వల్ల కర్మరహిత స్థితిని తీసికొనిరావడానికే. అంత మాత్రంతో ఆగిపోతుందా? ఎవ్వరికీ ప్రయోజనము ఉండదని చెబుతాయా? కేవలం అతని చిత్తశుద్ధికే పరోక్షంగా ఉపయోగిస్తాయని ఇక ఎందుకు పనికి రావని చెబుతాయా? ప్రత్యక్షఫలమూ ఉండాలి కాని, చేసేవానికే ప్రత్యక్షఫలం కాదు. అతనికే ప్రత్యక్ష ఫలం ఉంటే అట్టి ఫలం తనకూ కావాలనే కోరిక చేసే వానిలో ఉదయిస్తుంది లభించకపోతే అడ్డదారులు త్రొక్కుతాడు. కనుక అతడు చేయు స్వధర్మ కర్మానుష్ఠానం వల్ల మొత్తం సంఘానికి శ్రేయస్సని శాస్త్రాలు చెబుతాయి.

ఉదా:- ఒకనికి సాధనసంపత్తి పుష్కలంగా ఉందనుకొందాం. ఆరోగ్యంకోసం అతడు వ్యాయామంచేయాలనుకొందాం. అది శారీరక వ్యాయామంచేసి పొందవచ్చు. శరీరక వ్యాయామంతో ఒక ఉద్యానవనాన్ని నిర్మించవచ్చు. నేలను త్రవ్వడం, నీటిని పారించడంవల్ల శరీరానికి శ్రమ, ఆరోగ్యం కలగడమే కాకుండా ఇట్టివ్యాయమం వల్ల ప్రజలకూ ఉపయోగకరంగా ఉంది కదా! చెట్ల ఫలాలతనికి అక్కర్లేదు. అతనికే కావలసినన్ని ఫలాలున్నాయి. ఉద్యావనంలోని ఫలాలు నల్గురికీ ఉపయోగిస్తున్నాయికదా!

కర్మబంధాలను పోగొట్టుకాని పరమాత్మను చేరుకోవడానికి ప్రయత్నించేవాడు దేనినీ ఆశించడు. చివరకు శాస్త్రకర్మలను పాటించని స్థితి అతనికి కల్గుతుంది. కాని ప్రాథమిక దశలో కర్మలను చేస్తాడు. ఆ దశలో స్వార్థం ప్రవేశిస్తే దోషాలూ, అతనిలో ప్రవేశిస్తాయి. కనుక ఫలాన్ని ఆశించకుండా చేయాలి.

తనకొరకు పండ్లనాశించకుండా ఇతరులకై ఉద్యానవనాన్ని సంపన్నుడు ఏర్పాటు చేసినట్లు జీవుడు కూడా చిత్త శుద్ధికై కర్మలను చేస్తూ పైవాని మాదిరిగా ఫలాలనాశించడు. చిత్త శుద్ధికై ఏర్పడిన కర్మానుష్ఠానం జగత్ కల్యాణకారకమౌతోంది. అందుకే అనేక స్వధర్మాలను అనేకులకు విధించాయి శాస్త్రాలు. మానసిక పరిపక్వత లేనివారు ఫలాలనాశిస్తూ ఉంటారు. భగవానుని జగన్నాటకంలో అనేక లీలలుంటాయి.

జగన్నాటకం - ప్రలయం

సంసారాన్ని విడిచి పెట్టి మోక్షం పొందడం అందరికీ సాధ్యంకాదు. ఈ జగన్నాటకాన్ని ఈశ్వరుడు నడుపుచున్నాడు. అందనేక పాత్రలు, భిన్న భిన్నమనస్తత్వాలు. లీలగా ఆనాటకాన్ని సాక్షిగా చూస్తున్నాడు. నాటకంలో అనేక రసాలు. శాంతరసం ఒక్కటే కాదు. మొత్తం అంతా జ్ఞానులతో నిండియుండడం లేదు.

అయితే అతనిలో దయలేదా? ఇంద్రియాల వెంట పరుగులు పెట్టే జనాలను చూచి అనుకంపతో తన దగ్గరకు తీసికోంటాడు. అయితే అందరికీ మోక్షమిచ్చి కాదు. మహాప్రలయంలో ప్రపంచం అంతా అదృశ్యమౌతుంది.

పురాణాలు చాలా ప్రలయాలను పేర్కొన్నాయి. అందు నిత్యప్రలయం ఒకటి. ఇది రోజూ జరిగేదే. అలసిన జీవుడు నిద్రపోతాడు కదా! ఇక మరణం తరువాత అనగా స్వర్గానికో, నరకానికో లేక మరోజన్మ ఎత్తేవరకూ

తాత్కాలిక విశ్రాంతి యుంటుంది. ప్రతి మన్వంతరంలోనూ తనలో జీవులను లయంచేసి కోవడం మరొకటి. కృతత్రేత, ద్వాపర, కలియుగాల కాలం, సంధికాలం కలిస్తే ఒక మహాయుగం అట్టివి రెండువేలు బ్రహ్మకొకరోజు. దీనిని కల్పమంటారు. ఇట్టి కల్పాలు 360 ఐతే బ్రహ్మకొక సంవత్సరం. అట్లా నూరుసంవత్సరాలు బ్రహ్మాయుర్దాయం. బ్రహ్మాయుర్దాయ కాలం మహాకల్పమంటారు. కల్పాంతంలో కలుగు భూలోక ప్రలయానికి దినప్రలయమని, కల్పప్రలయమని పేరు. అట్లాగే ప్రతి యుగాంతంలోనూ కలిగే దానిని యుగప్రలయమంటారు. బ్రహ్మాయుర్దాయా నంతరం కలిగే ప్రలయం మహాప్రలయమని పిలువబడుతుంది.

వివరంగా చెప్పాలంటే నాల్గుయుగాల కాలం 43,20,000 సంవత్సరాలు. ఇది ఒక మహాయుగం. ఇటువంటివి డెబ్బదియొక్కటి కలిస్తే ఒక మన్వంతరం. ఇటువంటివి పదునాల్గున్నాయి. అనగావేయి మహాయుగాల కాలం పదునాల్గు మన్వంతరములు. ఇది బ్రహ్మకొక పగలన్నమాట. అట్లా బ్రహ్మాయుర్దాయాన్ని ఊహించండి.

బ్రహ్మకు ఒక్కరోజులో రెండువేల మహాయుగాలు గడిచిపోతాయి. అతడు నూరు సంవత్సరాలు జీవించిన తరువాత ఆ బ్రహ్మ పరమాత్మలో లీనమైపోతాడు తరువాత మరొక బ్రహ్మసాయంతో సృష్టివ్యాపారం సాగిస్తాడు పరమేశ్వరుడు.

ఇట్లా ఎన్ని యుగాలుగడిచినా జీవులను తనలో కలుపుకొన్నా ఇది అద్వైతమోక్షం కాదు. వీరందరికీ తాత్కాలిక విశ్రాంతి లభించినా మరల పుట్టుక, మరణాలు వెంటాడుతూనే ఉంటాయి. కనుక ఈనాటకానికి అంతం లేదు.

లయం అంటే అతనిలో ఐక్యమనికాదు. ఒకటి మరొకటిలా మారడం కాదు. జ్ఞానం కలిగినపుడే సరియైన ఐక్యం సిద్ధిస్తుంది. జీవులకు నిద్రలో

తాత్కాలిక విశ్రాంతి లభించి మరల మెలకువగా ఉండి పనులు చేస్తున్నట్లుగా మరణించినవాడు తిరిగి జన్మఎత్తుతాడు. ఈ తాత్కాలిక విశ్రాంతి అతని అనుగ్రహం వల్లనే. లెక్కపెట్టలేని జీవులలో ఏకొద్ది మందికో భక్తి జ్ఞానాలు కల్గుతాయని శాస్త్రాలు చెప్పాయి. భక్తి రసమనేది వైకుంఠంలోనో, కైలాసంలోనో లభిస్తుందికాని జీవలోకంలో నవరసాలూ ఉండి నాటకం ఆడిస్తాడు.

మామూలు జీవితంలో కొంత లాభం

లయం అంటే మోక్షం కాదనిచెప్పాం. ఆమోక్ష మార్గమెట్లా చిక్కుతుంది? కొంత వరకు భక్తి వల్ల సాధ్యం. చాలా తక్కువ మంది జ్ఞానమార్గంలో ఉంటారు. వారికే అద్వైత మోక్షం లభిస్తుంది. ప్రతి జన్మలో ఆ కొంత వరకనే దానిని పొడిగిస్తూ ఉండాలి.

మామూలు జనులు చిత్తశుద్ధి కోసం సత్కర్మలను భక్తితో చేయవలసిందే. వారిక సత్సంగము, సదుపదేశం మొదలైనవి ఉపయోగిస్తాయి. కేవలం ఈశ్వరభక్తిని కలిగినవారి కంటె చిత్త శుద్ధికోసం కర్మలను చేయువారు పై మెట్టు ఎక్కినవారుగా పరిగణింపబడతారు. వీరూ పై సత్కర్మల ద్వారా సామాన్యులలో భక్తిని వ్యాపింపచేయవలసిందే.

ప్రాపంచిక జీవితంలో ఒక పద్ధతి

ఈ జగన్నాటకంలో ప్రతివాడు భక్తుడు కాగలడా? అట్టి భక్తి ద్వారా ఏ కొందరికో ముక్తిలభిస్తుంది. మిగిలిన వారి మాటేమిటి? ముందుగా వారు ధర్మమార్గంలో నడవాలి. ఏమిటా ధర్మం? సత్యం ఋజుత్వం, ప్రేమ, దానం, సేవ మొదలైన వాటిని అనుసరించడం. ధర్మ శబ్దానికి చాలా అర్థాలున్నాయి. మతమని కూడా అర్థం ఉంది. పరస్పర సహకారంతో, ప్రేమాది గుణాలతో

సంఘాన్ని ఒక పద్ధతిలో ఉంచేది ధర్మం అని సర్వసాధారణంగా అర్థం. ఈ ధర్మం, కర్మతో ముడిపడియుంది. అందుకే దీనికి అధిక ప్రాధాన్యమిచ్చింది. పూర్వమీమాంసా శాస్త్రం. అథాతో ధర్మ జిజ్ఞాసా తో వాటి సూత్రాలు మొదలు. అంటే ధర్మాన్ని గూర్చి ముందు విచారిద్దాం అని. శాస్త్రకర్మలను చేయడం వల్ల పూర్వజన్మకర్మల ఉరవడి తగ్గించుట - మరల జన్మ ఎత్తకుండా నిష్కామకర్మలు చేయుట - చివరకు ధర్మకర్మలను విడిచిపెట్టుట - తుదకు మనస్సును గెంటివేయుట - ఆ ప్రయత్నంలో బ్రహ్మసూత్రాలకు చెందిన అథాతో బ్రహ్మ జిజ్ఞాసా అనే దానిపై దృష్టిని పెడతాడు. అనగా బ్రహ్మను గురించి తెలిసికొందామని. జీవితం ఎట్లాసాగాలో చెప్పడం కోసం పై సూత్రాలను పేర్కొన్నాను.

జీవితం సవ్యంగా సాగాలంటే అనేకమైన పనులున్నాయి. ముందు యాగాలు చేయడం - దేవతలను తృప్తిపరచడం - వారి అనుగ్రహం వల్ల వర్షాలు - దానివల్ల పంటలు - దాని వల్ల ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారు. ప్రజలను రక్షించడం కోసం శత్రువులను ఎదుర్కొనవలసి వస్తుంది. వివిధప్రాంతాలలో దొరికే వస్తువులను తీసికొని వచ్చి అందుబాటులో ఉంచేవృత్తి - పొలం దున్నడం వంటి అనేక వృత్తులున్నాయి. వీటి అన్నింటి వల్ల సంఘం కలకలలాడుతూ ఉంటుంది. అందువల్లనే అనేక వర్ణాలు, అనేక ఆశ్రమాలు, విధులు విధింపబడ్డాయి. ఇదంతా స్వధర్మం.

అయితే అంతిమ లక్ష్యం ఏమిటి? ఆధ్యాత్మిక మార్గంలో పయనించడమే. ఇది అందరికీ సాధ్యమా? ప్రకృతిని, అనగా సహజస్వభావాన్ని దాటడం కష్టమని భగవానుడన్నాడు కదా! కనుక సంసారాన్ని ఒక క్రమపద్ధతిలో ఉంచాలి అదే ధర్మం.

ఒకపాకలో జీవించేవానికి ఒక భవంతిలో ఉండాలని ఉంటుంది. దానికి తగినంత డబ్బు సమకూరే వరకూ ఉన్నపాకను శుభ్రంగా ఉంచుకోవాలి

కదా! లేదా అనారోగ్యం. అట్లా ఉంచదాన్ని స్వధర్మకర్మలు నిర్దేశిస్తాయి.

అయితే సగటు మానవుని ఉన్నతస్థితికి తీసికొని వచ్చే దెవరు? సర్వసంగపరిత్యాగియైన జ్ఞాని మాత్రమే. అట్టి వారు ఈశ్వరునికి సాధనాల వంటివారు. వారే కాదు, ఆధ్యాత్మిక మార్గంలో ప్రయనించే వారందరూ ఇతరులకు ఆదర్శప్రాయంగా స్వధర్మ కర్మలను అనుసరిస్తూ ఉండవలసిందే!

జ్ఞానులకు కర్మలతో నిమిత్తం లేదు. ఆ స్థితి వారికి రావాలంటే వారూ కర్మ యోగాన్ని ఆచరించాలి. అట్టివారి కర్మలు లోకకల్యాణం కోసమే చివరకు అన్నీ విడిచిపెడతారు. వారు కర్మను ముందే వదిలి పెట్టకూడదు. కర్మయోగం సాగవలసిందే.

ఇతరుల ధర్మాన్ని ఆచరించవచ్చా?

నీ ధర్మాన్ని విడిచి ఇతరుల ధర్మాన్ని స్వీకరించవద్దని గీతలో ఉంది కదా!

మన ధర్మంకంటె ఇతరుల ధర్మం బాగుందని ఎప్పుడైతే అనిపించిందో తనకోరికను అనుసరించే అతడు నడుస్తున్నాడని అర్థం. కోరికయే కామ్యకర్మకు దారి తీస్తోంది. ఫలాలను విడిచిపెట్టినంత మాత్రంచే అది నిష్కామకర్మ యని అనిపించుకోదు. మానసికతృప్తి కోసం అట్లా చేస్తున్నానని అంటే అది మనస్సును కళ్మలంచేస్తుంది. తాను చేయవలసిన విధియని భావించినపుడు మాత్రమే మనస్సును శుద్ధిచేయగలదు.

మరొక ఇబ్బంది కూడా ఉంది. మొత్తం సంఘం బాగుపడాలంటే రకరకాల వృత్తులను చేయవలసివస్తుంది. అందుకొన్ని వృత్తులు గొప్పవిగా కొన్ని తక్కువగా కన్పించవచ్చు. విశాల భావనతో చూచినపుడు ఒకటి ఎక్కువా లేదా, మరొకటి తక్కువా కాదు. సంఘం ఆరోగ్యవంతంగా ఉండాలంటే నీచంగా భావింపబడే వృత్తికే తగిన స్థానం ఉంది. వీథులూడ్చేవారు సమ్మెచేస్తే

నగరంలో రోగాలు వ్యాపించవా? ఇట్లా శుభ్రం చేసే వృత్తి నీచమెట్లా అవుతుంది?

ఇష్టం వచ్చిన వృత్తిని స్వీకరిస్తామంటే అతడు పూర్తిగా నిర్వహించలేక పోవచ్చు. ఒకవృత్తి బాగుందని అందరికీ అవకాశం ఇస్తే పరస్పర ద్వేషాలు, ఈర్ష్యలు, నిరుత్సాహాలు చోటు చేసికొంటాయి. ఇట్లా స్వధర్మాన్ని విడిచి పెట్టడం, సంఘశ్రేయస్సుకి తూట్లుపొడవడం, అనేరెండు తప్పులను చేసినట్లౌతుంది. అట్టి మనఃప్రవృత్తితో ఉన్నవాడు మనస్సునెట్లా శుద్ధిచేసి కొంటాడు? ఇంకా సంసారంలో చిక్కుకొన్నవాడవుతున్నాడు. అందుకే 'పరధర్మం భయావహం' అన్నారు కృష్ణభగవానులు.

ఇంతటితో ముందుచెప్పిన దేవాసుర యుద్ధం ముగుస్తుందా! గీతా వాక్యాన్ని విని అర్జునుడిట్లా ప్రశ్నిస్తున్నాడు.

పాపం చేయడానికి ఏది కారణం ?

ఏకోరికా వద్దు. ఏ వర్ణంలో పుట్టినా ఆ వర్ణానికి తగ్గట్లు, ఆశ్రమానికి తగ్గట్లు ప్రవర్తిద్దాం అనే ఆలోచన మనలో కనబడడం లేదు. ఏదో ఒక శక్తి మనలను పాపం చేయడానికి ప్రేరేపిస్తోంది. ఏమిటా శక్తియని ప్రశ్నించాడు అర్జునుడు.

అథకేన ప్రయుక్తోయం పాపం చరతి పూరుషః
అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః

అథ=శాస్త్రం చెప్పిన స్వధర్మాన్ని నీవు చెప్పిన ఏకోరిక లేకుండా చేద్దామన్నా, అయం పురుషః లేదా పూరుషః = అనగా జీవుడు; అనిచ్ఛన్నపి=అప్రయత్నంగా, కేన=ఎవని చేత, ప్రయుక్తః=గట్టిగా నెట్టివేయబడి, బలాత్=బలవంతంగా, నియోజిత ఇవ=నియోగింపబడుతూ ఉన్నట్లుగా, ఉండడానికి కారణం చెప్పుమని అడిగాడు.

నియోజితలో 'యుజ్' అనేధాతువునకు కూర్చబడునట్లని అర్థం. యుక్తంలో యుజ్, యోగంలో యోజ్ ఉంది కదా! ఆంగ్లంలోని YOKE అంటే బండి యొక్కకాడి మాను కూడా దీని నుండే వచ్చింది. దానికి పశువులను పూస్చుతాంకదా! అట్లాగే మనస్సు నియోజితమైంది. 'ని' అనే ఉపసర్గ చేర్చడంవల్ల ప్రక్కన ఉన్న పదానికి ఎక్కువ బలాన్నిస్తుంది. పాతం = పడుట – నిపాతం, దర్శనం – నిదర్శనం. అట్లా యోజితకు 'ని'చేర్చడం వల్ల గట్టిగా ముందుకు త్రోయబడుసాధనం అనే అర్థం వస్తుంది.

ఎవరో త్రోసివేసినట్లుగా మనిషి పాపం చేస్తున్నాడు. వీరూ తమంతట తాము చేస్తున్నట్లు కన్పించదు.

లోగడ సంసారం ద్వైతం అని అదే భయం అని చెప్పాను కదా! ఏది భయాన్ని పుట్టిస్తుందో అదే పాపం. భగవానుడు పరధర్మం భయావహం అంటే అది పాపాన్ని పుట్టిస్తుందనేకదా అర్థం. ఆపాపం గురించే అడిగాడు అర్జునుడు.

పరధర్మమొక్కటే భయావహం కాదు ఇంకా చాలా పాపాలున్నాయి. ఏ పాపంచేస్తే ఏనరక లోకం వస్తుందో, శిక్షలగురించి వివరాలు చాలా ఉన్నాయి. వీటిని గురించి అడిగాడు.

అర్జునుడు పాపం నుండి జీవుణ్ణి ఎట్లా విముక్తుణ్ణి చేయాలో అనే దాని గురించి అడగలేదు. అట్లా అడిగియుంటే స్వధర్మాన్ని అనుసరించని పాపానికి కారణమైన అసురప్రవృత్తి నుండి దూరంగా ఉండమని చెప్పేవాడు. అది ఇంతకుముందే చెప్పాడుకదా!

భయం, పాపం, బంధం, సంసారం– అనే పదాల అర్థం ఒక్కటే పాపం నుండి రక్షించుకోవడం అంటే పాపం నుండి విముక్తులవడమే. లోగడ కృష్ణుడు వివరించాడు కనుక పాపం నుండి ఎట్లా విడుదల అవ్వాలని అడగకుండా, పాపవృత్తులు, అనగా అసుర గుణాలు ఎట్లా జీవుణ్ణి ఈడ్చుకొని పోతున్నాయని అడిగాడు.

కామ - క్రోధాలు

భగవానుడు కామక్రోధాలే చేస్తున్నాయని జవాబు చెప్పాడు:-

కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః

మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణం

కామమే అనగా కోరికయే పాపంలో పడవేయడానికి కారణం. అంతమాత్రంచే సరియేనా? మరొకటి క్రోధం. ఇవి రెండూ రజోగుణం నుండి పుట్టాయని చెప్పాడు. అనగా సత్వగుణము కాదు కేవల తమోగుణం కాదు. క్షోభపెట్టేది, చురుకుగా పనిచేసే రజోగుణం నుండే పుట్టాయి. అందుకే 'రజోగుణ సముద్భవః' అన్నాడు.

నేను బహువచనం ఉపయోగించాను కాని భగవానుడు ఏకవచనమే వాడాడు. మరిరెంటిని ఏకవచనంతో చెప్పడం వ్యాకరణ విరుద్ధం కాదా? కామము, మరొకటి క్రోధమని నేనన్నాను గాని భగవానుడట్లా అనలేదు. కామం కావచ్చు, క్రోధం కావచ్చని అన్నాడు. కామమే క్రోధంగా కనబడుతుంది. కామం కంటె క్రోధం భిన్నంగా కాదు. కాని మనం సాధారణంగా జంటగా వాడుతూ ఉంటాం. ఆ ధోరణిలో బహువచనం వాడాను. అసురశక్తి కామంగా గాని క్రోధంగా గాని వ్యక్తీకరింపబడుతుందని అర్థం.

మరి రెండూ ఒకటేనా? రెండు విరుద్ధమైన వాటిని కలపడమేమిటి? ఇష్టం లేకపోవడం వల్ల స్వధర్మాన్ని విడిచి పెడుతున్నారు. ఇష్టం ఉండి పర ధర్మాన్ని స్వీకరిస్తున్నారు. మరిరెండూ ఒకటవడమేమిటి?

అవి నిజంగా ఒక్కటే. ఆలోచిస్తే కామం నెరవేరకపోతే క్రోధంగా మారడం లేదా? స్వధర్మాన్ని విడిచి పరధర్మాన్ని స్వీకరించేటపుడు స్వధర్మం అడ్డువస్తోంది కదా! కనుక దానిని ద్వేషిస్తున్నాం. కోరిక నుండే ద్వేషం పుడుతుంది. ఒక

బంతిని విసిరినపుడు గోడకు తగిలి తిరిగి మన దగ్గరకే వస్తోంది ఆ తిరిగిరావడమే క్రోధలక్షణం.

రెంటినీ శంకరులు కలిపేవాడారు. కామమే ప్రతిహతమైనపుడు క్రోధంగా ఉంటుందన్నారు. (2-62). కామక్రోధో భిజాయతే క్రోధం కామం నుండి పుట్టిందని అర్థం. మరొక సందర్భంలో (16-21) మూడింటిని పేర్కొన్నారు. కామక్రోధాలు పాపంలోనికి నెట్టుతాయని వాడిన సందర్భమది. పాపం వల్ల ఏంవస్తుంది? సంసారం. ఇక నరకవాసం సంసారం కంటె ఘోరం ఇట్టి నరకాన్ని ఈ సందర్భంలో పేర్కొన్నది గీత.

త్రివిధం నరక స్యేదం ద్వారం నాశన మాత్మనః

అనగా ఆత్మనాశానికి నరక ద్వారాలు మూడని అన్నాడు. అవి కామ, క్రోధ, లోభములు:-

కామః క్రోధః తథా లోభః

లోభమంటే - అదీ కామానికి దగ్గరే వేలకొద్దీ కోరికలు కామానికి చెందినవి. మహాత్ములకు కామం ఉంటుంది. ఏమిటది ? ఆత్మకామం. ఆత్మ జ్ఞానం పొందాలనే కోరిక అదే ఉపనిషత్తు చెప్పింది లౌకిక విషయాల పట్ల కోరిక, లోభం తెలియపరుస్తుంది. లోభం కలవాడు లోభి.

కనుక కామంలో భాగమైన లోభాన్ని విడిగా పేర్కొంటూ త్రివిధం అన్నాడు. నరక ద్వారాలు మూడని.

అన్ని దోషాలు కోరిక నుండే

లోపలున్న శత్రువులు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు ఆరు. అన్నింటికీ మూలం కామమే. మోహం అంటే ఏమిటి? మనస్సు ఒక దానిపై వ్యామోహంలో పడి దానిని కావాలని కోరుతూ ఉంటుంది. మదంకూడా కోరికపైనే ఆధార పడింది. కోరిన కోరికలు తీరగా

అందేచిక్కుకొని ఒక రకమైన గర్వం మనలో ఏర్పడుతుంది. - ఇందొకనికి ఉన్న దానిని చూసి, మనకు లేదని బాధపడతాం. అదే మాత్సర్యం మనకు లేనిది పొందాలనుకోవడం వల్లనే మాత్సర్యభావం ఏర్పడుతుంది. కనుక అన్నిటికీ కామమే కారణం. కుదురు.

కనుక ఈ అసుర ప్రవృత్తియైన కామాన్ని పెకలించగలగాలి. అది లేనపుడే జీవునకు శాంతి.

కనుక దానిని పాపిగా భావించి అతనితో పోరాడాలి. దానిని నపుంసక లింగంలో వాడకుండా అతడని ఎందుకుంటున్నాం? పరమాత్మ కృష్ణుని రూపంలో అవతరించ లేదా? మానవాకారం ధరించలేదా? కామాన్ని ఒకపురుష రూపంగా పేర్కొని అతడే జీవుణ్ణి గోతిలోకి నెట్టుతున్నాడని అట్టి అసురునితో పోరాడాలనే భావనతో వాడాడు. అతడు దేవుడు, ఇతడు అసురుడు.

క్రోధంతో కూడిన కామం మహాశన, మహాపాప్మ అని అన్నాడు.

మహాశనుడనగా ఎక్కువ తినువాడు. అగ్నిని హుతాశనుడంటున్నాం. తిండిపోతు, ఇంకా పెట్టండని అన్నట్లుగా కామం కూడా అట్లా కోరుతుంది.

అట్లాగే అతడు (కామం) మహాపాప్మ. పాప్మ అంటే పాపం. పాపం లేనిది ఆత్మయని 'అపహత పాప్మ'యని ఉపనిషత్తు చెప్పింది. కామాన్ని ఒక పురుషునిగా పేర్కొనినపుడు పాప్మ అనే పదాన్ని పాపి, పాపాత్మగా పేర్కొన్నాడు. అది మామూలు పాపి కాదు. మహాపాప్మ.

సంసారంలో ఇతణ్ణి (కామాన్ని) పెద్ద శత్రువుగా గుర్తించాలన్నాడు విద్ధ్యేనం ఇహవైరిణం.

నీవు కౌరవులతో లోకక్షేమం కోసం యుద్ధం చేయాలి నీవు కోరిక యనే అసురునితో అనగా దుర్యోధనునితో యుద్ధం చేయాలని భగవానుడన్నాడు.

కోరిక మనస్సునకు తృప్తి నిచ్చినా అదే అనేక అనర్థాలకు దారి తీస్తోంది. అన్ని దుఃఖాలకు అదే మూలమని శంకరులన్నారు. అది తీరకపోతే క్రోధంగా పరిణమిస్తోంది. మనకున్న వాటిని మన గుప్పిట్లో ఉంచుకోవాలనే భావన ఎప్పుడైతే కలుగుతుందో అనగా దానాది గుణాలుండవో దానినే లోభమని అంటారు. మనకున్నవాటిపై ఎక్కువ మోజుతో ఉండడాన్ని మోహం అంటారు. కోరిక నెరవేరినపుడు మనలో అహంకారం మొదలై మదంగా మారుతుంది. అట్లా మాత్సర్యాన్ని వివరించాను. కనుక అన్నిటికి మూలం కామమేయని మరల చెబుతున్నా.

సంతోషమే ప్రయాసానికి కారణం

సుఖాల కోసం వెంపర్లాడుతాం. మనకోరిక సంతోషాన్ని కల్గిస్తుందని భావించినా దుఃఖ కారణమౌతోంది. కోరిక నేరవేరనపుడు దుఃఖమే కదా! కోరిక నెరవేరినా దుఃఖం కలగడం అంటే ఏమిటి? మనం పొందినది పోగొట్టు కొంటామనే బాధకల్గుతుంది. దానికి మరొక భయం తోడ్పడుతుంది. దొంగ దొంగిలించవచ్చు. మనం ప్రేమించిన వ్యక్తి పోవచ్చు. మనడబ్బుకల బ్యాంక్ దివాళా తీయవచ్చు లేదా మన ఆ డబ్బు విలువ తగ్గవచ్చు, ద్రవ్యోల్బణం వల్ల. ***(inflatinon)***

డబ్బు సంపాదనలోనూ ప్రయాసం ఉంది. చివరకు వినోద కార్యక్రమాలున్నా ఏవో కష్టాలు వస్తూ ఉంటాయి. ఇక ఉత్తమమైన కోరికలూ కష్టాన్ని కల్గిస్తాయి. తీర్థ యాత్రలలో అనేక కష్టాలుంటాయి కదా! అట్లాగే యోగ సాధనలోనూ. ఉపవాసాలు. అంగప్రదక్షిణలు మ్రొక్కులు – ఇట్లా ఎన్నో మంచి కోరికలను నెరవేర్చుకోనడంలో నానా తిప్పలూ పడుతుంటాం. మరి సాధనలు చేయవద్దా? పూజలు చేయవద్దంటారా అని ప్రశ్నించకండి. మంచి కోరిక, లేదా చెడ్డకోరిక నెరవేర్చుకోవాలన్నా దుఃఖాలు, క్లేశాలు తప్పడం లేదని చెప్పడానికి వాటిని వివరించాను.

సంతోషం - ఆనందం

ఎందుకు కోరుకుతున్నాం? సంతోషం కోసం? అంతకంటె ఆనందం అనే పదం వాడడం మంచిది. సుఖం, ఆనందం అనే పదాలతో సంతోషాన్ని కలుపుతున్నాం అది సరికాదు సంతోషమనగా తృప్తి. ఆనందానికి, సంతోషానికి దగ్గర సంబంధం ఉన్నా రెండుఒకటి కావు. ఆత్మానందం కలిగితే ఏ అసంతృప్తి దరి చేరదు. ఈ చిట్టచివర దశలో మాత్రం సంతోషం, ఆనందం ఒక్కటే. మిగతా దశలలో తేడా ఉంది. ఒక చల్లని గాలివీస్తే ఆనందాన్ని అనుభవిస్తాం. ఏదైనా కోరిక నెరవేరినపుడు సంతోషపడడం ఉచితంగా ఉంటుంది. అనుకోకుండా ఏదైనా ప్రాప్తిస్తే అది ఆనందమౌతుంది. అక్కడ సంతోషం కాదు.

కోరికలు - సుఖ దుఃఖాలు

ఏదైనా మనం కోరుతున్నామంటే ఆనందం కల్గుతోందనే కదా! ఈ కోరిక దుఃఖానికి దారి తీయవచ్చు, కొద్ది పాటి ఆనందాన్ని కల్గించవచ్చు, లేదా సుఖ దుఃఖాలను రెంటినీ కల్గించవచ్చు. వీటితో నిమిత్తం లేకుండా ఆనందం అప్రయత్నంగా సిద్ధించవచ్చు. అయితే ఆనందం శాశ్వతంగా ఉంటోందా? ఉండదు. అది పోతే మళ్లీ దుఃఖం. ఆనందం తాత్కాలికంగా వచ్చి మటుమాయమైతే అది తిరిగిరావాలని కోరుతాం.

ఆనందం కల్గుతుందని గుఱ్ఱపుపందాలలో పాల్గొన్నామనుకోండి. డబ్బుపోతే దుఃఖం అట్టి కోరిక ఆనందాన్ని ఈయడం లేదు. ఒక చలనచిత్రాన్ని చూడదానికి వెళ్లినపుడు అది భయంకర సన్నివేశాలతో ఉంటే దీని కోసమేనా డబ్బు ఖర్చుపెట్టిందని కాలం వృథా అయిందని బాధ పడతాం. అట్లాగే ఏవినోదానికి వెళ్లినా ఆశాభంగమైనపుడు ఆనందం కోసం మనం చేసే ప్రయత్నం దుఃఖానికి కారణమౌతోంది.

ఐదు ఇంద్రియాల వల్ల మానవపతనం

శంకరులు వివేక చూడామణిలో దీని గురించి చక్కగా వివరించారు. ఐదు ఇంద్రియాలను ఐదు మృగాలతో పోల్చారు. ఇవి ఎట్లా మనిషిని క్రుంగదీస్తున్నాయో వివరించారు.

వేటగాడు సంగీతం వినిపించగా లేడి నిశ్చలంగా వింటూఉంటే ఒక బాణం వేసి దానిని చంపుతున్నాడు. స్పర్శ సుఖం వల్ల ఏనుగు బంధింప పడుతోంది. ఒక గుంట త్రవ్వి దానిపై ఆకులు పరచి దానికి అటు ప్రక్కగా మచ్చిక చేసిన ఆడ ఏనుగును కట్టినపుడు దానిని అనుభవించాలని వెడుతూ ఆగుంటలో పడిపోతోంది మగ ఏనుగు. స్పర్శ సుఖం అంతపని చేసింది.

దీపపు కాంతిని చూసి మిడతలు అందుపడి బుగ్గిపాలవుతున్నాయి. గేలాన్ని కట్టిన ఎరను తినడానికి చేప ముందుకురాగా అది పట్టుబడుతోంది. సంపెంగపువ్వుపై తుమ్మెద వ్రాలగా రేకులన్నీ ముడుచుకొని పోయి వాసన వల్ల అది బంధింపబడుతోంది. ఇట్లా పంచమృగాలు పంచత్వాన్ని అనగా మరణాన్ని పొందుతున్నాయని అంటూ మనిషి పంచేంద్రియాల వల్ల నశింపబడుతున్నాడని అన్నారు.

శబ్దాదిభిః పంచభిరేవ పంచ
పంచత్వమాపు : స్వగుణైర్నిబద్ధా :
కురంగ మాతంగ పతంగ మీన
భృంగా నరః పంచభిరంచిత : కిమ్?

కిమ్ అన్నారు. అనగా ఏమిటి? ఇట్లా అని అయ్యో అని జాలిచూపించారు నరులపై శంకరులు.

కోరిక వల్ల శాశ్వత సుఖం లభిస్తుందా?

కోరికే మనలను నాశం చేస్తోందని అంత నిరాశా నిస్పృహలతో ఉండనవసరం లేదు. అయితే దుఃఖంతో కూడిన ఆనందాన్నే మనం అనుభవిస్తున్నాం అనే మాట మరువకూడదు. త్రాగుడు వల్ల అనేక అనర్థాలున్నా త్రాగిన సమయంలో అతడానందాన్ని అనుభవిస్తూనే ఉన్నాడు. ఫలాహారశాలలో పదార్థం రుచిగానే ఉంటుంది. కాని అశుభ్రమైన పద్ధతుల ద్వారా వండబడే పదార్థాలు సుఖం కంటె దుఃఖాన్నే కలుగచేస్తాయి. ఒక సంగీత విద్వాంసుని పాట వినడం వల్ల సుఖ దుఃఖాలు సమంగానే ఉంటాయి. దుఃఖం ఎందుకంటే డబ్బుపెట్టికొన్నాం కనుక. బాగా పాడుతుంటే దుఃఖం కంటె సుఖమే ఎక్కువౌతుంది. మనం చెల్లించిన డబ్బు కంటె అధికలాభాన్నే పొందామని భావిస్తాం. ఊరకే వినేభాగ్యం (Free Pass) కలిగినపుడు అతడు బాగా పాడగలిగితే అంతా సుఖమే, దుఃఖమేలేదు.

కాని ఇట్టి సుఖం శాశ్వతంగా ఉంటుందా? పై కచ్చేరి నుండి తిరిగి వచ్చాడు. ఆలస్యంగా వచ్చాడని భార్య రుసరుసలాడింది అపుడతని ఆనందం ఎగిరి పోయింది. వాతావరణం బాగాలేక నిద్రపట్ట లేదు. కచ్చేరీలో కల్గిన ఆనందం ఇప్పుడుందా?

ఎందరో ధనవంతులు రకరకాల అవినీతి పద్ధతులలో డబ్బు సంపాదించినా పరలోకంలో సమాధానం చెప్పవలసివస్తుంది. కనుక భౌతిక సంపద ఏదో రకమైన బాధను కల్గిస్తూనే ఉంటుంది.

సంగీతం వల్ల ఆనందం అనుభవించినా కొన్ని గంటలపాటు ఆస్వాదించగలం గాని ఐదారుగంటలు భరించగలమా? విసుగు కల్గదా?

మధుర పదార్థాన్ని కొంతే తినగలం. ఎక్కువగా తింటే అనారోగ్యం కలగడం లేదా?

కోరవలసిన దానికి పరిమితిని విధించలేక పోతున్నాం. ఇంకా కావాలనే తపన మనలను దొలిచివేస్తోంది.

పరిస్థితుల ప్రభావం

ఒక దానిని అనుభవించి, ఆనందించిన తరువాత తాత్కాలికంగా విసుగు చెందుతాం. అనగా ఒక సందర్భంలో ఆనందమిస్తోంది, మరొక సందర్భంలో విసుగును కల్గిస్తోంది. ఎంత మధురపదార్థమైనా జ్వరంలో రుచిస్తుందా? జ్వరం రానపుడు అది కావాలని ఆరాటపడేదీ మనమే. కంటి బాధతో నున్నవాడు వస్తువులను చూడడానికే ఇష్టపడడు. చలికాలంలో శాలువా సుఖాన్నిచ్చినా మండువేసవిలో మంటలను పుట్టిస్తోంది దానిని విసర్జిస్తున్నాం.

ఒక కోరిక మరొక కోరికను ముంచేస్తోంది

సంగీత కచ్చేరీకి ఉచితప్రవేశం లభించినా దగ్గర బంధువు మంచం పట్టినపుడు వెళ్లగలమా? సంగీతం వినాలనే కోరిక ఏమైంది? ఒక కోరిక మరొక కోరికను కబళిస్తోంది.

భగవద్దర్శనం కోసం ఎంతో సేపు వేచి ఉండే పరిస్థితి ఉన్నపుడు తాను చూడదలచుకొన్న చలన చిత్రానికి ఆఖరిప్రదర్శన ఆనాడే ఉందని తెలిసి దాని కోసం పరుగెత్తుతాడు. మరొక విధంగానూ ఉంటుంది. చలన చిత్రానికి బయలుదేరినవాడు దానిని మానివేసి రథోత్సవానికి బయలుదేరుతాడు. ఏదైనా ఒక కోరిక శాశ్వతంగా ఉండదు. ఒక కోరిక మరొక కోరికను మ్రింగివేయడం ఖాయం.

సమస్యలు వెంటాడునపుడు దేవుడో దెయ్యమో గుర్తుకువస్తారు. సుఖంగా ఉన్నపుడు వాటిని ప్రక్కనబెట్టి వినోదాలకై వెంపర్లాడుతాడు.

తన శరీరతృప్తికే భిన్నమైన కోరికలు

మన శరీరంలో ఒక అవయవం కంటె మరొక అవయవాన్ని ప్రేమిస్తాం. జ్ఞానులను మినహాయిస్తే అందరూ శరీరాన్నే ప్రేమిస్తారు కదా! నేను అందంగా , నేనుపొడుగుగా, నేను పొట్టిగా ఉన్ననని తన శరీరమే తానని భావిస్తాడు. నేనుకి శరీరానికి అభేదాన్ని పాటిస్తాడు. పొరపాటున ఎవడు కాలు త్రొక్కినా మండిపడతారు. ఈశరీరాన్ని శుభ్రం చేస్తూ ఉంటాం.

మధుమేహ రోగం వికటించి ఏవ్రేలుకో రోగం వస్తే అది మొత్తం వ్యాపిస్తుందని అది ఖండింపబడదానికి అంగీకరిస్తాం. అది ఇంతకుముందు ఉంగరాలు ధరించిన వ్రేలు అయినాసరే హృదయరోగం ఉన్న వాడు క్రొవ్వు పదార్థాలను తినరాదంటే పొట్టకంటె గుండెకే అధికప్రాధాన్యం ఇచ్చాడుకదా!

ఒకడికి ధనమంటే ప్రీతి. ఒక్కగానొక్క కొడుకికి రోగం వస్తే డబ్బును తృణప్రాయంగా భావించి ఖర్చుపెడుతున్నాడుకదా! అంటే డబ్బుకంటె కొడుకుపట్ల ఎక్కువ ప్రీతిని చూపిస్తున్నాడు.

ఈషణ (ఏషణ) త్రయమని వింటున్నాం. అంటే మూడు కోరికలు. అవి దారేషణ, పుత్రేషణ, ధనేషణలు. అనగా భార్య, కొడుకు, డబ్బు పట్ల కోరికలు. ఇందాకే చెప్పినవాడు విత్తేషణ కంటె పుత్రేషణకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చాడు. కొడుకుకిరోగం కుదిరింది. తరువాత భార్యపోయింది. రెండవ పెళ్లి చేసికొని ఆమె మాటలను విని, కొడుకును గెంటివేసాడు. ఇక్కడ ధారేషణ, పుత్రేషణను మ్రింగివేసింది.

ఇతనికి రోగం రాగా బలవర్ధక ఆహారం తినాలనివైద్యులనగా, భార్యకు కనబడకుండా కొని తిన్నాడు. తన శరీరపోషణదగ్గరకు వచ్చేటప్పటికి దారేషణను ప్రక్కనపెట్టాడు.

ఇట్లా మన శరీరంలోనే ఒక అవయవాని కంటె మరొక దానిని

ప్రేమిస్తున్నాం. కర్మేంద్రియాల కంటె (చేయి, కాలు మొదలైనవి) జ్ఞానేంద్రియాలకే (ముక్కు, చెవి మొ॥) అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. కంటికి వేసే మందు కాళ్లకు ఇబ్బందని చెప్పినా కంటికే ప్రాధాన్యం ఇస్తున్నాం కదా! బ్రతకాలంటే ఒక మందు తీసికోవాలని దానివల్ల కంటికి మాత్రం ఇబ్బందని చెప్పినా కన్నుపోయినా ఫరవాలేదు బ్రతికితేచాలని ముందుకు వస్తున్నాం కదా! కోమా వస్తుందన్నా బ్రతకడానికే ఇష్టపడుతున్నాడు.

ఆత్మ, ఇంద్రియాల మధ్య మనస్సు

ఒక ముఖ్యమైన ఇంద్రియం గురించి చెబుతా. అదే మనస్సు ఇంద్రియాలనుభవించేవన్నీ మనస్సుకే చెందుతాయి. ఇంద్రియాలు లేకుండా కూడా మనస్సు అనుభవించగలదు. సుఖం, దుఃఖం, భయం మొదలైనవాటిని తానూహించి అనుభవించగలదు. వివాహం వల్ల సుఖం, బంధుమరణం వల్ల దుఃఖం, పొరుగువానికి లాటరీ తగిలితే ఈర్ష్య. ఇవన్నీ మనస్సులోనే తిన్నగా పుడతాయి. వీటికి ఇంద్రియాలతో పనిలేదు. కర్మేంద్రియాల కంటె జ్ఞానేంద్రియాలకే ప్రాధాన్యమిస్తాడు. దాని కంటె మనస్సుకు అధిక ప్రాధాన్యమిస్తాడు. మాదక ద్రవ్యాలకై ఎందుకు తహతహలాడుతున్నాడు? మత్తువల్ల ఇంద్రియాలు దెబ్బతిన్నా అవి తీసికొనేటపుడు ఆనందం. కలగడం వల్లనే! అపుడు బుద్ధి కూడా పనిచేయదు. అయినా దుఃఖాన్ని మరిచిపోవడం కోసం మానసిక తృప్తి కోసం వాటికి బానిసైపోతున్నాడు. ఇట్లా ఇంద్రియాలను, చివరకు బుద్ధిని పాడుచేస్తుందని తెలిసినా, లోకం అంతా ఛీత్కరించినా మనస్సునకు ఆనందం కల్గుతుందనే భ్రాంతితో గ్రహిస్తున్నాడు.

పోనీ అదే శాశ్వతంగా ఉంటుందా! మత్తు విదిలినపుడు ఆనందమూ కనుమరుగౌతోంది. అన్ని రోగాలు, అన్ని పాపాలు చుట్టుముట్టుతున్నాయి. సర్వమూ నాశమైపోతోంది. అందుకే పాపం చరతి పూరుషః అనేది సత్యం.

మానసిక సుఖమూ శాశ్వతం కాదు

మానసిక తృప్తి కూడా కొంత వరకే. మించితే అదీ విసుగు పుట్టిస్తోంది. ఒక రాగం విన్నా, ఒక స్వామిపూజ చేసినపుడు చూసినా వినడానికి చూడడానికి బాగానే ఉంటుంది. ఇందుపైసా ఖర్చులేదు. ఇవన్నీ కాలానికి పరిమితమైతే ఫరవాలేదు. నిద్రవేళను మించి అవిసాగుతూ ఉంటే వాటిపై కూడా విసుగు పుట్టదా?

అన్నిటిని విసర్జించి నిద్రపోతాడనుకొందాం. అయితే ఆ నిద్రలో శరీరానికి, మనస్సుకి, బుద్ధికి కొద్దిపాటి సుఖముందా? లేదు. అయినా నిద్రపోవాలి. కొద్దిరోజులు నిద్రపోకపోతే శరీరావయవాలు, మనస్సు, బుద్ధులు పనిచేస్తాయా? మందపవనం, ప్రక్కన భార్య, పూర్ణచంద్రకాంతి, వీణానాదం, సుగంధద్రవ్యాల పరిమళం అన్నీ ఒకచోట ఉన్నా ఒక సమయం దాటిన తరువాత నిద్రపోవాలని అనుకొంటున్నాడు కదా! ఆ నిద్రలో పైవాటివల్ల వచ్చే సుఖానుభవమేమీ తెలియదు.

పోనీ అన్నీ విడిచి నిద్రపోయాడనుకొందాం. అదీ ఎక్కువైతే ఏమిటీ మొద్దు నిద్రయని విసుక్కొంటాడు.

అలసిపోయాడు కాని విసర్జించలేదు

కోరికలకు విశ్రాంతినిస్తున్నామేకాని పూర్తిగా విసర్జించడం లేదు. వాటికి బానిసైపోతున్నాం. అపుడు దుఃఖం వెంటనంటి యుంటుంది.

ఏ కళ నాస్వాదించినా మహోత్తమ కళను అన్ని వేళలా ఆస్వాదించ గలడా? అది మంచి వ్యసనం కావచ్చు. దుర్వ్యసనం కావచ్చు అనుభవించిన కొద్దీ వాటికై పరుగులు పెడుతున్నాడు. తాను ప్రేమించిన వస్తువులలో ఉన్నతమైనవి లభించనపుడు నిరాశ కల్గుతోంది.

ఒక సంగీతకారుడు అద్భుతంగా పాడినా తనకిష్టమైన రాగాన్ని పాడడం లేదని బాధ పడుతున్నాడు.

అట్లాగే భగవంతుని పట్ల, మహాత్ముల పట్ల చూపే ఆదరంలోనూ అంతే. తానిష్టపడే భగవన్మూర్తి ఆలయంలో కనబడకపోతే అసంతృప్తి. ఎందరో మహాత్ములున్నా తానుపూజించే మహాత్ముడు వారితో సాటిరారని ఈసడిస్తూఉంటాడు.

తాను పూజించేమూర్తికి తనకిష్టమైన అలంకారం పెట్టలేదని, ఫలానాగ్రంథంపై మహాత్ముడు వివరించలేదని ఏవేవో కోరికలు తీరలేదని అసంతృప్తి.

ఇట్లా మనం ఇష్టపడేవి అన్నివేళలా లభించకపోతే అసంతృప్తి.

కోరికల వల్ల బాధలును గుర్తించినా మత్తుమందుకు అలవాటు పడి మానివేసినా తట్టుకోలేక ఆత్మహత్యకు కూడా సిద్ధపడుతున్నాడు.

కొన్ని ప్రయత్నం లేకుండానే ఆనందాన్ని కల్గిస్తాయి. పున్నమిరాత్రి సుఖానుభవంలో మన ప్రయత్నము లేదు, అసుఖం వల్ల హానికూడా లేదు. రాత్రి అంతా వెన్నెలున్నా ఆ రాత్రియంతా అనుభవించదానికి సిద్ధంగా ఉన్నమా? మీరొక రోజున అట్టి సుఖాన్ని అనుభవిద్దామని అనుకొన్నా బహుళ పాడ్యమినాడు, చంద్రుడు పున్నమినాటి చంద్రుని మాదిరిగా ఉంటాడా? పున్నమినాటి చంద్రుణ్ణి చూడడానికి మనప్రయత్నం లేకుండానే చూస్తున్నాం. వచ్చే నెలలో చూడాలని కోరిక పుడుతోందికదా! ఇట్టి కోరికలు బాధిస్తూ ఉంటాయి. కనుక ఏ సుఖము శాశ్వతం కాదు, కోరికలను తీర్చేవి శాశ్వతం కాదు.

కనుక ఇట్లా చెడ్డ కోరికలేకాకుండా మంచి కోరికలూ మనలను బాధిస్తూ ఉంటాయి.

ఒకమాటు భగవత్ దర్శనమై అతడు కనబడకపోతే విరహబాధను అనుభవిస్తున్నాడు. ఇట్టి భక్తులెందరో, మాణిక్యవాచకులు, చైతన్య మహాప్రభువు, రామకృష్ణ పరమహంస వంటివారెందరో!

అద్వైతం మినహా అన్ని చోట్ల దుఃఖమే

శాశ్వత సుఖాన్నిచ్చే దానిని భగవానుడు సృష్టించలేదు. అతడు దర్శనమిచ్చినా అదీ తాత్కాలికమే. నామదేవుడు, సుందరమూర్తికి స్వామి రోజూ కనబడేవాడట. కనబడనపుడు అతనికై విలపించేవారట. రాధ, కృష్ణుని ప్రాణమే కదా! వియోగబాధపడలేక శరీరం ముక్కలు ముక్కలై పోయినట్లు భావించేదట. ఇట్టి ద్వైతాన్ని భగవంతుడెందుకు చూపిస్తున్నాడంటే బాహ్యంగా ఉండేది శాశ్వతం కాదని చూపించడానికేమో!

ఇతరులను బాధపెట్టి కూడా సంతోషించడం

మన తృప్తి కోసం ఇతరులను బాధలకు గురిచేస్తున్నాం. ఇష్టమైన దానిని తినడం కోసం తల్లిని పిండి విసరమని పిల్లవాడు తొందర పెడుతున్నాడు. ఆమె పడేకష్టాన్ని గుర్తిస్తున్నాడా?

ఇతరుల బాధలో మనమెట్లా తృప్తి పడుతున్నామో జాగరూకతతో గమనించండి. మనకు సేవ చేయాలనే సద్భావమున్నా మనమెట్లా మాయలో పడుతున్నామో గమనించండి. ఇతరులు బాధపడుతూ ఉంటే మనం కష్టపడుతూ ఒక తృప్తిని పొందుతున్నాం. ఇతరుల సేవలో అతడు తృప్తిపడడం కంటె మన తృప్తికే అధిక ప్రాధాన్యమిస్తున్నాం. ఇట్టి ఆత్మ తృప్తిని మనం గమనించం. ఇతరులకు సాయం చేసే అవకాశం ఒక మాటులేదనుకోండి. అరెరె! ఈ రోజు ఏమీ సేవ చేయలేకపోతున్నాం ఏమిటని బాధపడతాం. ఆ సమయంలో ఎవడోవచ్చి ఏదో అడగగా డబ్బు ఇచ్చి సంతోషిస్తున్నాం.

కనుక ఇట్లా తృప్తిపడడం ఇతరుల బాధపై ఆధారపడింది. ఇతరులలో బాధఎప్పుడూ ఉండాలని అనుకోడుసుమా!

ఒక రోజు అన్నదానం చేసి తిరిగివచ్చిన తరువాత రేపౌ అవకాశం ఉండదేమోనని బాధపడుతున్నాడు. ఆ అవకాశం కోసం ఎదురుచూడడం వల్ల కూడా బాధపడుతున్నాడు. కోరిక ఎంత పనిచేస్తోందో గమనించారా?

మంచి కోరికలే ఇట్లా ఇబ్బంది పెడుతూ ఉంటే చెడ్డ కోరికల గురించి చెప్పేదేముంది? సామ్రాజ్య విస్తరణ కోసం ఒక హిట్లర్, ఒక ముస్సోలినీ ఎన్ని ఘాతక కృత్యాలు చేసారో చరిత్ర చెబుతోంది. పాపఫలాలను భవించవలసివస్తుందనే భీతి లేకుండా అనేక హత్యలు, దోపిడీలు, మానభంగాలు జరిగిపోతున్నాయి.

ఉన్నత గుణాలను హరించేకోరిక

ఇట్టి కోరికలు మానవునిలో ఉంటాయనే మన్వాది స్మృతికర్తలు అహింస, సత్యం, దొంగతనం చేయకుండుట, శుభ్రత, ఇంద్రియనిగ్రహం అనే ఐదింటినీ అందరూ ఆచరించాలని శాసించారు. కాని కోరిక వీటిని పాటించకుండా చేస్తోంది.

మన సంపదను, మన అధికారాన్ని మన గౌరవాన్ని ఎట్లాగైనా రక్షించుకోవాలనే తపనతో అనేకమైన, అడ్డదారులు తొక్కుతున్నాం – కనుక అన్నిటినీ ఉల్లంఘించడానికి కోరికే కారణం. అంతే కాదు, లోనున్న ఆరు శత్రువుల తృప్తికి పై ఐదుధర్మాలను కూకటి వ్రేళ్లతో పెకలించడానికి కారణం కోరికే.

అవిచ్ఛిన్న ఆనందం మనస్సుకి లభిస్తుందా?

మంచి కోరికలూ బాధనే కల్గిస్తున్నాయని చెప్పాం. మనస్సు తృప్తి పడకపోవడమే కోరిక యొక్క లక్షణం. అది దురదపెడుతూ ఉంటుంది.

కోరిక ఎక్కడైతే ఉందో అక్కడ మనస్సున్నట్లే. మనలో మనస్సుండడమే పెద్దఆటంకం. ఇది ఆత్మకంటె భిన్నమైనది, లేదా రెండవది. అదే భయాన్ని కల్గిస్తోంది. జీవుణ్ణి బంధించేది అదే. భిన్న భిన్న మనః ప్రవృత్తులుండడం వల్ల భిన్న భిన్న జీవులుగా కన్పిస్తున్నారు. మనస్సు బాగుపడాలంటే మనస్సు, పరమాత్మ యొక్క అనుగ్రహాంశతోనైనా నింపబడాలి. ముందుగా ఇది పరమాత్మతో ఐక్యంకాలేదు. అపుడే శాశ్వతానందం.

ఇక కైలాసంలోగాని, వైకుంఠంలో గాని పొందే ఆనందమూ మనస్సు వల్లనే. ద్వైత విశిష్టా ద్వైతసిద్ధాంతాలు దీనిని పరమానందమని, శాశ్వతానందమని అంటాయి. అందు దుఃఖస్పర్శలేదని చెబుతాయి. పురాణకథలను బట్టి వారు చెప్పిన ముక్తులూ బాధపడినట్లుందికదా! అక్కడ కూడా పరమాత్మకంటె తాము భిన్నులమని, ప్రత్యేకమైన మనస్సుతో ఆనందాన్ని అనుభవిస్తున్నామని అంటారు. నారదుడు, సనకాదులు, భృగువువంటి మహర్షులూ దుఃఖం, క్రోధం, శాపాలు పొందడం, భూలోకంలో వారు తిరిగి పుట్టడం, తపశ్చర్య వల్ల మరల ఉత్తమలోకాలు పొందడం వంటి కథలను వింటున్నాం కదా! ఏమంటారు? అందుకే అన్ని కోరికలను పరమాత్మ వైపు మళ్లిస్తే మిగిలిన కోరికలేమీ చేయవని తిరువళ్లువర్ అన్నాడు.

యుద్ధం ముగియాలంటే ముందుకోరికను చంపాలి

కొన్ని కోరికలు సుఖాన్నిస్తున్నట్లు కనబడినా దుఃఖానికి కారణమౌతున్నాయని గమనించాం. తామర ఉన్న చర్మాన్ని గోకినపుడు ఆనందం కలిగినా తరువాత పుండుపడి దుఃఖాన్ని కల్గిస్తోంది కదా! ప్రతి కోరిక ఒక దురదవంటిదే. కనుక కోరికను అంత మొందించగలిగితే మనలో దేవాసుర సంగ్రామమే ఉండదు. ఎట్లా నాశంచేయడం? ఒక దానిని అణిస్తే మరొకటి పుట్టుకొస్తోందికదా! (రావణుని తలల మాదిరిగా) నేను బ్రతికి యున్నానని మరో కోరిక తల ఎగురువేస్తోంది.

మృత్యువు కోరికను అంతం చేయగలదా?

శరీరం వల్ల కోరికలని, పోయిన తరువాత కోరికలుండవని ప్రశ్నించి మరణాన్ని ఆహ్వానిద్దామా? కూడదు.

చనిపోయిన వ్యక్తికి కోరికలు లేవనుకోవడం తప్పే, పోయిన వాడు శాశ్వతంగా పోడు. చేసిన పుణ్యపాపాలను అనుభవించడానికి రాకతప్పదు.

శరీరం పోయి ఏ శరీరమైనా రావచ్చు. ఒక ఎద్దైకాడి క్రిందతల పెట్టడమో, బరువును మోసేగాడిద గానో, లేదా మరోశరీరమో ఎత్త వలసివస్తుంది.

బాధల నుండి విముక్తికై కొందరు ఆత్మహత్యకు పూనుకొంటారు. ఇంకా ఘోరమైననేరం. ఇదొక అదనంగా పాపం. కాల్చుకొని చనిపోతే పోయింది పై పైశరీరమే. సూక్ష్మదేహం మిగిలే ఉంది. ఇది జీవుని అంతఃకరణ రూపంలో ఉంటుంది. ఇదే జీవుని పాపపుణ్యాలననుభవించే దేహం. ఇందే గిరగిరా తిరగ వలసివస్తుంది.

ఇట్లా కాకుండా మనిషి చనిపోతే పుణ్యకర్మల వల్ల పుణ్యలోకం, పాపకర్మల వల్ల నరకలోకం అనుభవించి తిరిగి జన్మనెత్తుతాడు. 84 లక్షల జీవరాశుల్లో ఏదో ఒకజీవ రూపం ఎత్తి అనుభవిస్తాడు. నరకలోక బాధలకంటె ఎక్కువ బాధననుభవిస్తాడు, ఆత్మహత్య చేసికొన్నవాడు. ఒక దెయ్యమై ఆకలిదప్పికలతో అలమటిస్తూ ఎవరి శరీరాన్నో అవహించి ఇతరులను బాధిస్తాడు. చివరకు జన్మనెత్తినా ఆత్మహత్యా ఫలమనుభవించాలి. కనుక ధర్మశాస్త్రాలు దీనిని తీవ్రంగా వ్యతిరేకించాయి. నేటి చట్టమూ అంగీకరించదు.

అసలు పుట్టుకయే శిక్ష

సహజంగా మళ్లీ తిరిగి పుట్టడం, జన్మనెత్తి అనుభవించే దశ కొరడా దెబ్బల శిక్షలాంటిది. ఈ బాధలను భరించలేనపుడు మరణం విధిస్తున్నాడు సృష్టికర్త, అట్లా తాత్కాలికంగా విశ్రాంతినిస్తున్నాడు.

మనం పడే బాధలలో నాల్గవ వంతే భరిస్తున్నాం. మిగతా మూడువంతులు, ఆ బాధలను తలుచుకొని బాధపడుతున్నాం. అయితే చిన్నతనంలో బాధపడుతున్నామా? ఏదైనా బాధపడినట్లున్నా మరుక్షణంలో మరిచిపోతున్నాడు. ఈ స్థితి ఎట్టిదంటే కారాగారంలో నేరస్థుణ్ణి బంధించి తిండి పెట్టడం వంటిది. దెబ్బలు తట్టుకోవడానికి బలంకావాలి కదా!

వేప పండు తీపితనం

ప్రతివ్యక్తి జీవితాంతం చెడ్డపనులు చేయడు. మధ్యమధ్యలో మంచి వాటినీ చేస్తాడు. ఈ రెండు దశల మధ్యలో కొంత సుఖం కల్గుతుంది. ఇది ఎటువంటిదంటే గాయానికి తగిన మందు పూయడం వంటిది. మంచి పనులు చేయడం వల్ల వచ్చే సుఖం, మంచిగంధం రాసినట్లుంటుంది. ఇది ఎక్కడో గాని జరగదు. 90 పాళ్లు పాపకర్మలనే చేస్తాం. కనుక సుఖం ఒక వంతైతే బాధ తొమ్మిదిరెట్లుంటుంది. మనం అనుభవించే సుఖం వేపపండ్ల తీపివంటిది. మామిడి పండువంటి తీపి కాదు. వేప చేదైనా కొంత తియ్యగా ఉంటుంది కదా! కనుక అనేక బాధలలో కొద్దిపాటి సుఖాన్ని దీనితో పోల్చవచ్చు. ఈమాత్రానికే భగవానుడు దయచూపిస్తున్నాడని భావిస్తాం.

చనిపోయినా కోరికలు వెంటాడుతూ ఉంటే ఎట్లా వీనినుండి తప్పించుకోవడం?

నిరంతర ప్రయత్నమే చేయాలి

కోరిక తగ్గకపోయినా నిరంతర ప్రయత్నంవల్ల వైరాగ్యం అలవడి కోరికలులేని స్థితి ఏర్పడుతుంది. అపుడే శాంతి.

చెడ్డ వృత్తులను తరమడం వల్ల ప్రయోజనం లేదు. సాధ్యంకాదు వేరు ఉన్నంతవరకూ మొలకలురాక తప్పదు. కొమ్మలను నరకగలం గాని వేరును పెకలించడం కష్టంతో కూడినపని.

తేనెటీగను తరుమనంతవరకూ అది పట్టుపెడుతూనే ఉంటుంది. కారణం నిర్మూలింపబడనంతవరకూ కార్యం విజృంభిస్తూనే ఉంటుంది.

కామాన్ని మహాశనయని, మహాపాప్మయని గీతా వాక్యాలను వినిపించాను కదా! దీనిని మహా శత్రువని తెలిసికో అని హెచ్చరించింది.

కోరిక ఏం చేస్తుంది ?

నిప్పును పొగ క్రమ్మునట్లుగా, అద్దంపై దుమ్ము పేరుకొన్నట్లుగా, పిండాన్ని మావి దాచునట్లుగా కామం జ్ఞానాన్ని ఆవరిస్తుంది, కప్పేస్తుందని గీతలో అన్నాడు. ఇది జ్ఞానానికి శత్రువని, బుద్ధిని దహించే అగ్నియని పోల్చాడు.

జ్ఞానాగ్నిని పొగమాదిరిగా కప్పుతుందని అన్నాడు. అగ్ని మాదిరిగా దహిస్తుందని తరువాత అన్నాడు అది ఒకచోట వేరూని తన బలాన్ని చూపిస్తుంది. ఆ వేరూనిన చోటే అధిష్ఠానం.

ఇది సన్యాసుల అధిష్ఠానం, సమాధికాదు మరి ఈపేరుతో ఎందుకు చెప్పబడింది?

మహాత్ములు సిద్ధిపొందినచోట సమాధిని కట్టినా వారి అనుగ్రహశక్తికిరణం అక్కడ ఉంటుంది. భక్తులననుగ్రహించడానికి ఆ అనుగ్రహకిరణమే చాలు కనుక వారి సమాధులను అధిష్ఠానములని అంటారు. ఇట్టి సమాధులపై తులసి మొక్కను గాని, శివలింగాన్ని కాని ఉంచుతారు. తులసి ఉన్నచోటును బృందావనమని, లింగమున్నచోటు అధిష్ఠానమని అంటారు. మా పూర్వాచార్యులు సిద్ధిపొందినపుడు ఇద్దరి సమాధులలో ఒకటి బృందావనంతో, ఒకటి శివలింగంతో ఉంది.

జీవుని బాధించడానికి ఆ అధిష్ఠానాలు మూడని అవి ఇంద్రియాలు, మనస్సు, బుద్ధియని చెప్పాడు. అవే జీవుణ్ణి మోహంలో ముంచుతున్నాయని అన్నాడు. కోరికలను చంపు అని మరల అన్నాడు. మనం కోరికను అణచిపెడుతున్నాం కాని చంపలేకపోతున్నాం.

అర్జునుని కష్టం

కోరికను లొంగదీయడం, అట్లే మనస్సుని స్వాధీన పరుచుకోవడం ఒక్కటే, కారణమేమంటే కోరిక పుట్టేది మనస్సునుండే కదా! ఇది జీవుణ్ణి బలవంతంగా లాగివేస్తోందని, దీనిని లొంగదీయడం కష్టమని అర్జునుడన్నాడు.

చంచలం హి మనఃకృష్ణ ప్రమాథి బలవత్ దృఢం

తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరం.

ఈమనస్సు నిరంతరం చలిస్తూనే ఉంటుంది. ఇది జీవుణ్ణి మథిస్తోంది. కవ్వం చిలికినట్లు, అమృత మథనం అనేమాటనువిన్నాం కదా! ప్రమాథి యనగా బాగా చిలుకుతోంది అని అర్థం. మానసిక భావాల వల్ల జీవుడు బాగా చిలకబడుతున్నాడు. గాలిని ఎట్లా పట్టుకోలేమో అట్లా మనస్సును నిగ్రహించడం కష్టం అని అర్జునుడన్నాడు.

కృష్ణుడు చెప్పిన విరుగుడు

నీవు చెప్పినట్లు కష్టమే. కాని అసాధ్యమని అనుకోకు అని అన్నాడు కృష్ణుడు:-

అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలం

ఇతణ్ణి మహా బాహో అని సంబోధించాడు. అంటే నీకు శారీరక బలముంది, అట్లే మానసిక బలం కూడా ఉందని చెప్పడానికే. అర్జునుడు చెప్పిన దానిని అంగీకరిస్తూ దానికి విరుగుడూ చెప్పాడు.

ఏమిటది? అభ్యాస వైరాగ్యాలవల్లనే దానిని నిగ్రహించవచ్చని అన్నాడు. ప్రయత్నం మానవద్దని, ప్రబల ప్రయత్నం వల్ల లొంగితీరుతుందని భరోసా ఇచ్చాడు. నీ ప్రయత్నంలో కృతకృత్యుడవౌతావు. వేటి వల్ల? ఏదీ కోరక పోవడం వల్ల, నిరంతర అభ్యాసం వల్ల ప్రయత్నంలో జారిపడుతున్నా లేవాలి:-

యతోయతో నిశ్చరతి మనశ్చంచల మస్థిరం

తతస్తతో నియమ్యైతత్ ఆత్మన్యేవ వశంనయేత్

అంటే చంచలమైన మనస్సు ఏయే విషయలలో తిరుగుతోందో ఆయా విషయాల నుండి దానిని మరల్చి ఆత్మయందుండునట్లు స్వాధీనం చేసికోవాలి.

మార్పు లేనిది ఆత్మ

జీవుని నిజరూపమైన ఆత్మగురించి చెబుతున్నాడు. జీవుడు విడిగానున్నానని భావించినపుడు ఆకారం, రంగు, పేరు, విద్య, వృత్తి, మొదలైన వాటిగురించి చెబుతాడు. అంటే మనస్సుతో కలిసినపుడు పైవాటిని ఏకరవు పెడతాడు.

అతడు గాఢనిద్రలో ఉన్నా, అతనికి మత్తుమందు నిచ్చినా, లేదా యోగనిష్ఠలో ఉన్నా అతని మనస్సు పనిచేయదు. ఆలోచనలుండవు. ఈదశలలో రాజునుండి పేదవరకూ ఒక్కటే, నిద్రపోయినపుడు తన గురించి ఏమైనా తెలుస్తోందా? దేశకాలాలు, వయోవస్థలు, జాతిలింగ భేదాలు తెలుస్తున్నాయా? తెలియవు. అవుడు నిజరూపంలో ఉంటాడు. మెలకువగానున్నపుడు మాత్రమే ఈ భేదాలన్నీ.

కాని గాఢనిద్రలో, సమాధిలో మనస్సు పనిచేయకపోయినా అతడుంటాడు అదే ఆత్మ.

అట్టి ఆత్మకు చావులేదు మార్పులేదు. ఒకవిధంగా మార్పేమరణం. మరణం అంటే ఉన్న దానిని విడిచి పెట్టుట అసత్యమగుట ఒకపువ్వు కాయగా మారిందంటే ఆ పచ్చికాయ పండుగా మారిందంటే పండుదశలో పువ్వు, పచ్చికాయ లేనట్లేకదా! మార్పును పెరుగుదలయని అంటున్నాం. ఒక రూపంవిడిచి మరొకరూపాన్ని ధరిస్తున్నాయి.

మన శరీరమూ మారుతోంది. బాల్యంలో యౌవనంలో వృద్ధాప్యంలో మార్పులే. చివరకు క్షీణదశ చూస్తున్నాం. ప్రతి క్షణమూ మార్పే. ప్రతి క్షణమూ మరణమే శరీరమే నేనని భావించినా ఇది తప్పదు.

అట్లాగే మనస్సుకూడా నిరంతరం మారుతోంది, మరణిస్తోంది. ఒక క్షణం దుఃఖం, మరొక క్షణం సుఖం, మరొకసారి కోపం. ఈ మార్పే వికారం మొదటి రూపం పోతుంది. కాని ఉండుట (సత్త) మాత్రం మారదు. పువ్వు పువ్వుగా కలకాలం ఉండకుండా కాయగా, పండుగా మారుతోంది. ఈ మారడంలో లోనున్న జీవన సూత్రం మారదు. పువ్వు కాయగా మారనపుడు త్రుంచివేస్తే కాయగా కనబడదు. అది చెట్టుమీద నున్నపుడే కాయగా, పండుగా మారుతుంది. ఈ మూడు దశలలోనూ జీవన సూత్రం దాగియుంది.

అట్లాగే మన శరీరం, మనస్సు నశించి క్రొత్తరూపం ధరిస్తున్నాలోనున్న జీవనాధారమైన ఆత్మ నశించదు. వికారాలుండవు. దానికి శ్వాస ఆగినా శ్వాస ఆడుటకు కారణమైన ఆత్మనశించదు. అట్టి ఆత్మను శరీరమని, మనస్సని పిలవడమేమిటి? క్షణక్షణమూ మారే వీటితోనా పోల్చడం? మెళకువలో, కలలో, గాఢనిద్రలో ఉండేనేనునకు మరణం లేదు. అదే మన నిజరూపం.

నాశరీరం ఉంది, నా మనస్సు పనిచేస్తోందని అనుకోనప్పుడు కూడా ఉండేదే ఆత్మ.

మారేది మారుతూ ఉన్నది నేనుకాదు. ఒకదశను మరొక దశను గుర్తించేది ఆత్మ, కలిపేది ఆత్మ సూత్రేమణిగణా ఇవ అని అన్నాడు కదా! మణులహారంలో దారం ఉంది అన్నట్లుని అర్థం.

నిజ ఆత్మ - తొడుగువంటి మనస్సు

నిజం అనేమాటను సత్యమనే అర్థంలో వాడుతూ ఉంటాం.

సహజస్వభావమని అసలర్థం. పై రెండర్థాలలోనూ నిజమైన నేనే ఆత్మ. మనస్సు మనలను మభ్యపెట్టడం చేత మనసహజరూపాన్ని మనం మరిచిపోతున్నాం. తానే అసలైన నేనంటూ మనస్సు మనలను భ్రాంతిలో ముంచుతోంది.

ఇది ఒకటికాదు, అనేక వేషాలు వేస్తోంది. పళనిక్షేత్రంలో దండాయుధ పాణికి అనగా సుబ్రహ్మణ్యస్వామికి వెంట వెంటనే అభిషేకాలు చేస్తారు. ఒక అలంకారంలో భిక్షుకునిగా చూపిస్తారు. మరల తెర, అలంకారం, తరువాత రాజువేషం, మరొకవేషంలో వేటగానిగా ఇట్లా గబగబా మారుస్తారు. అట్లాగే మన మనస్సు, శరీరం అనేక జన్మల నుండి అనేక వేషాలను వేస్తూ ఉంటుంది. మనమూ అనేక దశలలో తగిన వేషం వేస్తూ ఉంటాం కదా! అంతా ఆత్మపైనే ఆధారపడింది.

అట్లాగే నాటకంలో కూడా అనేక వేషాలు వేస్తాడునటుడు. వేషాలు తీసివేస్తే ఉన్నవాడొకడే. వేషం తీసి ఉన్నవాడు, మనస్సు, శరీరభావన లేని గాఢనిద్రలోని ఆత్మలా ఉంటాడు. దేవాసుర సంగ్రామ ఫలాలు అంటనివానిగా ఉంటాడు. అదే ప్రశాంత స్థితి.

ఆత్మ ద్వారానే మనోవ్యాపారం

ప్రశాంతమైన ఆత్మ ఉండడంవల్లనే శాంతం లేనిది, ఏపనితనంతట తాను చేయలేని మనస్సుంటుందని చెప్పడం ఆశ్చర్యకరంగానే ఉంటుంది. ఆత్మలేకపోతే మనస్సు ఆలోచించలేదు. అడుగు ముందుకు వేయలేదు. మనోవ్యాపారాల వల్లనే కోరికల వల్లనే శరీరం పనిచేస్తోంది. ఫలానా పనిచేయుమని శరీరాన్ని ఆదేశించేది మనస్సే. ఆత్మ ప్రశాంతంగా ఉంటూ ఏశక్తికి అవకాశం ఈయకుండా ఉంటుంది. అయితే లోకంలో ఆత్మశక్తియని వాడడం ఒక భ్రాంతియే. మానసిక వ్యాపారాలను దానికి అంటగట్టడం

వల్ల అట్లా అంటున్నాం అంతే. అది దేనితోనూ సంబంధం పెట్టుకోదు. శాంతస్థితి, దానికి శక్తి ఉందనడం కేవలం అపాదనే.

అయితే మనస్సు, శరీరాలు పనిచేయడానికి ఆధారమని ఇంతకు ముందు చెప్పారు కదా అని మీరు ప్రశ్నించవచ్చు.

మాయ

నిజమే ఆత్మలేకపోతే చలనంలేదు. అయినా ఆత్మప్రత్యక్షంగా దేనితోనూ సంబంధం పెట్టుకోదు. సంబంధం పెట్టుకొన్నట్లుగా కనబడడం మాయయని యంటారు. ఇట్లా నాటకం సాగుతోంది ఈ మాటను అర్థం చేసికోవడం కష్టం.

ఉదాహరణకు – మొక్కలు చెట్లుపుష్పిస్తున్నాయి ఫలిస్తున్నాయి. దేనివల్ల? సూర్యుడుండడం వల్లనే. సూర్యుడీ ప్రణాళికను తయారు చేసాడని చెప్పగలమా?

చీకట్లో ఒకడు దీపం వెలిగిస్తాడు. ఆ వెలుగులో ఒకడు పురాణాన్ని, మరొకడు నవలను, ఇంకా మరొకడు మరొక పనిని చేస్తాడు. దీపం వీరందరి చేత ఈ పనులు చేయండని నియమిస్తోందా? చెబుతోందా? ఈ పనులకు దీపానికి సంబంధం ఏమిటి? అయినా రాత్రిలో ఏ పని జరిగినా దీపం లేకుండా సాగడం లేదుకదా? కనుక ఆత్మకు కర్తృత్వం లేకపోయినా దాని సన్నిధానంలో మనస్సు అనేకమైన పనులను శరీరం ద్వారా చేయిస్తోంది.

ఉన్నస్థితి - చేయుస్థితి

గాఢనిద్రలో గాని, సమాధి స్థితిలోని గాని ఉన్న జీవుడు ఆత్మయే, అపుడు శారీరక మానసిక వ్యాపారాలుండవని చాలాసార్లు చెప్పాను.

అది ఉండుస్థితి (State of Being) మనస్సు, శరీరం తిరిగి పనులు చేయడం కార్య స్థితి. గాఢనిద్రలో ఆత్మ ఏ పనైనా చేసిందా? లేదు. ఉన్నది

ఉన్నట్లుంది. అట్టి స్థితిని కేవలస్థితియని అంటారు. కేవలశబ్దానికి, స్వతంత్రంగా, దేనితో కలవకుండా ఉండడమని అర్థం. అట్టి ఆత్మానుభవం పొందడమే కైవల్యం. కైవల్యపదవి, కైవల్య మోక్షం అనే మాటలను వింటాం.

భిన్నసంప్రదాయాలలో మోక్షాన్ని భిన్న భిన్నంగా నిర్వచించారు. అద్వైతులు దీనిని బ్రహ్మసాక్షాత్కారమని, ఆత్మసాక్షాత్కారమని అంటారు. శైవులు దీనిని శివసాయుజ్యమని వైష్ణవులు విష్ణుసాయుజ్యమని అంటారు. బుద్ధుడు దీనిని నిర్వాణమన్నాడు. అనగా ఏదీయుండని స్థితియని, శూన్యమని. న్యాయవైశేషికులు దుఃఖస్పర్శ లేని అపవర్గమంటారు. జైనులు, యోగులు దీని కేవల స్థితి లేదా కైవల్యమని పిలుస్తారు.

ఉండుస్థితిని ఎపుడు గుర్తించమో చేయుస్థితి మొదలై అన్నీ మనలను ముసురుకొంటాయి. పక్షులు గూళ్లనుండి బయలు దేరినట్లుగా వివిధ వ్యాపారాలను చేస్తాం.

ఆకలి, కోరికల వల్ల కలిగే ఫలాలు

మనస్సెపుడైతే మేల్కొందో కోరికలనే ఆకలితో భావావేశాలతో పరుగులు తీస్తుంది. కోరికలు తీరుతాయా అంటే అదీ లేదు. దానికై చేసే పనులకు అంతం లేదు. భూతం ఆవహించినట్లు గంతులు వేస్తాం. వేటి కోసం? సుఖం కోసం అదైనా కలకాలం ఉంటుందా? ఉండదు అదీ దుఃఖానికి దారి తీస్తుంది.

పిల్లవాడు ఆడుకొంటూ ఉంటే చూడడానికి బాగానే ఉంటుంది. వాడు జ్వరంతో బాధపడినపుడు పై సంతోషం కంటె నాల్గురెట్లు బాధపడతాం. అట్లాగే డబ్బు సంపాదన – ఖర్చు – దొంగల భయం మొదలైనవి ఎన్నో. ఎన్నో పనులు మన తృప్తి కోసం చేసినా బాధ, భయం, అవమానం, ఈర్ష్య, అహంకారం, ఇట్లా ఎన్నో వెంటాడుతూ ఉంటాయి.

నిద్రనుండి లేవగానే మనస్సు పరుగులు తీస్తుంది. అంతకు ముందున్న శాంతి, సుఖం, తృప్తి కనుమరుగై పోతాయి. ఇక అసంతృప్తి వెల్లువలా మీద పడుతుంది.

పొందడం - విడిలిపెట్టడం

ఒకదానిని పొందడంలో కష్టం వచ్చినదానిని రక్షించడంలో కష్టం అదిపోతే పొందే కష్టం ఇంకాఎక్కువ. ఇక విడిలిపెట్టడంలోనూ కష్టాలే ఆరోగ్యం బాగుపడాలంటే పథ్యమైన వాటిని స్వీకరించాలి, అపథ్యాన్ని విడిచిపెట్టాలి. మిత్రులను పొందాలి, శత్రువులను విడిలించుకోవాలి.

కనుక రెంటిలోనూ సమస్యలే కడుపులో వేసిన పదార్థము అజీర్ణానికి దారితీయవచ్చు. లేదా ఇంకా కావాలని అనిపించవచ్చు. విడిచిపెట్టవలసివస్తే విడిచి పెట్టనపుడు రోగం, మరీ ఎక్కువగా విడిచి పెట్టినా మంచంపట్టవలసి వస్తుంది. తొలగించిన సేవకుడు బెదిరిస్తే భయం, క్రొత్తగా వచ్చిన వాడు ఇంకా డబ్బు అడిగితే, సమ్మెచేస్తే భయం -, ఇట్లా కొన్ని వందల ఉదాహరణలను చూపవచ్చు.

శత్రువుల గురించే బాధపడడంకాదు, ఎక్కువ చొరవ తీసికొన్న మిత్రులన్నా భయపడతాం. కనుక కొన్ని సందర్భాలలో విడిలిపెట్టవలిసి వస్తుంది. ఇట్లా ఆలోచిస్తూఉంటే పనులెందుకు చేయాలా అని అనిపిస్తుంది.

ఏపని చేయకుండా ఆత్మ ఎట్లా ఉంటోందోకదా! అది ఎంత గొప్పదో! మనకు సమాధి నిష్ఠలేకపోయినా గాఢనిద్రావస్థ అందరికీ ఉంది కదా! ఆ నిద్ర ఎంత ఆనందదాయకమో! మహారాజు కూడా నిద్రపోతాడు కదా! ఎందుకోసం? అందు ఆత్మలో ఉండిపోతాం, ఆస్థితిలో పొందడం, విడిచి పెట్టడం ఉండదు కనుక. అదేనిజరూపమని భావిస్తాం. మనలను మనం పొందడం ఉంటుందా? ఆ పొందడాన్ని కోరుతున్నామంటే ఇపుడు దానికి భిన్నంగా ఉన్నామా? మనకంటె మనం భిన్నంగా ఎట్లా ఉండగలం? మనలను

మనం విడిచిపెట్టగలమా? అట్లా విడిచి పెట్టేవాడెవడు? మనం విదిలిపెట్టబడిన తరువాత మిగిలిన వారెవరుంటారు? మనకంటె మరొకడు మనలోలేనపుడు ఆత్మనువిడిచి పెట్టలేం, అది విడిచిపెట్టబడితే మిగిలేది ఏదీ ఉండదు. కనుక మనలను మనం విడిచి పెట్టలేం, మనలను మనం పొందేదికాదు. మనం మనంగా ఉన్నపుడు క్రొత్తదేదీ ప్రవేశపెట్టబడదు.

లలితా సహస్రనామాలలో అమ్మవారికి హేయోపాదేయ వర్జితా అనే నామం ఉంది. ఆమె ఆత్మస్వరూపురాలని అర్థం. హేయం=విడువ దగినది, ఉపాదేయం – పొందదగినది. అనగా పొందదగినదీ కాదు, విడువదగినదీ కాదు. మనం ఏం చేస్తున్నాం? పొందదగిన దానిని పొందుతూ విడువదగిన దానిని విడిచి పెడుతూ ఉంటూ కాలాన్ని వృథాచేస్తున్నాం. అంటే అవి రెండూ మన కంటె భిన్నమైనవి.

మనం మనగా ఉంటే, లేదా మనలో మనముంటే పని చేయవలసినపనే లేదు. విడువ వలసినదీ ఉండదు.

అందుచే నిద్ర సుఖశాంతులను ప్రసాదిస్తుంది. ఈ స్థితిలో దేవాసుర సంగ్రామం లేదు. ఈ స్థితి ఎల్లవేళలా లేకపోయినా రోజూ 7,8 గంటలపాటు విశ్రాంతి నిస్తున్నాడు భగవానుడు. కొంతసేపైనా విశ్రాంతి తీసికొంటాడని దయచూపిస్తున్నాడు.

అయితే నిద్రయే పరమగమ్యమా ?

శాంతి పొందాలంటే ఏ కోరికలు లేకుండా ఉండాలంటే నిద్రనే శరణు జొచ్చాలా? మెలకువ వచ్చినపుడల్లా నిద్రమాత్రలు వేసుకొందామా?

అది పద్ధతి కాదు. నిద్రలో మనస్సు పనిచేయదు, ఆత్మయే ప్రకాశిస్తూ ఉంటుంది. అయితే ఆత్మానుభవాన్ని పొందుతున్నామా? లేదు. మేల్కొన్న తరువాత మాత్రమే హాయిగా నిద్రపోయానని అంటున్నాం. నిద్రలో

ఉన్నపుడనడంలేదు. ఒక కర్రదుంగలా పడియుంటాం. ఇట్లా అచేతనంగా పడియుండడం మనలను మనం అగౌరవించుకొనునట్లు అగపడడం లేదా? జడంగా ఉన్నావని ఎవరైనా అంటే మనకు కోపం రావడం లేదా? దీనిని మనంతట మనం చేస్తున్నామా? మనకై చేస్తున్నామా? ఎల్లపుడూ ఈ జడావస్థ ఏమిటి?

సృష్టిలో అచేతన పదార్థాల నుండి చేతన పదార్థాల వరకూ ఒక ఇంద్రియం నుండి ఆరు ఇంద్రియాల వికాసం కన్పిస్తోంది. అన్నింటి వికాసం మానవునిలోనే, ఆరవ, ఇంద్రియం వల్ల (మనస్సు) మానవునకు అనేక కష్టనష్టాలు వస్తున్నమాట నిజం.

ఈ ఇంద్రియాల వల్ల ఎన్ని కష్టనష్టాలు, వచ్చినా మంచిపనులను వీటివల్ల చేయవచ్చు. మనస్సును, ఇంద్రియాలను, క్రియలను ఒక క్రమపద్ధతిలో పెట్టి ఉన్నత భూమికలలో విహరించునట్లు చేయవచ్చు. సంగీతం, శిల్పం, కవిత్వం, సంఘసేవ, ప్రేమ, త్యాగం మొదలగు వాటిని ఇంద్రియాలను సరియైన మార్గంలో పెట్టినపుడు సాధించడం లేదా? ఆరు ఇంద్రియాలను దాటి మహోత్తమ ఆత్మజ్ఞానంలో విహరించవచ్చు. జడస్థాయికి దిగనవసరంలేదు.

వైరాగ్యం - అభ్యాసం

అసుర ప్రవృత్తులను వైరాగ్యం, అభ్యాసాల వల్ల నియమించవచ్చని దైవీశక్తులను శక్తిమంతములుగా తీర్చిదిద్దవచ్చని గీతలో చెప్పాడు.

ఇష్ట అనిష్టాలకు దూరంగా ఉంటూ పొందుట, విడిచిపెట్టుటకు దూరంగా ఉంటూ ఉండడమే వైరాగ్యం. అపుడు జీవుణ్ణి ఏ ధార్మికనియమాలు తీర్చిదిద్దుతాయో, గమనించి వాటిపై ఇంద్రియాలను, మనస్సును కేంద్రీకరించాలి. ఇట్లా పనులు చేసేటపుడు లాభనష్టాలు, జయాపజయాలు,

గౌరవా గౌరవాలు రావచ్చు. వీటినన్నిటిని సమాభావంతో చూడడానికి వైరాగ్యం ఉపకరిస్తుంది.

ఇట్టి తీవ్ర ప్రయత్నం, లేదా శిక్షణయే అభ్యాసం. దేహాభ్యాసాన్ని గుర్చివిన్నాం. యోగాసనాలు సరిగా వేయాలంటే ఎన్నో రోజులు కష్టపడవలసి వస్తోంది కదా! రోజూ నిర్దిష్ట సమయంలో అభ్యసించడం వల్ల పట్టు సాధిస్తాం. అట్లాగే అసురప్రవృత్తుల వెంటబడే మనస్సును మరల్చి దైవీప్రవృత్తులలో పెట్టాలంటే తగినంత అభ్యాసం ఉండాలి కదా!

మిగతా ప్రాణులలో వికసించని మనస్సును, ఉన్నతంగా తీర్చిదిద్దాలి. ఆత్మస్థాయి వరకూ తీసికొని రాగలగాలి. అందులీనం చేయగలగాలి. చిట్టచివర దశలో ఆ ఇంద్రియాలను విడిచి పెట్టగలగాలి. అట్లా ఇంద్రియాలనర్పించడం నిద్రను ఆలంబనంగా చేసికొని మాత్రం కాదు. నిద్రబోతూ ఉండడం జడస్థితికి తీసికొని పోతుంది. అందాత్మానుభవం లేదు. నిద్రపోతున్నట్లుగా కనబడే సమాధిస్థితిలోనే సాధ్యం. అందింద్రియాలు పనిచేయవు. ఆత్మయే వాటికి ఆధారం, వాటికది అతీతం కూడా.

శరీరానికి, మనస్సుకి కొద్దిపాటి విశ్రాంతి నిచ్చే నిద్ర అవసరమే. కాని అది శాంతితో కూడిన సమాధి స్థితి మాత్రం కాదు.

ఆనంద మయం

ఆత్మకున్న శాంతి, మరణంలోనో, గాఢనిద్రలోనో ఉన్న శూన్యస్థితి కాదు. బుద్ధుని నిర్వాణం, శూన్యస్థితియే. ఉపనిషత్తులనాధారం చేసికొని సమాధిలో కలుగు శాంతిని జ్ఞానానందమయమని శంకరులు నిర్ధారించారు. అది పూర్ణానుభవం కాని, శూన్యం కాదు. మరణంతో అంతం కాని ఆత్మ సర్వవ్యాపకం, ఆనంద స్వరూపం కాకుండా పోతుందా?

ఆత్మఎట్లా సర్వవ్యాపకం? జ్ఞానమయం? ఒకటి సజీవంగా ఉందని

అంటే దానికి బుద్ధియుందని భావావేశం ఉందని, అది జడానికి భిన్నమని భావించడం లేదా? ప్రాణానికి ప్రాణమైన ఆత్మ, చైతన్యస్వరూపమే, అందు బుద్ధి, భావావేశాల సమ్మేళనం ఉంటుంది అదే జ్ఞానం.

ఆత్మ దేనితోనూ సంబంధం పెట్టుకోదని లోగడ చెప్పాను. తనను తాను మాత్రమే తెలిసికొంటుంది ఇంద్రియాలచే, మనస్సుచే తెలియబడేది కాదు. సమాధిలో మనస్సు అణగినపుడు ఆత్మానుభవం కల్గుతుంది. అట్టి అనుభవం నిద్రలో ఉండదు.

అది ఎట్లా ఆనందమయం? అని ప్రశ్నిస్తే మరి ఎట్లా ఉంటుందని భావిస్తున్నావని అడుగుతున్నా. బంధాలు లేనిది, స్వతంత్రమైనది ఆనందమయం కాకుండా పోతుందా? మనస్సు, ఇంద్రియాలు చేసే అల్లరి వల్ల బాధపడుతున్నాం ఆత్మకివిలేవు. అంతమాత్రంచే అది బుద్ధిలేనిదని భావించరాదు అది చైతన్యమయం, స్వయం ప్రకాశం అట్టి బంధరాహిత్యాన్ని ఊహిస్తే ఆనందస్థితి దానికున్నట్లు భావించలేమా? బంధాల మధ్యలోనే అప్పుడపుడు ఆనందాన్ని అనుభవిస్తూ ఉండగా బంధరహిత స్థితిలో చెప్పేదేమిటి? తనకంటె మరొక దానిని తెలియని ఆత్మకు బాధ, భయాలుంటాయా? అది శాశ్వతం, ఆనందమయం.

మామూలు జీవితంలో అధికారి మనలను నియమిస్తాడు. అతణ్ణి అతని భార్య అదుపులో పెడుతుంది. అట్లాగే మనలను ప్రకృతి నియమిస్తే ఆ ప్రకృతిని నియమించేవాడు ఈశ్వరుడు. అతడుకూడా భక్తపరాధీనుడే. ఎక్కడ ద్వైతముందో అక్కడ స్వాధీనం లేదు, పరాధీనమే మనమెవ్వరం స్వాధీనులలంకాము. అట్లా స్వాధీన స్థితిలేనపుడు ఆనందం ఎట్లా అనుభవించగలవు? కేవలం అద్వైత స్థితిలోనే పరాధీనం కాని స్వాధీనానుభవం, అఖండానందం ఇంద్రియాలవల్ల పొందే ఆనందం, ఆ ఆనందంలో కొన్ని చుక్కలు మాత్రమే. ఈ మామూలు ఆనందం మాయవల్లనే. ఆత్మను ఆధారంగా చేసికొనే జీవాత్మను నడుపుతోంది మాయ.

బాహ్యవస్తువుల వల్ల ఆనందం రాదు. లోనున్న ఆత్మయొక్కప్రకాశం అంతఃకరణాలలో అనగా మనస్సు మొదలైన వాటిల్లో మాయవల్ల ప్రతిబింబిస్తోంది. జీవుడు ఇంద్రియాల ద్వారా కొద్దిపాటి ఆనందాన్ని అనుభవించడానికి ఈ మాయ కారణమైంది. బాహ్య వస్తువులనుండి ఆనందం లభిస్తున్నట్లుగా ప్రతిబింబిత కిరణాలు తోపింపచేస్తున్నాయి.

ఆత్మానందలేశమే బాహ్యసుఖం

చిల్లులున్నకుండలో దీపం ఉన్నట్లుగా శరీరంలో ఆత్మఉందని, అది జ్ఞానదీపంగా ఆనందమయంగా ఉందని దక్షిణామూర్తి స్తోత్రంలో శంకరులన్నారు. మాయ ఈ ఆత్మదీపపుకాంతులను ఇంద్రియాలనే చిల్లులు ద్వారాపైకి ప్రసరింపచేస్తోంది. ఏ వస్తువులపై ఈకాంతి ప్రసరింపబడుతుందో ఆవస్తువులకు కాంతి వస్తోంది తాముకాంతి నిస్తున్నామని ఇంద్రియాలను కోవడం లేదు, అసలీకాంతిని, ప్రసరింపచేసేది ఆత్మయనీ అనుకోవడం లేదు. ఆ ఇంద్రియాలేమని సంతోషిస్తున్నాయంటే బాహ్యవస్తువులే సహజంగా కాంతిమంతములని వాటితో కలయిక వల్ల అవి వీటిని స్వీకరిస్తున్నాయని భావిస్తున్నాయి. వెఱ్ఱివాడైన జీవుడు ఆత్మకు చెందిన జ్ఞానానందాలను బాహ్యవస్తువుల నుండి పొందినట్లుగా భ్రాంతిపడుతున్నాడు.

చిల్లులతో ఉన్నపందిరి ఉందని భావిద్దాం. వాటి సందులనుండి సన్నని కాంతి ప్రసరిస్తూ ఉంటుంది. ఒక చిన్నపిల్లవాడు చూస్తూ పందిరే కాంతి నిస్తోందని భావిస్తాడు. దానిపైన సూర్యుడున్నాడని అతని కాంతి దీనిపై పడగా, దీనికున్న చిల్లుల వల్ల కాంతి వస్తోందని అనుకోడు. మన పరిస్థితి అంతే.

మన శరీరం ఆత్మకాంతిని కప్పియుంది. ఇంద్రియాలనే చిల్లులు ద్వారా ఆకాంతి మినుకుమినుకుమని ప్రకాశిస్తోంది. కనుక ఇంద్రియాలే

ఆనందాన్నిస్తున్నాయని భావిస్తాం. సూర్యకాంతిని అడ్డుకొన్న పందిరిని తొలగిస్తే తిన్నగా సంపూర్ణ సూర్యకాంతి మనమీద పడదా? పందిరి చిల్లులను ఆసరాగా చేసికొని పరిమిత కాంతి వస్తున్నట్లుగా ఈ శరీరాన్ని ఆధారంగా చేసికొని ఆనందాన్ని అనుభవిస్తున్నాం. అనగా దేహభ్రాంతి ఎప్పుడైతే తొలగిపోయిందో అంతా అఖండానందమే అదే ఆత్మతత్వం.

జాగరూకతతో ఆలోచిస్తే బాహ్య వస్తువులు తమంతట తాము ఆనందాన్ని కలిగించలేవు. కాశ్మీరుశాలువాను కప్పుకొంటే కలిగే ఆనందం చలికాలంలోనే, అన్ని ఋతువులలో ఆనందాన్నిస్తోందా? కనుక శాలువాలో ఆనందం ఉందా? అద్భుతంగా ఒకడు గానం చేస్తు ఉంటే ఒక ఇష్టుడు మరణించాడనే వార్తను విని ఆసంగీతాన్ని ఆస్వాదించగలమా? జీవుని మనస్సు బాహ్య వస్తువులందు మగ్నమైనపుడు సంతోషం కల్గుతోంది. నిద్రబోతున్నపుడు ఏవస్తువైనా ఆనందం కల్గిస్తోందా? మానసిక సుఖం శాశ్వతంగా ఉండదు. పందిరిలో చిల్లులున్నపుడే ఆచిల్లుల నుండి కాంతిగాని, పందిరి దట్టంగా ఉన్నపుడు వెలుతురు కనబడదు కదా! అట్లాగే మనస్సు పరిమిత సుఖాన్నిస్తుంది. అది ఆత్మలో లీనమైనపుడు బాహ్య సుఖస్పర్శ ఉండదు.

జీవుడాత్మ స్వరూపుడైనా బాహ్యమైన వాటివెంట పరుగెడుతున్నాడు. ఈ స్థితిని అద్వైత గ్రంథాలు, కస్తూరిమృగం తననుండి వచ్చేసువాసనను గుర్తించకుండా అది ఎక్కడో ఉందని పరుగెత్తినట్లుగా జీవుడు పరుగెడుతున్నాడని పోల్చాయి.

శాంతంతో కూడిన ఆనందం మనస్సుకి పట్టుబడదు

మనం మామూలుగా మనస్సును గుర్తిస్తాం ఆత్మనుకాదు ఆనందం అంటే శాంతం, శక్తితో కూడిన భావమని, అందన్ని భావాలు అణగిపోయే స్థితియని భావిస్తాం. ఆనందం ఒక శక్తి యొక్క ఆకారమని భావిస్తూ ఆత్మయొక్క

ప్రశాంత స్థితిలో ఆనందాన్ని ఎట్లా అనుభవించగలమని, మీరాశ్చర్యపడవచ్చు. ఆత్మకు సంబంధించిన శాంతిని, ఆనందాన్ని మనస్సుకు అనుకూలమని ఎట్లా ఊహించగలం? ఆత్మ, మనస్సునకు అందేది కాదుకదా! ఆత్మకే జ్ఞానం, ఆనందం, శాంతం మొదలైనవి తెలుసుకదా? వీటిని మనస్సు ఎట్లా గ్రహించగలదు? మన శరీరంలోనే కంటితో చూసి అనుభవించిన దానిని చెవులానందించలేవు కదా! చెవికింపైన గానాన్ని కన్నులానందించగలవా? ఇట్లా ఆలోచిస్తే ఇంద్రియాలవల్ల ఏ సుఖాన్ని అనుభవించలేమని నిర్ధారణకువస్తాం. అయితే ఆనందం అనుభవిస్తూ ఉంటే శాంతంగా ఉండవచ్చు.

శాంతం అంటే ఏమిటి? అన్నీ అణిగి ఏ కదలిక లేని స్థితి. బాహ్యమైన దానివల్ల మనస్సు సంతోషపడుతుంది. అన్నీ అణగినపుడు అనుభవించవలసిన దానిని కదలికలతో కూడిన మనస్సెట్లా అనుభవించ గలదు? దీనికి విరుద్ధంగా తనకంటె భిన్నమైన దానిని గుర్తించని ఆత్మయే అనుభవించగలదు.

మనస్సునకు అతీతమైన శక్తులు కలిగి అనగా గంధర్వ, పితృ, దేవతల స్థితి ఏర్పడినపుడు ఉన్నతమైన ఆనందాలను అనుభవించగలదు. పైవారి ఆనందాల స్థాయిని తైత్తిరీయ ఉపనిషత్తు వివరించింది. ఆ ఆనందం మానవులకు అందదు. కాఫీ త్రాగడం వల్ల వచ్చిన ఆనందాన్ని ఆవు గుర్తించగలదా? అట్లాగే అదీను, అన్ని ఆనందాలలో ఉత్తమమైనది ఆత్మానందం.

పరాశక్తియొక్క ఆనందం కూడా శాంతాత్మలోనే

లలితా సహస్రనామాలలో పరాశక్తికి ఒకనామం-

స్వాత్మానందలవీభూత బ్రహ్మాద్యానందసంతతిః

అనగా బ్రహ్మ నుండి సమస్త దేవతల ఆనందాలు అమ్మవారి ఆనందంలో లవలేశము మాత్రమే.

మన ఆనందం పైవాటితో పోలిస్తే అల్పాతి అల్పంగా కన్పిస్తుంది. కారణమేమంటే దేవాసుర శక్తులు మనలను నియమించడం, అవి చెప్పినట్లు మనం నడుచుకోవడం వల్లనే. మనకంటె దేవతాశక్తులు విశిష్టమైనవి. వారనుభవించే ఆనందం ఉన్నతమైనది. దేవతలందరిలో బ్రహ్మ అనుభవించు ఆనందం మహోన్నతమైనది. ఆ ఉన్నతత్వం స్వతంత్రతను బట్టివస్తుంది. అదీ కేవలం స్వతంత్రంకాదు. అతడూ మహావిష్ణువుయొక్క అధీనంలో ఉండవలసిందే, ఆ విష్ణువు, పరాశక్తికి లోబడినవాడే. కనుక అమ్మవారి ఆనందం నిరవధికం, పరమస్వతంత్రం. బ్రహ్మాది దేవతల ఆనందం కూడా ఆమె ఆనందంతో పోలిస్తే లవలేశమే అని పైనామానికి అర్థం.

శక్తి పెరిగిన కొలదీ ఆనందస్థాయి. ఎక్కువంటున్నాం. అంతమాత్రంచే శక్తినుండే ఆనందస్థాయి ఎక్కువంటున్నాం. అంతమాత్రంచే శక్తినుండే ఆనందం రాలేదు. అసలు శక్తికి ఆనందానికి సంబంధం లేదు. మనకంటె తక్కువ శక్తికలవారిని మనం నియమిస్తున్నామని తప్పుగా అహంకరిస్తూ ఉంటాం. కనుక దీని వల్ల ఆనందం రాదు. అయితే శక్తి వృద్ధి చెందినకొలదీ ఆనందాభివృద్ధి పొందుతుందని ఎందుకన్నారు? నీకు శక్తిపెరిగిన కొలదీ నిన్ను నియమించువారు కొద్దిమందే ఉంటారు. కనుక ఇతరులను నియమించే అధికారం కాదు, నిన్ను నియమించే వారి సంఖ్య రాను రాను తగ్గడం, స్వతంత్రత పెరగడం తటస్థిస్తుంది. ఒక గుమస్తాకు ఆఫీసరు ఉద్యోగం వస్తే ఇతరులను నియమించగలననే భావనతో ఉండడం కాదు. తనను నియమించే పై ఆఫీసరు లేదని ఎక్కువగా ఆనందిస్తాడు. కొని నిర్ణయాలను చక చకా తీసికొనే వెసులుబాటు వస్తుంది కదా!

పెద్ద పెద్ద ఆఫీసర్లు చీటికీ మాటికీ ఒక శాసన సభ్యుని మాట

వినవలసివస్తే ఈఉద్యోగం కంటె గుమాస్తా ఉద్యోగమే నయమని భావిస్తారు కదా! అతని కున్న స్వతంత్రత తనకు లేదని వాపోతాడుకదా! కనుక శక్తికంటె స్వతంత్రతకే ప్రాధాన్యం.

కొంతమంది పెద్ద పెద్ద కంపెనీలలో మేనేజర్లుగా పనిచేసి ఉద్యోగాలను విడులుకొని విడిగా కంపెనీలు పెడతారు. తక్కువ ఆదాయం వచ్చే కంపెనీని విడిగా ఎందుకుపెట్టావని ప్రశ్నిస్తే ఇప్పుడెవరి చెప్పుచేతలలోనూ ఉండనవసరం లేదు, హాయిగా స్వతంత్రంగా ఉన్నానని జవాబిస్తాడు.

కనుక స్వతంత్రత వల్లనే సుఖం. శక్తి నుండికాదు. శక్తితో బాటు ఆనందమూ వృద్ధిపొందితే అపుడు శక్తి నీ ఆటంకాలను నియమించిందన్న మాట.

పరాశక్తి యొక్క ఆనందాన్ని గురించి చెప్పినపుడు, ఆమె ఆనందం, ఆమెశక్తి వల్ల వచ్చిందని కాదు. ఆమె అనుభవించేది స్వాత్మానందమే. అఖండమైన, అపరిమితమైన, స్వతంత్రమైన ఆత్మను అనుభవిస్తూ ఉంది కనుకనే. అంతేకాని ఆమె మహాశక్తి అవడం వల్ల కాదు.

ఆత్మకు శక్తికీ సంబంధం లేదు. బాహ్యస్థితిలోనే అనుకూలంగానో ప్రతికూలంగానో పనిచేస్తుంది. ఆత్మకు బాహ్య మనేది లేదు. శక్తి ద్వైతానికి సంబంధించింది. ఆత్మ అద్వైతానికి.

శక్తికి గుణాలు, చర్యలూ ఉంటాయి. ఆత్మనిర్గుణం, నిష్క్రియం అందుకే దానిని శివమన్నారు. ఆత్మానందమని గాని, శివానందమనిగాని వాడుతూటంటాం. పరాశక్తి కూడా శివానందాన్ని అనుభవిస్తుంది. శివానందాన్ని, లేదా జ్ఞానాన్ని అందరికీ ఇస్తుందని, తాను దక్షిణామూర్తి అంటూ అని లలితా నామాలలో ఒకటి:-

దక్షిణామూర్తి రూపిణీ - సనకాది సమారాధ్యా శివజ్ఞాన ప్రదాయినీ.

పరాశక్తి యొక్క ఆనందంవేరు, మన ఆత్మానందం వేరని కాదు. ఆత్మ అని ఎప్పుడైతే అన్నామో, పెద్ద, చిన్న తేడాలుండవు. ఆ ఆత్మానందం సమగ్రశక్తితో ఉండగా కొద్దిపాటి శక్తితో సమస్త జీవులలోనూ ఉంటుంది.

ద్వైతస్థితిలోనున్న బ్రహ్మ అనుభవించే ఆనందంకంటె అద్వైతస్థితిలోని ఆనందం అపరిమితమని సారాంశం. ఆ ఆనందం సంపూర్ణ శాంతితో అనుభవిస్తున్నాననే భావనతో కూడినది.

గాఢ నిద్ర

గుర్తింపబడని ఆనందం ఆనందమేకాదు. ఒక చక్కని పుస్తకం కనబడినపుడు అంధుడవైతే ఏమి అనుభవించగలవు? గాఢనిద్రలో అట్లాగే నీవాత్మను అనుభవించలేవు. సమాధి స్థితిలో అట్టి ఎఱుకతో కూడిన ఆత్మానందం ఉంటుంది. భగవానుడు జీవులకు విశ్రాంతి నీయడం కోసం నిద్రను కల్పించాడు గాని ప్రతి జీవికి సమాధి ఆనందాన్ని ఈయలేదు. అది తీవ్రసాధకులకు అతని అనుగ్రహం వల్ల లభించేది.

చిల్లులున్న కుండలో దీపం పెట్టగా ఆ చిల్లుల నుండి కాంతి కిరణాలు వచ్చి మనకు ఆనందం కల్గించునట్లుగా ఇంద్రియాలవల్ల అట్టి ఆనందం కల్గుతుందని చెప్పాను. ఇది మెలకువగా నున్నపుడు మాత్రమే. చిల్లులులేని కుండను బోర్లించినపుడు కాంతిపైకి కనబడడంలేదు. దానిని మనం అనుభవించడం లేదు. గాఢనిద్ర కూడా అట్టిదే. బాహ్య ప్రపంచం యొక్క రణగొణ ధ్వనులు మాత్రం వినబడవు. మెలకువగానున్నపుడు పొందే ఆనందలేశము కూడా గాఢనిద్రలో ఉండదు. పట్టి కటిక చీకటి. ఇక సమాధిలో దీపకాంతిని అంతరంగా చూడగలం.

మన ప్రయత్నం లేకుండానే నిద్ర ముంచుకువస్తుంది. ఇది బాహ్యమైనది. అది మనలను నియమిస్తుంది.

కలలుగనే స్థితి

గాఢ నిద్రలేని స్థితి ఒకటుంది. కలత నిద్రలో కలలు వస్తాయి. జాగ్రదవస్థలో తటస్థించే కొన్ని భయంకర, అసభ్యకర, అసందర్భకర భావాలను బుద్ధిచేత అణచిపెడతాం. నిద్రలో బుద్ధియొక్క నియంత్రణ ఉండదు కనుక ఈ సుప్తమైన, భావాలు మేల్కొంటాయి. అవే కలలు, కలలలో మనస్సు, అటూ ఇటూ చలిస్తూ ఉంటుంది. కలలో మనస్సు అటూ ఇటూ చలిస్తూ ఉంటుంది. కలలోని భయాలను తట్టుకోలేక లేచి అరుస్తూ ఉంటాం. భక్తి యోగ సాధన చేస్తూ బ్రహ్మచర్యానికై గట్టిగా ప్రయత్నం చేసేవారు కొంతమంది నా దగ్గరకు వచ్చి ఏమిటీ చెడ్డ కలలని వాపోతూ ఉంటారు.

కనుక నిద్ర తన ఇష్టం వచ్చినట్లు మనలనులాగేస్తుంది. అందు సమాధినిష్ఠలోని భగవదనుగ్రహమున్నట్లుండదు. సమాధి స్థితిని పొడిగించవచ్చు. కాని నిద్రలో దేవాసుర సంగ్రామం జరుగుతూ ఉంటుంది. నిద్రలో కూడా కలలరూపంలో అసుర ప్రవృత్తులు మనపై దండెత్తుతాయి. ఎప్పుడోగాని మంచి కలలురావు. దేవాలయ దర్శనంవంటివి ఎప్పుడో! పోనీ కలలులేని నిద్రను పొడిగించగలమా? ఆ గాఢనిద్ర కూడా ఒక కర్రదుంగలా పడియుండడమే అని చెప్పానుకదా!

అయితే మనం చేయవలసిందేమిటి? పరుగెత్తే మనస్సును నిమ్మదిగా దువ్వి లోచూపు దానికి అలవాటు చేసి అనగా ఆత్మపై దృష్టిపెట్టునట్లు అభ్యాసం చేయాలి. అనగా ఆత్మకు వశం చేసినగాని దీనికి శాంతి, సుఖము ఉండదు. ఇంతకంటె మరోమార్గం లేదన్నాడు గీతలో, మనస్సు ఎన్నిసార్లు పరుగెత్తుకొనిపోతూ ఉన్నా దానిని నియమించాలన్నాడు:-

యతో యతో నిశ్చరతి మనశ్చంచల మస్థిరం

తతస్తతో నియమ్యైతత్ ఆత్మన్యే వవశం నయేత్

మనస్సు ఆత్మవశమెప్పుడౌతుంది?

మనస్సుకు అతీతం ఆత్మయని, దానితో సంబంధం లేకుండా తనంతట తానుంటుందని ఒక మూల చెబుతూ మనస్సును ఆత్మవశం చేయమంటారేమిటని ప్రశ్న. నిష్క్రియమైన, మనస్సుకు అతీతమైన ఆత్మ, మనస్సునెట్లా వశం చేసికొంటుంది?

నిజమే మాయవల్ల దీనిని వశం చేసికోలేక పోతున్నాం. అయితే ఆ ఆత్మయే మనస్సుకి ఆధారం. అది లేకపోతే మనస్సుకు ఏ వ్యాపారాలుండవు. మనస్సు మాయతో కలిసి అటు ఇటూ తిరగడానికి శక్తిని ఆత్మ ఇచ్చినట్లు నిజమైతే తనలో వశం చేసికోవడానికీ అదే ఆత్మ పనికివస్తుందని చెప్పవచ్చునుకదా!

ఏమిటీమాయ? అది ఈశ్వరశక్తి అదే అమ్మవారు. మాయాశక్తి అద్దంలో సూర్యకాంతి ప్రతిబింబించినట్లు అంతఃకరణంలో ఆత్మచైతన్యం ప్రతిబింబించునట్లు చేస్తుంది. ఆ అంతఃకరణం చైతన్యం, భావాలను, బుద్ధినిగ్రహిస్తోంది. (అంతఃకరణం నాల్గువిధాలుగా ఉంటుంది. స్మరించే చిత్తంతో, సంకల్ప వికల్పాలతో కూడిన మనస్సుతో, నిశ్చయజ్ఞానం కల్గించే బుద్ధితో, నేననే అహంకారంతో ఉంటుంది.)

మరోవిధంగా చెబుదాం. అంతటా, నిండిన ఆకాశం, కుండలోనూ ఉంది. అంతటా ఉన్నది మహాకాశం. కుండలో ఉన్నది ఘటాకాశం. మహాకాశం వంటి అనంత చైతన్యాన్ని శరీరమనే కుండలో బంధించునట్లు చేసేది మాయ. ఈ భేదాన్ని సృష్టించేది మాయయే. దీనిని పోగొట్టేది మాయాశక్తియే. అనగా ఆత్మచైతన్యాన్ని జీవుడు అనుభవించునట్లు చేసేది అదే.

మనస్సును మచ్చికచేయి, లేదా మనస్సును లాగు అనే మాటలు

అజ్ఞానంలో ఉన్న జీవుల గురించే. జ్ఞానికీ సలహాలెందుకు? మనస్సును మించి అజ్ఞాని మరొకటి ఆలోచించదుకదా! అట్టి సందర్భాలలో ఈ సలహాలెందుకు పనికి వస్తాయి? అయితే మనస్సు తనంతట తాను మచ్చిక చేయబడుతుందా? లాగబడుతుందా? పరుగెత్తడం దాని స్వభావం కదా!

ఈశ్వరానుగ్రహం

ఇక్కడే ఈశ్వరానుగ్రహం పనిచేస్తుంది. తనమాయాశక్తి చేత ఈ జీవుల్ని సృష్టించాడు. సృష్టిలో భాగమైన మనస్సు ఒకదానికి అర్పింపబడవచ్చు. తనంతటతాను ఈ అర్పణచేసి కోదు. ఇది చంచలమని విన్నాం కదా! దీనిని వైరాగ్య అభ్యాసాదుల ద్వారా లొంగదీయాలని లోగడ భగవానుడన్నాడు. వాటిని మనస్సు అంగీకరించినపుడు జీవుడు అభ్యసిస్తాడు. ఆ పనిచేయడానికి అది ఒప్పుకొంటుందా? కోరికలతో నిండినవానికి వైరాగ్యం నూరిపోస్తుందా? మరిఎట్లా? ఇట్లా కొట్టు మిట్లాడే జీవునిపై భగవానుడు కనికరించి ఈ చంచలమైన దానిని పనిముట్టుగా చేసికొన్నాడేమిటని కనికరిస్తాడు. అపుడు జీవుడు అభ్యాసవైర్యాల వల్ల మనస్సును లొంగదీసికొనగలడు.

జీవుని కంటె ఈశ్వరుడధికమడవడంచే అతని అనుగ్రహం పనిచేస్తుంది. జీవుడు ఆత్మస్వరూపాన్ని తెలిసి కోవడానికి ప్రయత్నం మాత్రం చేయగలడు. అది సఫలమగునట్లుగా చేయువాడే ఈశ్వరుడే.

మనస్సు ఆత్మను గ్రహించలేదు. మన మీదపెత్తనం చెలాయించేది మనస్సని మాత్రం తెలుసు. కనుక మన ప్రయత్నం ఈ మనస్సు ద్వారానే చేయాలి. ఈ బాధలనుండి విముక్తుణ్ణి చేయి అని మాత్రమే మన మనస్సు ప్రార్థించగలదు. ఆవైరాగ్యాన్ని మాటిమాటికి చింతించాలి. ప్రార్థన తీవ్రమైన కొద్దీ పైవాడి అనుగ్రహం ఉంటుంది.

ఈశ్వరానుగ్రహం వల్లనే మహోన్నతమైన శాశ్వతమైన శాంత స్థితిని పొందగలవని భగవానుడన్నాడు:-

తత్ప్రసాదాత్పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతం (18-62)

తర్కాతీతం

మాయకు ఇది సాధ్యమని, ఇది అసాధ్యమని మనమెట్లా నిర్ధారించగలం? అట్లాగే అనుగ్రహం పట్ల కూడా. ఈతర్కించడమూ మాయలో భాగమే కనుక మన తర్కానికి అన్నీ లొంగాలనుకోవడం భ్రమ, బంధరహితమైన, శాంతమైన ఆత్మ కర్మ బద్ధమైందని తెలుసు. ఏది బంధించిందో అదే విడుదల చేస్తుందని ఎందుకనుకోకూడదు? ఇది హేతుబద్ధం కాదని తర్కించి ప్రయోజనం ఏమిటి?

అనేక సాక్ష్యాలు

మనస్సును గెంటివేయడం, ఆత్మ సాక్షాత్కారం వంటి విషయాలలో మన బుద్ధి, మన పాండిత్యం పనికి రావు. ఆత్మానందాన్ని అనుభవించిన మహాత్ముల చరిత్రలే సాక్ష్యాలు.

సదాశివబ్రహ్మేంద్రుల జీవిత చరిత్ర చూడండి. ఒక నవాబు ఇతని చేతిని ఖండించడం, అది మరల ఇతని యోగశక్తివల్ల అతుక్కొనడం వంటివెన్నో. కావేరీ నదీ తీరంలో యోగనిష్ఠలో ఉండగా వరదలు రావడం, తరువాత ఇసుకమేట వేయడం, అందీయన శరీరం కప్పబడడం జరిగింది. కొంతకాలానికి ఒకరైతు దున్నతూ ఉండగా నాగలికఱ్ఱుకు ఇతని దేహం తగిలి రక్తం వచ్చింది. పైకితీసారు. లేచాడు, ఆనందంతో ఎక్కడికో వెళ్లిపోయాడు.

అయ్యా, ఇది మూడువందల సంవత్సరాలు నాటి కథ, ఎవరో కల్పించారని మీరనవచ్చు. అట్టి మహాత్ములను మా పూర్వులు చూచారు.

గతశతాబ్దంలో కుంభకోణంలో మౌనస్వామి ఉండేవారు. వారు సమాధిలో

ఉండగా వారి కన్నులు తెరుచుకొనే ఉండేవి, మూయబడేవి కావు. ఇట్లా గంటలు, రోజులు గడిచేవి. రెప్పలపై చేతుల నద్దినా అవి ముడుచుకొనేవి కావు. నోట్లో అన్నం పెట్టడానికి భక్తులు ప్రయత్నించేవారు. వారు తినకపోతే పెదవులపై ఉంచేవారు. చీమలు కుడుతూ ఉండేవి. అయినా వారిలో, చలనం ఉండేది కాదు. ముఖకాంతి దివ్యంగా ఉండేది.

మనము నిద్రబోతున్నపుడు మన ముఖాలలో అట్టి దివ్యకాంతి ఉంటుందా? కాని మహాత్ములు సమాధిలో ఉండగా ఆత్మానందాన్ని సూచిస్తూ ఒక మందహాసరేఖ స్పష్టంగా వారిలో కన్పిస్తుంది.

ఇట్లా రోజుల తరబడి ఆత్మనిష్ఠలో ఉండే యోగులుండేవారు. నాల్కపై పంచదార వేసినా అది ఎంతసేపైనా కరగనట్లు వింటూఉంటాం. అంటే వారికి ఇంద్రియానుభవం లేనట్లే కదా! అట్లాగే కాశిలో ఉండే భాస్కరానందుల గురించి అనేక కథలు చెబుతూ ఉంటారు. ప్రత్యక్ష సాక్షులు చెప్పినవే చాలా ఉన్నాయి. 1950లో సిద్ధిపొందిన రమణులను గూర్చి వినలేదా! తేళ్లు, జెఱ్ఱులు కుట్టి కండలు బయటకు వచ్చి రక్తం కారుతున్నా దేహభ్రాంతి లేక సమాధి నిష్ఠలో ఉన్నట్లు వారి చరిత్ర చెబుతోంది.

అట్టి వారి సన్నిధిలో ఉంటేనే ఎన్నో అనుభావాలు కలిగిన భక్తులున్నారు. ఎంతో ఆశాంతితో, సమస్యలతో వారి దగ్గరకు వెళ్లేవారు, వారి సన్నిధిలో కొంతసేపు కూర్చుంటేనే అన్ని కష్టాలు పోయినట్లనిపించేదని చాలా మంది వారి అనుభవాలను చెబుతూ ఉండేవారు. దర్శనం చేసికొన్న వారే ఎందరో సాధకులై తరించినవారున్నారు. ఎట్టి సాధనలు చేయని మామూలు జనులు తిరిగివచ్చి అక్కడున్నంతకాలం సంసారం మరిచిపోయామని అంటూ ఉండేవారు. నామాదిరిగా వారు ఉపన్యాసాలిచ్చే వారు కాదు. ఏదైనా అడిగితే సమాధానం చెప్పేవారు. అయినా వారి మౌనమే భక్తులకు శాంతిని ప్రసాదించేది. అట్టి అనుభూతి నిద్రపోయేవానిని చూస్తే కల్గుతుందా?

ఇట్టి ఆత్మజ్ఞానుల నుండే అనుగ్రహ ప్రసారం జరుగుతుంది. అది శూన్యస్థితి కాదు. వారు శాంతులై శాంతస్థితిని అనుగ్రహిస్తారు. సాధకులకది తాత్కాలికంకావచ్చు. దానిని పొడిగించుకొంటూ సాధన చేస్తే మనస్సుని నిర్మూలించగలిగితే ఈశ్వరానుగ్రహం ఉంటుందని. మనం అంగీకరిస్తాం.

ఆనాటి శుకబ్రహ్మను గూర్చి విన్నాం. తరువాత సదాశివ బ్రహ్మేంద్రుల గురించి విన్నాం. నిష్క్రియులై విగ్రహం మాదిరిగా కదలికలేనట్లు కనబడినా అట్టివారు నిర్వికల్ప సమాధినిష్ఠలో బ్రహ్మానందాన్ని అనుభవిస్తారు.

జీవన్ముక్తులు

సమాధినుండి బైటకు వచ్చినా వారి నిష్ఠ చెక్కుచెదరదు. దాని నుండి బైటపడ్డారని మనం భావిస్తాం. బాహ్యప్రపంచంతో మనమాదిరిగా మరల సంబంధం పెట్టుకొన్నారని మనమనుకొంటాం. కాని వారు ఆత్మనిష్ఠకలిగే యుంటారు. చంటిపిల్లవాడు నిద్రబోతూనే పాలు త్రాగుతూ ఉంటాడు కదా! అట్లాగే ఆత్మనిష్ఠులైయుండి ప్రపంచవ్యవహారాలను నడుపుతున్నట్లుగా ఉంటారు. మన మాదిరిగా కోపతాపాలున్నట్లు కనబడినా ఆత్మానందంతో ఉండే ఇదంతా.

ఆత్మనుండే ఆనందం

ఆత్మానుభవం అంటే పూర్ణానందమే కాని కేవలం శూన్యస్థితి కాదని చెప్పాను. కుండకు చిల్లులుండడం, అందుండి వెలుతురు రావడం గుర్తుపెట్టుకోండి. చిల్లులవెలుతురే అందుండేదని అందుదీపం లేదనడం ఎటువంటిదో ఆత్మ, ఆనందస్వరూపం కాదనడం అట్టిది. చిల్లుల ద్వారావచ్చేది కొద్దికాంతి. అట్లే ఇంద్రియాల వల్ల సుఖం తాత్కాలికం, పరిమితం.

ఒక ఎండిపోయిన ఎముకను కుక్కలు కొరుకుతూ ఉంటాయి. కొరికిన

కొద్దీ పండ్లలోని రక్తమే దానికద్దుకొని, అది ఎముక నుండే వస్తోందని భ్రమించి ఇంకా గట్టిగా కొరుకుతూనే ఉంటుంది. కొరికిన కొద్దీ రక్తం. అది తనదే, అట్లాగే బాహ్యవస్తువులు నిజమైన సుఖాన్ని ఈయడం లేదు. కుక్క నోటినుండి రక్తం వచ్చినట్లు ఇంద్రియాలలోనే సుఖం ఉంది. ఆ ఇంద్రియాల సుఖం దేని నుండి వచ్చింది? దానికాధారం ఆత్మయే. అట్టి మూలం నుండి ఆనందాన్ని అన్వేషించకుండా కొద్దిపాటి సుఖాన్ని ఇంద్రియాలనుండి పొందుతున్నాం.ఇంద్రియాలలో ప్రతిబింబించిన ఆనందాన్ని అనుభవిస్తున్నాం. ఆనందం స్వీయమైనది. బాహ్యం నుండి వచ్చేది కాదు.

కర్తయే

ఇది నా దండమని ఎప్పుడైతే అన్నానో నేనువేరు, వస్తువు వేరని అర్థం వస్తోంది కదా! అంటే నేను దండాన్ని కాను. అంటే ఇది నా అధీనంలో ఉంది. అంటే కలిగియున్నవాడని తేలింది.

నా శరీరమంటున్నావు. శరీరం నీవెట్లాకాదో చెబుతా నాకన్ను బాగా పనిచేయలేదు, నా చెవి బాగా పనిచేసింది అనినపుడు నీ అధీనంలో ఉన్న ఇంద్రియాల గురించి చెబుతావు. అంతేనే కాని అవి నీవు కావు కనుక అధీనములు. అధీనములు కలవాడు అనగా కర్త విడిగా ఉండాలి. అధీనంలో ఉంచుకొన్నది. "నేను" నా యొక్కనేనని అంటున్నావా? అట్లే అధీనంలో ఉంచుకొనబడనిది, అధీనముకలవాడే ఆత్మ.

మామూలుగా నా ఆత్మయని అంటారు అది తప్పు. ఆత్మ గురించి తెలియక ఇట్లా అంటారు. సాధారణంగా ఆత్మగురించి ఎపుడు మాట్లాడతాం? ఎవరైనా బాధలు పడుతున్నపుడు జీవుడు (ఆత్మ) బాధపడుతున్నాడురా అని అంటాం. వాడి ఆత్మక్షోభిస్తోందని అంటాం. ఎవరైనా పోతే అతని ఆత్మకు శాంతి కలుగుగాక అని ప్రార్థిస్తాం. ఈ అన్ని వ్యవహారాలలో ఆత్మ అనే

పదం వాడదం తప్పు. అది బాధపడేది కాదు, దానికి క్రొత్తగా శాంతిని తీసికొనిరాలేం. మాయా ప్రభావంచే జీవుడు, అనగా అంతఃకరణంలో ప్రతిబించించిన చైతన్యం అనగా జీవుడు బాధపడుతున్నాడు. చైతన్యం, బుద్ధి, మనస్సు, కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలతో, జీవుడు నియమింపబడుతూ ఇవే నేనని భావిస్తున్నాడు. దీనినే అహంకారమంటారు. అంతఃకరణం ఈ అహంకారంతోనే ఉంటుంది. ఆత్మయనేది అవిచ్ఛిన్నమైనది. దాని అంశ, నేనుగా అహంకారంగా కన్పిస్తోంది. దీనినే పొరపాటుగా ఆత్మయని పిలుస్తాం. ఇట్టి జీవాహంకారాన్ని ఆత్మగా పిలవడం ఎట్లా ఉందంటే ఒక కుండను సముద్రంలో ముంచి ఇందు సముద్రజలం ఉందని చెప్పడంవంటిది. కుండలో ఉన్నది కొద్దిపాటి సముద్రజలమే. అట్లా ఈ అహంకారాన్ని ఆత్మ అనడం అటువంటిది. సముద్రజలం అంతా కుండలో ఉందా? ఇది నేననే పూర్ణహంకారం కాదు. నేను, నాయొక్క అంటున్నాం. నాదియని ఆత్మఅనదు. దానికి "నేను" తెలుసు. దాని కంటె భిన్నంగా దేనినీ చూడదు. జీవునికి సంబంధించినవన్నీ దాని నుండి వచ్చినా ఆత్మమాత్రం వీటితో సంబంధం కలిగియుండదు.

కోరిక యొక్కలక్ష్యం

ఏ సుఖం మనం పొందినా ఈ జీవాహంకారానికి సంబంధించినదే. కోరికలను నెరవేర్చడం వల్ల ఈ అహంకారం ఆనందాన్ని పొందుతోంది. కాని ఆత్మ ఏదీ కోరదు. కోరిక ఎప్పుడు కల్గుతుంది? తనకంటె వేరైనది ఉన్నపుడు. ఆత్మకు బాహ్యమనేది లేదుకదా! ఈ చిన్న నేననే జీవుడు ఆత్మచైతన్యం నుండి వచ్చినా కోరికకూడా ఆత్మనుండే వస్తుందా? కోరిక ఆత్మను లక్ష్యం చేసికొంటుందా? జీవుని మనస్సునకు ఆత్మ గురించి తెలియకపోయినా కోరిక, ఆత్మను లక్ష్యం చేసికొంటుందా?

అయినా ఉపనిషత్తులు ఇట్లా వివరించాయి. యాజ్ఞవల్క్య మహర్షి భార్యయైన మైత్రేయికి ఉపదేశం చేస్తూ కోరిక అనే పదానికి బదులు ప్రేమ అనే పదం వాడాడు. రెంటికీ దగ్గర సంబంధం ఉంది. మన కోరికనుబట్టి వస్తువులను ప్రేమిస్తాం కదా! ప్రేమించకపోతే కోరం. భార్య, భర్తను ప్రేమిస్తోందంటే అతని కోసం కాదని తన తృప్తికోసమే అన్నాడు. అట్లాగే అతడీమెనుకూడా. అందువల్ల వస్తువులు ప్రేమపాత్రములయ్యాయి. లోగడ మీకు చెప్పాను, గుర్తుందా? తండ్రి ముందు డబ్బును-తరువాత కొడుకును-తరువాత రెండవ భార్యను-తన ఆరోగ్యాన్ని-జ్ఞానేంద్రియాలకై కర్మేంద్రియాలను విడిచిపెట్టడం. ఇట్లా మానసిక తృప్తి కోసం మొత్తం ఇంద్రియాలనే, మనస్సునే లక్ష్యం చేయకపోవడం మొదలైనవి. ఇట్లా అన్ని కోరికలకు జీవితం, దాని మూలం ఆత్మయే, దీనినే ఏదోవిధంగా జీవులు కోరుతారు. పై కథలో ఒక్కొక్క కోరికనే మరొక కోరికకోసం విదిలిపెడుతున్నాడు. శరీరం కంటె మనస్సుపొందే ఆనందం కోసం శరీరాన్ని కూడా విదిలిపెట్టాలని సిద్ధపడుతున్నాడు. శరీరం ఉంటే మనస్సుంటుందనే భావన కూడా లేకుండా తెగిస్తున్నాడు. ఇది ఒక విధంగా ఆత్మకోసమే. (అబద్ధమైన నేను కోసమే)

మనస్సును ఆత్మకు వశముచేయుట వేరు, మరి ఈ ఆత్మను పొందడమెట్లా?

ఆత్మను పొందడానికి అసురసైన్యాన్ని పరిమార్చడమే

మామూలుగా ఆత్మ, ఉండేది ఉండుటయే దాని లక్షణం. అదే సత్. జడముగా కాకుండా జీవంతో, బుద్ధితో, భావానుభవంతో ఉండేది చిత్. సహజమై సంతోషంతో ఉండడమే ఆనందం. కనుక ఆత్మను సత్-చిత్-ఆనందమని అన్నారు. స్వబోధతో (స్వయం జ్ఞానముతో) స్వానుభూతితో ఉండేది. మామూలుగా అనే పదం బాహ్యస్పర్శ లేని ఏకాంతాన్ని సూచిస్తుంది.

ఈస్థితి పట్టుబడాలంటే మనస్సు, శరీరాలు పోయినపుడు అనగా నేననే అహంకారం లేనపుడు, అసుర ప్రవృత్తులైన కామక్రోధాలు పోయినపుడు ఆత్మచిక్కుతుంది.

మరణంరాగా శరీరం పోతుందని భావిస్తున్నాం. మరణం తరువాత మరల శరీరం, నరకంలో యాతన శరీరం, ఆత్మహత్యవల్ల దెయ్యం మొదలైన శరీరాలు వస్తున్నాయి. శరీరమే నేననే భావన ఉన్నంత వరకూ శరీరాలను ధరించక తప్పదు.

దుఃఖ కారణం

అన్ని బాధలకు కామ క్రోధాలని ఒకచోట, వీటికి కూడా మనస్సు కారణమని మరొక చోట గీతలో అన్నాడు. కనుక మనస్సును కూడా గెంటివేయాలన్న మాట.

సాధారణంగా కోరికే అన్నిటికీ కారణమని భావిస్తాం. ప్రస్తుత దశలో దీనిని మచ్చిక చేసికోవాలి. ఎవరైనా సఫలం కాక బాధపడుతూ ఉంటే కోరికే నిన్నట్లా చేసిందని వ్రేలుపెట్టి చూపిస్తాం.

ఇదే మూల కారణం కాదు, కాకపోదు కూడా. కోరికకు మూలం మనస్సే. ఈ మనస్సుకి మూలకారణం మాయ. ఇదే సమస్త ద్వైతప్రపంచానికీ కారణం. మనస్సు ద్వారా జీవుణ్ణి బంధిస్తోంది మాయ. మనస్సు నుండి సంకల్ప వికల్పాలకు దూరంగా ఉండాలని జీవుడు ప్రయత్నించాలి.

సత్వరజస్తమోగుణాలున్నాయి. సత్వగుణం ప్రబలంగా ఉన్నప్పుడు మనస్సు సమస్థితితో స్పష్టతతో ఉంటుంది. తమోగుణం వల్ల జడత్వం, సోమరితనం. ఏదో పనిచేయాలని అనిపించడం రజోగుణం వల్లనే. ఏ గుణమైనా మనస్సుతో ఉన్నపుడే! ఇట్లా మూడు గుణాలు, మనస్సు-ఇవన్నీ మాయాకల్పితాలే. కనుక చివరకు మాయ, మూలకారణం అందాం.

దీనిని తొంగదీయడం మనవల్లకాదు. ఈ శక్తి మానవాతీతం. కనుక మనస్సునే దువ్వాలి. వర్షం పడుతూ ఉంటే ఆపగలమా? తలుపులు మాత్రం వేసికొని ఉందాం.

ఆ మనస్సునుండే కోరిక, దురద పెట్టే మనస్సు నుండే ఇది వస్తోంది.

గీతోపదేశంలో ఒక వరుస ఉంది. ఇంద్రియవిషయాలతో కూడిక వల్ల కోరికపుడుతోంది. సంగాత్ సంజాయతే కామః కోరిక నుండి క్రోధం. క్రోధం నుండి మోహం. మోహం వల్ల బుద్ధినాశం. దాని వల్ల పూర్తిగా నశిస్తున్నాడు జీవుడు. కనుక కామం మొదటి కారణం కాదు. మనస్సు ఇంద్రియవిషయాలలో చిక్కినపుడు కామం కల్గుతోంది. అది ఎక్కడ? మనలో అన్ని భావాలు మనస్సు నుండే కదా!

మనస్సు నాధారంగా చేసికొనే మాయ, జీవుణ్ణి సృష్టిస్తోంది. అది అణిగితే కామక్రోధాలుపోయి, శాంతి, ఆనందాలు లభిస్తాయి.

లోగడ చెప్పిన గీతోపదేశాన్ని వివరిస్తా, కామక్రోధాలే జీవుణ్ణి పాపంలో ముంచుతున్నాయి. ఈ కోరికకు అధిష్ఠానాలను చెప్పాడు. అవి ఇంద్రియాలు, మనస్సు, బుద్ధులని. ఈ మూడింటిని ఆధారంగా చేసికొని మాయ, నాటక మాడుతోంది. ఇంద్రియాల ద్వారా మనస్సు పరుగెడుతోంది. ఆకోరికకు కారణమూ మనస్సే. బుద్ధి దీనిని నియమిస్తోంది. అనగా మచ్చిక చేయబడేది మనస్సే.

ఇంద్రియాలూ గుర్తింపబడ్డాయి

ఇంద్రియాలు, దాని కంటె మనస్సు, దాని కంటె బుద్ధి, దాని కంటె ఆత్మ గొప్పదని ఒక దాని కంటె ఒకటి మించినవని గీతలో ఉంది.

ఇంద్రియాణి పరాన్యాహుః ఇంద్రియేభ్యః పరంమనః
మనసస్తు పరాబుద్ధిః యోబుద్ధేః పరతస్తుసః -3-42-

ఇంద్రియాలు గొప్పవన్నాడు. మరి ఇవి గోతిలో త్రోసివేస్తాయని చెప్పలేదా? ఇట్లా అంటారని చెప్పాడు. అంతేనే కాని పెద్దలు అంటారని అనలేదు. ఒక అభిప్రాయాన్ని చెప్పాడంటే ఇట్టి అభిప్రాయం కొందరిచే ఆదరింపబడిందని కదా!

మనలను పడవేసే ఇంద్రియాలు గొప్పవెట్లా అవుతాయి? ప్రతివస్తువు మంచి చెడ్డలతో ఉండేదే. కృష్ణునికిది తెలుసు. విషం కూడా కొన్ని సందర్భాలలో మందుగా ఉపయోగపడి ప్రాణాన్ని రక్షిస్తోంది. ప్రతిదాంట్లో కొంత మంచి ఉండకపోదని సూచించడానికే అంటారని అన్నాడు. పరిపక్వంకాని మానసికస్థితిలో ఇంద్రియాన్ని పూర్తిగా విదిలివేయగలదా? పూర్తిగా విడిచిపెట్టకుండా అందులోని మంచిని చూపించి చెడు ఫలితాల నిచ్చేవాటి నుండి దూరంగా ఉండాలని హితబోధచేస్తూ చివరకు విడిచి పెట్టేస్థితికి తీసికొని వస్తాడు.

డబ్బుకోసం భగవానుణ్ణి ప్రార్థించడం తప్పని తెలుసు. కేవలం భగవత్ప్రీతి కోసం అడగాలనీ తెలుసు. డబ్బుకోసం అడిగేవారిని ఉదారులన్నాడుకదా! బాధలనుండి విడుదల కోసం డబ్బు కోసం అడిగినా అందుకొన్ని మంచి గుణాలు లేకపోలేదు. కారణమేదైనా భగవానుణ్ణి స్మరిస్తున్నాడు కదా! అతడు శక్తిమంతుడని కొలుస్తున్నాడు కదా! అనుగ్రహం చూపించేవాడని భావిస్తున్నాడు కదా! కనుక అట్టివారిని 'ఉదారాః' అన్నాడు. ఏదో ఒక మార్గంలో నన్ను చేరుకొంటే చాలని, క్రమంగా సరియైన మార్గాన్ని ఉపదేశిస్తానని అన్నాడు కదా!

ప్రేమతో అతణ్ణి అర్చించనవసరం లేదట! భయంతో కంసుడు, క్రోధంతో శిశుపాలుడు, అతణ్ణి ఏదో రకంగా స్మరించారు. ఎంత చెడ్డమార్గమైనా పిసరంత మంచి ఉంటే దానిని ప్రోత్సహిస్తాడు. అది వేదధర్మ విశిష్టత.

మంచిని, చెడునూ రెంటినీ విడిచిపెట్టాలన్నా. మంచి కూడా

విడిచిపెట్టడం ఏమిటని ప్రశ్నిస్తారు కదూ! తరువాత చెబుతా. రెంటినీ విడిచిపెట్టడమే అద్వైతం.

మంచి, చెడులు అన్నీమాయ ప్రపంచానికి చెందాయని ప్రాథమిక దశలో నూరిపోస్తే పనిచేస్తుందా? దానం చేయవద్దని చెబితే వానిలో నిర్దయభావాన్ని కల్గించినట్లౌతుంది కదా! రోగం నీకు కాదు నీశరీరానికే శరీరం నీవు కావు పట్టించుకోవద్దని మొదట్లో ఉపదేశిస్తే రోగాన్ని వాడు నిర్లక్ష్యం చేస్తే మొత్తానికే నష్టం కదా! కనుక సామాన్యమానవుణ్ణి దృష్టిలో పెట్టుకొని శాస్త్రాలు ఆవిర్భవించాయి. క్రమవికాసాన్ని సూచించాయి.

ఇంద్రియాలు గొప్పవని ఈ అర్థంలో వాడాడు. ఇంద్రియాల వల్ల ఎన్నో సందర్భాలలో ఎంతో ఆనందాన్ని పొందుతున్నాం. అమ్మవారి ఆలయంలో ఆవు నేతి దీపం వెలిగిస్తే దాని నుండి వచ్చే వాసన దైవసానిధ్యాన్ని గుర్తు చేయడం లేదా? ఆమె అలంకరింపబడితే కన్నుల ద్వారా ఆనందాన్ని అనుభవించమా? దివ్య మంగళ విగ్రహం నేత్రానందకరంగా లేదా? త్యాగరాజు కీర్తనలు చెవులకు ఆనందాన్ని ప్రసాదించవా? చెడువైపులాగే లక్షణాలున్నా మొదటి దశలో ఆ ఇంద్రియం ఇచ్చే మంచిని విడిచిపెట్టలేం. తీర్థయాత్రలు, పూజలు, నామసంకీర్తనం, దేవాలయ నిర్మాణాదులు, సంఘసేవ ఇట్లా ఎన్నిటినో ఇంద్రియాల ద్వారానే చేస్తున్నాం.

పరాశక్తిచే నిర్మింపబడిన ప్రతి ఇంద్రియాన్ని ఒక యంత్రంగా భావించకుండా జీవం తొణికిసలాడుతున్నట్లుగా భావించగలిగితే ఆనందాన్ని ప్రసాదిస్తుంది. చిన్న కన్ను, సూర్యకాంతిలో క్షణక్షణమూ మారే హిమాలయ పంక్తులలోని రంగులలోని ఆనందాన్ని, చెవి అనేక నాదాలను వినగలదు. ఇట్లా ప్రతి ఇంద్రియంనుండి ఆనందాన్ని అనుభవించగలం. కనుక ఇంద్రియాలు గొప్పవని చెప్పడంలో తప్పులేదు.

రంగులను, శబ్దాలను మొదలైన వాటిని కన్ను, చెవి మొదలైన

ఇంద్రియాల వల్ల గుర్తించలేం. ఇదంతా బుద్ధివల్లనే. లోనున్న చైతన్యంతో ఈ బుద్ధికి సంబంధం ఉండడంవల్ల ఇంద్రియాలకు ఆ శక్తి దాని ద్వారా లభిస్తుంది. మనస్సు పని చేస్తేనే వాటిని అనుభవించగలం కదా! కనుక ఇంద్రియాలకంటె మనస్సు గొప్పదని అన్నాడు మనస్సుకు సాధనాలు ఆ ఇంద్రియాలు.

మనస్సుకంటె బుద్ధిగొప్పది మనస్సులో భావాలు కల్గుతాయి. అవి మంచివో చెడ్డవో మనస్సు నిర్ధారించలేదు. బుద్ధికి ఆశక్తిఉంది. చెడును తొలగించి మంచివాటిపై దృష్టి పెట్టేటట్లు చేస్తుంది. దేనిని గ్రహించాలో దేనిని విడిచిపెట్టాలో బుద్ధికి తెలుస్తుంది. ఇది మంచిది, ఇది మంచిది కాదని క్షణక్షణమూ భావిస్తుంది మనస్సు కాని నిశ్చయజ్ఞానాన్ని కల్గించేది బుద్ధియే.

మనస్సుకు, బుద్ధికి ఇట్టి నిర్వచనాలనే ముందుగ్రహిద్దాం. కాని సాధారణంగా మనస్సును అంతఃకరణమనే అర్థంలో వాడుతారు. అనగా దానికే పైస్థాయి. క్రిందిస్థాయి యున్నదని, క్రింది స్థాయిలోనిది ఊగిసలాడేదని, పైస్థాయిలోనున్న మనస్సు తీర్పునిస్తుందని అంటారు.

చెడు నుండి మంచిని విడదీసి చూపేది బుద్ధియని చెప్పాంకదా! అయితే చెడ్డపనిలో పకడ్బందీగా పథకం వేసేది బుద్ధియే. కనుక మంచి పనిచేసినా, చెడ్డపనిచేసినా ఒక నిర్ణయానికి వచ్చేది బుద్ధియని అందాం.

చివరకు మంచీ లేదు, చెడూ లేదు, రెండు మాయయే. ఆత్మ, అంతః కరణంతో సంబంధం లేకుండా స్వస్వరూపస్థితిలో ఉన్నపుడు పైమనస్సు, బుద్ధులతో పనేమి?

జ్ఞాని యొక్క సమాధిలో మంచి చెడుల ప్రస్తావన ఉంటుందా? ఆపైన గాఢ నిద్రలో ఈ స్పర్శ ఉంటుందా? కనుక మంచి చెడులు, మాయవల్ల ఈ అంతఃకరణం సృష్టించినవే. కనుక మంచి చెడులను వివేచించే బుద్ధికీ మహత్త్వప్రస్థానం లేదు.

కామానికి మూడు అధిష్ఠానాలని అందు బుద్ధి ఒకటని చెప్పాడు. అప్పుడిది గొప్పదెట్లా అవుతుంది? మంచి చెడులను వింగడించి మంచి దగ్గర ఆగిపోతుంది బుద్ధి. అది ఆత్మతో ఏకీభావాన్ని పొందడం లేదు. మాయ జీవుణ్ణి సృష్టించిందని చెప్పగలదు. అంతవరకు పనిచేస్తుంది. మాయను దాటాలన్నప్పుడు ఆత్మలో కలియాలన్నప్పుడు బుద్ధినీత్యజించవలసి వస్తుంది. కనుక పరమోత్కృష్టం కాదన్నాం.

ఆత్మయే సత్యం

బుద్ధికి ఆధారభూతమైన ఆత్మయే ఉన్నతమైనది అది తత్. తత్-సత్.

సత్ అనగానేమిటి? ఎప్పుడూ మారనిది, ఒకేవిధంగా ఉండేది. అదే ఆత్మ.

అతత్-అతడు, ఆమెను సూచించదు. ఆ తత్‌ను ఈశ్వరునిగా భావించినపుడు పుంలింగం వాడుతున్నాం. అమ్మవారి భక్తులు ఆమెయని అంటారు. కాని సాధారణంగా ఈశ్వరుడిని అతడని అంటాం. ఏ అణువు కదిలినా అతని వల్లనే అని అంటూ ఉంటాం. నమ్మాళ్వార్, తిరువాయిమొళిని ప్రారంభిస్తూ పుంలింగమేవాడాడు. దేవుణ్ణి ఆంగ్లంలో He అని అంటారు.

సంస్కృతంలో సః అని అంటారు. పరమాత్మ, జీవాత్మలు ఒకటే అనే అర్థంలో సోఽహం అంటారు కదా అద్వైతంలో సః+అహం=సోఽహం. సః పుంలింగమే. వాడే నేనని సోహం పదానికి అర్థం. నపుంసక లింగంలో వాడబడిన తత్‌ని, సఃఅని పుంలింగంలో వాడుతున్నాం. పురుషసూక్తంలో పురుషుడు పరమాత్మయే, సాంఖ్య శాస్త్రంలోని ఆత్మపురుషుడే. మాయను వారు ప్రకృతియని పిలుస్తారు. ఈ ఆత్మనుండే పరాశక్తి లేదా మాయ. ఈ జగత్తును జీవులను అన్నిటినీ సృష్టించింది. ఆ ప్రకృతిని స్త్రీలింగంలో వాడుతారు. పురుష, ప్రకృతి అనే జంటను శివం-శక్తులుగా భావిస్తాం. కృష్ణుడు బుద్ధికంటె పైనున్నదానిని "సః" అని వాడాడు.

బుద్ధేఃపరతస్తు సః

ఆత్మస్థితికి క్రమక్రమంగా

ఆత్మ ప్రక్కన అంతా మాయయే. అదే ఆత్మను గుర్తించకుండా చేస్తోంది. ఆత్మచైతన్యం, ఇంద్రియాలలో ప్రతిబింబించడం వల్ల అసత్యాన్ని సత్యమని భావిస్తున్నాం. దీనినే అద్వైతం ప్రాతిభాసిక సత్యం అంటోంది. కాని అసత్ అని అనడం లేదు. అనగా అసలే లేదని అనడం లేదు.

మంచి, చెడులకు అతీతంగా ఎందుకు వ్యవహరించలేకపోతున్నాం అంటే మనలను ఆవరించే మాయాశక్తివల్లనే. ప్రస్తుతం ఆ లక్ష్యాన్ని చేరుకోలేక పోయినా ముందు మంచిని పట్టుకొందాం. క్రమక్రమంగా అతీతస్థితి పట్టుబడుతుంది. ఒకముల్లును తీయాలంటే మరొక ముల్లునుపయోగించి చివరకు రెంటినీ విడిచి పెట్టినట్లు ముందు మంచితో చెడును పరిహరించి చిట్టచివర రెంటినీ విడిచిపెట్టాలి.

ఆత్మ మంచి చెడులకు అతీతమని అట్టి ఆత్మకై ఇట్టి ప్రయత్నమేలయని ముందు ప్రశ్నించవద్దు. మనమెట్లా చిక్కుకొన్నామో వెదికి ప్రయోజనం లేదు. ఈ మాయాశక్తిని నిర్వచించడం కష్టమన్నారు అనిర్వచనీయమన్నారు. ఒక పాము మన కాలును చుట్టుకొంటే ఎన్ని చుట్టలు చుట్టిందని ఆలోచిస్తామా? దానిని విదిలించుకోవడానికే ప్రయత్నిస్తాం కదా! కనుక మాయ శక్తి మూలాలను విచారించకుండా దాని నుండి విముక్తులం కావాలి. ఇంద్రియాలు, బుద్ధి, మొదలగు వాటిల్లో కొంత సత్యం ఉందని, నిష్కళంకమైన ఆత్మను అన్వేషించడమే లక్ష్యమని పెద్దలు ఉపదేశించారు. కనుక పైవాటిని చెబుతూ ఒక దానికంటె మరొకటి గొప్పదని చెప్పారు. అనగా ఆత్మకాంతి ఒక దాని కంటె ఎక్కువ ప్రతిబింబించిందని అర్థం. కనుక ఇంద్రియాలు, మనస్సు, బుద్ధిని ఆశ్రయించాలని దాని ద్వారా ఆత్మను తెలిసికొనగా అదీ విదిలిపెట్టబడుతుందని అన్నారు.

ఒక్కొక్క కొండనెక్కి వేంకటేశ్వరుని దర్శిస్తాం. అట్లాగే ఇంద్రియాలను

అధిరోహించాలి. తరువాత దాటాలి. ఆ కొండలు స్వామియా? ఏడవ కొండపైనే స్వామి, ఏడవ కొండనూ పూర్తిగా ఎక్కినపుడే స్వామి దర్శనం! అట్లే ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి-ఇవేమీ ఆత్మ కావు. బుద్ధి యొక్క ఎత్తు కూడా ఆత్మకాదు. ఇవేమీ ఎక్కకుండా దిగువతిరుపతిలోనే ఉండిస్వామిని చూస్తామంటే ఎట్లా? అట్లే కర్మ, ఉపాసన, విచారములను ఇంద్రియాలను, మనస్సు, బుద్ధిని ఉపయోగించి సాగవలసిందే! అన్ని కొండలెక్కి ఆగుతాం. అపుడు స్వామి దర్శనం. అన్నీ విరమించి సమాధిలో ఉన్నపుడే ఆయన దర్శనం. పైకర్మాదులపుడుండవు.

కొండనెక్కేటపుడు ఒక ప్రసిద్ధమార్గంగుండా వెడతాం. లేకపోతే దారి తప్పుతాం. అందరికీ తెలిసిన మార్గంగుండానే వెళ్లాలి. అదే కర్మ, భ[illegible] యోగమార్గం.

ఒక్కొక్కపుడు మంచి మార్గంలో వెళ్లినా దొంగల భయం ఉండవచ్చు. అట్లాగే సాధనలో కొన్ని ఆటంకాలు వస్తాయి. వాటినీ దాటి చిట్టచివరకు స్వామి ఎదురుగా నిలబడినపుడు ఈ మంచి, చెడూ మటుమాయమైపోతాయి. అయితే అక్కడ దేవుణ్ణి సృష్టించామా? అట్లాగే ఆత్మ ఉండనే ఉంది. అది సృష్టింపబడేది కాదు. దానిని చేరుకోవడమే మనవంతు.

ఏమిటి సారాంశం? కామక్రోధాలు దానికి మూలమైన మనస్సు, ఇంద్రియాల ద్వారా మనస్సుచేసే గందరగోళాన్ని ఆపాలంటే ముందుగా మంచికర్మలను చేయాలి. చెడును పొగొట్టాలి. ఆచీకటి పోవాలంటే దీపాన్ని వెలిగించాలి. ఆ దీపం వెలిగించడమనేదే సత్కర్మ. ఇది ఇంద్రియాలు, మనస్సు వల్లనే. బుద్ధియొక్క సాహాయ్యాన్ని గ్రహించాలి. అపుడీశ్వరానుగ్రహం రాగా అన్నీ కనుమరుగై ఆత్మ స్వరూపం చిక్కుతుంది:-

ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్తంభ్యాత్మాన మాత్మనా
జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదం -3-43-

నీవు బుద్ధికంటె కనబడని ఆత్మను తెలిసికొని బుద్ధిచేతనే ఆత్మను నిశ్చలంగా చేసికొని తీవ్రమైన కామమనే శత్రువును సంహరించుమని అర్థం.

ఆత్మను ఆత్మతో మచ్చిక

సంస్తంభ్యాత్మనా - అనగా మనస్సును బుద్ధితో సంస్తంభ్య-ఆత్మానం - ఆత్మనా = ఆత్మను ఆత్మతో మచ్చిక చేసియని అర్థం. సంస్తంభ్య = కదలకుండాచేసి. కనుక కదలని దానిని స్తంభం అంటున్నాం. మరి ఆత్మకు క్రియలులేవు, అది లొంగబడేది కాదు కదా, దానిని లొంగదీయడమేమిటి? అది స్వతంత్రమైనది కదా!

అసలు మనం ముందుగా మనస్సునే ఆత్మయని అనుకొంటాం కదా! ఇందు నీచస్థాయిలోనున్న మనస్సు అటూ ఇటూ ఊగుతూ ఉంటుందని ఉన్నత స్థాయిలోనున్న బుద్ధి నిశ్చయజ్ఞానం కల్గిస్తుందని చెప్పాను కదా! కనుక ఆత్మానం అనే దానిని తక్కువ స్థాయిలోనున్న మనస్సును లొంగదీయాలన్న మాట. లొంగదీసేది ఉన్నతస్థాయి మనస్సైన, అనగా బుద్ధి, శంకరులు భాష్యంలో 'సంస్కృతేన మనసా' అనగా సంస్కరింపబడిన పవిత్రమైన మనస్సుతో అని అర్థం వ్రాసేరు. కనుక మంచిని అర్థం చేసికొనే బుద్ధితో అని అర్థం చేసుకోవాలి.

ఆత్మప్రకాశించాలంటే ఆ బుద్ధినీ లొంగదీయాలి కదా! అది తనంతట అది లొంగదీయబడుతుందా? కాదు. మరల చెబుతున్నా, మనస్సు నెట్లా లొంగదీయడం? లొంగదీయబడాలనే తీవ్రమైన తపన ఉన్నపుడు ఈశ్వరానుగ్రహం ఉంటుందని చెప్పాను. అపుడు తనలో దానిని లీనంచేసి కొంటాడని అన్నా ఇది చెప్పేటపుడు మనస్సుకంటె బుద్ధిపైన ఉందని, ఆ బుద్ధి దీనిని లొంగదీయాలని చెప్పలేదు. అపుడు మనస్సనే పదాన్ని వాడాను. అనగా అంతఃకరణం అనే అర్థంలోనే. ఆ అంతఃకరణంలోనే మనస్సు, బుద్ధులు రెండూ ఉంటాయి.

ఈశ్వరానుగ్రహం గురించి ఎందుకు చెప్పలేదు?

ఈ సందర్భంలో బుద్ధి అణగిపోతుందని సత్యతత్వం ప్రకాశిస్తుందని భగవానుడు చెప్పలేదు. మిగతా సందర్భాలలో ఈశ్వరునను అర్పణ చేస్తే అతని అనుగ్రహం వల్ల లక్ష్యాన్ని చేరుకొంటాడని అన్నాడు. కాని ఈ సందర్భంలో చెప్పలేదు. బహుశః జ్ఞాన మార్గాన్ని చెప్పేటపుడు సగుణతత్వాన్ని తీసికొని రాకుండా ఉండడం కోసం చెప్పియుంటాడు.

ఇట్లు తర్కించియుండవచ్చు ఈశ్వర కృపగురించి మాట్లాడానా లేదా అనడంలో తేడా ఏమిటి? ఏది అవసరం అనుకొంటే అది కృపచేస్తుంది. జీవుడు చేయవలసిందేమిటని ముఖ్యప్రశ్న. ముందు చేయువలసింది అంతః కరణాన్ని దువ్వడమే. ఈ దశలో ఈశ్వరుణ్ణి పిలువనవసరం లేదు. ఈశ్వరుడని స్పష్టంగా పిలువకపోయినా అతడు అతనితో ఎప్పుడూ ఉన్నవాడే కదా! అతని సాధనను చూడడా? అనుగ్రహించడా? అయితే సాధకుడు, నీవేగతియనినపుడు తనను తాను అర్పించుకొన్నపుడు ఈశ్వరకృప యుండనేయుంటుంది. ఆమార్గమే తప్పనిసరియని చెప్పడం లేదు. సాధకుడు జ్ఞానమార్గంలో ప్రయాణించిన కొద్దీ అహంకారాన్ని పోగొట్టుకోవడానికి దారి సుగమం అవుతోంది కదా! శరణాగతిలోనూ పూర్తి అహంకారం పోవడం ఉంటుంది. మరి ఆ జ్ఞానమార్గానికి శరణాగతికి తేడా ఏమిటి? ద్వైతమార్గం లోని శరణాగతిలో కొద్దిపాటి వ్యక్తిత్వం ఉంటుంది. భక్తిప్రపత్తులుంటాయి. తాను భక్తుడుగా, భజింపబడేవాడు విడిగా ఉంటారు. అద్వైతంలో కేవలం అహంవృత్తియే యుండదు. అట్టి వారిపట్ల దయను చూపించడా?

పరమాత్మ, మాటలకు, చేతలను ప్రాధాన్యంచూడడు. హృదయ భావాన్ని చూస్తాడు (భావగ్రాహీజనార్దనః) భక్తుడు, నేను శరణాగతిని పొందుతున్నానని అనకుండానే అతడి భావాన్ని గ్రహించి కృపను చూపిస్తాడు కనుక ఈశ్వరకృప అనే మాటను జ్ఞానమార్గంలో వాడలేదు.

ఆత్మకంటె భిన్నంగా భావించే జీవుడు, తనంతటతాను ఉన్నత శిఖరాలను ఎక్కలేడు. నేను, నేను అన్నంత వరకూ ఇంతే. ఇపుడు చేయవలసిందేమిటి? నీకంటె భిన్నునిగా నన్నునేను చూసుకొనేటట్లు చేయవద్దనే ప్రార్థనను చేయాలి. వాడువేరు, నేను వేరు అని ఉన్నంత వరకూ ఈచీకటి నుండి బైటపడలేడు. చీకటి సూర్యుణ్ణి చూపిస్తుందా? దీపం వచ్చీరాగానే చీకటి పోతుంది. చీకటి తనంతట తాను నిర్మూలించుకోలేదు. ఆత్మ ప్రకాశమున్నపుడే చీకటి తొలగిపోతుంది. కనుక మనస్సు, బుద్ధి ఎంతవరకూ ఎదగాలో అంత ఎత్తు ఎదిగినపుడు భగవానుడు, చేతి నందిస్తాడు.

ఇక్కడ సరిగా విచారించాలి. ఎంత ఉన్నత స్థితిని పొందినా అంతఃకరణం ఆత్మను స్పృశించలేదు. అది పూర్తిగా అణిగినపుడు మాత్రమే. అది తనంతట తాను ఎట్లా అణగుతుంది? ఆత్మహత్య చేసికొన్నాడంటే ఏదో ఒక సాధనాన్ని వాడుతాడు కదా! అంటే తనకంటె భిన్నమైనది జీవుడున్నంత వరకూ అంతఃకరణం ఉంటుందికదా! అనగా అతనికి అభిన్నంగా, అటువంటప్పుడు తననుతాను హత్య చేసికోవడమేమిటి? ఏ సాధనం లేకుండా. సమాధి స్థితిలోనే దీనిని పోగొట్టుకొనే వారున్నారు. ఎట్లా ఇది సాధ్యం?

ద్వైతానికి అద్వైతానికి ఈశ్వరుడు వంతెనగా

జీవుడేమో ద్వైతానికి చెందినవాడు. ఆత్మ, అద్వైతానికి చెందింది. జీవభావం రావడానికి కారణమైన మనస్సునకు జీవభావం లేని ఆత్మకూ సంబంధం ఎట్లా? మనం ఆశ్చర్యపడతాం. ఇక్కడే ఈశ్వరుని రాక.

ద్వైతాద్వైతాలకు వంతెన మాదిరిగా ఉంటాడు. రెండూ భిన్నమైన తీరాలు, ఒక దానికి మరొకదానికి సంబంధంలేదు. ఇక్కడ వంతెనగా ఉంటాడు. తాను అద్వైతంలో ఉంటూ ద్వైత ప్రపంచం అనే నాటకాన్ని

ఆడుతూ ఉంటాడు. అతడు వేసిన మాయయనే వలలో చిక్కుకొన్నాం. కాని అతణ్ణి అది ఏమిచేయలేదు. అద్వైత శాస్త్రాలు ఏమంటాయాంటే మాయతో కలిసిన ఆత్మ, జీవుణ్ణి, ఈశ్వరుణ్ణి సృష్టించిందంటోంది. ఈశ్వరునికి సమష్టి మనస్సుంది. సృష్టిని నడిపే తెలివి. కాని అతని మనస్సు అతణ్ణి బంధించలేదు. మనకు సాధ్యం కానివి అతనికి సుసాధ్యం. జీవుని మనస్సు, బుద్ధి ఏంచేస్తున్నాయని మనం అడుగుతాం. అట్టి ప్రశ్నను ఈశ్వరుని గురించివేయం. మనస్సుచే బంధింపబడని వాడు కనుక ఏదైనా చేయగలడు.

పొందడానికి వీలులేని ఆత్మను. జీవుడు పొందడానికి వీలు కల్పిస్తాడు. ఈశ్వరుడు జీవుని అంతఃకరణాన్ని నశింపు చేసే శక్తి అతనికుంది. ఎత్తునకెదిగి ఆత్మను గ్రహించలేని చిట్టచివర స్థితిలో ఇతనిలో జీవ బుద్ధిని పోగొట్టి తనలో లీనం చేసికొగలడు.

అద్వైతం - ఈశ్వరానుగ్రహం

ఈశ్వరుని అనుగ్రహం వల్లనే జ్ఞానం లభిస్తుందని అద్వైత గ్రంథాలు చెప్పలేదని మీరనవచ్చు. అద్వైత శాస్త్రంలోని జ్ఞానం, బుద్ధివల్ల వచ్చేదని చెప్పదు. ఆత్మ తనంతట తానే అనుభవించి తెలిసికొనుట జ్ఞానమని చెబుతుంది. జ్ఞానం పొందాడంటే మోక్షాన్ని పొందడమనే అర్థం. స్పష్టంగా ఈశ్వరానుగ్రహం ఉండాలని ఎందుకీ గ్రంథాలు చెప్పలేదని అడుగుతారు కదా! భగవానుడు ఈశ్వరకృప గురించి చెప్పలేదు. ఎందుకు చెప్పకుండా ఉన్నాడంటే జ్ఞానమార్గాన్ని చెబుతున్నాడు కనుక. అందే ఎందుకు చెప్పలేదని మీరు ప్రశ్నిస్తారు.

నాకొక సమాధానం దొరికింది. అద్వైతం యొక్కలక్ష్యం ద్వైతజ్ఞానం నుండి లేదా ద్వైత అజ్ఞానం నుండి విడుదల కావడమే. అద్వైత సాధన యొక్క చిట్టచివర దశలో, అనగా మనస్సు యొక్క పూర్తి నిర్మూలన దశలో

ఈశ్వరుణ్ణి పేర్కొంటే అది ద్వైతాన్ని తీసికొని వచ్చినట్లే కదా! ఎట్లా? ఈశ్వరుడు జీవుని కంటె భిన్నుడని మిగతావారంటారు కదా! అద్వైతంలో ఈశ్వరునకు ఉన్నత స్థానమున్నా, అనుగ్రహం చూపించే వాడొకడు, గ్రహించే వాడొకడనే ద్వైతం రావడంలేదా? ఇది ద్వైతానికి చెందదా? ఇట్టి అవకాశం ఈయకుండా ఉండడానికే, అనగా అట్టి ద్వైతస్ఫురణ లేకుండా ఉండడానికే అద్వైతసిద్ధిలో ఈశ్వరకృపను అద్వైత శాస్త్రాలు ఎత్తుకోలేదు. అద్వైతాన్ని గూర్చి యోచించు శాస్త్రాలు చెప్పనంత మాత్రంచే ఈశ్వర కృప ఉండదని ఎందుకనుకోవాలి? అని ప్రశ్నించవచ్చు. అద్వైత లక్ష్యం జీవేశ్వరుల ఐక్యమే. ద్వైత భావనలో ఈశ్వరుని పట్ల భక్తి చూపించుట కాదు. ఈశ్వరునకు అది ప్రీతికరమే. అందువల్లనే ఈశ్వరకృప ప్రస్తావన లేదు.

ఒక భక్తుడొక శ్లోకాన్ని వ్రాసాడు. ఈశ్వర భక్తిని విడిచి జ్ఞానాన్ని పొందగలనా? అప్పుడది మోక్షం కాదు, మోహమే అంటూ, ఇందులో ముంచుతున్నాడని వాపోయాడు. అట్లా సాధకులు మారడాన్ని అద్వైత శాస్త్రాలు అంగీకరించవు. ఈశ్వరభక్తికంటె ఈశ్వరుణ్ణే కోరాలంటాయి. ఈశ్వరుని సహజరూపం నిరాకారతత్వమే. సగుణమూర్తిని కాదు పూజించవలసింది, నిరాకార తత్వంలో లీనమగుటయే. ఈ మాటలు చిట్టచివర సాధనలో అని గుర్తించండి.

ప్రాథమిక దశలో అద్వైత శాస్త్రాలు కర్మలను చేయాలన్నాయి. ఇవన్నీ ద్వైతానికి చెందినవే. ఈశ్వరభక్తి కూడా తప్పని సరిగా ఉండవలసిందే! లేనిచో సాధకునకు ఏకాగ్రత కుదరదు. చివరి మాటలు ముందుచెబితే అంతా శూన్యమని భావిస్తాడు. సాధకుడు ఆలంబనం దొరకక కొట్టుమిట్లాడుతాడు. శ్రవణ మనన నిదిధ్యాసలు పట్టుబడినపుడు ఆత్మలీనమైన స్థితిలో ద్వైతప్రస్తావన తీసికొని రావద్దంటున్నారు.

బ్రహ్మము - ఆత్మ - ఈశ్వరుడు

సత్యాన్ని ఆవరించేది మాయ. దానిని ఆవరణమంటారు ఏకమును అనేకంగా చూపించేది విక్షేపం. మాయకు ఆవరణ విక్షేపాలు రెండూ ఉంటాయి. ఈ మాయా శక్తిని ఆధారంగా చేసికొని జగన్నాటకం ఆడుతున్నాడు ఈశ్వరుడు. బ్రహ్మము మాయతో కలిసినపుడు ఈశ్వరు డగుచున్నాడు. ద్వైతజగత్తును సృష్టిస్తున్నాడు.

బ్రహ్మమనగానేమి? అదే ఆత్మ. జీవుని మూలం వెదికినా ఆత్మయే. జీవునికి ఆత్మ ఎట్లాగో జగత్తునకు బ్రహ్మమట్లా. జీవజగత్తుల మూలాలు ఒక్కటే, జీవునికి మూలమైన ఆత్మకంటె ఏదీ భిన్నంగా లేనపుడు బ్రహ్మము భిన్నంగా ఉంటాడా? ఆత్మయన్నా బ్రహ్మమన్నా ఒక్కటే. జీవుని గురించి చెప్పేటపుడు ఆత్మయని ఎట్లా అంటున్నామో జగత్తును గురించి చెప్పేటపుడు బ్రహ్మము గురించి చెబుతాం.

జీవుడు - ఈశ్వరుని నుండే

ఆత్మమాయతో ఉన్నపుడు ఈశ్వరుడని, ఆత్మను జీవుడనే మాట మాయవల్లనే అని అద్వైతులందరూ అంటారు. జీవుల కంటె పైవాడు ఈశ్వరుడని, అతడు జగద్రక్షకుడనీ అంటారు. అయితే ఈశ్వరుని నుండే జీవుడువచ్చాడని, ఈశ్వరుడే జీవభావాన్ని కల్గించాడని మాత్రం అనరు. ఈశ్వరుని మాయద్వారా ఆత్మ, జీవుడయ్యాడని అంటారు.

పురుషోత్తమ ప్రాప్తియోగంలో భగవానుడిట్లా అన్నాడు. తాను పురుషోత్తముడని అన్నాడు. అనగా ఈశ్వరుడని, ముల్లోకాలలో ప్రవేశించి రక్షించేవాడని అన్నాడు. శంకరులిక్కడ నిర్గుణ బ్రహ్మను గూర్చి చెప్పలేదు. ఆ పురుషోత్తముడు నారాయణుడని, సగుణబ్రహ్మమని చెప్పారు:

మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః

మనః షష్ఠానీంద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి (15-7)

తా:- శాశ్వతమైన నాలోని ఒకఅంశ జీవునిగా జీవలోకంలో ఉన్నది. ప్రకృతి సంబంధమైన మనస్సుతో చేరిన జ్ఞానేంద్రియాలు ఆ జీవుని విషయములనాకర్షించుచున్నవి.

ఇక్కడ మనస్సును ఆరవ ఇంద్రియంగా పేర్కొన్నాడు. శంకరులు కూడా షట్పదిస్తోత్రంలో శ్లేషరూపంలో దీనిని పేర్కొన్నారు.

జీవుణ్ణి అంశగా పేర్కొన్నాడు. జీవుడు తననుండే వచ్చినట్లుంది. ప్రకృతి అంటేనే మాయ. మాయకు సంబంధించిన విషయాలలో కూడిన మనస్సు ఈశ్వరాంశచే లాగబడింది. జీవునికట్టి మనస్సు నిచ్చి మాయలో పడియుండుమని ఈశ్వరుడు అనుమతించినట్లే కదా!

విముక్తిని ప్రసాదించువాడూ ఈశ్వరుడే

పై ప్రకారంగా ఆలోచిస్తే విడుదల చేసేవాడూ ఆయనే అవుతాడు. (ఎద్దును కాడికి పూన్చినవాడు, ఎద్దును విప్పడా?)

జీవగుణాలను గురించి చెప్పేటపుడు జీవప్రకృతియని అంటాం. ప్రకృతియనగా ఇక్కడ స్వభావం. బాహ్యప్రకృతిని కూడా ప్రకృతియని పిలుస్తాం. సరే అన్నిటికీ ఈ మాయయే కారణం.

మాయను తొలగించేదీ ఈశ్వరుడే

జ్ఞానియైనా ప్రకృతిని ఎట్లా నియమించగలడని భగవానుడడిగాడు. ప్రకృతి లేదా మాయ అణగినపుడే మోక్షప్రాప్తి. ప్రకృతి సృష్టించినది మనస్సే. మనస్సు నణచినపుడు జీవునకు మోక్షం వస్తుందని చెబుతున్నాను గాని, మాయను అణచుటవల్ల అని చెప్పడంలేదు. అద్వైత శాస్త్రాలు కూడా మనస్సును

లొంగదీయమనే చెప్పాయిగాని మాయను లొంగదీయండని అనలేదు.

కారణం? అది గొప్పశక్తి కనుక. అదే జీవుణ్ణి సృష్టించింది కనుక. మాయ యొక్క కబంధహస్తాల నుండి మనస్సును సాధకుడు లాగగలడు. అపుడాదశలో ఈశ్వరానుగ్రహం కావాలి. ఇట్లా జీవుని మనస్సు నణచి మరల తల ఎత్తకుండా అనగా మాయయొక్క గుప్పిట్లో పడకుండా చేయాలంటే ఈశ్వరానుగ్రహము కావాలి. ఆ ఈశ్వరుడే మాయా సంసారంలోనూ త్రోయగలడు. రెండు పనులూ అతని చేతిలో ఉన్నాయి.

మనస్సును నియమించుకొని జ్ఞానులైనవారెందరో ఉన్నారు. అట్లా ఆత్మస్వరూపులుగా ఉండిపోవడానికీ ఈశ్వరానుగ్రహం కావాలి, కారణం కూడా. జ్ఞాని కూడా దువ్వలేని ప్రకృతిని లోబరుచుకొనే వాడిక్కడ ఈశ్వరుడే. ఈశ్వరుని నుండి జీవుడు పుట్టాడా అనే సందర్భంగురించి చెబుతూ పైవి చెప్పాను.

జీవ - ఈశ్వరుల భేదం

మాయ యొక్క ఆవరణ విక్షేపశక్తులకు గురికాబడిన వాడు జీవుడని అన్నాం. ఆవరణశక్తి ఆత్మను కప్పియుంచుతుంది. అపుడాత్మ స్వరూపం తెలియదు. విక్షేపశక్తి కూడా విజృంభిస్తుంది. అనగా లేనిది ఉన్నట్లు కన్పింపచేసేదే అదియని లోగడ అన్నాను.

ఈశ్వరుని పట్ల ఇట్లా కుదరదు. మాయతో కూడిన ఆత్మకదా ఈశ్వరుడు? అది లేనపుడు ఆత్మయే. దేనితోనూ సంబంధం లేదని చెప్పబడే ఆత్మ, మాయతో ఉందని చెప్పడమూ మాయయే.

ఆత్మకు భిన్నునిగా మాయతో ఈశ్వరుడున్నాడని చెప్పడమూ అతని లీలయే. అది అతనిపై పెత్తనం చెలాయించలేదు. దానిని లొంగదీయగలడు. అతని కంటె తక్కువది మాయ. జగన్నిర్వహణ దశలో ఉన్నదిలేనట్లు

కప్పుడుదశలో విక్షేపశక్తితో కూడిన మాయద్వారా నిర్వహిస్తూఉంటాడు. ఇంకా అద్వైత శాస్త్రాలు ఏమంటాయంటే మాయకున్న ఆవరణ శక్తి ఇతనిని కప్పిపుచ్చలేదని చెబుతాయి. అనగా అతడు బ్రహ్మముగానే ఆంతరంగా ఉంటాడు. బాహ్యంగా వ్యక్తీకరింపబడినట్లు కనబడినా స్వస్వరూపానికి ఎట్టి హానిలేదు.

ద్వైతం నుండి అద్వైతం వైపుకి

ద్వైతాద్వైతస్థితులలో ఈశ్వరుడున్నా ఆత్మకు, జీవుని మనస్సుకు వంతెన మాదిరిగా ఉంటాడు. తనకు మాయ కప్పలేదని ఆత్మతో ఉంటూ మాయ ప్రపంచాన్ని కూడా నడపగలడు. అనంతమైన ఆత్మతో సంబంధం కలిగియుంటూ జీవునితో సంబంధం పెట్టుకొనియుంటాడు. అట్లా వంతెనమాదిరిగా ఉంటాడు. ఇట్లా రెండు గుణ్ణాల స్వారిని మనం అర్థం చేసికోలేము. ఇట్లా అనిర్వచనీయమైన స్థితిలో ఉంటూ అనగా తనకు తానుంటూ జీవుల ద్వైతమనస్సును అద్వైత మనస్సు వైపు మళ్లిస్తాడు. చివరకు జీవుణ్ణి ఆత్మలో లీనం చేస్తాడు.

ఒక ఉదాహరణను చెబుతా: ఒక ఇనుపగుండును ఊహించండి దానికి వాయురూపం ఎట్లా తీసికొని రావడం? అది గాలిలో ఎట్లా కలుస్తుంది? దానిని ఎక్కువ డిగ్రీలున్న కొలిమిలో కాలుస్తారు. అసలు అగ్నియే మండే వాయువు. ముందు మంటలరూపంలో ఉంటుంది. అపుడు ఇనుపగుండు ద్రవరూపాన్ని పొందుతుంది. ఇంకా మండిస్తే ఆ ద్రవం వాయురూపాన్ని ధరిస్తుంది. అపుడంతర్ధానం చెందుతుంది. అట్లే మన అంతఃకరణం ఇనుప గుండువంటిది. మాయ ప్రభావం వల్ల ప్రత్యేకంగా జీవునిగా కనబడుతోంది. ఈశ్వరుడనే అగ్ని దానిని కాలుస్తున్నాడు. అవిరిగా మారుస్తున్నాడు. అంటకుండా ఆత్మ ఉన్నట్లుకాక ఈశ్వరునకు జీవునితో సంబంధం ఉంది.

ఇతడు జీవుని మనస్సును కాల్చగలడు, ఆవిరి రూపంలో తీసికొని రాగలడు. ఆకారంలేని ఆత్మస్వరూపంలో లీనం చేయగలడు. అపుడు జీవుడు వ్యక్తిత్వాన్ని కోల్పోతాడు.

మధ్య దశలు

ఇనుప గుండు ఆవిరిగా మారడానికి మధ్య, అనేక దశలున్నాయి. ఇట్లా మధ్యదశలను ద్వైతమనస్సుతో గ్రహించలేము, అట్లే అద్వైతస్థితితో కూడా, అది తెలియని స్థితి. ఇతరులకు చెప్పలేని స్థితి. అది అనుభవం ద్వారానే తెలుస్తుంది. మధురపదార్థాల రుచిని వ్యక్తీకరించగలమా? ఏవోకొన్ని సూచనలను మాత్రమే చేయగలం. ద్వైతస్థితిని దాటి మరల ద్వైతలోకంలో అడుగుపెట్టగలమా? అట్టి అనుభూతిని పొందిన జ్ఞానులనందించాడు. వారూ చెప్పగలగుచున్నారా? ఊటీ చల్లదానాన్ని వివరించడం ఎట్లా?

ఇనుపగుండు గాలిలో కలియడం జరిగినట్లే వాసనలతో సంస్కారాలతో గట్టిపడిన ఇనుపగుండు వంటి అంతఃకరణమూ ఈశ్వరానుగ్రహం వల్ల తీవ్రసాధనల వల్ల కరిగినీరై ఆవిరైపోతుంది. గట్టిపడిన స్థితిలో చైతన్యరేఖ ఉంటుంది. ద్రవరూపంలో సూర్య ప్రతిబింబం కనబడే స్థితి ఉంటుంది. అనగా చైతన్యం మనస్సులో ప్రతిబింబించినట్లుగా. అపుడు బింబంవేరు, ప్రతిబింబం వేరుగా ఉంటుంది. ఇంకా తేలిక చేయబడి ఆ వాయు రూపంలో ఉన్నపుడు తనవ్యక్తిత్వాన్ని కోల్పోతుంది. భక్తిలయ, యోగలయల ద్వారా ద్రవస్థితిని పొందగా చివరకు ఆవిరిరూపంలోనున్న స్థితిలో అనగా జ్ఞాన స్థితిలో గుణాతీత స్థితిని, ఆత్మరూపస్థితిని జీవుడు పొందుతాడు. ఆత్మస్వరూపమని మామూలుగా అంటాం. అది అరూపమే, రూపరహితంగా ఉండుట.

ఇట్లా ద్వైతం నుండి అద్వైతానికి పయనిస్తూ ఉండగా జీవుడు క్రమక్రమంగా మెత్తబడుతూ కరుగుతూ ఉంటాడు.

ఘన పదార్థాల కంటె ద్రవపదార్థాలు విస్తరిస్తాయి. వాయు పదార్థాలు ఇంకా విస్తరిస్తాయి. ఇనుపగుండు, ఆవిరిగా మారడాన్ని విని ఆశ్చర్యపోతాం. అట్లే జీవుని మనస్సు తనసంకుచిత పరిధిని దాటుతున్న కొద్దీ అనేకమైన మార్పులను చెందుతూ విశ్వవ్యాప్తమౌతూ ఉంటే మన మనస్సేనా అని ఆశ్చర్యపోతాం. మొదటనున్న జీవుని మనస్సునకు అనంత శక్తులు లేకపోయినా ఇపుడు అనంతశక్తిమంతుడవుచున్నాడు. ఎక్కడో జరిగిన సంఘటనలు, సంకల్పాలు అతనికి సాక్షాత్కరిస్తాయి. రాబోయేది తెలుస్తుంది. అనగా ఈశ్వర శక్తులు అలవడ్డాయన్నమాట. ఈశ్వరుడు ఒకచోట పరిమితుడు కాడు. సర్వవ్యాపనశీలి. అందరి హృదయాలలోను ఉండేవాడు కనుక అద్వైతస్థితి. అతడు ద్వైతికూడా ఎట్లా? అతడు అంతర్యామిగా అందరిలోనూ ఉన్నాడు కనుక ముందు ద్వైత ప్రపంచంలో ఉన్న జీవుడు మాయతో కూడిన ఈశ్వరునిలో లీనమై పరిమితమైన మనస్సును, అపరిమితమైన మనస్సుతో చేర్చి చివరకు అద్వైత స్థితిని పొందుచున్నాడు.

అనగా ద్వైతము నెమ్మది నెమ్మదిగా కరిగిపోతుంది. ద్వైతంలో పూజించేవాడొకడు, పూజింప బడేవాడొకడూ ఉంటారు. ఇవన్నీ ఉపాసనా మార్గానికి చెందినవి. ఇవి జ్ఞానానికి చెందినవి కావు. ఇందుకొన్ని ఉపాసనలు అద్వైతం వరకూ చేరుస్తాయని శంకరులన్నారు. ఛాందోగ్యోపనిషత్తు యొక్క ఉపోద్ఘాతంలో కర్మకు సంబంధించినవి కొన్ని 'కైవల్య సన్నికృష్టఫలాని' కైవల్య మోక్షం వరకూ తీసికొని వచ్చేవి కొన్ని, 'బ్రహ్మ విషయాని' అద్వైత జ్ఞానాన్ని కలిగించేవి కొన్ని అని వ్రాసేరు.

ఆత్మవిచారణ అనే నిదిధ్యాసంలో ఈశ్వరుడు జీవుని మనస్సును తీసికొని ఆత్మలో లీనంచేస్తాడని అద్వైత గ్రంథాలు చెప్పవు. ఆత్మవిచారణ చేయగా చేయగా ఒకదశలో ఆవిచారణ కూడా ఆగిపోయి ఆత్మప్రకాశమాన మౌతుందని చెబుతాయి. ముందు తత్త్వమసి వంటి మహావాక్యాలను గురువు నుండి వినాలని అంటాయి. దాని అర్థంపై విచారించాలని చెబుతాయి. ఆ

ధ్యానంలో నిలద్రొక్కుకోవాలి. అందు మగ్నం కావాలి. అనగా తీవ్ర నిదిధ్యాసం ఉండాలి ఇట్లా ఉంటూ ఉండగా బ్రహ్మజ్ఞానం మెరుపులా తళుక్కుమంటుంది.

సాధకుల స్థాయిని బట్టి ఉపదేశాలు

ఈరోజులలో అందరికీ అన్నీచెప్పడం అలవాటుగా మారింది. పూర్వమిట్లా కాదు. అర్హత కలవారికే చేప్పేవారు. పాత్రతనెరిగి బోధించేవారు. మహోన్నత సత్యాన్ని ప్రాథమిక దశలోనున్నవారికి బోధించేవారు కాదు. అతనికి చెప్పినా అర్థంకాదని ఆచరణలో ప్రస్తుత స్థితిలో పెట్టలేడని, తప్పుగా కూడా అర్థం చేసికొనే స్థితి వస్తుందనీ, హానికూడా జరుగవచ్చని జాగరూకత వహించేవారు. ఆనాడు, ఈనాడున్న పుస్తకప్రచురణల వంటివి, ఎవరికి పడితే వారికి దొరికేవి కావు. సాధనలో ముఖ్యాతి ముఖ్యమైన అంశాలను వెంటనే నూరిపోసేవారు కాదు.

అట్టివినేను చెప్పినా వెంటనే ఆచరణలో పెట్టండని చెప్పను. మనిషి మాయలో చిక్కుకొన్నాడని, ఆత్మపై దృష్టిపెట్టండని క్రమక్రమంగా ముందుకుసాగండని చెబుతాను. అద్వైత జ్ఞానం అందించేబాధ్యత మఠాధిపతులకు ఉంది. కాబట్టి చెబుతున్నా ప్రాథమిక జ్ఞానమైనా అందరికీ తెలిసియుండాలనే భావనతోనే. అన్నీవిడిచి ఆత్మవిచారణకు పూనుకోండని చెప్పడం లేదు. అసాధ్యమైన దానిని ఇప్పుడే అభ్యసించండని చెప్పడంకాదు. ద్వైత కర్మలను, భక్తిని ఎక్కువగా వివరించకుండా వాటిని చేస్తూ అద్వైత లక్ష్యాన్ని మరువవద్దని చెప్పడమే నాలక్ష్యం.

కర్మబద్ధులైన సామాన్యజనులకు వేదాంత సత్యం అందీయవద్దనీ అది నిష్క్రియమని అన్నాడు గీతలో.

ద్వైతులకు, అద్వైతులకు ఉపదేశం భిన్నంగా ఉంటుంది. ద్వైతాన్ని ఆచరిస్తూ క్రమక్రమంగా దానిని తగ్గిస్తూ అద్వైతాన్ని అభ్యసించగలగాలి.

అట్టివారికి అద్వైతం పట్ల సుముఖత కల్పించాలి. క్రమక్రమోపదేశం చేయాలి. ఇక అద్వైత సాధకుడు ద్వైతాన్ని గూర్చి ఆలోచించకూడదు. ఈశ్వరుడని, ఈశ్వరానుగ్రహమని చెప్పకపోవడం ఇట్టి అద్వైత సాధకుల నుద్దేశించే. పై మాటలు ద్వైతానికి చెందినవి కనుక.

నేడు శ్రోతలస్థాయిని గమనించకుండా అందరికీ అన్నిటిని బోధిస్తున్నారు. దీని ప్రయోజనం సున్న. ఎంతో తీవ్రమైన సాధన ఉంటేనే గాని అద్వైతం పట్టుబడదు.

(ఈ ఉపన్యాసాలు కూడా బహిరంగ ఉపన్యాసాల రూపంలో స్వామివారు అందీయలేదు. కొంతమంది విద్వాంసుల, సాధకుల సమక్షంలోనే ఇచ్చారు – ఆంగ్లానువాదకుడు)

కర్మ, ఉపాసనలు చేసి చిత్త శుద్ధిని పొంది, సన్యాస స్వీకారం చేసి మహావాక్య శ్రవణం చేసిన వారినుద్దేశించే అద్వైత శాస్త్రాలు వ్రాయబడ్డాయని మరోసారి గుర్తించండి. అందుకే అవి ఈశ్వర కృపగురించి గట్టిగా చెప్పవని చెప్పడానికి అదేకారణం. బౌద్ధిక దశలో సాధనచేస్తున్నంతకాలం వారిని కేవలం అద్వైతనిష్ఠలో ఉంచడానికే నిదిధ్యాసనం. పట్టుబడిన వారికే, మనస్సును పూర్తిగా గెంటివేసిన వారికే, ఆత్మసాక్షాత్కారం.

ఈశ్వరుడు గొప్పమాయవి. అతని ఆజ్ఞలేనిదే ఒక్క అణువైనా కదలదు. అతడన్నిటికి కారణమని మనకు తెలియకుండా చేసేది అతడే. మన ఆలోచనలు గందరగోళంగా ఉన్నపుడు మనకు వచ్చే ఆలోచనలను అతడంగీకరించడని మనకు తెలుస్తుంది. మంచి భావాలను కల్గించేటట్లు అనుగ్రహించుమని అపుడు ప్రార్థిస్తాం. గాయత్రీ లక్ష్యమిదే. మనకీ బుద్ధిని అందుకే ప్రసాదించాడు. బుద్ధినెట్లా సాధకుడు వినియోగిస్తాడో పరికిస్తాడు. అన్నీ అతనిఇష్ట ప్రకారం జరిగితే మనమేమీ సాధన చేయనవసరం ఉండదు కదా!

ఎంత వరకూ మన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తూ ఉండగా చూస్తాడో,

ఎక్కడ అడ్డుకట్ట వేస్తాడో గట్టిగా చెప్పలేం. ఈరేఖను గుర్తించడం కష్టం. మన మనస్సు ఉన్నతమైనది కాకపోతే మనం ఇష్టవచ్చినవి చేస్తాం. మన మనస్సుకి ఉన్నతిని తీసికొని వచ్చి మన మనస్సుతో ఆటలాడుతాడు కూడా. మన ఉన్నత స్థితిలో అతడు కృపచూపించాడు కనుక ఇట్టి ద్వైత స్థితిలో ఉండిపోదామని అనుకొంటాం. ఇక జీవునకు అద్వైతస్థితి పట్టుబడడం ఎలా? ఈ స్థితి రానంతవరకూ భక్తుడడిగినవి ఇస్తూ ఉంటాడు. నిరాకార నిర్గుణ పరబ్రహ్మస్థితి ఎప్పుడు?

ఈశ్వరకృత్యానికి శాస్త్రమేల ?

బుద్ధితో చేసే సాధనల గురించే శాస్త్రాలు చెబుతాయి. ఈశ్వరుడు సాధకుని బుద్ధిని క్రమక్రమంగా గ్రహించి అతనిని ఒక సాధనంగా వాడుకొని పనులు చేయిస్తున్నపుడు శాస్త్రాలేమి చెబుతాయి? శాస్త్రాలు సాధకుని సాధన మార్గాన్ని చెబుతాయి గాని ఈశ్వరుడేమి చేయాలో నిర్దేశించవుకదా! అందుకే అద్వైత శాస్త్రాలు ఏమి చెబుతాయోవిందాం.

ఎంతవరకూ నిదిధ్యాసనం చేయాలో అంతవరకూ సాధకుణ్ణి చేయనీయండి. అతని చేత ఈశ్వరుడేమి చేయిస్తాడో చేయించనీయండి. సాక్షాత్కారం తనంతట తానే వస్తుందని చెబుతాయి. అంతేనే కాని ఈశ్వరకృపవల్లనే మాయ తొలగింపబడిందని బహుస్పష్టంగా మాత్రం చెప్పకుండా నిదిధ్యాసనం వల్ల ఆతెర చీల్చబడుతుందని స్పష్టా స్పష్టంగా చెబుతాయి.

గీతలో సత్యప్రకటన

అయితే గీతలో ఈశ్వరకృపవల్లనే అద్వైత జ్ఞానం కల్గుతుందని స్పష్టంగా చాలా చోట్ల చెప్పబడింది. అతడందరికీ విచక్షణా రహితంగా తత్వాన్ని

అందించడం లేదు. తపస్సు, భక్తి, సేవ లేనివానికి ఈ గీతా శాస్త్రాన్ని అందించవద్దని గీతలో చివరిమాటలు, మిగతా అద్వైత శాస్త్రాల మాదిరిగా అద్వైత సాధనలో చివరిమెట్టు ఎక్కిన వారికే ఇది పరిమితం కాదు. గీతలో మొదటి ఆరు అధ్యాయాలు కర్మను, రెండవ ఆరు భక్తిని, మూడవ ఆరు జ్ఞానాన్ని వివరించాయి. ప్రతి షట్కంలో (ఆరులో) కేవలం ఒక్కొటొక్కటే చెప్పబడుతుందని అనుకోవద్దు. బుద్ధికంటె పరమైనది ఆత్మయని చెప్పినమాట జ్ఞానానికి సంబంధించినదైనా మూడవ అధ్యాయంలో అనగా కర్మషట్కంలో చెప్పాడు. మొత్తం మీద ఒక్కొక్కషట్కంలో ఒక్కొక్క దాని గురించే ఉన్నా మిగిలిన షట్కాలలోని అంశాలను తడుమ లేదని భావించవద్దు. గీతలో చెప్పినట్లుగా కర్మ, ఉపాసనల గురించి అద్వైత గ్రంథాలు చెప్పవు. వీటి ప్రస్తావన ఈ శాస్త్రంలో చాలా తక్కువగా ఉంటుంది. ప్రాథమిక దశలో కర్మ ఉపాసనల గురించి ఏదో కొద్దిగా చెప్పినా విస్తరించి మాత్రం చెప్పవు. కాని గీత, అర్హులైన సాధకులకు తత్త్వం చెప్పాలని అనినప్పటకీ చివరి మెట్టు ఎక్కిన సాధకులకే ఉపయోగించాలని మాత్రం అనలేదు. కర్మ, భక్తి, జ్ఞానాలలో పయనించు ఏపాటి సాధకునకైనా ఉపయోగించే రీతిలో ఉపదేశం అందించాడు. కనుక గీతలో ద్వైతమార్గంలోని భక్తి, అద్వైత జ్ఞానము రెండూ ఉంటాయి. ద్వైతాద్వైతాలు ఒక చోట నప్పుతాయా అని ప్రశ్నించవచ్చు. అట్టి సందేహాలు రాకుండా రెంటినీ కలిపే మార్గాలనూ చెప్పాడు. ద్వైతం నుండి ఉద్ధరించేవాడు ఈశ్వరుడని చెప్పాడు. భగవంతుడు ఉద్ధరించడం అనే మాట అద్వైత గ్రంథాలలో ఉండదు.

సాధకుని సాధన వల్ల మాయయనే తెరచీల్చబడదని, ఈశ్వర కృప వల్లనే సాధ్యమని గీతలో అంటాడు.

అర్జునుడు జ్ఞాన (సాంఖ్య) సాధకుడు కాదు. సన్యాసం పుచ్చుకొని అద్వైతంలో మునగడానికి సిద్ధంగా లేదు. అనగా ఒక విధంగా ఉత్తమాధికారి

కాదని చెబుదాం. అతడు యోగసాధకుడు మాత్రమే. ఫలాల నపేక్షించకుండా, చిత్త శుద్ధికై కర్మలు చేయువాడు మాత్రమే. కనుక అతడు మధ్యమాధికారి. ఉత్తమ, అధముల మధ్యనుండువాడే. అందుకే అర్జుననకు ఉత్తమోత్తమ స్థితిని ఉపదేశించు సందర్భంలో ద్వైత అద్వైతాలను కలిపే ఈశ్వర ప్రస్తావనను, అనగా ఈశ్వరకృపయనే మాటను వాడాడు.

మరొక సందర్భంలో (7-14) సత్త్వ రజస్తమోగుణ రూపమైన మాయ, నాశక్తియే, దానిని మానవుడు దాటగలడా? నన్ను శరణుబొంది నా అనుగ్రహం పొందితేనే సాధ్యం అన్నాడు.

మరొక సందర్భంలో (18-62) ఈశ్వరునకు భావసమర్పణ చేసినపుడు శాశ్వతమైన అద్వైత మోక్షాన్ని, అతని అనుగ్రహం వల్ల పొందగలడని ఉంది.

ద్వైత భావంలో భక్తిని చూపించినా భగవానుని అనుగ్రహం వల్ల ఆత్మసాక్షాత్కారమై అతనిలో ఏకమై వెలుగొందే స్థితి వస్తుందన్నాడు. (18-55)

ఆది శంకరులు ఈశ్వరకృపను పేర్కొన్నారా ?

ఈశ్వరకృప వల్లనే జ్ఞానం కల్గుతుందనే అభిప్రాయాన్ని ప్రకటించడంలో పూర్తి నిగ్రహాన్ని చూపలేదు అక్కడక్కడ ఈశ్వరకృప ప్రస్తావన, శంకరులు చేయకపోలేదు.

సౌందర్య లహరి, శివానందలహరి వంటి స్తోత్రగ్రంథాలలో భక్తి గురించి చెప్పడంలో విశేషం లేదు. జ్ఞానగ్రంథాలలో సైతం, మాయనుతొలగించి పరమాత్మ మోక్షాన్నిస్తాడని చెప్పారు. ప్రస్తుతం భక్తిగ్రంథాలలో జ్ఞానానికి సంబంధించిన నిదిధ్యాసంగురించి చెప్పవద్దని భావించారు. తీవ్రమైన భక్తితో ఏకాగ్రత కుదిరి అది జ్ఞానమార్గం లోకే దారి చూపిస్తుంది కదాయని, తనంతట అదే పట్టుబడుతుందని, కనుక వేదాంతానికి చెందిన నిదిధ్యాసం భక్తి

మార్గాంలో చెప్పనవసరం లేదని శంకరులు భావించియుంటారు. భక్తి మార్గంలో వేదాంతం గురించి చెబితే మోక్షానికి జ్ఞానమార్గమే గొప్పదన్నపుడు ఈభక్తిని పట్టుకొని వ్రేళ్లాడడమెందుకనే తప్పుడు సంకేతాలనిచ్చినట్లౌతుంది. అట్టివారు భక్తికి చెడిన వారవుతారు, ఆత్మచింతనకు దూరమైపోయి రెంటికి చెడిన రేవడిలా ఉండవలసి వస్తుందని భావించియుంటారు. ఏకాగ్రత కోసమే కదా భక్తి? శంకరులేమి భావించియుంటారంటే ముందుగా ఈశ్వర కృప వల్లనే అద్వైత జ్ఞానంపట్టుబడుతుందని ముందు భక్తి గ్రంథాలలో చెబుదాం. అది భక్తి మార్గంలో ఉన్నవారికే ప్రీతి పాత్రంగా ఉంటుందని భావించియుంటారు. ఇక జ్ఞానం గురించి విపులంగా వారి భాష్యగ్రంథాలలో, ప్రకరణ గ్రంథాలలో చెప్పారు. ఈ గ్రంథాలలో ఈశ్వరకృప గురించి చెప్పియుంటే బలకరంగా ఉండియుండేది. (బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్తులు. గీత–ఇవి భాష్యగ్రంథాలు వివేక చూడమణి, అపరోక్షానుభూతి, ఉపదేశసాహస్రి మొదలైనవి ప్రకరణ గ్రంథాలు)

అద్వైత గ్రంథాలలో ఈశ్వరకృప గురించి విపులంగా చెప్పకపోయినా అక్కడక్కడ చెప్పారు, ఎట్టి పరిస్థితులలో చెప్పారు? 18వ అధ్యాయంలో అన్నింటిని భగవానునికి అర్పించనే సందర్భంలో విధింపబడిన కర్మను విడిచిపెట్టరాదని, ఈశ్వర ప్రీతికోసం చేయాలని, అపుడు సిద్ధికల్గుతుందని అన్నారు. శంకరుల భాష్యాన్ని అనుసరించి దానివల్ల జ్ఞాననిష్ఠకు అర్హత వస్తుందని ఉంది. ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలను చేస్తే ఆత్మవిచారణకు అర్హత వస్తుందని భగవానుడు చెప్పాడే గాని ఈశ్వరకృప కల్గుతుందని అనలేదు. కాని శంకరులు, ఈ సందర్భంలో ఈశ్వరకృపను తీసికొనివచ్చారు. ఈశ్వరార్పణ బుద్ధితో స్వకర్మలను చేస్తూ ఉండగా జ్ఞాననిష్ఠ ఈశ్వరకృప వల్ల వస్తుందని అన్నారు. "తత్ప్రసాదజం" అనే మాటను వాడారు. అసలు శ్లోకంలో ఈశ్వర ప్రసాదం అనేమాట లేదు. ఇట్లా అనడం వల్ల, స్వకర్మకు పట్టుబడడంవల్ల ఆత్మవిచారణ తనంతట తాను కల్గదని, ఈ అర్హత

ఈశ్వరకృపవల్లనే అని చెప్పినట్లైంది. ఇట్లా శ్లోకంలో లేనిదానిని చెప్పడం గమనింపదగింది.

కర్మఫలదాత, ఈశ్వరుడని అద్వైతులంటారు. కర్మ, తనంతట తాను ఫలాన్నియ్యదు. కర్మలు తమంతట తామే ఫలాన్నిస్తాయని పూర్వమీమాంసకులంటారు. అట్లా అద్వైతులనరు. ఎంత వరకూ మాయా ప్రభావం ఉంటుందో అంతవరకూ ఫలప్రాప్తి యుంటుందని. చెబుతూ మాయనుండి విడివడే ప్రయత్నంలోనూ అనగా జ్ఞాన సాధనలో అడుగడుగునా ఈశ్వరకృప ఉంటుందని చెప్పరు. కర్మయోగం వల్ల చిత్తశుద్ధి ఏర్పడుతుంది, తరువాత ఆత్మవిచారణ చేస్తాడని అంత వరకే చెబుతారు. కర్మయోగంవల్ల ఈశ్వరుడు చిత్తశుద్ధిని ప్రసాదించి జ్ఞాననిష్ఠలో ప్రవేశపెడతాడని మాత్రం అనరు.

గీతలో చివరి అధ్యాయంలో కర్మనుండి జ్ఞానంలో ప్రవేశ పెట్టబడినపుడు అనగా అన్ని కర్మలను వీడి సన్న్యాసం స్వీకరించే సందర్భంలో ఈశ్వరకృప గురించి ప్రస్తావించారు. దాని మొదటి మెట్టు రెండవ అధ్యాయంలో ఉంటుంది. ముందు జ్ఞానవేదాంతాలను చెప్పిన తరువాత భగవానుడు కర్మయోగాన్ని చెప్పాడు. ఇంతవరకూ సాంఖ్యాన్ని (జ్ఞానాన్ని) చెప్పాను. ఇపుడు యోగం గురించి చెబుతానని అన్నాడు (2-39) సాంఖ్యం అంటే కపిలుడు చెప్పిన సాంఖ్యమని, యోగం అంటే పతంజలి చెప్పిన యోగమని సాధారణ జనులు భావిస్తారు. జ్ఞానమార్గాన్ని సాంఖ్యమని కర్మమార్గాన్ని యోగమని భగవానుని అభిప్రాయం. ఈ యోగం కూడా ఫలాలను అపేక్షించకుండా చేయాలని ఇదే కర్మయోగమని, ఫలాలు నాశించి చేస్తే అదే బంధకారణ మౌతుందని అన్నాడు. లోక సంగ్రహం కోసం, చిత్తశుద్ధి కోసం చేస్తే ఆ కర్మ, బంధించదని అన్నాడు. "కర్మబంధం ప్రహాస్యసి"

భగవానుడు చెప్పకపోయినా శంకరులు, తమ భాష్యంలో ఈశ్వరకృపవల్ల

జ్ఞానాన్ని సంపాదించి ధర్మాధర్మాలతో కూడిన కర్మ బంధాలను త్రెంపివేయాలన్నారు అట్లా అనడం వల్ల కర్మయోగం తనంతట తాను ఫలమీయదని, ఈశ్వరుడు ఫలదాతయని అర్థం వచ్చింది. మరొకటుంది. స్వధర్మకర్మ చేయడం వల్ల కర్మబంధాల నుండి విడుదల చేసి జ్ఞాన ప్రాప్తికి దోహదం చేస్తానన్నాడు. భాష్యంలో ఈశ్వర ప్రసాద నిమిత్త జ్ఞాన ప్రాప్తే అన్నారు. కర్మబంధం పోవడం కంటె జ్ఞానప్రాప్తికి ఎక్కువ ప్రాధాన్యం. జ్ఞానాన్ని పొందుటకు కర్మలను విడిచిపెట్టడానికి దోహదం చేస్తాడని అర్థం.

కర్మయోగం వల్ల కర్మలను ఆచరించి చివరకు కర్మను విడిచిపెట్టే స్థితి, అనగా నిష్కర్మ సిద్ధిస్తుంది. ఈశ్వరకృప వల్లనే ఇది జరుగుతోంది. అది జీవుణ్ణి జ్ఞానమార్గంలో పెడుతుంది. ఈ సందర్భంలో బుద్ధితో ఆత్మనెట్లా తెలిసికోవడం అనే ప్రశ్న వేసేవారికి గురుప్రసాదం వల్ల తరువాత ఆత్మ ప్రసాదం వల్ల సాధ్యమని అన్నారు. లబ్ధ్వా గుర్వాత్మ ప్రసాదనం. గురు ప్రసాదనమనగా గుర్వనుగ్రహం, ఆత్మ ప్రసాదమనగా స్వచ్ఛమైన స్థితి. అనగా గురువుయొక్క అనుగ్రహంవల్ల. అంతఃకరణము శుద్ధిపొందగా ఆత్మను గ్రహించగలడు. ఈ మాటను లోగడవివరించారు. ద్వైతంతో కూడిన బుద్ధి అద్వైతానికి క్రమక్రమంగా మారుతూ అద్వైత స్థితిని పొందుతుందని అన్నారు. జీవుని శుద్ధమైన అంతఃకరణం గురించే చెప్పకుండా జీవునికి భిన్నమైన గురువు యొక్క అనుగ్రహం గురించి కూడా చెప్పారు. శ్లోకం, ఇంత స్పష్టంగా చెప్పకపోయినా శంకరులు అనుగ్రహం యొక్క ఆవశ్యకతను వివరించారు.

గురువు, ఈశ్వరుని ప్రతినిధియే. అందరి గురువు ఈశ్వరుడే సపర్వేషామపీ గురుః **(యోగసూత్రం 1-2-6)** ఇట్లా గురురూపంలో ఈశ్వరుడే జీవుణ్ణి మంచి మార్గంలో పెడతాడని చెప్పడం, మన మతం సిద్ధాంతం. కనుక పైన చెప్పిన గురుప్రసాదం, ఈశ్వరప్రసాదమే, ఈశ్వరకృపయే.

మరొక ముఖ్యవిషయం- అన్ని అద్వైత గ్రంథాలూ జ్ఞానమార్గానికే ప్రాధాన్యం ఇస్తాయి. కర్మానుష్ఠానాన్ని భక్తి ఉపాసనలను ప్రాథమిక దశలో వివరిస్తాయి. వాటిని గురించి విపులంగా చెప్పవు. ఆత్మవిచారణకే ప్రాధాన్యం. చిట్టచివర దశలో వచ్చే ఈశ్వరానుగ్రహం గురించి కూడా అద్వైత శాస్త్రం చెప్పదని తెలిసికొన్నాం వారి ప్రకరణ గ్రంథాలు కూడా ఆత్మవిచారణ గురించే చెబుతాయి. శంకరులు తరువాత వచ్చిన అద్వైతాచార్యులు కూడా అద్వైతంలో చివరి మెట్టు ఎక్కిన వారినుద్దేశించే వ్రాసేరు. అందువల్ల స్పష్టంగా ఈశ్వరానుగ్రహం గురించి పేర్కొనలేదు. ఎందుకంటె ద్వైత భావన కల్గించినట్లౌతుందని. అయినప్పటికీ వీరి గ్రంథాల ఆరంభంలో ఈశ్వరుడు, లేదా గురువునుద్దేశించి మంగళ శ్లోకాలుంటాయి. ఈ శ్లోకాలు మాత్రం ఈశ్వర కృపవల్లనే జ్ఞానం లభిస్తుందని అంటాయి. దీనిని గమనించండి.

వివేక చూడామణి వంటి గ్రంథాలలో శిష్యుడు గురువునకు సాష్టాంగ నమస్కారం చేసి అతణ్ణి శరణుజొచ్చడం ఉంటుంది. చివర మీ అనుగ్రహం వల్లనే అద్వైతానుభవం కల్గిందని చెప్పడమూ ఉంటుంది. వీటివల్ల ఈశ్వరానుగ్రహం వల్లనే జ్ఞానం కల్గుతుందని అర్థమౌతోందికదా!

గుర్వనుగ్రహానికి ప్రాధాన్యం

అద్వైత మార్గంలో పయనించేవారు కొందరు కనబడని, ఈశ్వరుని గురించి చింతించనేల అని భావిస్తునే ఒక మహాత్ముణ్ణి సేవిస్తూ ఉంటారు. ఆ గురువు ప్రత్యక్షంగా కన్పిస్తున్నాడు. అతణ్ణి సేవించినా తన అద్వైత సాధనకు ఉపకరిస్తుందని భావిస్తాడు. ఈపద్ధతి ద్వైతంగానే కన్పిస్తుంది.

చాలామంది పాశ్చాత్య భక్తులు, రమణులు దగ్గరకు అద్వైత తత్త్వంగురించి తెలిసికోవడానికి వచ్చేవారు. వారికి ఈశ్వరదన్నమాట, ఇష్టం ఉండదు. అయినా రమణులను గురువుగానే భావించేవారు. వారి అనుగ్రహం

వల్ల శాంతి లభించిందని అనేవారు. అయితే రమణులు తమనుతాము గురువుగా ప్రకటించుకోలేదు. వచ్చిన వారిని శిష్యులుగా చూడలేదు. ఇంకా చిత్రమేమంటే పవిత్ర గ్రంథాలను గురువులను ప్రక్కనబెట్టి మీకు మీరే ఆలోచించండనే జిద్దు కృష్ణమూర్తి గారి దగ్గరకూ చాలా మంది వచ్చేవారు. గురువనే మాటనే వాడడానికి సుతరామూ ఇష్టపడని జె.కె.గారిని గురువుగా పైవారు భావంచేవారు. అట్లా ఎందరో ఉత్తేజితులై అనుసరించేవారు.

కనుక అద్వైతులు, ఈశ్వరానుగ్రహం గురించి గట్టిగా చెప్పకపోయినా గుర్వనుగ్రహాన్ని గుర్తిసారు. శంకరులు గుర్వష్టకం వ్రాసి గురువు గొప్పదనాన్ని కీర్తించారు కదా!

మాయాశక్తి కూడా జ్ఞానప్రదాత్రి

ఈశ్వరుడు జ్ఞానస్వరూపుడని, జ్ఞానప్రదాతయని చెప్పకనే చెప్పేరీతిలో కేనోపనిషత్తు విశదీకరిస్తోందని శంకరులు, భాష్యంలో వివరించారు. ఇందు ఇంద్రునకు అమ్మవారి ఉపదేశం ఉంటుంది. ఎవడేది చేసినా అది అతనిలోనున్న శక్తివల్ల కాదని బ్రహ్మమే చేయిస్తోందనే మాట ఉందని, ఆమెయే ఉమాహైమవతి యనియుంది. ఇందలి ప్రతి అక్షరాన్ని వివరించారు శంకరులు.

అమ్మవారిని విద్యాస్వరూపిణిగా కీర్తించారు. విద్యయనగా జ్ఞానము. జ్ఞానమనగా అద్వైతంలోని బ్రహ్మజ్ఞానము. ఇందు బ్రహ్మమును తన ఆత్మగాగుర్తిస్తాడు. ఉపనిషత్తులు పెక్కువిద్యలను, ఉపాసనలను పేర్కొన్నా వాటిముందు ఆ ఉపాసనలపేర్లను పేర్కొన్నాయి. దానికి విరుద్ధంగా కేవలం విద్యయని చెప్పినపుడు బ్రహ్మవిద్య లేదా ఆత్మజ్ఞానమనే అర్థంలోనే వాడబడింది. కాంతిగలవస్తువులలో మిక్కిలి కాంతిమంతమైనది విద్యయని భాష్యం వ్రాసి అమ్మవారే విద్యయని బ్రహ్మవిద్యా స్వరూపిణియని పేర్కొన్నారు.

అవిద్యయనగా అజ్ఞానం. మాయను అవిద్యగా శంకరులు పేర్కొన్నారు. (తరువాత వచ్చిన అద్వైతులు మాయ, ఒక దానిని మరొకటిగా చూపే ఇంద్రజాలశక్తి వంటిదని, సత్యాన్ని గుర్తించని అజ్ఞానదశను అవిద్యయని పేర్కొన్నారు.)

బ్రహ్మము మాయతో కూడినపుడు ఈశ్వరుడని పిలువబడతాడని, అవిద్యతో కూడినపుడు జీవుడనబడుతాడని వ్రాసేరు. ఆవిషయాన్ని అట్లా ఉంచుదాం.

బ్రహ్మముతో కూడిన మాయా శక్తి వల్ల ఈశ్వరునిగా పిలువబడినా అతడు జ్ఞానస్వరూపియనే అద్వైతుల మాటకు పై మాటను శంకరులు పేర్కొన్నారు. అదేమిటనగా ఆమెయేవిద్యయని. రాజరాజేశ్వరిగా అమ్మవారినుపాసించే ఉపాసన శ్రీవిద్యయే. దానిని యంత్రప్రతిష్ఠాదుల ద్వారా వ్యాప్తిలోనికి తెచ్చారు. వారి సౌందర్యలహరిలో ఆమెయే మాయయని, ఆమె విద్యయని జ్ఞానాంబికయని పేర్కొన్నారు. ఏమాయ మనలను బంధింస్తోందో ఆమెయే మనలను విముక్తులను చేస్తోంది కదా!

బంధవిముక్తులకు కారకుడు ఈశ్వరుడే

ఈశ్వరానుగ్రహం గురించి బ్రహ్మసూత్రాలలో లేకపోయినా దానిని గురించి భాష్యంలో వివరించారు. (3-2-5) జీవాత్మ పరమాత్మల అభేదజ్ఞానం జీవునిలో ఉంది. ఇది పరమేశ్వరుని ధ్యానం చేయడం వల్ల లభిస్తుంది. ఎందుకంటే ఈశ్వరుడు బంధ-విముక్తులకు కారకుడు కనుక ఆ సూత్రాలలోనే జీవుడు కర్తయేనా? అతడు కర్తయైతే క్రియారహితమైన సమాధి ఎట్లా సిద్ధిస్తుందని ఎట్లా సిద్ధిస్తుందని ప్రశ్న. దానికి సమాధానంగా అతడు కర్త, అతడు కర్తృత్వంలేని ఆత్మ కూడా అని జవాబు. రెండూ ఏకకాలంలో ఎట్లా సిద్ధిస్తాయని ప్రశ్న. వడ్రంగి మాదిరిగా అని జవాబు. వడ్రంగి కర్ర పనిచేస్తున్నపుడు సాధనాలతో చేస్తాడు. లేనపుడు వాటిని ఒక

మూల పడవేసి విశ్రాంతి తీసికోవడం లేదా అని సమాధానం. అట్లాగే జీవుడు ఇంద్రియాలనాధారంగా చేసికొని పనులు చేసినా సమాధిలో వాటిని పక్కనబెట్టి ఆత్మలో విశ్రాంతి తీసికొంటున్నాడు. అ సందర్భంలో పనిచేయాలనే భావన కూడా పరమేశ్వరుని నుండి వచ్చిందే! ఇక్కడ కర్తృత్వం, అనగా బంధంతో కూడినదనే అర్థం వస్తుంది. ఇక్కడ జ్ఞానము, ఆ బంధం నుండి విముక్తం చేస్తుందని బ్రహ్మ సూత్రాలలో లేదు. ఈశ్వరుని కూడా ప్రస్తావించలేదు. దీనికి భాష్యంవ్రాస్తూ జీవుడు సంసారంలో పడి పనులు చేస్తాడని ఈశ్వరానుజ్ఞ వల్ల ఫలాలు అనుభవిస్తాడని చెప్పి ఊరుకోకుండా ఈశ్వరానుగ్రహం వల్ల జ్ఞానం కలిగి విముక్తుడౌతాడని వ్రాసారు.

ఈశ్వరః తతః అనుజ్ఞయా కర్తృత్వ భోక్తృత్వ లక్షణస్య సంసారసిద్ధిః అని వ్రాసి ఊరుకోలేదు. సూత్రంలో అంతవరకే ఉంటుంది. అని అనుగ్రహం వల్ల జ్ఞానం కలిగి బంధవిముక్తుడౌతాడని ఇట్లా అదనంగా వ్రాసేరు:-

తతః అనుగ్రహేతుకేనైవ చవిజ్ఞానేన మోక్షసిద్ధిః భవితుమర్హతి.

శాస్త్రాలలో అద్వైత సాధకునకు అనుగ్రహం గురించి చెప్పకపోవచ్చు. మోక్ష సిద్ధికి ఈ అనుగ్రహం తప్పని సరియని భగవానుడు చెప్పకపోయినా సాధారణంగా గీతలో ఈశ్వరానుగ్రహం ప్రస్తావింపబడకపోలేదు. క్రమపద్ధతిని సూచిస్తూ ఇంద్రియాలనుండి మనస్సుకు, మనస్సు నుండి బుద్ధికి, బుద్ధి నుండి ఆత్మకు ప్రయాణం సాగించాలని చెప్పాడు. 3వ అధ్యాయాన్ని ముగిస్తూ మనస్సును నియమించి కోరిక అనే శత్రువును చంపు, బుద్ధికి కూడా అతీతమైన తత్వాన్ని గుర్తించు అని అన్నాడు. ఇదంతా జీవుని సాధనను బట్టే ఉంటుందని తెలుస్తుంది.

ఈశ్వరుని గురించి సూచన

ఈ ప్రకరణంలోనే ఈశ్వర సూచన ఉంది. నా ఊహను గుర్తించండి. బుద్ధికంటె ఆత్మగొప్పదని ఉంది కదా! ఆ ఆత్మను "సః" అనివాడాడు గాని

అది అనివాడలేదు. ఆ 'సః' ను ఈశ్వరునిగా అర్థం చేసికోవాలి. దాని తరువాత శ్లోకాన్ని "ఈశ్వరుణ్ణి తెలిసికొని మనస్సును నియమించి కోరికను చంపుమని" అర్థం చేసికోవాలి. అనగా మనస్సును మచ్చిక చేసే ఈశ్వరుణ్ణి గుర్తించి అతని అనుగ్రహం వల్ల మనస్సును లొంగదీసికో అని అర్థం చేసికోవాలి. లేకపోతే జీవునకు సంబంధించిన ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి గురించి ప్రస్తావించడం ఎందుకు? ఆత్మజ్ఞానం కావాలంటే మనస్సు అణగాలి. కాని ఈశ్వరుణ్ణి గుర్తించడానికి మనస్సుండాలి. అయితే ద్వైతమనస్సు ద్వైత ఈశ్వరుణ్ణి తెలిసికొంటుంది. కనుక గీతాశ్లోకాన్ని పూర్తిగా అర్థం చేసికోవాలంటే ఈశ్వరుణ్ణి గుర్తిస్తే మనస్సు అణుగుతుంది. అంటే ఎవరైతే తనను గుర్తిస్తారో వారి మనస్సునణచడానికి అనుగ్రహం చూపిస్తాడని తేలింది.

ఆత్మజ్ఞానమే కామనల నాశానికి హేతువు

అయితే జీవుడు చేయవలసినదేమిటి? వైరాగ్య అభ్యాసాల వల్ల మనస్సు నణచడానికి జీవుడు ప్రయత్నం చేయాలి. అది ఎప్పుడైతే అణిగిందో కోరిక నశిస్తుంది. ఈ కామమే జీవుణ్ణి అనేక పాపాలు చేయిస్తోందని భగవానుడన్నాడు కదా! దీనిని మహాపాపియని అన్నాడు. ఇంద్రియాలను మనస్సును, బుద్ధిని దువ్వడం వల్ల కామాన్ని అణచవచ్చుని చెప్పాడు. 'జీవుడు తాను జీవునిగా భావించకుండా ఉంటే అద్వైత ఆత్మ సిద్ధించి కోరికలు లేకుండా పోతాయి. కోరికలే కాదు, జీవభావనే అతనికి ఉండదు. తరువాత భగవానుడు దారి చూపాడు.

మోక్షం లేదా బ్రహ్మ నిర్వాణం కామక్రోధాలనుండి విముక్తులైన వారికే అని స్పష్టంగా చెప్పాడు:-

కామక్రోధ విముక్తానాం యతీనాం యతచేతసాం

అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనాం (5-26)

అనగా యతులు కామక్రోధ బంధాలను త్యజించి చిత్తాన్ని నిగ్రహించి ఆత్మను తెలిసికొని బ్రహ్మనిర్వాణాన్ని రెండు దశలలో పొందుతారు.

ఈ రెండు దశలేమిటి?

ఇక్కడే మోక్షము

ఈ రెండు దశలు ఒకటౌతాయని అద్వైతులంటారు. అద్వైతులకు ఇహము, పరము అని రెండు లేవు. అద్వైతులు కాని వారికి మోక్షమనగా పరలోకమే. పరం అనగా ఉత్కృష్టము. వారికి ముక్తి వైకుంఠంలోనో కైలాసంలోనో శరీరం విడిచిపెట్టిన తరువాత వస్తుంది. అద్వైతులనట్లా కాదు. ఈ జగత్తును మాయావినోదంగా భావిస్తాడు. ఇహలోకంలో ఉన్నా ఇహలోకచింతలేదు. అతడు ఇహలోకంలో ఉన్నట్లు మిగతా వారికితోచవచ్చు. అతని మనస్సు ఆత్మ పైనే లగ్నమై యుంటుంది. సహజంగా దేహం, పతనం కావచ్చు. దానిపై చింత అతనికుండదు ఆత్మలోనే ఉంటాడు. శరీరం వల్ల బాధలు వస్తూ ఉంటే, శరీరంపోతే బాధలు రాకుండా పోతాయా? మరుజన్మలో వస్తాయి కదా! కనుక శరీరం పోవడం కాదు, కర్మలు పోవాలి. నేను శరీరం అనే భావన పోవాలి. అతడు శరీరంతో ఉన్నా అతని చూపు ఆత్మవైపే. తనను శరీరంలో చూసికోడు. అట్టివాడే జీవన్ముక్తుడు.

అట్టి స్థితిని ఇహలోకంలోనే సాధించవచ్చని భగవానుడు అంగీకరించాడు. ఇహపరాలనే జంటను వాడాడు. శాశ్వత సత్యాన్ని విద్వాంసులు చూస్తున్నారని పురుషసూక్తంలో ఉందికదా! కనుక పరలోకంతో నిమిత్తం లేకుండా ఇహలోకంలోనే అద్వైత మోక్షాన్ని సాధించవచ్చని ఒక అద్వైతియే అంటాడు. కోరికను చంపితే అద్వైత మోక్షం వస్తుందని భగవానుడు భరోసా ఇచ్చాడు.

బుద్ధునికి ముందే తత్త్వజిజ్ఞాన

దుఃఖానికి కారణం కోరిక, అదిపోతే నిర్వాణమని బుద్ధుడన్నట్లు కీర్తిస్తారు. ఆ విషయాన్ని అతడేకనుగొన్నట్లుగా. ఈ మాట అంతకు పూర్వం గీతలో లేదా! బ్రహ్మనిర్వాణ పదంలోని బ్రహ్మను తిరస్కరించాడు, బుద్ధుడు. నిర్వాణమనగా అతని దృష్టిలో శూన్యమే. యగయుగాల నుండి వచ్చే భారతీయ సంస్కృతిని గుర్తించకుండా సంస్కృతి, కేవలం బుద్ధునితోనే ప్రారంభమైనట్లు చరిత్రకారులు చిత్రీకరించారు. మన పరిశోధకులు వంతపాడారు. అయితే మనవాళ్లు బుద్ధుని తరువాత గీత వచ్చిందని అనరు. (అందుకు సంతోషించాలి)

తైత్తిరీయ ఉపనిషత్తులో ఆనందవల్లిలో ఆనందస్థాయి వర్ణింపబడిందని లోగడ చెప్పాను. మనుషానందం-'గంధర్వానందం-ఇంద్రానందం-బృహస్పతి ఆనందం-ప్రజాపతి ఆనందము-చివరకు బ్రహ్మానందము. దీని నెట్లా అర్థం చేసికోవాలంటే ద్వైతానందం నుండి అద్వైతానందం యొక్క స్థాయిని సూచిస్తున్నట్లుగా భావించాలి. ప్రతి ఆనందం మధ్యలో కొన్ని పదాలు తిరిగి తిరిగి వస్తూ ఉంటాయి. ఆనందం అనుభవించేవాడు శ్రోత్రియుడు, అకామహతుడనే మాటలు వస్తాయి. శ్రోత్రియుడంటే సద్వంశంలో పుట్టి సంస్కారాలచే సంస్కృతుడై యుండేవాడు. ఉన్నత విద్యావంతుడై యుండాలి. అంతే కాదు కామహతుడు కూడా కాకూడదు. అనగా కోరికలచే చిక్కుకొన్నవాడు కాకుండా ఉండాలి. అనగా అకామహతుడు. అట్టి లక్షణాలు కలవానికే ఆయా ఆనందం పట్టుబడుతుంది. చివరకు బ్రహ్మానందం. ఈ మాటలు మాటిమాటికీ వస్తాయని చెప్పాను కదా!

ఉపనిషత్తులు ఆత్మ జ్ఞానులను వీతరాగులని చెబుతాయి. అనగా కోరికలు లేనివారు. ఇట్లా ముక్తికి కోరికలు పనికిరావని చాలా చోట్ల చెబుతాయి. కర్మ, సంతానం కనుట, ధనం వల్ల అమృతత్వం రాదని త్యాగం వల్లనే వస్తుందని తైత్తిరీయం చెప్పింది.

కృష్ణుడు ఉపనిషత్తుల సారాన్నే అందించాడు. ఉపనిషత్తులనే గోవుల నుండి ఆయన పాలు పితికాడు, 'అర్జునుణ్ణి దూడగా చేసికొని'యనే ప్రసిద్ధ శ్లోకం ఉంది కదా! ఇది అనాది సంస్కృతి ఇచ్చిన ఉపదేశం కాదా?

మనస్సు ఆగిన తరువాత

కృష్ణుడు, అర్జునుణ్ణి మహాబాహో అన్నాడని దాని పరమార్థాన్ని వివరించాను. మనస్సును ఏకాగ్రం చేయడంలో అటూ ఇటూ తిరగకుండా ఉంచడంలో మహాబాహుత్వం కావాలని అతని ఉపదేశం.

మనస్సెపుడైతే ఆగిందో ఆత్మ ప్రకాశిస్తుంది. మనస్సు వల్ల ప్రాపంచిక విషయాలను తెలిసి కొంటున్నాం. అది అణిగితే శాశ్వత శాంతి. ఒక స్వతంత్రభావం కల్గుతుంది. దేనినుండి స్వతంత్రత? శరీరం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి, కర్మ, బంధుత్వం, సంసారం నుండి. అట్టి స్థితి సమాధిలోనే.

ఆత్మనెరుగుటయే నిజమైన జ్ఞానము

అట్టి ఆత్మ ఉందంటే అనుభవించేవాడొకడు ఉండాలి కదా! ఈ ఆనందం కంటె భిన్నంగా మరొకడున్నాడంటే అది ద్వైతమౌతుంది కదా! ద్వైతం ఎంతవరకూ ఉందో అపుడు భయమే. అయితే ఆనందం ఎట్లా? కనుక ఆనందాన్ని అనుభవించేవాడు ఆనందస్వరూపి కావాలి.

ఆత్మ అనగా "నేను" ఇంతవరకు మనస్సును నేనని అనుకొంటున్నాం. ఇది అనుభవించేది దుఃఖాలే కాని, ఆనందం కాదు. ఇది ఎట్లా ఉందంటే బురదను ఒంటిమీద పులుముకొంటూ స్నానం చేయడంవంటిది. ఇదంతా అసత్యాన్ని సత్యమనుకొనుట, అసలు సత్యాన్ని తెలిసికొనక పోవుట వల్లనే.

మనస్సునే నేననుకోవడం తప్పుకదా! ఇది పూర్తిగా అబద్ధమా? అది పనిచేయని దశ, మరుగైన దశ ఒకటుందికదా! గాఢనిద్రలో గాని,

మత్తుమందు ఇచ్చినపుడగాని, సమాధిలోగాని ఇది పనిచేయకుండా ఉంటుందని, అట్టి దశలలోనూ 'నేను' ఉంటుందని లోగడ వివరించాను. కనుక మనస్సే నేననుకోవడం తప్పని తేలింది. ఆత్మను తెలిసికొనడమే నిజమైన జ్ఞానం.

మనం అనేక శాస్త్రవిషయాలను తెలిసికొంటాం. అనేక సత్యాలను తెలిసికొనడమే జీవిత పరమార్థం. అనేక కళలను, శాస్త్రలను అభ్యసిస్తాం. సుఖసాధనాలను కొనుక్కొంటాం. అయినా మన విజ్ఞానం యొక్క డొల్లతనాన్ని చివరకు గుర్తిస్తాం. చివరకు దీనివల్ల సుఖంలేదని, సత్యం కాదని గ్రహిస్తాం. ఇక్కడ మనస్సంటే అంతఃకరణం, బుద్ధిని కలిపినది. ఎన్ని క్రొత్తవాటిని కనుగొన్నా ఇదంతా మానసిక తృప్తికోసమే అనిగ్రహిస్తాం. అసలులోనున్నది ఏం కోరుతుందో దానిని సిద్ధింపచేసికోలేం. అబద్ధపు నేను తృప్తికోసం ఆరాటపడుతూ ఉంటాం. అసలు జ్ఞానం పట్టుబడనంతవరకూ తాత్కాలిక సుఖాన్వేషణకై ప్రయత్నిస్తూ ఉంటాం.

ఈ తత్త్వవిచారణ చేయనివాడు సుఖంగానే ఉంటున్నానని ఇదంతా దుఃఖమయంగా కనబడడంలేదని అంటాడు. ఎందుకు మమ్మల్ని ఇంద్రియాలను బంధించమంటారు? ఈ అద్వైతచర్య వల్ల లాభమేమిటని ఒకడు ప్రశ్నిస్తాడు.

ఒకమాటు ఇట్లా ఊహించి చూడండి. మీకిష్టమైన వానికి ఆతిథ్యం ఇచ్చి ఏదో వాని నుండి ఆశించాలనుకొన్నారు. మరొక వ్యక్తిని మీరిష్టపడిన వ్యక్తిగా పొరపాటున భావించి సకల మర్యాదలు చేసి పంపిన తరువాత నిజం తెలిసికొని మీరు దుఃఖపడడం లేదా? అట్లాగే మాయతో కప్పబడిన మనస్సు మిమ్మల్ని సుఖపెడుతుందని ముందుగా భావిస్తున్నారు. సత్యం తెలిసిన తరువాత మోసపోయామని దుఃఖపడతారు.

మనస్సు ద్వారా బ్రతుకుటలో లోపం

మనస్సు యొక్క అనుభవాల వల్ల సుఖపడుతున్నామని భావిస్తాం. దీని వల్ల నిజంగా సంతోషం అనుభవిస్తున్నామా? అణువు నుండి బ్రహ్మాండం వరకూ మనము పరిశోధించామని సంతోషిస్తున్నాం. ఆ మనమంటే ఏమిటి? ఈ పదంపై పరిశోధించారా? మనస్థితి ఏమిటో తెలియక పైపైవాటిని పరిశోధించి ఏం ప్రయోజనం? అన్ని జ్ఞానాలకు జ్ఞానమైన దానిని, అన్ని సత్యాలకు పరమసత్యమైన దానిని పరిశోధించకుండా పైపై వాటిని కనుగొనడం వల్ల శాశ్వతనందం లభిస్తోందా?

మనలో చాలామంది ఆత్మశాస్త్రాన్ని చదువరు. ఆత్మను మరిపించే మనస్సు పైనే దృష్టిపెడతారు. మన నిజస్థితిపై కొద్దిపాటి కాలాన్ని కేటాయిస్తే ఒక శాంతమైన స్థితి మనలో ఉందని, అదే అన్నిపనులు మనం చేయడానికి. కారణమని గ్రహిస్తారు. చివరకు అన్నీ అబద్ధమని తెలిసికొంటారు.

మనస్సు ఇచ్చే వాటితోనే తృప్తిపడకూడదు. ఏదో రోగం రావడమో, పొందిన వస్తువులు పోవడమో, బంధునాశమో జరిగితే మిగిలేది కోపం, భయం, చివరకు పిచ్చిపట్టడం తటస్థించడం లేదా?

మనస్సు పోవాలి, శరీరంకాదు

అసలు 'నేను'ను కనుగొననంతవరకు తృప్తి ఉండదు. అది పట్టుబడితే నేను శరీరం అనే భ్రాంతి తొలగిపోతుంది. అపుడు శరీరం రోగ గ్రస్తమైనా బాధించదు.

ఆత్మహత్య చేసికొనేవారి గురించి మాట్లాడాను. ఈ బాధలు పోవాలంటే చనిపోవడమే మేలని శరీరాన్ని విడిచినా భూతశరీరం లేదా మరోజన్మలో అధికబాధలు పొందుతాడు. కనుక శరీరం పోవడం ప్రధానంకాదు. శరీరంతో ఉన్న తాదాత్మ్యం పోవాలి. అందున్న అబద్ధపు నేనును విడిచిపెట్టాలి. అనగా

ఆ నేనుతోనున్న తాదాత్మ్యాన్ని విడిచి పెట్టాలి. అబద్ధపు నేనును స్మరించే మనస్సు పోవాలి. అపుడు నేను నేనుగా ఉండడం జరుగుతుంది. అనగా సహజమైన "నేను"

పుట్టుక-ముక్తులకు చెందిన భావాలు

మనస్సు, శరీరం కలిస్తే నేను అనే జీవభావం అసలు నేనుతో ఎట్టిసంబంధం కలిగియుందని మీరు ప్రశ్నించవచ్చు. నిజమైన నేను, మాయకలిస్తే జీవభావం అనగా మనస్సు శరీరం కలిసినది వస్తోంది. మరొక ప్రశ్న ఉదయిస్తుంది. అసలు ఆత్మ, మాయకలవడమేమిటి? సంపూర్ణ ఆనంద స్వరూపమైన బ్రహ్మము ఈ మాయతో కలిసి అసంపూర్ణంగా ఉండడమేమిటి? ఏదో ఇదంతా లీలయని చెప్పగలంగాని అంతకు మించి జవాబులేదు. బ్రహ్మము దోబూచులాడుతోంది. తన సంపూర్ణత్వాన్ని కుంచింపచేసికొని, మరల సంపూర్ణ స్థితికి అదే కృషిచేస్తోంది. ఎందుకీ ఆటలాడుతున్నాడంటే సమాధానం చెప్పలేరు.

ఊరకే దీనినొక క్రీడ అని చెప్పాను. ఏదోలీలగా అని చెబుతూ ఉంటే మళ్లీ దీనికి కారణమేమిటని ప్రశ్నించడం వ్యర్థం.

ఇక మనజన్మ, కర్మవల్ల వచ్చింది. ఆకర్మకు మరొక జన్మకారణం. ఇట్లా అనంతంగా సాగుతుంది.

ఇట్లా జన్మలేకుండా ఉండాలంటే ఆత్మగా, ఆత్మస్థితితో ఉండిపోవాలి. జన్మలేని ఆత్మయైనా జన్మనెత్తి జీవుడవుచున్నాడు.

బ్రహ్మసూత్రాలు చూస్తే పరస్పర విరుద్ధ వచనాలున్నట్లుగా కనబడే వాక్యాలు కన్పిస్తాయి. జన్మ బ్రహ్మము నుండి వచ్చిందని (1-1-2) మరొక చోట జన్మ శరీరం కల్పించిన భ్రాంతియని, సత్యముకాదని, ఆత్మయే పుట్టుకలేదనీ ఉంది (2-3-16,17)

ఇట్లా పరస్పర విరుద్ధంగా నున్న వాక్యాలను, జీవులు పెక్కుమందియని వాదించే వారు సమన్వయం చేయలేరు. ఆత్మశాశ్వతంగా ఉంటుందని, అది సృష్టింపబడేది. కాదని అది జీవాత్మయని వారు చెప్పినపుడు జన్మ బ్రహ్మమునుండి వచ్చిందనే మాటను అంగీకరించరు. శాశ్వతమైనది, సృష్టింపబడనిది గానున్నపుడు ఈ జన్మ దేనినుండి వచ్చింది? అద్వైతంలో ప్రాపంచిక వ్యవహారాలలో మునిగిన దానిని జీవాత్మయని అంటారు. జీవాత్మ, పరమాత్మ విడివిడిగా నున్నారని చెప్పరు. ఉన్నది ఒక్క ఆత్మయే బ్రహ్మ సూత్రం, ఈ ఆత్మనే బ్రహ్మమని, అది పుట్టింపబడదని అంటుంది. జగత్తుగా, జీవాత్మలుగా కనబడేది ఈ ఆత్మనుండే అంటారు. ఇట్లా జీవునిగా కనబడుట ఏదైతే ఉందో అవుదు జన్మ బ్రహ్మము నుండి వచ్చిందని అంటాం ఆ ఆత్మనుండే. మీకున్న సమస్యఏమంటే ఎందుకు? ఎప్పుడు? ఏకారణంవల్ల ఇట్లా జరుగుతోంది? ఎందుకిన్ని కర్మలవల్ల జన్మలు? అనేది ఊహకందనిగాతోస్తుంది.

జీవుడెట్లా పుట్టాడు? పుట్టింపబడ్డాడు? మొదటి జన్మనెత్తుటకు ముందతని స్థితి ఏమిటి? అని ప్రశ్నించగా ఎట్లా జీవుడు సృష్టింపబడ్డాడో ప్రశ్నించవద్దు. అది సృష్టింపబడలేదు. అదే శాశ్వతమైన పరమాత్మయే అని అంటారు. మరొక విధంగా మాయ జీవ భావాన్ని ఆత్మలో కల్పించింది. అయితే మాయ ఎప్పుడీ భావాన్ని కల్పించింది అని ప్రశ్నించగా ఎప్పుడనే తప్పు ప్రశ్నయని, ఎప్పుడనేది కాలాన్ని సూచిస్తుందని, కాలభావన ఆత్మపై కల్పింపబడిందని, ఆ ఆత్మయే కాలాతీతమని చెబుతారు. కాల భావననే మాయ కల్పించినపుడు మాయ ఎప్పుడు పుట్టించిందని ప్రశ్నించడమేమిటి? ఇట్లా నోళ్ళ మూయిస్తారు.

వారు చెప్పిన దానిని బట్టి కొంత ఊరట కల్గుతోంది. జీవుడు అనాదియైనా మాయ అనాదియైనా ఏది ఏమైనా రెండూ అనాదులే. అనంతం మాత్రంకావు. అవి అంతములయ్యేవే. ఆది, అంతము రెండు భావాలు.

ఆది, అంతములు లేనివాడు పరమాత్మ అనగా అనాది, అనంతుడు. మాయ, ఆదియైనా అంతము కలదే. జ్ఞానమైప్పుడైతే కల్గిందో మాయలేదు కనుక అది అంతంతో కూడిందే. అపుడు, జీవాత్మ, పరమాత్మలో అంతమౌతాడు. ద్వైతం నుండి పుట్టిన శరీరానికి, బాధలు, కోరికలూ ఉండవు.

ఇక ద్వైతుల మాట విందాం. వారు జీవుడు అనాది, అనంతుడని అంటారు. జీవుడు, పరమేశ్వరసాన్నిధ్యంలో నిరంతరం ఆనందాన్ని పొందడమే మోక్షమని అంటారు. జీవాత్మగానే ఉంటూ. అట్లా ఉండడమే జన్మమరణ ప్రవాహానికి దూరంగా ఉండడమని అంటారు. దీనికి కొంత మార్పుచేసి జీవాత్మలు తమలో అంతర్యామిగా ఈశ్వరుడున్నాడని, జీవభావం లేకుండా ఈశ్వరునికి చెందిన జ్ఞానానందాలను ఆస్వాదించడమే మోక్షమని విశిష్టా ద్వైతులటారు. కొందరు తాత్త్వికులు అద్వైతం వరకూ వెళ్లి అంతర్యామితో ఆగిపోకుండా ఈశ్వరసమక్షంలో జీవులు, పగలు నక్షత్రాలు కనబడనట్లుగా ఉంటారని అంటారు. సూర్యుడున్నపుడు నక్షత్రాలు కనబడడంలేదు. అంతమాత్రంచే అవి లేకుండా పోతాయా? కనుక పరమాత్మ సన్నిధిలో జీవకాంతి కనుమరుగైపోతుంది. ఆ కాంతిలో లీనమైపోతుంది. వీరే పశు (జీవుడు), పతి (పరమాత్మ), పాశం (జగత్) అనే మూడింటినీ చెబుతారు. ఇట్లా మతభేదాలున్నా ఈ స్థితికి చేరుకొన్న తరువాత సంసారం ఉండదని, మరల జన్మ ఎత్తవలసిన అవసరం లేదనీ అందరూ అంటారు.

విముక్తికై ప్రయత్నం తప్పనిసరి

ఏ సిద్ధాంతమూ, ఆత్మఎట్లా సంసారంలో చిక్కుకొందో, దానికి జవాబు తృప్తికరంగా అందించలేదని బాధపడనవసరం లేదు. అద్వైత శాస్త్రం ప్రకారం, మాయ ఎట్లా ఆత్మను బంధించిందో, మాయ ఎట్లా కారణమైందో అనేవిషయాన్ని ప్రక్కన పెడదాం.

తెలిసి ఎవ్వడూ మాయలో పడడం లేదు. అయినా మాయజాలంలో చిక్కుకొన్నాం. మాయ, ఇంద్రజాలమని అంటున్నాం. జాలం అంటే వల, నిజమైనట్లు తోపింపచేసి అబద్ధమైనది మాయ అని తెలుసు దానిని చూడడానికి డబ్బు ఖర్చుపెడతాం కూడా.

మాయాధీనంలో ఆత్మవచ్చిందనడమే మాయచేసే చమత్కారం. ఇది అబద్ధము, ఇది ఆత్మను బంధించలేదని ఎంత గట్టిగా చెబుతున్నా, నిజజీవితంలో బాధలు పడక తప్పడంలేదు. ఇంద్రజాలకుడు చూపించే చమత్కారాలవల్ల కొంత ఆనందం కల్గుతోంది గాని, మన మాయ దుఃఖాన్నే కల్గిస్తోంది. దీని బారి నుండి తప్పించుకోవడానికి ప్రయత్నం చేద్దాం. గోతిలో పడినపుడు, ఎపుడు, ఎట్లా అని విచారించంకదా! సాధ్యమైనంత త్వరలోనే బైటకు రావడానికి ప్రయత్నిస్తాం. కనుక ఈశరీరం ఎట్లా వచ్చింది? ఈ సంసారం ఎట్లా వచ్చింది? మాయ ఎట్లా బంధించింది? మొదలైన ప్రశ్నలువేసికొని తలబ్రద్దలు కొట్టుకోవడం కంటె దీని నుండి విడుదలకై ఇప్పటి నుండి ప్రయత్నంచేయడమే మనవంతు చేయవలసినపని. ఒకవేళ ప్రశ్నలకు సమాధానాలు దొరికినా ఏం ప్రయోజనం?

సంసారానికి అంతముందనడంలో ఏకాభిప్రాయం

జీవునికి అంతమున్నా లేకపోయినా సంసారానికి అంతమున్నట్లు అందరూ అంగీకరిస్తారు. ఇదే మనకు కావలసినది. అన్ని బాధలకు కారణమైన సంసారం పోతే చాలు. అది పోయిన తరువాత వట్టి జడునిగా ఉండకూడదని అందరూ అంగీకరిస్తారు. పరమాత్మతో, అతని చైతన్య స్వరూపంతో ఒకటై ఉండి పోవడం ఒక సిద్ధాంతి అభిమానిస్తాడు. అతని సన్నిధిలో పరమాత్మ ప్రేమామృతాన్ని గ్రోలాలని ఒకడు భావిస్తాడు. కనుక ఎవరెట్లా చెప్పినా జడునిగా ఉండడాన్ని ఎవ్వరూ అంగీకరించరు. ఇది చైతన్యంతో కూడినదే. మరొక సిద్ధాంతి ఆ చైతన్యకాంతిలో లీనమైపోవడమే లక్ష్యమంటాడు.

సంసారబంధం తొలగాలని అందరూ అపేక్షిస్తారు. అనేక జన్మల పాపకర్మలను మంచి కర్మలు చేసి పోగొట్టు కోవాలని, పాప భావన నుండి దూరంగా ఉండాలని, దానిని ఈశ్వర భక్తితో సాధించాలని అందరూ భావిస్తారు.

ఇదే అద్వైత సాధనకు మొదటి మెట్టు.

౯.
అద్వైతం - ద్వైత స్థాయులను అంగీకరిస్తుంది

ఇందు సందేహం లేదు. మనం అందరం అద్వైతులముకామా? అట్టి అనుభవం మనకు రావద్దా? ఆ సంప్రదాయాన్ని నిలబెట్టవద్దా? అంటూ ఈ ద్వైతభావనల కూడిన కర్మలను, ఉపాసన లెందుకని ప్రశ్నించేవారుంటారు. శంకరులే కర్మ, ఉపాసనల మార్గాన్ని ఎన్నుకొన్నారు. ద్వైత భావనతో జీవితాన్ని కొనసాగిస్తూ వెంటనే అద్వైతంలోకి గంతువేయడం కుదురుతుందా? ప్రాథమిక దశలో దీనిని అంగీకరించి మనసా వాచా కర్మణా కర్మలూ, ఉపాసనలూ చేయాలని, క్రమక్రమంగా ద్వైత భావాన్ని విసర్జించి అద్వైతమార్గాన్ని త్రొక్కాలని శంకరులన్నట్లు పదే పదే చెబుతున్నా.

ఇతర సంప్రదాయాలవారు, పూర్తిగా అద్వైతాన్ని ద్వేషిస్తారని, కాని అద్వైతం గ్రుడ్డిగా ఇతర సంప్రదాయాలను త్రోసి రాదనదని కూడా లోగడ వివరించాను.

బృహదారణ్యమంత్రానికి (5-1-1) భాష్యం వ్రాస్తూ మొట్టమొదటి నుండి ద్వైత ప్రపంచం అంతా తప్పే అని ఎవ్వనికీ తెలియదని అన్నారు నచ

ద్వైతస్య అనృత్వ బుద్ధిః ప్రథమమేవ కస్యచిత్ స్యాత్

బ్రహ్మ సూత్రంలోని రెండవ అధ్యాయం యొక్క మొదటి భాగంలో బ్రహ్మమునుండి జగత్తు ఎట్లా వచ్చిందో వివరించారు. ఇందనేక అభిప్రాయభేదాలున్నాయి. జగత్తునకు కారణం బ్రహ్మమైనా మిగతా

సాధనాలున్నాయా? తానే జగత్తుగా పరిణమించాడా? జగత్తుగా కన్పిస్తున్నాడా? సాధనాలనుపయోగిస్తే అవి ఎక్కడి నుండి వచ్చాయి? అవి ఎక్కడి నుండో వచ్చాయంటే ముందుగా జగత్తునకు తాను కారణమన్న సిద్ధాంతం వీగిపోదా? అతని కంటె వేరే వస్తువున్నదంటే ఈ బ్రహ్మము బ్రహ్మము కాకపోతాదా? పాలు పెరుగుగా పరిణమించినట్లు బ్రహ్మము, జగత్తుగా పరిణమించాడంటే మార్పులేని, మారని బ్రహ్మమనే మాట అబద్ధం కావడం లేదా? అతడు జగత్తుగా మారితే విడిగా బ్రహ్మముండే స్థితియే ఉండదుకదా! ఇట్లా ఎన్నో అభిప్రాయాలున్నాయి. కాని ఇవి సరికావు. శంకరుల సిద్ధాంతం ప్రకారం బ్రహ్మము జగత్తుగా కన్పిస్తున్నాడు. బాహ్యసాధనలతో సృష్టి చేయడం లేదు. అతడు పాలు పెరుగైనట్లుగా పరిణమించుట లేదు. పరిణామం వేరు, ఒకటి మరొకటిగా కనబడడంవేరు. దీనిని వివర్తవాదమంటారు. పరిణామంలో ఆకారంలో మార్పువస్తుంది. కీటకం, భ్రమరంగా మారడం పరిణామం. ఇట్లా మారినపుడు మళ్లీ కీటకం ఉంటుందా? ఉండదు. అది ఒక రబ్బరులా కనబడుతుంటే దాంట్లో మార్పేమైనా ఉంటుందా? కీటంగానే ఉంటుంది. కాని అట్లా ఉంటూనే రబ్బరుగా పైకి కన్పిస్తోంది. అట్లే బ్రహ్మము ఎట్టి మార్పు లేకుండా, స్వస్వరూపంలో ఉంటూ, ఎట్టిమార్పు లేకుండా ఉంటుంది. బ్రహ్మమట్లా ఉండగా, మాయ, జగత్తును తోపించచేస్తోంది. ఇట్టి సందర్భంలో రజ్జుసర్ప భ్రాంతిని వాడారు. ఈ పోలిక చాలాసార్లు అద్వైత గ్రంథాలలో వస్తుంది.

బ్రహ్మ సూత్రాలలో 14వ సూత్రం (2.1.14) తదనన్యత్వ మారంభణ శబ్దాదిభ్యః మీద భాష్యం వ్రాస్తూ అద్వైతాన్ని అంగీకరించడానికి ముందు ద్వైత అభిప్రాయాలను అంగీకరించాలని స్పష్టంగా పేర్కొన్నారు. కలలుగనే స్థితి ఉన్నంతవరకూ కలలు నిజాలే! మేల్కొన్న తరువాత అవి అబద్ధమని తెలుస్తాం. కనుక జీవాత్మ పరమాత్మలకు ఏకత్వాన్ని అంగీకరించడానికి ముందు ద్వైతస్థితిని అంగీకరించవలసిందే:-

సర్వ వ్యవహారాణా మేవ ప్రాక్ బ్రహ్మాత్మతా విజ్ఞానాత్
సత్య త్వోపపత్తేః స్వప్నవ్యవహారస్యేవ ప్రాక్ ప్రబోధాత్.

కనుక శంకరులుపదేశించినట్లు శాస్త్రీయకర్మలు ఆచరించవలసిందే. భక్తి ఉపాసనను కొనసాగించవలసిందే చిత్తశుద్ధి తరువాత ఆత్మ విచారణకు పూనుకోవాలి. అంతేకాని మనం అద్వైతులం కదా, ద్వైత సాధనలేమిటని ప్రశ్నించకూడదు. మనం చేస్తున్నట్లుగానే అద్వైతులు కర్మ, భక్తులనే అనుసరిస్తున్నారని, తేడా ఏమిటని ద్వైతులు మనలను వేళాకోళం చేయడం లేదా? అసలు మనం సత్యాన్వేషకులమైతే వినయం కలిగి అన్ని బంధాల నుండి విముక్తులమై, మన సిద్ధాంతం పట్ల కూడా విశేషానురక్తి లేకుండా ఉండగలగాలి.

పిడివాదం చేయడానికి సిద్ధపడుతున్నామే కాని ప్రాథమిక సత్యాలను గుర్తించడం లేదు. ఆచరణలో అనేకమైన మెట్లు ఎక్కాలని గుర్తించకపోతే ఎలా?

శంకరులు తమ అవతారాన్ని చాలించే సమయంలో మీబోధల సారాంశాన్ని చెప్పండని శిష్యులడుగగా 5 శ్లోకాలలో అందించారు. మనవంటి సామాన్య సాధకులెట్లా తరించాలో వివరించారు. అధ్యాత్మ సాధనలో వికాసాన్ని సూచించారు. మొదటిమాట ఏమనగా ముందు వేదాభ్యాసం చేయండి, వైదిక కర్మలను అనుష్ఠించండి, అధికూడా ఈశ్వరతృప్తి కోసమే, మీకైకాదు. భగవంతుని పట్ల దృఢమైన భక్తి కల్గియుండాలని.

వారి శిష్యులం మనమైతే వారి మాటలను తు.చ. తప్పకుండా పాటించాలి. చిత్తం ఏకాగ్రం కానంత వరకూ కర్మలను చేయవలసిందే. ఏకాగ్రత కుదిరినపుడు కర్మ భక్తులకు ఉద్వాసన చెప్పి ఆత్మ విచారణకు పూనుకోవాలి. ప్రాథమిక దశనుండి అద్వైతలక్ష్యాన్ని విస్మరించకూడదు. రోజూకొంత సేపు ఇదంతా మాయ, అంతా ద్వైతం, ఆత్మయే సత్యం, అది నిష్క్రియం, శాంతం అని భావిస్తూ నేనే బ్రహ్మమనే భావన కల్గియుండాలి.

ఆ భావన కర్మ భక్తులను సరిగా నిర్వహించినపుడే. భావన గట్టిపడిన కొలదీ, ఆ కర్మాదులు తమంతట తామే కనుమరుగౌతాయి. కనుక ద్వైతంనుండే అద్వైతానికి పయనం. కర్మానుష్ఠానం ద్వారా కర్మను ఎట్లు మట్టు పెట్టాలో ఆలోచించాలి. భక్తి ద్వారా మనస్సు నెట్లా నియమించ గలగాలి? మనస్సుతోనే అని చాలా సార్లు సారాంశాన్ని వివరించాను.

అద్వైతులు చూపిన సమన్వయాన్ని ద్వైతులంగీకరించరు. అనేక అంతస్తులున్న భవనంలో క్రింది అంతస్తువారు పైఅంతస్తు గురించి ఆలోచించరు. కాని పై అంతస్తులో ఉన్నవారు క్రింది అంతస్తులున్నాయని ఎక్కేటపుడు ఆలోచిస్తారు కదా! పై అంతస్తు ఉందా అని క్రింది అంతస్తులో ఉన్నవారడుగవచ్చు. వారికి పైకి ఎక్కే అవసరం ఉండదు కనుక, కాని పై అంతస్తులో ఉన్నవారు క్రింద అంతస్తులులేవని ఎన్నడూ అనరు. కుంభకోణం నుండి చిదంబరానికి వెళ్లిన వానికి మద్రాసు తెలియదని చెప్పవచ్చుగాని, మద్రాసుకు వెళ్లవలసిన వాడు చిదంబరం ద్వారానే వెడతాడు.

సత్యానందములు అద్వైతంలోనే

అద్వైతంలోనే మార్పు లేని సత్యం లభిస్తుంది ప్రతివస్తువూ మారుతూనే ఉంటుంది. ద్వైతం ఎంతగొప్పదైన కావచ్చు. పరమార్థ సత్యం అద్వైతంలోనే పట్టుబడుతుంది. అసత్యంలో నెలకొనియుండాలంటే ద్వైత ప్రపంచాన్ని విడువవలసిందే!

పరమార్థ సత్యానుభూతిలో దివ్యానందమూ లభిస్తుంది. గత పుణ్యకర్మలు మన మనస్సునకు ఆనందం కల్గిస్తూ ఉండగా అద్వైతం ఎందుకని ప్రశ్నించినవారికి, ఆఫలాలెప్పుడైనా గతించవచ్చని, ఉత్తరక్షణం ఎట్లాగైనా ఉండవచ్చని. రోగం, భయం, మొదలైనవి రావచ్చని లోగడ సమాధానం చెప్పానుకదా! కనుక మనం అనుభవించేసుఖం తాత్కాలికమే కదా! కనుక మనలక్ష్యం అద్వైతం పై సుఖాలు మనస్సుకి సంబంధించినవి. అద్వైత

సుఖం కావాలంటే ఆత్మలో లీనమైనపుడే. అపుడే మీ బంధాలుండవు. స్వతంత్రత, అరిషడ్వర్గాలేమీ మనలను బాధించవు.

భయం కోరిక నుండే

కోరిక నుండి భయం ఎందుకు వస్తోంది? నేను నాశరీరం అనడంతోనే. దానికి హానికల్గుతుందోనని బాధ. నాచిత్తం అనడం వల్ల దెయ్యాల భూతాల బాధ, అవి మనలను ఆవహిస్తాయని దిగులు, నా వస్తువనినపుడు దొంగలు దోచుకొంటారని దిగులు, నామనస్సనినపుడు తనకున్న గౌరవం ఆదరణ ఎక్కడ తగ్గుతుందోననే భయం, పై అధికారి ఏమడుగుతాడో, ఉద్యోగం నుండి తొలగిస్తాడో అని మన గౌరవానికి భంగం కల్గిస్తాడేమోనని బాధ. ఇట్లా తనవికాని దానిని అనుకొని నానా బాధలు పడుతున్నాం కోరికే వేరువంటిదని లోగడ చెప్పాను కదా! ఇప్పుడది దుఃఖానికి, భయానికి కారణమౌతోంది. కోరినది లభించకపోయినా వచ్చినదిపోయినా దుఃఖమే మిగులుతోంది.

మనస్సులో కోరిక ఎందుకు పుడుతోంది? మనస్సు కంటె భిన్నమైనది ఉన్నట్లు కన్పడడం వల్లనే. ఒక ఆటంకాన్ని దాటడం కోసం ఈ కోరికను నెరవేర్చుకోవడం కోసం ప్రయత్నిస్తున్నపుడు. ఈకోరిక కూడా మన కంటె (ఆత్మకంటె) భిన్నమైనట్లు కన్పిస్తోంది.

ద్వైతమంటేనే భిన్నవస్తువులని

అద్వైతం అంటేనే ఒక అస్తిత్వము. ద్వైతం దానికి భిన్నం. ద్వైతం అంటే సరిగా చెప్పాలంటే రెండని, పెక్కని కాదు. ద్వైత సిద్ధాంతం ఇట్లా సాగుతుంది. పరమాత్మ ఉన్నాడు, జీవాత్మ ఉన్నాడని అతడు పరమాత్మ కంటె భిన్నుడని, ఈ రెండూ సత్యములే అని అంటారు. జీవాత్మయనగా

ఒక శరీరం, ఇంద్రియాలు, అంతఃకరణం ఉండుట. అతని అనుభవంలో తనకంటె బాహ్యమైన వస్తుప్రపంచమున్నట్లు గుర్తిస్తాడు. తానొకడని తన కంటె బాహ్యమైనది ఉందని అనుకోడు. తనకంటె బాహ్యమైనవి పెక్కుతన అనుభవంలోకి వచ్చినపుడు వీటినన్నిటని కలుపగా ఇదంతా ద్వైత ప్రపంచమౌతోంది. జీవాత్మ, పరమాత్మల కంటె చేతన అచేతన వర్గాలెన్నియున్నా జీవాత్మ ఒక్కడే. అన్నీ కలిపినది తనకంటె రెండవది. అట్టి జగత్తు ద్వైత ప్రపంచం క్రిందకు వస్తుంది.

మనస్సు ఒంటరిగా ఉండదు

మనుష్యపదం, మనస్ నుండి వచ్చింది. ఆలోచించేవాడు మానవుడు, ఆంగ్లంలో Man. సమస్త జీవులలో ఆలోచించేవాడితడు కనుక మనుష్యుడయ్యాడు. ఈ ఆలోచనవల్లనే అనేక కష్టాలు, జన్మమరణ పరంపరలు కల్గుతున్నాయి. ఈ ఆలోచించడానికి ఆధారం ఆత్మ. ఆలోచించేది (మనస్సు) ఆత్మ పరిధిలోకి రాదు. కాని జీవునికి ఆధారం ఆత్మయే.

ఏసాయం లేకుండా ఈ మనస్సు ఆలోచించగలిగితే ద్వైత ప్రపంచంతో సంబంధంలేని ఆత్మగా ఎందుకుండలేక పోతోందని ఆశ్చర్య పోతాం. అన్ని బాధలు బాహ్యమైన వాటి నుండే వస్తున్నాయి కదా! ఎముకను కొరుకుచూ చివరకు తనరక్తాన్నే త్రాగే కుక్కలా వెంటబడుతున్నాం. బ్రాహ్యవస్తువు లభించవచ్చు, లభించకపోవచ్చు. ఇతరులు అపహరించవచ్చు. దాని వల్ల అనేక బాధలు వస్తున్నాయి. కనుక ఇతర వస్తుసాహాయ్యం లేకుండా తనంతట తాను మనస్సుతో ఆలోచించగలిగితే ఈ బాధలే ఉండవుకదా! ఇక్కడేమాయ, రంగప్రవేశం చేస్తోంది.

తనకు తాను ఒంటరిగా ఎట్లా ఉండాలో మనస్సుకు తెలియదు. తనంతట తానుండగలిగితే అది అదృశ్యమౌతుంది. అపుడాత్మయే ప్రకాశిస్తుంది. పరమేశ్వరుని మాయ, మాయనిట్లా తీర్చిదిద్దింది.

ఏసాయం లేకుండా తనంతట తాను ఆలోచించగలిగితే దేనిని గురించి ఆలోచిస్తుంది? ఇంతవరకూ బాహ్యమైన వాటిని గురించే ఆలోచించింది. బాహ్యమైన వాటిని చింతించకూడదని మనస్సుకు ఇంతవరకూ తెలియలేదు. ఇట్లా తెలియక పోవడానికి మాయ కారణం. తనకంటె భిన్నమైన వాటిని ఆలోచించడంతోనే దీని పనిసరి పోతోంది.

ఇది ఆలోచించడమే కాదు, అనుభూతినీ పొందుతోంది. అనుభూతికూడా బాహ్యమైన వాటి నుండే, పూజలో ఉద్ధరిణి, పంచపాత్రలెట్లా ఉన్నాయో కన్నులు, ముక్కు మొదలైన ఇంద్రియాలను మనస్సు సాధనాలుగా గ్రహిస్తుంది. ఇంద్రియాలకంటె భిన్నమైన దృశ్యాలను, పాటలను చూడడం, వినడమూ జరుగుతుంది.

ఇంద్రియాలను గెంటివేసి తనంతట తాను అనుభవించలేకపోతుంది. మనస్సు కథలను కల్పిస్తుంది, పాటలను అల్లుతుంది. ప్రకృతి దృశ్యాలను చూసి పరవశించిపోతుంది. ఇవన్నీ బాహ్యమైన వాటినుండే.

అది ఏకాంతంగా ఉన్నప్పుడు తనకు తాను పరీక్షించుకొనగలిగితే దానికి ప్రత్యేకమైన అస్తిత్వమే ఉండదు. సుఖదుఃఖాలు మొదలైనవన్నీ అన్నీ మనస్సుతో ఉన్నపుడే. అవి మనస్సుకావు.

ఒకడున్నాడు అతనికి ఇల్లు, భార్య, పిల్లలున్నారు. ఇవన్నీవేరు, తాను వేరు, పైవిఏమీ లేకపోయినా వాడొక్కనికి అస్తిత్వం ఉందికదా! అట్లా మనస్సుండలేకపోతోంది. ఈ ఆలోచన, అనుభవం, బాహ్యవస్తువులను ఆధారంచేసికొనే. అట్టి స్థితి ఎంతవరకూ ఉందో అదంతా ద్వైతమే!

ఆత్మ ఏకాంతముగా నుండుట

మనస్సు తనంతట తాను విడిగా ఉండలేదు కదా! కనుక దీనిని బాహ్యమైన వాటితో, మనస్సుతో సంబంధంలేని ఆత్మపై నుంచగలగాలి. మనస్సునకు అతీతమైనది ఆత్మ, తనంతట తాను అనుభవించగలది. మనస్సు

ధర్మం - ఆత్మధర్మం - భిన్నమైనవి. తనకు తాను తెలియనిది మనస్సు. బాహ్యమైన వాటిగురించి తెలుసు. ఆత్మ, తనకుతాను తెలిసికొనేది. మనస్సు ద్వైతం. ఆత్మ అద్వైతం.

ఆత్మలేకుండా మనస్సులేదు. నేను అనే భావంలేనపుడు మనస్సు నెట్లా గ్రహించగలదు? ఆత్మయే మాయ వల్ల మనస్సుగా అవుతోందని, అపుడు నేననే జీవభావం వస్తుందని, ఒక ఆత్మయే పెక్కుజీవాలుగా కన్పిస్తోందని అద్వైతం అంటోంది.

విద్యుత్తుతో పోలిక

అందరూ విన్నదే చెబుతున్నా. విద్యుత్తుతో అనేక సాధనాలను తయారు చేస్తున్నాం. వాటితో అనేక ఉపయోగాలు పొందుతున్నాం. ఒకే విద్యుత్తు అనేక సాధనాలలో ఉండి అనేక విధాలుగా ఉపయోగపడుతోంది. ఆ సాధనాలు మాత్రం, అదికాదు. ఆసాధనాలలో ఉన్నది మాత్రమే. అట్లే ఆత్మ, జీవవ్యవహారానికి హేతువౌతోంది. భిన్నమైన రంగులతోనున్న బల్బులలో రకరకాల కాంతి కనబడడానికి, ఒక దాంట్లో వేడి పుట్టించడానికి, ఒక దాంట్లో చల్లదనం కలిగించడానికి, విద్యుత్తే కారణమైనట్లుగా ఆత్మ ఉంటుంది. పచ్చకాంతి బల్బునుండి వస్తూ ఉంటే విద్యుత్తు పచ్చగా ఉందని, టేప్ రికార్డర్‌లో అది వినసొంపుగా ఉందని అనంకదా!

విద్యుత్తు ఒక్కటే అనుట అద్వైతం. దాని వల్ల అనేకమైన పనులు చేస్తున్నాం. అది ద్వైతం, అట్లా ఆత్మ, మాయా శక్తిద్వారా నిర్వహిస్తోంది.

పరమాత్మ - జీవాత్మలు

వీరిద్దరు భిన్నులా? అభిన్నులా? ఆత్మ, జీవునిగా కన్పిస్తోంది. జీవులు భిన్నంగా ఉన్నట్లు కనబడినా వారి యందున్న ఆత్మ ఒక్కటే జీవులసహజరూపమే ఆత్మ.

ఒక జీవుణ్ణి తీసికోండి నఖశిఖ పర్యంతమూ అనేక అంగాలతో ఉంటాడు. అవి భిన్నభిన్నమైన పనులు చేస్తాయి. అంతేకాకుండా శరీరంలో సప్తధాతువులున్నాయి. రక్తం మొదలైనవి. అంతే కాకుండా చిత్తం మనస్సు, బుద్ధి అహంకారం ఉన్నాయి. అన్నీ ఒక ప్రాణశక్తిపైనే ఆధారపడ్డాయి. ఆ ప్రాణం ఎప్పుడైతే పోయిందో చిత్తం, బుద్ధి మనస్సు, అహంకారాలు కూడా శరీరం విడిచిపెట్టినపుడు పోయి మరొక శరీరంలో ప్రవేశిస్తాయి. మిగిలిన శరీరభాగాలు పంచభూతాలలో కలుస్తాయి. కనుక అన్ని ద్వైతకృత్యాలకు ఒకేఒక ప్రాణశక్తి ఆధారంగా ఉందికదా!

అట్లాగే జీవులుగా కనబడేవారినందరికీ ఆత్మయే మూలం. పెక్కు ఆత్మలుండవు. ఆ ఆత్మయే పరమాత్మ.

పరమాత్మ - అంతర్యామి

మామూలు వ్యవహారంలో జీవాత్మ, పరమాత్మయని అంటాం. ప్రపంచంలో ఏంచూస్తున్నాం? ప్రకృతి, జడలోకం పనులు నిర్వహిస్తున్నట్లు చూస్తున్నాం. గ్రహాలు, సూర్యుని చుట్టూ తిరుగుతున్నాయి. చంద్రుడు, భూమి చుట్టూ తిరుగుతున్నాడు. ఈ గ్రహాలకదలికలను బట్టి పగలు, రాత్రి ఏర్పడుతోంది. సూర్యుని వెలుగువల్ల వృక్షాలు మొలకెత్తుతున్నాయి. ఇదంతా జీవునకు సహకారంగా ఉంటోంది. ఇక మనుషులలో స్త్రీ పురుషభేదాలు, బుద్ధినుపయోగించి అనేక పనులను నిర్వహించడం చూస్తున్నాం. కర్మలు – వాటి ఫలాలు. ఇట్లా లోకవ్యవహారమంతా ఒక దానితో ఒకటి సంబంధం కల్గియుంది. దీనినంతా ఒకడు నిర్వహిస్తున్నాడని అనిపించడం లేదా? అతడే పరమాత్మ, అతడే సృష్టించి, అందతనుప్రవేశించి అన్నిటికీ కారణమైయున్న వాడు పరమాత్మ.

అయితే ఈ కనబడే జగత్తుఎట్లా వచ్చింది? దీనిపై పెక్కు అభిప్రాయ భేదాలున్నా అద్వైత దృష్టితో ఇది ఎట్లా ఉందో వివరిస్తాను.

జగత్తుందని జీవుడు మనస్సు ద్వారానే గ్రహిస్తున్నాడు. సాంసారిక బాధలు పోవాలంటే జగత్తుతోనున్న సంబంధంనుండి దూరంగా ఉండి మనస్సు నణచగలిగితే జగత్తేమీ ఇతణ్ణి బాధించదు. జగత్తు అతనికి కనబడకపోవచ్చు. అయితే మటుమాయమైపోతుందా? మిగతా జీవులు తమమనస్సులతో జగత్తును అనుభవిస్తున్నారు కదా! కనుక తను మనస్సుతో జగత్తును నిర్మూలించలేడు. తన మనస్సుతో దానిని సృష్టించలేడు. జగత్తు మానసిక కల్పన అని భావించినపుడు అది అడిగిపోతే మిగతా జీవులకూ ఇట్టి సమమైన అనుభూతి కల్గుతోందా? అందరికీ ఈ జగత్తు సత్యమని అనిపిస్తోంది కదా! అణువు నుండి బ్రహ్మాండం వరకూ అనేక ఆశ్చర్య సంఘటనలు జరుగు తున్నాయి. అన్నీ ఒక క్రమపద్ధతిలో సాగుతున్నాయి. ఇట్లా సాగే ఈజగత్తును ఒక మానవ మనస్సు సృష్టించలేదు.

జీవుడు, మనస్సును ఆధారంగా చేసికొని అనేక కర్మలను చేసి అనేక బాధలను పొందుతున్నాడని ప్రస్తుతం గ్రహిస్తే చాలు. అంతా మనస్సు కల్పించిందంటే బాధలనెవడైనా కోరితెచ్చుకొంటాడా? ఇది పాపాలతో కూరుకుపోయిందని, ఆ పాపాలకు శిక్షను తానేవేసి కొంటాడా?

ఈ జీవునకు, అనేక జీవులు కన్పిస్తున్నారు. ఇతని మనస్సు వారిని సృష్టించిందా? అట్టి సామర్థ్యం ఉంటే అందరి మనస్సులను, స్వభావాలను తెలిసికొనేవాడు కదా! నిత్య జీవితం ఇందుకు భిన్నంగా ఉంది. తోటివారితో మెలగుతూ ఉన్నా వాళ్లను అర్థం చేసికోలేక పోతున్నాం కదా! మనం పాపులనుకొనే వాళ్లు పుణ్యాత్ములుగా, పుణ్యాత్ములు పాపులుగా కనబడడం లేదా?

నీ కల్పన వల్లనే అవతలివాడున్నట్లు కన్పిస్తున్నాడంటే అది నీకల్పనయని అవతలివాడు భావించవచ్చుకదా! ఇట్టి పై జీవుడు మనస్సును పోగొట్టుకొని ముక్తిని పొందితే అందరూ ముక్తిని పొందుతున్నారా? ఎందరో మహాత్ములు

మనస్సును పోగొట్టుకొని ముక్తిని పొందినా, ఈ జగత్తు సాగుతూనే ఉంది కదా! జీవప్రపంచము, జడప్రపంచము ఉండనే ఉన్నాయి. కనుక దీనికి కర్త ఎవరు?

ఈశ్వరుడు - సగుణ బ్రహ్మము

దీని కంతకీ ఏది కారణం? మాయా శక్తి అదే బ్రహ్మమును జీవజగత్తులుగా కన్పింపచేస్తోంది. బ్రహ్మమునకు ఇతరమైనది ఎట్లా లేదో, మాయాశక్తి అతని కంటె భిన్నం కాదు. అయితే బ్రహ్మమే కారణమని ఎట్లా అంటాం? కనుక బ్రహ్మము తనంతట తానుంటూ వేటితోనూ సంబంధం లేకుండా ఉంటూ మాయాశక్తివల్ల ఒకదానిని మరొక దానిలా కన్పింపచేసే శక్తి ఉంటుందని అంగీకరించాలి. దేనితోనూ సంబంధం లేనపుడు నిర్గుణ బ్రహ్మముగా ఉంటాడు. గుణమంటే ప్రత్యేక లక్షణం. అది లేకపోతే నిర్గుణం. ఈశ్వరుడు సగుణ బ్రహ్మము ఇతడే సర్వ జగత్ వ్యవహారాన్ని నిర్వహిస్తూ ఉంటాడు.

జగత్తులో ఆత్మనుజీవాత్మగా సృష్టించింది ఇతడే. సృష్టి స్థితిలయాలు చేసేవాడు ఈశ్వరుడు, సగుణ బ్రహ్మము, పరమాత్మయే, ఈమూడు ఒక్కటే.

నిర్గుణ బ్రహ్మము జగత్తును సృష్టిస్తోందని చెప్పినపుడు మాయాశక్తితో కూడిన ఈశ్వరుడని అతడు మహామనస్సుతో ఉంటాడని భావించాలి. జీవుని చిన్నమనస్సు పెక్కుపనులు చేస్తూ ఉండగా పరమాత్మ యొక్కగొప్ప మనసైన, లేదా సమష్టిమనస్సైన ఈశ్వరుడు ఈ జగత్తును పాలిస్తున్నాడు. ఈ గొప్ప మనస్సు జీవుల మనస్సులకు ఆధారం.

మన మనస్సు ఆత్మను గుర్తించలేదు. ఈశ్వరుడు సమష్టి మనస్సుగా నున్నపుడు అతడు ఆత్మ జ్ఞానరూపియే. ఇది తేడా, మనమనస్సునశిస్తే అపుడు మనకు ఆత్మప్రకాశం సిద్ధిస్తుంది.

వేదాంతంలో ఈశ్వరుడు శివుడుకాదు

వేదాంతంలో తఱుమ ఈశ్వరపదం వాడబడుతుంది. శివుడనే అర్థంలో కాదు. సాధారణంగా ఈశ్వరుడనగా శివుడని అర్థం చేసికొంటాం. శివవిష్ణు ఆలయాలను ఈశ్వరాలయమని, పెరుమాళ్ ఆలయమని (తమిళంలో పెరుమాళ్, విష్ణువని అర్థంలో) అంటారు. వైష్ణవులు మహావిష్ణువును ఈశ్వరుడని అనరు. భగవాన్ అనిగాని పెరుమాళ్ అని గాని, అంటారు. భగవాన్ పదం నుండి భాగవత రాగా విష్ణుభక్తుడనే అర్థంలో వాడతారు. ప్రాచీన వైష్ణవ శాస్త్రాలలో, రామానుజుల విశిష్టాద్వైతంలోను, అన్ని వేదాంతశాస్త్రాలలోను ఈశ్వరుడనగా పరమాత్మయనే అర్థంలో వాడబడింది. ఆ పరమాత్మ శక్తియే సృష్టిస్థితిలయాలను చేస్తోంది అదే నేను లోగడ చెప్పిన విశ్వమనస్సు.

రాను రాను ఈశ్వర పదాన్ని వైష్ణవులు త్యజించారు.

శ్రీ వైష్ణవ సిద్ధాంతంలో మొదటి ఆచార్యునిగా పరిగణింపబడిన నాథముని యొక్క తండ్రిపేరు ఈశ్వరభట్టర్ వీరి సంప్రదాయం ప్రకారం రామానుజులకు ముందు ప్రధానంగా ఇద్దరు ఆచార్య పురుషులున్నారు. ఒకరు ఆళవందార్, తరువాతి వారు నాథముని. ఆళవందార్ తాతగారే నాథముని. జీవలోకాన్ని నడిపే శక్తిని ఈశ్వరుడని వారి పూర్వులు పేర్కొన్నారు.

ఈశ్వరపూజ

అద్వైత గ్రంథాలు, జీవుని ఇంద్రియాలకు మనస్సునకు అతీతమైనది ఆత్మయనియన్నా, పరమాత్మ శక్తియే జగత్తును నిర్వహిస్తోందని, అది జీవుని మనస్సు కంటె పైనున్నదని, ఆత్మకంటె తక్కువగా నున్నదని పేర్కొన్నాయి. జీవుని కర్మానుగుణంగా, జన్మనిచ్చేది ఈ పరమాత్మ శక్తియే. ఈ విశ్వమనస్సైన పరమాత్మను మనస్సు ముందుగా భజించాలి. దానివల్ల దానితో ఏకత్వాన్ని

పొంది ఆత్మను సాక్షాత్కరించుకొంటాడు. ఆ ఆత్మ, పరమాత్మకు ఆధారము. అపుడు ఆత్మలో మనస్సు లీనమౌతుంది. ఇది శంకరులు చెప్పిన మార్గము.

శాస్త్రీయమైన కర్మలను చేసి చిత్తశుద్ధిని పొంది, మనలను సృష్టించిన ఈశ్వరుని అపుడు మనోనిగ్రహం కోసం భజించాలి. అట్టి చిత్తశుద్ధి, ఏకాగ్రతవల్ల మనస్సు తన పట్టును సడలించుకొని ఆత్మలో లీనమగుటకు అర్హతవస్తుంది. అపుడు జ్ఞానమార్గంలో ప్రవేశించి ఆత్మ విచారణచేయాలి. ఇది శంకరులు వేసిన బాట.

చిన్న మనస్సు, పరమమైన అట్టి మనస్సును వినయంతో భజిస్తే ఆ పరమమైనది దీనిపట్ల అనుగ్రహం చూపిస్తుంది. ఇతణ్ణి మాయనుండి విడుదల చేయాలని సంకల్పిస్తుంది. ఆత్మమార్గాన్ని చూపిస్తుంది. అద్వైత శాస్త్రాలు ఈశ్వరుని లేదా పరమమనస్సు వల్లనే జీవునకు అద్వైతం పట్ల రుచి ఏర్పడుతుందని అన్నాయి:-

ఈశ్వరానుగ్రహేనైవ పుంసాం అద్వైతవాసనా

ఇందు జీవుని మనస్సు తరువాత ఈశ్వరప్రస్తావన ఉంటుంది. అదే పరమమై మనస్సు. జీవ, జగత్తులను సృష్టించేది.

సత్యాన్వేషణ - జీవ దృష్ట్యా, జగత్ దృష్ట్యా

జీవుని దృష్టిలో పెట్టుకొని అన్వేషించుటలో ఇంద్రియాలు-మనస్సు-ఆత్మయని చెప్పడం వల్ల ఈశ్వరప్రస్తావన తీసికొని రాలేదు. ఎందుకంటె ముందు శరీరం కన్పిస్తోంది. ఇది జీవశరీరం. తరువాత ఇంద్రియాలు, ఇవీ జీవునివే. తరువాత నియంత్రించే మనస్సు-అన్నీ జీవుని అధీనంలో ఉన్నాయి. చివరకు పొందవలసినది ఆత్మ. అన్నిటిని తనదని భావించే జీవుడు తన జీవత్వాన్ని పోగొట్టుకొంటేనేగాని ఆత్మ, పట్టుబడదు.

ఇట్లా జీవుణ్ణి ఆధారంగానే చేసికొని జీవునకు సంబంధించిన వాటిని పేర్కొన్నాడు. మరల చెబుతున్నా ముందు శరీరము, అది ఇంద్రియాలతో కూడియుండుట, మనస్సుతో కూడిన అంతఃకరణము, అది ఇంద్రియాలను నియమించుట చివరకు ఆత్మ. అన్నింటికి ఆధారభూతమైన ఆత్మను అన్వేషించుటలో జీవుణ్ణి ఆధారం చేసికొన్నాం కనుక ఈశ్వరుని ప్రస్తావన తీసికొనిరాలేదు. ఆ ఈశ్వరుడు ఇతడ్డేకాక మొత్తం జీవ,జడ ప్రపంచాన్ని సృష్టించాడు కదా! అందువల్ల మనస్సు – ఆత్మల మధ్య ఈశ్వరుని గురించి చెప్పలేదు.

ఇక జగత్ దృష్ట్యా ఆలోచించినపుడు ఈశ్వర ప్రస్తావన వస్తుంది.

అన్వేషింపదగిన బ్రహ్మము, జగత్తునకు ఆధారము. పరిమాణంలో అన్నిటికంటె పెద్దది కనుక ఇది బ్రహ్మము. ఇది అండపిండ బ్రహ్మాండాలకు కారణం. సమస్త జంగమ స్థావరాల ఉత్పత్తికి కారణం. అన్నిటికి ఆధారమైన, కారణమైన బ్రహ్మము, జీవునకు ఆధారం కాకపోతుందా? మరి జీవునకు ఆధారం ఆత్మయని ఇంతకుముందే చెప్పాంకదా! కనుక బ్రహ్మము, ఆత్మ ఒక్కటే.

బ్రహ్మము, ఆత్మయని చెప్పడం కంటె ఆత్మయే బ్రహ్మమని చెప్పుట సబబు. రెండూ ఒకటైనా జీవునకు సంబంధించినది ఆత్మగా ఆలోచిస్తాం. జీవ జగత్తులను సృష్టించే దానిని బ్రహ్మముగా భావిస్తాం. అందువల్ల ఆత్మయే బ్రహ్మమనుట మేలు. తనను జీవునిగా భావించువాడు నిజముగా బ్రహ్మమే. అతని ఆత్మ, సర్వగతమైనది. అంటే భిన్నమైన ఆత్మలుండవు. మాయాశక్తి వల్ల ఆ ఆత్మయే జీవునిగా, జగత్తుగా కన్పిస్తోంది. ఈశ్వరుని మాయాశక్తి అంతటినీ నడిపిస్తోంది. చిన్న చిన్న మనస్సులను, అహంకారాలను, జీవులను సృష్టించేది మాయాశక్తితో కూడిన ఆ విశ్వమనస్సే. ఏ జగత్తును ఏ ఈశ్వరుడు సృష్టించాడో తెలిసికొనేది, ఇంద్రియాల ద్వారా జీవుని మనస్సే.

జీవ-ఆత్మ-ఈశ్వర-ఆత్మ

జీవుని మూలం కనుగొనుటలో ముందు మనస్సు దగ్గరకు వెడతాం, తరువాత ఆత్మదగ్గరకు వెడతాం. జగత్తు యొక్క మూలాన్ని అన్వేషించేటపుడు ఈశ్వరుని వరకూ వెడతాం. అన్వేషణలో చివరిమెట్టు సత్యమేకదా! అది నిష్క్రియం, అది ఈశ్వరునకూ ఆధారం, జగత్తును సృష్టించేవాడు, ఈశ్వరుడనినపుడు, అతని నిజతత్త్వమేమిటని అతని సృష్టిదశను, విరమణ దశను గురించి అన్వేషిస్తాం. ఎప్పుడూ ఏదో చేసే మనస్సునకు ఆధారం ఆత్మయని, అది ఏమీ చేయకుండా కేవలం ఉండుటయే (సత్త) లక్షణమని గుర్తిస్తాం. ఆ ఉనికి గాఢనిద్రలో, అపస్మారక దశలో, సమాధిలో ఉన్నట్లు గుర్తిస్తాం. సమాధిలో ఉన్న ఉనికిని గుర్తిస్తాం. మిగతా పైరెండు చోట్ల గుర్తింపు లేదు. మనస్సు, ఈఆత్మనే ఆధారంగా చేసికొంటోందని చాలా సార్లు చెప్పాం. అది లేకపోతే మన మనస్సే లేదు కదా! ఇట్లా వ్యక్తికి సంబంధించిన మనస్సునకు ఏవి ఉంటాయో ఆవిశ్వమనస్సునకూ అనగా ఈశ్వరునకూ అవే వర్తిస్తాయి. ఆ ఈశ్వరునకూ నిష్క్రియమైన, కేవలసాక్షియైన బ్రహ్మమే మూలము. జీవునకు ఆత్మయుందని చెప్పినట్లే ఈశ్వరుని ఆత్మను పరమాత్మయని అంటున్నాం. చివరకు రెండూ ఒకటే.

అనేక నామరూపాలతో కూడిన జగత్తునకు ఈశ్వరుడాధారము. ఆ ఈశ్వరుడు సహజరూపంలో ఉండగా అతణ్ణేమని పిలుస్తాం? పేరు, లక్షణాలు, ఆకారం లేనిదిగా ఉండాలి. ఉదాహరణకు ఇంద్రధనుస్సులో ఏడు రంగులున్నాయి. దీనినే VIBGYOR అని అంటారు. ఈ ఏడు రంగులూ దేని నుండి వస్తున్నాయి? రంగులేని కాంతి నుండి యని శాస్త్రజ్ఞుడు చెబుతున్నాడుకదా! దీనిని ప్రయోగశాలలో ఒక పరికరం ద్వారా చూపిస్తారు. రంగులేని సూర్యకిరణం తేమలో కూడిన మేఘం మీద పడగా ఇంద్రధనుస్సు ఏర్పడుతోంది. రంగులేని స్ఫటికం గుండా కాంతిని పంపిస్తే ఈ రంగులు

కన్పిస్తాయి. ఏడు రంగులను చూపించేది రంగులేని కాంతియే కదా! నామరూపాలతో కూడిన జగత్తునకు నామరూప రహితమైనదే కారణమౌతోంది కదా! అదే బ్రహ్మము దానిని అద్వైతులు నిర్గుణం, నిష్క్రియం, నామరూప రహితం అంటారు.

కనుక జీవునకు ఆత్మ అట్టిది ఈశ్వరునకు పరమాత్మ అట్టిది. ఆత్మ, పరమాత్మలు ఒక్కటా? భిన్నమా?

జీవ– ఆత్మయైనా, ఈశ్వర – ఆత్మయైనా రెండూ నామరూప రహితములే. అది ఇదికాదు, అది కాదు అని త్రోసి వేస్తుంటే మిగిలేది సున్నయే. దానికి అస్తిత్వంలేదు. రెండు సున్నలుండవు. జీవుని ఆత్మకు ఒకసున్న, ఈశ్వరుని ఆత్మకు ఒక సున్న ఉండవు. సున్నఒక్కటే.

ఇది శూన్యమెట్లా అవుతుంది? అన్నీ దాని నుండి వస్తున్నాయికదా! అది లేకపోతే ఈజీవ జగత్తులే లేవుకదా! కనుక సున్న అనడంలో ఆంతర్యమేమిటి? అది సున్న కాదు, అది పూర్ణము, అనగా నిండినది, సంపూర్ణము. రంగు లేని కాంతి నుండి ఏడు రంగులని చెప్పాంకదా! అది రంగులను ప్రకటించడం లేదు. కాని అన్ని రంగులూ అందున్నాయి. అన్ని రంగులూ కలిసినట్లుగా భాసిస్తోంది. అట్లే జీవుని ఆత్మ, ఇంద్రియాదులను ప్రకటించడం లేదు. అది సత్య స్వరూపంగానే ఉంది. అది లేకపోతే ఈ జగత్తులేదు. ఇవన్నీ ఛాయా రూపాలే. కాంతి, మేఘాలద్వారా వక్రీకరణం పొంది రంగులను చూపించునట్లుగానే ఆత్మ, మాయద్వారా వక్రీకరణం పొంది జీవుని అంతఃకరణంగా, ఇంద్రియాలుగా చూపిస్తోంది. కనుక అది పూర్ణము ఈ పూర్ణత్వాన్ని మహాత్ముల జీవితంలో చూడగలం. వారు ఆత్మనిష్ఠులై ఏదీ కోరని స్థితిలో ఉంటారుకదా! పూర్ణకాములై; ఏదీ కోరనవసరంలేనివారై, అనగా అన్నీ కలిగినవారై యుంటారుకదా! ఆ పూర్ణత్వానికి దేనినీ చేర్చనవసరంలేదు. కనుక ఈశ్వరుని సత్యాత్మ, పూర్ణమైనది, లోనున్న అంతః

కరణము ఆత్మను జీవునిగా చూపించింది. మాయతో కూడియుంటే ఈశ్వరుడగుచున్నాడు. మాయతో కూడిన బ్రహ్మమే ఈశ్వరుడు, జీవజగత్తులు అతనినుండే. అట్టి సందర్భంలో ఈశ్వరుని ఆత్మ ఎట్లా ఉంటుంది? అతని కాంతి మాయ ద్వారా వక్రీకరింపబడి జీవులుగా మారింది. దీనినే తాయుమానవార్, సర్వ పరిపూర్ణ అఖండ తత్త్వం అని కీర్తించాడు.

జీవుని ఆత్మ పూర్ణమే, ఈశ్వరుని ఆత్మ పూర్ణమే. ఇది ఒక పూర్ణము, మరొకటి మరో పూర్ణం కాదు. రెండుసున్నలుండనట్లే రెండు పూర్ణాలు ఉండవు. శూన్యమొక్కటే. అది అనంతం, అపారం, అమితం. శంకరులు అద్వైతాన్ని 'ఏకం' ఒక్కటి యని చెప్పకుండా; రెండు కావు = అద్వైతం అని చెప్పారు. ఎందుకంటె రెండు పూర్ణాలుండవు కనుక. పూర్ణం అంటే దాని కంటె భిన్నమైనది మరొకటి లేదు కనుక, అన్నీ అందులో ఉన్నాయి కనుక. ఒకటి ఇందుంది, మరొకటి లేదని చెప్పడానికి వీలులేనిది.

జీవునిలోని ఆత్మ, ఈశ్వరునిలోని ఆత్మ – రెండూ ఒక్కటే అని చెప్పకూడదు. ఆ బహువచనం వాడకూడదు. ఒకేఒక ఆత్మ లేదా సత్యం, లేదా బ్రహ్మము, ఈశ్వరునిగా, జీవునిగా అయిందనిచెప్పాలి. ఆత్మకంటె భిన్నంగా, ఈశ్వరునిగా, జీవునిగా కన్పిస్తున్నాడు మాత్రమే అందుకే జీవాత్మ పరమాత్మలనే వ్యవహారం.

ద్వైత - విశిష్టాద్వైతాలలో జీవాత్మ పరమాత్మలు

పరమాత్మ సర్వగతుడు, సర్వవ్యాపియని, అతడు జీవాత్మకంటె భిన్నుడని, జీవాత్మకు పరిమిత జ్ఞానం, పరిమిత శక్తి ఉంటుందని, ఇద్దరి మధ్యచాలా అంతరమని, భిన్నులని ద్వైత సిద్ధాంతం.

రామానుజులు విశిష్టా ద్వైతాన్ని ప్రతిపాదించారు. కుమ్మరి తనకంటె భిన్నమైన కుండను తయారుచేసి విడిగానున్నట్లుంటాడని, శరీరంలో ప్రాణం

ఉండి శరీరాన్ని నడిపిస్తున్నట్లుగా జీవునిలో అంతర్యామిగా ఉంటాడని, నడిపిస్తున్నాడని అంటారు. మోక్షస్థితి మాత్రం ద్వైత స్థితిలోనే ఉంటుంది. జీవాత్మ, పరమాత్మ కంటె విడిగా ఉంటాడని, భక్తిని చూపిస్తాడని అద్వైతంలోనున్న మాదిరిగా జీవుడతనిలో కలిసిపోడని అన్నారు.

ఇందుపేర్కొన్న జీవాత్మ, ఆత్మయేనా? ఆత్మ జీవునకులోనున్న నిజమైనదికదా! ఆ ఆత్మ మనస్సుకాదు, అది అంతఃకరణమూ కాదు. సిద్ధాంతులందరు ఈ విషయంలో ఏకీభవిస్తారు. ఆత్మ సాక్షిగా ఉంటుందని చెబుతారు. అయితే ఆ సాక్షిపొందే అనుభవాన్ని చెప్పరు. వారు మోక్షానందాన్ని ద్వైత స్థితిలో ఉండగానే అనుభవించగలడని అంటారు.

జీవాత్మ, పరమాత్మలు భిన్నులని మోక్షస్థితిలో జీవుడు ఆత్మస్వరూపంతో ఉండి పరిమిత శక్తి కలిగియుంటాడని అంటరు. లేనిచో మోక్షస్థితిలో ఈశ్వరుణ్ణి కొలవనేల? ఈశ్వరుడు అపరిమిత శక్తి కలవాడని అంటారు. అంతకుమించి అతడు సత్యస్వరూపుడై, నిష్క్రియుడై యుంటాడని చెప్పరు. పెక్కు పరిమిత జీవులున్నారని, వారిని నడిపే సర్వశక్తి మంతుడొకడున్నాడని చెబుతారు. అటువంటిప్పుడు పరిమిత శక్తి కల వారు జీవాత్మలని వారికంటే ఎక్కువ శక్తి కలవారు ఈశ్వరుడు పరమాత్మయని చెప్పడం సబబుగా ఉండదా? వారి దృష్టిలో బ్రహ్మము, అన్నిటికి ఆధారమని, శాశ్వతుడని, పవిత్రుడని, ముక్తుడని, సచ్చిదానంద స్వరూపుడని అతడే ఈశ్వరుడని అంటారు. శాశ్వతంగా విడిగా జీవులు, విడిగా ఈశ్వరుడంటాడని చెబుతారు. వారి మోక్షలోకమును పరమపదమని, పరంధామమని అంటారు.

అద్వైతుల దృష్టిలో సత్యమైన ఆత్మఒక్కటైనా ప్రపంచవ్యవహారంలో జీవాత్మ, పరమాత్మ, అని వ్యవహరిస్తారు. ఆ స్థితిలో అంతఃకరణంలో బద్ధుడైన జీవుణ్ణి జీవాత్మయని ఇతని కంటె ఉన్నతుడైన మాయతో కూడిన వానిని ఈశ్వరుడని పిలుస్తారు. ఇద్దరూ విడిగానున్నారా అన్నట్లు జీవాత్మ

పరమాత్మలని వ్యవహరిస్తారు. ప్రపంచ దృష్టివల్ల ఇట్లా కనబడే భేదాన్ని మాత్రమే అంగీకరించకుండా భేదమేసత్యమని. క్రిందస్థాయిలోనున్న జీవునకు, ఉన్నత స్థాయిలోనున్న ఈశ్వరునకు హస్తిమశకాంతర భేదం ఉందని ఖచ్చితంగా భిన్నులేయని అంటారు ద్వైతులు.

ద్వైతులుగాని, విశిష్టాద్వైతులుగాని జీవుని ఆత్మ నిష్క్రియమని, నిర్గుణమని అద్వైతులు చెప్పినట్లు మాత్రం చెప్పరు. అయినప్పటికీ ఇంద్రియాలలో చిక్కుకొన్న జీవత్వం సత్యం కాదని అంటారు. జీవుని నిజమైన శాశ్వతమైన స్వరూపం ఆత్మయేనని అందుకై ప్రకృతికి అతీతుడైన ఈశ్వరుణ్ణి, ప్రేమతో భక్తితో ఆరాధించాలని అంటారు. ప్రస్తుతం జీవుడా స్థితికి రాలేదు కనుక తప్పుడు మార్గంలోనున్న జీవుడు ఆత్మను గుర్తించాలని, అదే సరియైన స్థితియని అంటారు. జీవుడు, ఆత్మ కొద్దిపాటి భేదంతో ఉంటారని చెప్పడం కోసం జీవాత్మ అని వ్యవహరిస్తారు.

అద్వైతులు మాత్రం జగత్ వ్యవహారంలో తక్కువ స్థాయిలోనున్న జీవాత్మ, ఎక్కువ స్థాయిలోనున్న పరమాత్మ భేదాలను అంగీకరించినా చిట్టచివర స్థాయిలో మాత్రం భేదం అంగీకరించక ఆత్మ ఒక్కటే అని అంటారు.

ప్రపంచ వ్యవహారాలలో ఉండగా జీవుడు తనను ఆత్మగా గుర్తించక అనగా అసలు నేనును గుర్తించక మామూలు నేనును గుర్తించి వ్యవహరిస్తున్నాడు. ఇట్టి చిన్న నేనును జీవాత్మయని అద్వైతులంటారు.

రెండు అస్తిత్వాలకు సంబంధం ఉంది

ఇక జీవుడు, ఆత్మ రెండూ ఒకటైనపుడు, అనగా జీవత్వం, తనకు తానుండే ఆత్మ ఒకటైనపుడు జీవ, లేదా ఆత్మ అని చెప్పవచ్చుకదా! ఈ రెంటిని కలిపి జీవాత్మయని చెప్పనవసరం లేదు. రెంటిని కలుపుతున్నామని భావన వచ్చినపుడు విడివిడిగా ఉండే వారనే భావనవస్తోంది కదా! పాల

పాయసం అంటున్నాం. పాలు, పాయసం కాదు. పాలకంటె భిన్నమైనదేదో ఉంది. పాలలో పంచదార వేస్తున్నాం. ఉన్న రుచికి అదనంగా మరొక దానిని చేరుస్తున్నాం. అపుడు పాలపాయస మేర్పడుతోంది.

పాలు, పంచదార భిన్నంగా ఉన్నట్లుగా పాలు, క్షీరము భిన్నంగా లేవు. రెండు శబ్దాలు ఒకే పదార్థాన్ని సూచిస్తున్నాయి. ఒకే అర్థాన్ని సూచించడానికి భిన్నశబ్దాలను వాడతామా?

జీవాత్మ అనే పదం స్పష్టంగా అర్థం అవుతోంది. జీవునకు ఆత్మకు సంబంధంలేకపోతే రెంటినీ కలపలేం. అనగా జీవాత్మ అని అనలేం. పాలతో సంబంధం ఉండడం వల్ల పాలపాయసమంటున్నాం. రెండు వస్తువులు ఒక దానితో ఒకటి సంబంధం లేకపోయినా తాదాత్మ్యస్థితిని పొంద లేకపోయినా రెంటినీ కలిపి వ్యవహరించగలమా?

జీవునకు రెండు దశలున్నాయి. జీవత్వం ఒకటి రెండవది తనను తాను తెలిసికొనే స్థితికల ఆత్మస్థితి ఈ రెంటికీ సంబంధం ఉంది. సత్యమైన ఆత్మ అసత్యమైన జీవునిగా మారింది. జ్ఞానం కలిగినపుడు జీవత్వంపోయి ఆత్మగానే ఉంటుంది.

ఈశ్వరాత్మ అనుటకు బదులు పరమాత్మ అనడమేమిటి?

జీవాత్మ అన్నట్లుగా ఈశ్వరాత్మ అని అనకుండా పరమాత్మయని ఎందుకంటున్నాం?

ఆత్మను తెలిసి కోకుండా ఈశ్వరుడున్నాడా? ఈశ్వరునకు, ఆత్మకు భిన్నభిన్నస్థితులు లేవుకనుక కలిసియుండే స్థితియుందికనుక ఈశ్వర+ఆత్మ=ఈశ్వరాత్మ అని అనడం లేదు. ఈశ్వరునకు ఆత్మజ్ఞానం ఉంది. అద్వైతం ప్రకారం ఈశ్వరుడు నిష్క్రియుడు, నిర్గుణుడుకాడు. అతడు సగుణుడే. మాయాశక్తితో కూడి ప్రపంచాన్ని నిర్వహిస్తున్నాడు. అంటే

నిజరూపాన్ని విస్మరించి వ్యవహరిస్తున్నాడని భావించకూడదు. మాయతో కూడియుండడం వల్ల నిజరూపాన్ని గుర్తించదని చెప్పకూడదు.

అందువల్ల ఈశ్వరాత్మయని వ్యవహారం లేదు. జీవుని కంటె అధికుడనే అర్థంలో పరమాత్మయని వ్యవహరిస్తున్నాం.

కొన్ని అద్వైత సిద్ధాంతాలు

ఒకే ఒక సత్యం జీవునిగా, ఈశ్వరునిగా ఎందుకు కన్పిస్తోందనే విషయంలో అద్వైతులలో కొద్దిపాటి అభిప్రాయభేదాలున్నాయి.

ఆ సిద్ధాంతాలను బింబప్రతిబింబవాదమని, అవచ్ఛేద వాదమని అంటారని అట్లే ఆభాసవాదమని లోగడ కొంత వివరించాను. వివరంగా చెప్పవలసివస్తే మిమ్ములను కళ్లకుగంతలు కట్టి అరణ్యంలో విడిచి పెట్టినట్లౌతుంది. ఇపుడు మాయ మనలను కళ్లకు గంతలు కట్టి సంసారమనే అరణ్యంలో పడవేసింది. ఆకట్లను కొద్దిగావదులు చేయడానికి ప్రయత్నిస్తాను. పైపైన వివరిస్తాను.

సిద్ధాంతాలలోకి వెడితే కొందరు జీవుని మనస్సు, విశ్వసృష్టికి చెందిన మనస్సు (Cosmic Mind) రెండూ భిన్నం కావని అంటారు. జీవమనస్సు జగత్తును సృష్టిస్తోందా అని మీరు ప్రశ్నిస్తే వారు దృష్టి, సృష్టి వాదాన్ని వివరిస్తారు. నీవు చూడదాన్ని బట్టి జగత్తు ఉంది, దానికి తనకంటూ అస్తిత్వం లేదంటారు. దీనిని ఏకజీవవాదమని అంటారు. ఈ జగత్ సృష్టి అంతా నీచూపును బట్టే ఉంటుందని. జగత్తునకసలు లోకమని పేరుకదా! లోక్ అంటే చూచుట. ఆంగ్లంలోని Look అనే పదం దాని నుండే వచ్చింది. లోకనము = చూచుట. వస్తువునకున్న అస్తిత్వం అది మనచే చూడబడడం వల్లనే. అందువల్ల అది లోకమైంది. ప్రదేశం అనే చెప్పే అర్థంలో వాడబడే Locality, Locus కూడా ఆ లోక్ నుండే. తమిళంలో దీనిని పార్ అంటారు.

అది చూడబడడం వల్లనే అది ఉన్నట్లుంది. తిరుమూలర్ ఈ పదాన్ని వాడాడు.

నీవు చూడడం వల్ల ఇది నీకు కన్పిస్తోంది. నీవు చూడకపోయినా, నీవు లోచూపుతో ఉన్నా నీచూపునకు ఇది కనబడదు. కనుక జగత్తు లోకమైంది. జీవుడు చూడనంత మాత్రంచే జగత్తు కనుమరుగౌతుందా అని మీరు ప్రశ్నిస్తారు. ఒక పిల్లి కళ్లు మూసికొనినంత మాత్రంచే జగత్తునకు చీకటి అలుముకొంటుందా? అని అడుగుతారు.

అయితే ఈ వాదం చేసినవారు గొప్ప విద్వాంసులే. వారు ఉన్నతస్థితిలో ఇట్లా భావించారని భావించాలి. మన దృష్టితో విమర్శించడం తగదు.

మాయకు అతీతమైన స్థితిలో విశ్వమనస్సుపై మన మనస్సుంచి నపుడు జీవుని మనస్సు ఆ విశ్వమనస్సులో లీనమైపోతుంది. నిర్గుణాత్మను చేరడానికి ముందు మనలను ఉద్ధరించే విశ్వమనస్సు మన మనస్సును తనలో లీనం చేసికొనే దశలో విశ్వమనస్సుచేసే వ్యాపారమంతా జీవునకు కల్పించినట్లే అనిపిస్తుంది. అయినా ఆదశలో జీవుడు, ఈశ్వరుడు కాడు.

జీవుడు ఈశ్వరుడు కాలేడు

అంతా ఒక్కటే అని చెప్పిన శంకరులు కూడా నిర్గుణస్థితిలోనే జీవుడు, బ్రహ్మము ఒకటౌతారని చెప్పారుగాని సగుణస్థితిలో ఈశ్వరుడు, జీవుడు ఒకటనిచెప్పలేదు . జీవుడు విశ్వమనస్సులో లీనమైనపుడు ఈశ్వరునికున్న మానసిక శక్తులు జీవునకూ వస్తాయని చెప్పారు. అయితే ఈశ్వరునికున్న జగత్తును సృష్టించేశక్తి ఇతనికి ఉండదని అన్నారు.

ఇది బ్రహ్మ సూత్రాలలోని చివర అధ్యాయంలో సూత్రాలలోని చివర అధ్యాయంలో స్పష్టంగా చెప్పబడింది. ఈశ్వరునితో జీవుడు సాయుజ్యం పొందినపుడు వస్తాయా అంటే అన్ని శక్తులు అలవడినా, ఈశ్వరునికొన్ని సృష్టి, స్థితి, సంహారశక్తులు రావని వ్యాసులవారే చెప్పారు.

అంతా బ్రహ్మమైనపుడు జీవుడు జ్ఞానమార్గంలో వండిపోయి బ్రహ్మమైనపుడు జీవుడు ఈశ్వరుడెందుకు కావడంలేదనే ప్రశ్నకు శంకరులు సమాధానం ఇచ్చారు.

నిష్క్రియస్థితిలోనే ఇద్దరూ ఒక్కటగుట తటస్థిస్తుంది. బ్రహ్మము సగుణుడైతే ఇది సాధ్యం కాదన్నారు. ఎందుకంటే రెంటి అస్తిత్వాలూ ఇక పనిచేయవు. ఒకడు చేసే పనిని అట్లాగే మరొకడు చేయలేడు. పనిచేయడమంటేనే ద్వైతం. అద్వైతం నిష్క్రియంకదా! అది ఏకాంతస్థితి. తనకంటె మరొకటి లేనిదది. క్రియలో మునిగిన ద్వైతంలో రెండూ ఒకటెట్లా అవుతాయి? నిష్క్రియుడైన బ్రహ్మము, జగన్నిర్మాణం చేసే ఈశ్వరుడైతే అతనికి ద్వైత స్థితియే పట్టుబడుతుంది. జ్ఞానం కలిగిన తరువాత నిష్క్రియమైన జీవుని ఆత్మ, క్రియాశీలుడైన ఈశ్వరునిలో లీనం కాదు. ఆత్మ మార్పులేనిది. ఈశ్వరుడు, ఆత్మను జీవునిగా మార్చు మాయను తొలగిస్తే జీవుడు, ఆత్మయే అవుతాడు. సగుణుడైన ఈశ్వరుడు ఆత్మను తనలో కలుపుకోడు. ద్వైత స్థితిలోనున్న ఈశ్వరుణ్ణి ద్వైతభావనతోనున్న జీవుని మనస్సు పట్టుకొనగలదు. అది శుద్ధమనస్సా, మరొకటా అనే విషయం ప్రక్కనపెట్టండి తనకంటె ఈశ్వరుడొకడున్నాడని మనస్సెపుడైతే భావించిందో అది ఇంకా ద్వైతస్థితిలో ఉన్నట్లేకదా!

ఈదృష్టితో చూస్తే ద్వైత విశిష్టాద్వైతులు చెప్పే మోక్షస్థితిలోనూ జీవుడు లీనం కాడు. నిష్క్రియమైన ఆత్మలో లీనంకావడానికి తగిన స్థాయిలో ఆ జీవులు లేరని చెప్పాలి. ఈ పైసిద్ధాంతాల వారు ప్రేమతో కూడిన భక్తిని ఈశ్వరుని పట్ల చూపిస్తే జీవునకు మోక్షానందాన్ని ఈశ్వరుడువారికి ప్రసాదిస్తాడని అంటారు. ఇంకా భగవంతునికి నిర్గుణ రూపంలేదని, సగుణరూపమే అని వాదిస్తారు. అద్వైతులు మాత్రం భగవానునకు సగుణ నిర్గుణ రూపాలుంటాయని, ఆత్మను జీవాత్మ, పరమాత్మ అన్నట్లుగా రెండు

రూపాలుంటాయని నిర్గుణ బ్రహ్మము నిష్క్రియమని, సగుణ బ్రహ్మమే ఈ సృష్టికార్యాన్ని నడుపుతోందని చెబుతారు. సగుణబ్రహ్మ ఈశ్వరునే ద్వైత విశిష్టా ద్వైతులు అంగీకరిస్తారు. (సగుణమనగా సమస్త కల్యాణగుణాలు కలవాడని అంటారు) వారు నిర్గుణమని అనరు. భగవంతుణ్ణి సేవించడమే మోక్షం యొక్క పరమావధిగా వారు భావిస్తే ఆసేవను అంగీకరించి వీరిపై ఈశ్వరుడు కృపను చూపిస్తాడని వీరందరూ నమ్ముతారు. ఒక దానిని ఒక దానిని ఒకరినుండి తీసికోవడం, కృపను చూపించడం – ఇదంతా క్రియను చూపించడం లేదా? ఇదంతా ద్వైతం క్రిందకే వస్తుంది. ఇట్టి పనిని ఈశ్వరుడు చేస్తూ ఉంటే అతడు జీవుణ్ణి తనలో లీనం చేసికోవడం అంటూ ఉండదు. తనకంటె భక్తుణ్ణి బైట ఉంచినట్లౌతోంది కదా! వారి సిద్ధాంతంలో జీవుడు భిన్నంగానే ఉంచబడతాడు. భక్తులనుండి సేవలందుకోవడం, వారు సేవచేయడం జరుగుతూనే ఉంటుంది. గాఢనిద్రలో క్రియారహితమైన స్థితిలో రాజు, పేద, ఇద్దరూ సుఖనిద్రపొందుతున్నారు కదా! ఇక క్రియ ఎప్పుడైతే మొదలైందో రాజు బీదవాడు, బీదవాడు రాజవగలరా?

మీరిట్లా అడగవచ్చు జీవుడు ఈశ్వరుని స్థాయికి చేరుకోకపోయినా అతని కృప వల్ల ఈశ్వరుడు తనకుతానుగా ఉంటూ తనకున్న శక్తులను జీవునకు అందించవచ్చుకదా! అట్లా చేయలేడా అని. అట్టి పనిచేయడు. అట్లా చేస్తే అనేక కష్టనష్టాలు జగత్తునకువస్తాయి. ఎట్లా? సృష్టి స్థితి లయాలు ఒకక్రమపద్ధతిలో సాగుతాయి. ఒకవేళ జీవునకు ఈశ్వరశక్తులే కనుకవస్తే అసలు ఈశ్వరుడు సృష్టించాలనుకొంటే క్రొత్తగా శక్తిని సంపాదించిన జీవుడు లయం చేయాలని భావిస్తాడు. జగత్తంతా అల్లకల్లోలమైపోతుంది. ఇట్టి కారణాన్ని పురస్కరించుకొనే శంకరులు, తమ సూత్ర భాష్యంలో ఆత్మ జ్ఞానం కలిగిన జీవుడు బ్రహ్మమౌతాడు గాని, ఈశ్వరుడు కాడని నిర్ధారించారు.

ఈశ్వరుడు కాకపోయినా జీవునకు జగన్నిర్వహణలో ఈశ్వరశక్తి

వస్తుందని అన్నారు. ప్రేమ భక్తి పండి ఈశ్వరునితో సమానమైనట్లు కనబడినా సత్యం మాత్రం కాదు. దివ్యానంద స్థితిలో సాధకునకు ఈశ్వరశక్తులు వచ్చినట్లుంటుంది! అది మరలపోతుంది. అట్టి భావావేశంలో కొంతమంది మహాత్ములు వారు వ్రాసినపాటలలో ఈ సృష్టి అంతా తామే నిర్మించినట్లు వ్రాసినట్లుంది. ఎందుకంటే వారు సమస్త జీవుల యొక్క బాహ్య ఆంతర శక్తులను తెలిసికొనగలరు. రాబోయేది తెలిసికోవడం, సమస్త జ్ఞానులకు అన్ని కాలాలలోనూ ఉంది. ఉంటుంది. అయినా అట్టివారికి సమస్త ఈశ్వర శక్తులురావు.

ద్వైత జీవునకు ఈశ్వరునితో సంబంధం

సగుణరూపంలో ఉన్న ఈశ్వరుడు ద్వైత స్థితిలో ఉన్నా, కేవలం ద్వైత భావనతో ఉన్న జీవుని వంటివాడుకాదు. అతడు ఈశ్వరునిగా కన్పిస్తున్నా (తన) నిజరూపం నిర్గుణ బ్రహ్మమే అని తెలిసికొంటాడు. పైన ఈశ్వర రూపం, లోన అద్వైత పరబ్రహ్మం. అతని బాహ్యమైన ఈశ్వరరూపాన్ని ఎవరైనా భక్తితో సమీపిస్తే బ్రహ్మములో అట్టి జీవుని లీనంచేయగలడు.

ఇదే మాట గీతలో, చివరి భాగంలో ఉంది. నన్ను భక్తితో సమీపిస్తే నా నిజరూపాన్ని నీవు చూడగలవు, లీనం కాగలనవి భగవానుడన్నాడు.

ఆలోచన చేయకుండా జీవుడుండడని, ఆలోచించే మనస్సుతోనే తాదాత్మ్యం చెందుతాడని-లోగడ చెప్పాను. ఆత్మను గురించి తెలిసికో అని అతనికి చెప్పగా అది అతనికి సాధ్యం కాదు. ఈశ్వరుణ్ణి గురించి ఆలోచించుమనగా ద్వైతభావంతో ఉన్న జీవుడు దానికి సిద్ధపడుతాడు. కనుక నిర్గుణమైన ఆత్మను చింతించడమంటే ఇష్టపడని వాడు ఈశ్వరునితో సంబంధం పెట్టుకోవడానికి సిద్ధపడుతున్నాడు.

జీవునకు సకల జగత్ వ్యవహారాలూ తెలియవు. తనను భక్తితో

ప్రేమించమని భగవానుడనగా తనకున్న జ్ఞానంవంటి జ్ఞానంతో జీవుడుంటాడని భావించడు. ప్రేమతో నన్ను భావిస్తే నా కృప చూపిస్తానని అంటాడు. మన మనస్సు అతని అనంతశక్తిని ఎంతవరకైతే ఊహించగలదో అంతవరకూ భావిస్తేచాలు. కృపచూపిస్తాడు కృప అంటే ఏమిటి? అతని నిజరూప సందర్శనమే. జ్ఞానం కల్గించడమే అతని కృప.

నిజరూపమంటే అనంతశక్తి సమన్వితమైన ఆత్మయే కాదు, సత్యస్వరూపముగా నుండుటనూ అనుగ్రహిస్తాడు. అనగా బ్రహ్మసాక్షాత్కారాన్ని, ఏది జగత్తునకు ఆధారమో, ఏది బ్రహ్మముగా పిలువబడుతుందో అదే జీవునకు ఆధారమైన ఆత్మయే కనుక బ్రహ్మసాక్షాత్కార మన్నా, ఆత్మసాక్షాత్కారమన్నా ఒక్కటే. ఈ దశలో జీవాత్మ, పరమాత్మల ద్వంద్వ భావన ఉండదు. రెండూ ఒక్కటే అనే జ్ఞానం ఉంటుంది.

జీవుడు, తాను జీవునిగా భావించునంతకాలం, ఆత్మ పట్టుబడదు. ఆ ఆత్మ ఈశ్వరునిగా అవతరించినపుడు జగత్ నిర్వహణలో తన నిజరూపం ఆత్మయే అనిగ్రహిస్తాడు. ఇట్లా జీవ, ఈశ్వర మనః ప్రవృత్తులలో తేడా ఉంటుంది. జీవునకు ఆత్మ జ్ఞానం ఎప్పుడైతే పట్టుబడిందో జీవత్వం పోతుంది. ఈశ్వరుడెల్లపుడూ ఆత్మజ్ఞానం కలిగే ఉంటాడు. ద్వైత ఈశ్వరునిగా పైకి కనబడవచ్చుగాక.

ఈశ్వరుడు - జీవుడు, అవిద్య - అంతఃకరణం

అసలు జీవత్వం, ఈశ్వరత్వం అంటూ ప్రత్యేకంగా లేవని అద్వైతం అంటుంది. ఒకే పరమసత్యం జీవునిగా, ఈశ్వరునిగా మాయవల్ల అయిందని అంటుంది. బ్రహ్మము అవిద్యతో కూడినపుడు ఈశ్వరుడని, అంతఃకరణంతో కూడినపుడు జీవుడని పిలువబడతాడని అంటుంది. ఆ అంతఃకరణం, చిత్తం, బుద్ధి, అహంకారాలతో ఉంటుంది. చిన్న మనస్సులో చిక్కుకొన్నవాడే జీవుడు.

మాయాశక్తితో కూడినవాడు ఈశ్వరుడు. ఆ మాయా శక్తి ఆత్మసత్యాన్ని మరుగుపఱచి లేనట్లు కన్పింపచేసి అబద్ధపు జీవులను ఉన్నట్లుగా చూపించేది. దానినే అజ్ఞానమంటారు. ఆ అజ్ఞానమునకే సాధారణంగా మరొకపేరు అవిద్య. సత్యమును తెలిసికొనుట జ్ఞానము. విద్ అనగా తెలిసికొనుట సరియైనా జ్ఞానమే విద్య. సత్యమును అసత్యముగా, అసత్యమును సత్యముగా చూపించేది మాయ. అదే అవిద్య. మాయతో కూడినవాడు ఈశ్వరుడు. అజ్ఞానికాదతడు. అతనిని ఈశానః సర్వవిద్యానాం అని కొనియాడింది మంత్రం. అనగా అతడు సర్వవిద్యాస్వరూపుడని. అతడు మనలను మాయవల్ల అజ్ఞానులుగా చేసినా అతడజ్ఞానికాడు. మాయచేత అతడు బంధింపబడడు. అతడు మనలను అంతఃకరణంతో కట్టివడవేసాడు. కనుక బద్ధులమైయున్నాము. అతడు మన పట్ల అనుగ్రహం చూపించినపుడు ఆత్మ స్వరూపులమైయుంటాం. అతడు జగత్తును చక్కబెట్టుచున్నా అతడు ఆత్మజ్ఞానియే అతణ్ణి బంధిస్తున్నట్లుగా కనబడే మాయనుండే జీవునకు సంబంధించిన అంతఃకరణం వచ్చింది. అందువల్లనే ఒక్కొక్కనికి ఒక్కొక్కమనస్సు వచ్చి కొట్టుమిట్లాడు తున్నాడు. అన్ని అంతఃకరణలు ఈ మాయనుండే. ఇది సమస్త జీవుల సత్యస్వరూపాన్ని కనబడకుండా చేసేది. అందువల్ల అవిద్య అనబడుతుంది. ఈ అవిద్య ఈశ్వరుణ్ణి మాత్రం బంధించలేరని. మరల చెబుతున్నా.

ఎట్లా? పాముకి విషమున్నా ఆ విషం పామునేమి చేయలేదు. దాని నోట్లో కోరలున్నా తనను తాను కరుచుకోలేదు. అది ఇంకొకర్ని కాటువేస్తుంది. అట్లా మాయావియైన ఈశ్వరుణ్ణి మాయ యేమీ చేయలేదు. కాని ఈ మాయజీవలోకాన్ని బాధపెడుతోంది. ఇంద్రజాలం చేసేవాడు ఉన్నవి లేనట్లు చూపించినా తానుంటున్నాడని తెలుసు, తానుచేసేవి అబద్ధాలనీ తెలుసు.

మనకు శరీరం ఉంటోంది. అదే ఉపాధి. ఏ ఉపాధులు లేకుండా ఐశ్వర్యంతో కూడినవాడు. ఈశ్వరుడు. విష్ణుసహస్రనామాలలో ఈశ్వర శబ్దాన్ని నిర్వచించారు శంకరులు, ఐశ్వర్యమనగా ఈశ్వరలక్షణం. దీనితో జగత్తును నిర్వహిస్తాడు. ఈశ్ అనగా పాలించుట. ఇతరులను పాలించేవాడు, తాను పరిపాలింపబడతాడా? మాయ అనే వలను విసిరినవాడు తనను మాయబంధించుకొనునట్లు చేసికొంటాడా? మాయతో ఉన్నా మాయను అదుపులో పెట్టుకొనే శక్తి అతనికి ఉంది. అందువల్ల అతనికి అబద్ధపు నేనుండదు.

బద్ధుడైజీవునిగా, ముక్తుడైనపుడు ఆత్మగా ఉండేవాడని అనినపుడు రెంటికి అసలు సంబంధం ఉండదని భావించవద్దు. అందుకే జీవాత్మ అనే పదం. అట్లే ఈశ్వరుడు ఆత్మనెరిగియున్నా ఈశ్వరత్వం – ఆత్మ అనేవి విడివిడిగా సుండవని కలిసేయుంటామని చెప్పడం కోసం పరమాత్మ అనే పదం తెలియపరుస్తుంది.

అటువంటప్పుడు పరమాత్మ అని ఎందుకు చెప్పబడాలి? ఆత్మ అంటే సరిపోదా? అని శంక సరిపోదు. ఆత్మ అని ఎప్పుడైతే అన్నామో జీవుడు. జగత్తు, ఈశ్వరకృత్యములు లేని దశ. నిష్క్రియం, నిర్గుణ స్థితి. అట్టి దశలో ఈశ్వరప్రస్తావన కూడా ఉండదు. అందువల్ల ఆత్మకు పరమ పదంచేర్చి పరమాత్మ అని అన్నాం.

ఆత్మకు పరమ పదం, ఎందుకుచేర్చినట్లు? జీవుని కంటె ఈశ్వరుడు ఉత్కృష్టుడు కనుక పరమాత్మ అని అన్నాం. ఆ ఈశ్వరుడు కేవల ఆత్మగానే ఉండక పోవడం వల్ల కేవలం ఆత్మ అని చెప్పలేం. అతని దృష్టితో చూచినపుడు ఈశ్వరునకు ఆత్మభిన్నంగా లేకపోయినా, ఈశ్వరాత్మ అని కూడా పిలవడం లేదు. ఇక మనదృష్టితో చూచినపుడు మాయాశక్తితో కూడిన ఆత్మ మనకంటె ఉన్నతంగా, సర్వవ్యాపిగా, సర్వశక్తిమంతునిగా కనబడడం వల్ల ఈశ్వరాత్మ అని చెప్పకుండా పరమాత్మ అని కొలుస్తున్నాం.

వ్యవహారదృష్టితో చూచినపుడే జీవాత్మ పరమాత్మల భేదమని అంగీకరించింది అద్వైతం. పారమార్థిక దృష్టితో చూస్తే రెండూ ఒకటే అని చెప్పింది.

ద్వైత మోక్షం - ప్రకృతి

అన్ని సిద్ధాంతాలు, మోక్షమంటే శాశ్వతమైన ఆనందాన్ని అనుభవించడమే అని, కర్మమార్గం నుండి సంసారచక్రం నుండి విడుదల అవడమే అని అంటాయి. అద్వైతుల కంటె భిన్నమైనవారు, ఈశరీరాన్ని విడిచి పరమాత్మ సన్నిధికి చేరి జన్మలు లేకుండా ఉండిపోవడమే అని అంటారు. వారి జీవుడు పరమాత్మ కంటె భిన్నుడై పరమాత్మ సన్నిధిలో ఉంటాడు. అపుడు స్వామి పట్ల భక్తిచూపించుట, సేవించుట ఉంటుంది. అనగా జీవునకు భక్తియనే భావన, సేవ అనే క్రియ కూడా ఉంటుంది.

ఇట్లా కైలాసంలో గాని, వైకుంఠంలో గాని మాయా స్పర్శ లేకుండా ఉండవచ్చుని, భక్తితో సేవతో కూడిన మనస్సు, శరీరం ఉంటుందని అంటారు. ఇహలోకంలోని మాయతోకూడిన శరీర మనస్సులు అపుడు బాధించవు అంతామంచే.

ఇది ఎంత బాగున్నా కేవల ఆత్మస్థితి మాత్రం కాదు. గాఢనిద్రలో లేదా సమాధిలోగాని ఆత్మకు మంచి చెడులంటవు. వారు చెప్పే అంతా మంచియనే మాట ఆత్మకు భిన్నమైనది. మంచి చెడులనేవి జీవునకు సంబంధించినవి. మంచి అని ఎప్పుడైతే అన్నామో అది ద్వైతానికి, జీవునకు చెందినది అవుతుంది. జీవుడు ఇది మంచి, ఇది చెడు అనినపుడు ఇంకొకవస్తువున్నపుడే కదా! కాని తననూ తాను చూడడం లేదు. ఇట్లా బైట, లోపల ఒకేసారి చూడగలడా? మన మనస్సుకు ఏకాగ్రత లభించనపుడు అనేక భావాలు, భ్రాంతులు కల్గుతాయి. అది ఎపుడు ఏకాగ్రమైందో ఒకదానినే చింతిస్తుంది.

ఒక దానిలో లీనమైనపుడు మాత్రమే అవతలిదాని సమగ్రస్వరూపం తెలుస్తుంది. ఒక దానిని ఆలోచిస్తూ ఉండగా మరొక దానిని ఆలోచించడం కుదరదు. కనుక వారి జీవుడు వైకుంఠంలో ఉన్నా అందుమంచి అనుభవిస్తున్నా తానేమిటో దానిని అనుభవించడం లేదు. ఆత్మ జ్ఞానం లేని అనగా ఆత్మానుభవం లేని అట్టి జీవదశ సత్యస్థితి కాగలుగుతుందా? అని అద్వైతులు ప్రశ్నిస్తారు.

క్రియ, భావాలు ఆత్మలో కల్పింపబడ్డాయి. అవి ఆత్మకు భిన్నమైనవి. కృతం అనగా తయారు చేయబడినది. ఎప్పుడైతే ఒక దానిని తయారు చేసామో అది సహజంగా లేదనికదా! ప్రకృష్టముగా చేయబడినది ప్రకృతి. ఇది ఆత్మకు పనిని కల్పిస్తోంది. కాని ఆత్మ నిర్గుణం, నిష్క్రియం అనగా ప్రకృతి అసహజం, తయారుచేయబడినదని అర్థం వస్తోంది. అది చేయించే పనులు ఎంతగొప్పవైనా, అనగా భగవదర్శనాదుల వంటివి ఎంతబాగున్నా ఇవి ఆత్మ స్వభావానికి భిన్నమైనవి. దీనిని అప్రాకృతమని అనకూడదు. ఏడవ అధ్యాయంలో గీతలో అపరాప్రకృతియని, పరాప్రకృతియని రెండు ప్రకృతులను పేర్కొన్నాడు అవి వరుసగా క్రిందిస్థాయి, పైస్థాయికి చెందినవి. ద్వైతులు, మోక్షదశలోని ప్రకృతి ఉత్తమ దశకు చెందినదని, జీవుణ్ణి భగవంతుని వైపునకు మరలించేదని, మామూలు ప్రకృతి జీవుణ్ణి సంసారంలో ముంచేదని చెప్పుదురుగాక. భగవానుడు ఉత్తమ ప్రకృతిని గురించిచెప్పి నిర్గుణమైన, నిష్క్రియమైన బ్రహ్మమును గురించి చెప్పాడు. అంతేనే కాని, గుణాలతో, క్రియాలతో కూడిన ప్రకృతిని గురించి చెప్పలేదు. ప్రకృతికి సంబంధంలేని అప్రాకృతమును గురించి చెప్పలేదు.

జీవుడు మరొక ప్రపంచానికి వెళ్లినా అతడు ప్రకృతితో ఏదో రకమైన సంబంధం కలిగే ఉంటాడు. అంటే మాయతో, మాయ ఎప్పుడైతే ఉందో మోక్షమెట్లా వస్తుంది? అయ్యా ఇక్కడ అంతా మంచని చెప్పాం కదా! మంచి

కోసమే మాయపని చేస్తోందని ఇదే మోక్షమని ఎట్లా చెబుతారు? అద్వైతులు చెప్పిన జీవబ్రహ్మల ఏకత్వం లేదని ఎట్లా చెప్పగలరు?

ద్వైత స్థితిలో నుండుటయే మోక్షం కాదని కొంతమంది పెద్దలన్నా ఇట్టి స్థితి ఆకర్షిస్తోందని అంటారు. అట్టివారు అద్వైతస్థితిని లోలోన మెచ్చుకొన్నా దీనిని కోరరు.

పెరియపురాణం వ్రాసిన సేక్కియార్, కొంతమంది శివభక్తులిట్లా అంటారని వ్రాసేడు. ప్రేమతో ఈశ్వరునిలో లీనమై భజిస్తాం. దీనిని విడిచి మోక్షానికి ప్రయత్నించం. అంటే కైలాసానికి వెళ్లి అక్కడ ద్వైత భావంతో అర్చించడమే మోక్షమని భావించరన్నమాట.

పై శివభక్తులు అద్వైతమోక్షాన్ని తిరస్కరించినా వారి ప్రపంచవ్యవహార శైలిలో మాత్రం అద్వైత భావనతోనే ఉంటారు. జీవ బ్రహ్మల ఐక్యాన్ని అంగీకరించకపోవచ్చు. కాని మట్టినీ బంగారాన్నీ ఒక విధంగానే చూస్తారు. వారు సృష్టికీ లయానికి తేడా చూడరు. సమభావంతో పవిత్రంగా బ్రతుకుతారు.

ద్వైతంలో దుఃఖం తప్పదు

ద్వైతులు పరమగమ్యమని చెప్పే వైకుంఠమో, కైలాసమో శాశ్వతంగా, బాగా ఉంటున్నాయా? అందున్న వారిలో మధ్య సంఘర్షణలు, శాపాలు ఉంటున్నాయని లోగడ చెప్పాను కదా! చివరకు భగవంతునికే శాపాలు తప్పలేదుకదా! రాధను విరహంలో ముంచి భగవానుడు బాధపెట్టినట్లుంది కదా!

రెండు ఎప్పుడైతే ఉన్నాయో సుఖదుఃఖాలు తప్పవని తెలియడం లేదా? రెండు లేకపోతే ద్వైతం రక్తి కట్టదుకూడా. నాటకంలో అన్ని పాత్రలు సుఖమయంగా ఉంటే విసుగ్గా ఉండదా? భిన్న భిన్నసమస్యలు, మనః

ప్రవృత్తులలో తేడా ఉంటేనే నాటకం రక్తి కదుతోంది కదా!

పోయింది మరల దొరికనపుడే మిక్కిలి ఆనందం కల్గుతుంది. అట్టిది ద్వైతంలోనే. అందుకే భగవానుడు భక్తుల మధ్య విరహాన్ని కల్గిస్తాడు. సంఘర్షణ ఉంటేనే జగన్నాటకం రక్తి కదుతుంది. దుఃఖంవల్ల సుఖం పోయి మరల సుఖం వస్తే బాగుంటుంది. అయితే ఈ ద్వంద్వాలు అనగా సుఖదుః ఖాదులవంటివి శాశ్వత సుఖాన్ని అందిస్తున్నాయా? దుఃఖం పోయి సుఖం వచ్చినా అది శాశ్వతంగా ఉంటోందా? అది ఎప్పుడైతే లేదో మోక్షస్థితి పట్టుబడదు. అది అద్వైతంలోని ఆత్మ సాక్షాత్కారంవల్లనే సాధ్యం.

ఇక కాశ్మీర శైవులున్నారు. వారు వైకుంఠాన్నీ, కైలాసాన్నీ వాంఛించరు. ఆలోకాలలో ఇష్టదైవాలతో ఉండదానికి ద్వైతులు మాదిరిగా కోరరు. తీవ్రధ్యానంలో పరమాత్మలో లీనం కావాలని భావిస్తారు. జీవ బ్రహ్మల ఏకత్వం కాదు. అపుడు కూడా కొన్ని సందర్భలలో వారి ఏకాగ్రతకు భంగం కల్గుతుంది. ధ్యానానికి ఆటంకం కలుగవచ్చు. వారు ఆకారం లేని శివుణ్ణి భజించినా అనగా నిర్గుణుణ్ణి సేవించినా శివునిగా మారదం కోసం కాదు. అది ఒకదానితో ఒకటి పేనునట్లుగా ఉందేదశ, కలుపునట్లుండే దశను కోరుతారు. అయితే పడగుపేకలుగా అల్లిన దాని నుండి దారాలను తొలగిస్తే అపుడు జీవబ్రహ్మలు విడిగా ఉందడం తటస్థిస్తోంది కదా! కనుక ఈధ్యాన పద్ధతి శాశ్వతంగా ఉంటుందా? ఉండదు. అద్వైతంలోనే సాధ్యం.

పవిత్ర మగుటకు ప్రయత్నం - పాత్రనుతోమినట్లు

మనం చెప్పినట్లు వైదిక కర్మలు చేయుట భగవత్ ప్రేమతో గట్టిబడిన మనస్సును మెత్తపడునట్లు చేయుట, చిత్తశుద్ధి, తరువాత ఆత్మజ్ఞానికి అన్వేషణ సాగవలసిందే.

మట్టిలో కూరకుపోయిన రాగిపాత్రనెట్లా శుభ్రం చేస్తాం? ముందు మట్టిని తొలగిస్తాం చింతపండుతో రుద్దుతాం. కిలుముపోయేవరకూ తోముతాం.

అంటే క్రొత్త పాత్రను తయారు చేడయం లేదు. దానికి పట్టిన మురికిని మాత్రమే తొలగిస్తున్నాం.

ఆత్మకూడా అట్టిదే. దానిని సాక్షాత్కరించుకోవాలనే తపన కలిగినపుడు దుష్టకర్మలు, దుష్టభావాలనే చెత్తా చెదారాన్ని తొలగించవలసిందే. మట్టిని, చింతపండును వాడి, మకిలిని తొలగించినట్లు శాస్త్రంలో చెప్పిన కర్మలు, మంచిపనులు చేసి పూర్వజన్మ కర్మలను తొలగించాలి. శుభ్రంచేయడానికి ఇవి పనికివస్తాయి. చివరకు నీటిని వాడతాం. అట్లాగే చిట్టచివర దశలో ఈమనస్సు, శరీరం అపవిత్రములని భావించి వీటినీ విడిచిపెట్టినపుడే ఆత్మ చిక్కేది. ఆత్మాన్వేషణ అనే శుద్ధజలంతో అనగా జ్ఞానమనే జలంతో కడగాలి. చివరకు ఆత్మను గురించి ఆలోచించాలనే ఆలోచనను కూడా విడిచిపెట్టాలి. ఆలోచన ఎప్పుడైతే వచ్చిందో ఆలోచించేవాడు, ఆలోచింపబడే మరొకటి అనే ద్వైతం తొంగిచూస్తోంది కదా! కనుక ఆత్మగానుండుటయే పరమలక్ష్యం. ఈస్థితి మాటలకు, బుద్ధికీ లొంగేది కాదు. అన్నిటికీ అతీతం.

అపుడు పాపం లేదు, పుణ్యం లేదు. ఆ పుణ్యం ఎందుకు చేయలేదు? ఈ పాపం ఎందుకు చేసాను? అనే చింత ఉండదు. ఆత్మకర్త కాదు, భోక్త కాదనే స్థితి వస్తుంది. ఆత్మనిష్ఠుడై యుంటాడు.

పాత్రను మంచి నీటితో కడిగినా దానిపై ఇంకా మరకలు ఏర్పడవచ్చు. అది లేకుండా ఉండాలంటే పొడిగుడ్డతో తుడుస్తున్నాం కదా! అట్లాగే చిట్ట చివర దశలో ధ్యానమూ ఉండదు, ఆత్మాన్వేషణ ప్రయత్నమూ ఉండదు.

ఇట్టి ఆత్మానుభూతి కూడా ఒక మెరుపులా ఉంటుంది. అది రెప్పపాటు కాలమే ఉంటుందని కేనోపనిషత్తు చెప్పింది. శాశ్వతంగా ఉండే కాంతిని గురించి నారాయణ ఉపనిషత్తు చెప్పింది. తాత్కాలికంగా మెరిసే దానిని శాశ్వతంగా ప్రకాశించేటట్లు ఎట్లా చేయగలం? సత్కర్మల వల్లనే. సాధనలు చేయగా చేయగా ఇక మనస్సు రాగి పాత్రగా ఉండదు. బంగారు పాత్రగా

మారుతుంది. ఇక దానిపై మరకలు ఏర్పడవు. ఆ బంగారానికీ మెరుగుపెట్టవలసి వస్తుంది. అనగా దాని కంటె గొప్పది ఆత్మ. అది సూర్యునివంటిది దాని కాంతికి వృద్ధిక్షయాలు లేవు.

రవసెల్లా పోలిక

దేవాలయాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో చాలా జాగరూకతలను పాటించారు పూర్వులు.

డక్కా మస్లిన్ మాదిరిగానే రవసెల్లా నేత చాలా సుకుమారంగా, శుభ్రంగా ఉంటుంది. దానిని ధరిస్తే అసలు బట్టవేసికోలేదా అనిపించేటట్లుంటుంది. నేలమీద పరిస్తే నేల తేమను, ధరిస్తే ఒంటి చెమటను పీల్చే గుణముంది దీనికి, మురికి దీనిని వెంటనే అంటుకొంటుంది. స్పష్టంగా మరకలు కన్పిస్తాయి.

తిరుపతిలో స్వామికి అభిషేకాలు చేస్తారుకదా! దీపాల నూనె మరకలతో అక్కడి నేల యుంటుంది. ఆలయాన్ని గాని, విగ్రహాన్ని గాని తుడిచేటపుడు ముందు ముతక బట్టలతో తుడిచి ఆరిన తరువాత మరల తుడుస్తారు. చాలాసార్లు ముతకబట్టలనువాడి ఈసుకుమారమైన వాటితో చివర తుడుస్తారు.

అట్లాగే అద్వైతసాధనలో మనస్సును అట్లాశుభ్రం చేయాలి. ముందే సుకుమారమైన గుడ్డలతో తుడిస్తే అవి పికిలిపోయినట్లుగా, చివరిమెట్టు సాధనను (ధ్యానం) ముందుపయోగించకూడదు. అట్లాగే సాధనలో ముందుగా గృహస్థాశ్రమ ధర్మాలను ఆచరించడం వల్ల గత జన్మల కర్మవాసనలు క్షయమౌతాయి. తరువాత ధ్యానము. అంతేనే కాని కర్మను విడిచి ధ్యానము కాదు. ముందు చింతపండు, మట్టి, తరువాత మంచినీటితో కడుగుట, సాధనలో ఈ తోమడం అనే మాట అంతఃకరణాన్ని శుభ్రంచేయడం అనే అర్థంలో వాడబడింది.

మంచితో కలిసిన చెడును తప్పించడం

సత్కర్మలు చేసి దుష్కర్మలను పోగొట్టుకొని ప్రేమ, సేవ, భక్తి వినయం మొదలైన సద్గుణాలను అలవర్చుకొంటున్నాం. చెడ్డ పనులు లేక అసత్‌వృత్తులు అసురగణానికి చెందినవని, మంచికర్మలు, సత్‌వృత్తులు దేవగణానికి చెందినవని చాలా సార్లు చెప్పాను. నేను మొదట చెప్పిన దేవాసుర సంగ్రామంలో ఒక్కొక్కప్పుడు దేవతలకు కూడా అసురగుణాలున్నట్లు కన్పిస్తోంది. అంటే చెడ్డవి కూడా మంచివాటితో కలిసిపోతున్నాయి. ఒక్కొక్కప్పుడు ఈదేవతలే మాయోపాయాల వల్ల వారనుకొన్న అమృతాన్నో, లక్ష్మినో సాధించిన కథలున్నాయి. ఈపురాణ కథలు తాత్పర్యమేమిటంటే దేవాదులను మించిన పరమసత్యం ఉందని బోధించడానికే.

దేవతలొకమారు అసురులను గెలిచి మనబలంవల్ల మనం గెలిచామని పొంగిపోయారు. పరమాత్మకృపవల్ల గెలిచామని అనలేదు. ఈ మాటలు కేనోపనిషత్తులో ఉన్నాయి. అటువంటి తప్పులు మనం సత్కర్మలు చేస్తున్నా, ఉపాసనలు చేస్తున్నా తటస్థిస్తూ ఉంటాయి. మనకర్మల వల్ల, జపాలు, ఉపాసన వల్ల సాధించామని విఱ్ఱవీగుతూ ఉంటాం కదా! అట్టి పతనం లేకుండా ఉండాలంటే అద్వైతమే శరణ్యం. అది మంచి చెడులకు అతీతం. ఈ భావన మొదటి నుండీ ఉండాలి. నిజమైన "నేను" ఇది చేయడం లేదు. ఒక వేషం వేస్తున్నట్లుగా భావించాలి. రాజువేషంవేస్తే కిరీటాన్ని ధరిస్తాడు, బిచ్చగాని వేషం వేస్తే చింకిగుడ్డలు కట్టుకొంటాడు. వేషాలు తీసివేస్తే ఉన్న మనిషి ఒక్కడే కదా! వేషాలు నాటకంలో కొన్ని గంటలే వేస్తాం. అసలు రూపం వేరనేభావన మనలను నిత్యం వెంటాడుతూ ఉండాలి. రాజువేషం వేసి తాను నిజమైన రాజునని అహంకరించునట్లుగా దేవతలు అట్లా అహంకరించారని కథల వల్ల తెలుస్తోంది. మనవేషాలు వట్టి తొడుగుల వంటివి. అవి అబద్ధపు నేను వంటివి. అసలైన పూర్ణమైన అహంకాదు.

నేనెవరనే తెలిసికొనుట అనే అర్థమూ అహంభావపదానికీ ఉంది. మాకిది తెలియడం లేదు మాపై కర్మపేరు కొనిఉంది. దాని వల్ల అసలు రూపం చూడలేకపోతున్నాం. చూడడానికి ప్రయత్నిస్తున్నాం అనే ధోరణిలో ముందుకు సాగితే మనస్సు నుండి ఇట్టి అహంకారం తొలగాలంటే ఆధ్యాత్మిక భావాలుండాలి అది ముందు సాధ్యం కాదు కాబట్టి ఈశ్వరభక్తి, ఈవిషయంలో తోడ్పడుతుంది. ఇదే క్రమక్రమంగా ఈ దుష్టమైన అహంభావాన్ని పోగొడుతుంది. అటూ ఇటూ తిరిగే మనస్సును అరికట్టడం కోసం సత్కర్మలుపయోగించునట్లుగా ఈశ్వరభక్తి మనస్సును ప్రేమతో నింపడానికి దోహదం చేస్తుంది.

ప్రేమకున్న నామాలు

ఈశ్వరుని పట్ల ప్రేమయే భక్తి. ఎవరిపట్ల ప్రేమను చూపిస్తున్నామో మిగతా మనకున్న సంబంధాన్ని పట్టియుంటుంది. పెద్దలపట్ల చూపేది మర్యాద. పిల్లవాని పట్ల చూపేది వాత్సల్యం. మనకంటె బీదతనంతో ఉన్నవారి పట్ల చూపేది దయ. మహాత్ములు మనపట్ల చూపేది కృప. అట్టి కృప ఓదార్పుతోనో, దయతోనో ఆగిపోదు. మన దురదృష్టాన్ని కూడా తుడిచివేస్తుంది. ఈవిషయంలో ఈశ్వరకృప, శిఖరంవంటిది. ఈశ్వరునిపట్ల మనము చూపు ప్రేమయే నిజమైన భక్తి.

ప్రేమకు నిర్వచనం - భక్తి

ప్రేమ అంటే ఏమిటి? మనమనస్సు ఇంకొకని మనస్సుతో కలవడం. అయితే మన అంతిమ గమ్యమేమిటి? మనస్సు ఆత్మలో లీనంకావడమే. ఇంకొకని మనస్సుతో కలవడానికి, ఈ లీనమవడానికి ఉన్న సంబంధం ఏమిటి?

లీనంకావడానికి ముందున్న దశ కలుపుట, ముందు పాలలో పంచదార వేయాలి. పాలలో రెండు భిన్నవస్తువులున్నపుడు ముందుగా కలపాలి. అప్పుడే లీనమౌతుంది. ఇక లీనమైనపుడు, రెండూ విడివిడిగా ఉండవు. ఒక్కటే, ఇదే ఐక్యం. ఏకమయ్యే స్థితి ఐక్యం. పాలలో పంచదార వేసినా ముందు, రెండూ భిన్నంగా ఉంటాయి. అపుడది ద్వైత మిశ్రమమే. కలియబెట్టినపుడు పంచదార పాలలో లీనమై ఒకట్లేతుంది. అక్షతలు నువ్వులూ కలిపినా రెండూ ఏకమౌతాయా?

ఆత్మ ప్రత్యేకమైనది. దేనితోనూ కలవదు అది స్వతంత్రము, ఏకము. కనుక దీనితో మనస్సును కలపడం కుదురుతుందా? అసలు ఆత్మను మనస్సు సమీపించగలదా? అయితే ఎట్లా కలపడం? ఈ సందర్భంలో ఈశ్వరుని అవసరం ఉంది. ఇట్టి దశలో జీవాత్మయని పరమాత్మయని వ్యవహరిస్తాం. జీవాత్మ చిన్నమనస్సుకు, పరమాత్మ పెద్ద మనస్సుకు చెందినవారు. ఈ చిన్నమనస్సు దేనితోనూ సంబంధం పెట్టుకోని ఆత్మతో కలవలేదు. కాని విశ్వమనస్సుతో కలవగలదు. ఈ చిన్నమనస్సును సృష్టించినది ఆ పెద్దమనస్సేకదా! పిల్లవాడు తల్లి ప్రేమలో కలిసిపోయినట్లు తల్లి, పిల్ల మీద చూపించే ప్రేమవంటి ప్రేమతో, ఆ పెద్ద మనస్సు చిన్నమనస్సును చేరదీస్తుంది. జీవుడు ప్రేమతో భక్తుడై పరమాత్మతో కలుస్తాడు. అపుడీశ్వరుడు ఆత్మలో ఇతణ్ణి లీనంచేస్తాడు. రెండు లేదన్న స్థితిలో ఉంచుతాడు. అపుడు జీవాత్మ, పరమాత్మలనే భేదాలుండవు.

భక్తిద్వారా అద్వైత ముక్తి

భగవానుడు బహుస్పష్టంగా చెప్పాడిట్లా (18-55)

భక్త్యామామభిజానాతి యావాన్ యశ్చాస్మి తత్త్వతః
తతోమాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనంతరం.

భక్తితో ఏయే శరీరాలతో ఉన్నానో, అవి లేకుండా ఉన్నానో అట్టినన్ను ఆత్మరూపంగా గ్రహిస్తూ నాయథార్థస్వరూపాన్ని తెలిసికొంటూ నాయందే ప్రవేశిస్తాడు అని తాత్పర్యం.

భక్తివల్లనే నేనెవరో తెలిసికొంటాడు. తరువాత జ్ఞానం వల్ల నాలో ప్రవేశిస్తాడు. అనంతరం 'విశతే' అని అనడం వల్ల పరమాత్మ జీవాత్మలకు మధ్య ఎడం లేకుండా అతనితో ఏకమగుటకు లోపల ప్రవేశిస్తాడు.

ఈశ్వరుని నిజరూపమైన ఆత్మలోపల భక్తి ద్వారా ప్రవేశించలేడు. భక్తిమార్గంలో తానింకా వేరనే భావంతో ఉంటాడుగదా! తతః= దాని తరువాత, అతనిలో అద్వైత మార్గంలోనే ప్రవేశిస్తాడని అర్థం.

దీనిపై శంకరులు భాష్యం వ్రాస్తూ ఇట్లాఅన్నారు. ముందు జగత్ కారకుడైన పరమాత్మను ద్వైత స్థితిలో గుర్తిస్తాడు ఎట్లా? ఉపాధికృత విస్తరభేద గా. అతడు నానారూపాలతో నానా గుణాలతో ఉన్నవానిగా ముందు గుర్తిస్తాడు. ఈ భేదాలకు కారణమైన అభేద స్థితిని గుర్తిస్తాడు. అద్వైతం, చైతన్యమాత్ర ఏకరస స్వరూపునిగా. తేలినదేమిటి? జీవుడు, పరమాత్మను (విశ్వమనస్సును) భేదబుద్ధితో సమీపించి, ఈశ్వరునిగా గుర్తించి, భేదబుద్ధిని పోగొట్టుకొంటాడు.

ఈ అభిప్రాయం తరువాతి శ్లోకంలో స్పష్టంగా ప్రతిపాదింప బడింది. "మత్ ప్రసాదతః అవాప్నోతి శాశ్వతం పరమవ్యయం" = అనగా నాఅనుగ్రహం వల్ల శాశ్వతమైన, మార్పులేని స్థితిని పొందుతాడు. అదే అద్వైత మోక్షం. ముందు సగుణ బ్రహ్మనుగూర్చి ద్వైత సంబంధమైన ప్రేమభక్తులను చూపించగా అతని అనుగ్రహం వల్లనే జీవుడు నిర్గుణ బ్రహ్మలో ఐక్యమవుతాడు. తనకంటె భిన్నంగా జీవుడు ఉండడం వల్లనే జరిగింది కదా! కనుక అతడే భేదబుద్ధిని పోగొడతాడని సారాంశం.

ఇక్కడ భగవానుడు పరమాత్మనని చెప్పాడు 4,5 శ్లోకాల తరువాత ఆ పరమాత్మ శక్తి సమస్త జీవులలో ఉందని మాయద్వారా వాటిని నియమిస్తున్నానని కీలుబొమ్మలను బొమ్మలాటలాడించేవాడు ఆడించునట్లుగా చేస్తున్నానని చెప్పాడు. ఈ పరమాత్మ శక్తినే ఈశ్వరుడని పేర్కొన్నాడు. తరువాతి శ్లోకంలో శాశ్వతమైన, శాంతమైన స్థితి ఈశ్వర కృపవల్ల వస్తుందన్నాడు. అదే మోక్షం, ఇంద్రియాలు, మనస్సు వల్ల చేసే సమస్త పాపాలను ప్రోగుచేసి ఈశ్వరునకు అర్పించుమని చెప్పడం వల్ల చిన్నమనస్సును పెద్దమనస్సులో ముంచుమని అర్థం.

తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత

తత్ప్రసాదాత్ పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసిశాశ్వతం.

కనుక కర్మ మార్గం వల్ల జీవుడు చిత్తశుద్ధిని పొందుతాడు. భక్తి మార్గం వల్ల విశ్వమనస్సును సమీపిస్తాడు. ఆ పరమాత్మ అనుగ్రహం వల్ల ఆత్మతో ఐక్యాన్ని పొందుతాడు. ఇక్కడ పొందుట అనడం వల్ల విడిగా మనస్సు, మరొక దానిని పొందుతుందని కాదు. జీవుని జీవాత్మ భావన అదృశ్యమైపోయి అఖండాత్మ గానే ఉంటాడని అనగా మనస్సు తన అస్తిత్వాన్ని కోల్పోతుంది.

భక్తిలో ప్రేమ తప్పనిసరి

పైమనస్సు తన వ్యక్తిత్వాన్ని లేక విడిగాఉన్నా అహంకారాన్ని పోగొట్టుకొని ఇంకొక మనస్సుతో కలవడమే ప్రేమ. ఇట్టి ప్రేమను ఇతరుల పట్ల చూపించినపుడు స్వార్థాన్ని పోగొట్టుకొని ఇతరుల ప్రీతికొరకు పనిచేస్తున్నాంకదా!

ఇట్లా పనిచేసినపుడు ఏ ఫలాన్ని అవతలి వ్యక్తి నుండి అపేక్షించకుండా ఉండగలగాలి. అపేక్షిస్తే అదినిజమైన ప్రేమకాదు. అది కామమే అవుతుంది. మనం చేసే పనులన్నీ కోరికతో కూడినవే. కాని ప్రేమతో కూడినవి కావు.

ప్రేమ, బిగిసిన మనస్సును చిక్కిపోయినట్లు చేసేదే! మెత్తబడునట్లు చేసేదే. చివరకు లీనమగునట్లు చేసేదే.

మనస్సు, పూర్తిగా అదృశ్యమవడానికి ముందు తేలికపడాలి, వ్యాప్తిచెందాలి. విస్తృతం కావాలి. అపుడే అది లేకుండా పోతుంది. ఇంతకుముందు ఇనుపగుండు గురించి చెప్పాను. అదే చివరకు ఆవిరైపోయింది కదా! నీరు, ఆవిరగునట్లు చెప్పాను కదా! అట్లా తేలిక పడడం, విస్తృతమవడానికి దోహదం చేసేదే ప్రేమ. ఇక కామవిషయం ఎట్లా ఉంటుంది? మంచు గడ్డలా గట్టిపడుతుంది. ఒకప్పుడైనా మంచుగడ్డ కరుగుతుంది. కాని కోరికలతో కూడిన మనస్సు ప్రేమ లేని మనస్సు ఎన్నడూ కరగదు. అందుకనే పెద్దలు ఱాయియైనా కరుగుతుంది కాని, ఈమనస్సు కరగడం లేదు మహాప్రభూ అని విలపించారు.

ఈమనస్సు మిగతా ప్రాణులను ప్రేమించేటపుడుకంటె భగవంతుని ప్రేమించినపుడు ఎక్కువగా మెత్తబడడానికి ఆస్కారముంది. మిగతా ప్రాణులవైపు ఈ ప్రేమను మళ్లిస్తే అది కోరికకు దారి తీయవచ్చు. ఏదైనా ఇతరుల నుండి ఆశించాలని అనిపిస్తుంది. ఇతరుల కోసం మనం ఎంత త్యాగం చేసినా గుర్తింపుకావాలని కోరుతాం. మన త్యాగాన్ని ఇతరులు గుర్తించకపోతే కోపతాపాలు, దుఃఖం కలిగి ఎంత కృతజ్ఞత లేకుండా ఉన్నారో కదా అని బాధపడవచ్చు. మరొక సమస్య ఇతరులను ఉద్ధరిస్తున్నామనే భావన ఎప్పుడైతే కలిగిందో వారి పట్ల చిన్న చూపు ఏర్పడుతుంది. సమస్త ప్రాణుల పట్ల చూపించవలసిన ఉపరోపకార బుద్ధి సంకుచితమైపోయి ఒకనిపట్లే చూపిస్తాం. ఇట్లా ఒకనికే ఉపకారం చేయవలసివస్తే ఈ కోరిక నెరవేరడం కోసం దానినడ్డగించే వారిపై ద్వేషం కూడా కలుగవచ్చు. ప్రేమకొద్దీ, ఒక అసర్హునకు ఉద్యోగం రావాలని ప్రయత్నించడం వల్ల అర్హునకు హాని జరగడం లేదా? ఇటువంటి చిక్కులేర్పడుతాయి.

అట్లా కాక ఈశ్వరుని పట్లప్రేమ చూపించగలిగితే మన మనస్సు యొక్క పరిధి విస్తృతమౌతుంది. మనస్సు తేలిక పడుతుంది. చివరకు లీనమౌతుంది. భగవానుడు తాను చూపే అనుగ్రహాన్ని మత్ ప్రసాదమన్నాడు. ఇట్లా మనస్సు పూర్తిగా అణగినపుడు వట్టి శూన్యస్థితిని సాధకుడు చూడడు. నిర్గుణ బ్రహ్మతత్త్వాన్నే చూస్తాడు.

ఆత్మ సాక్షాత్కారం పొందినవారు

అట్టి దానిని తానిస్తున్నాని, జీవుడు దానిని గ్రహిస్తున్నాడని బాహాటంగా ప్రకటించడు. ఆత్మాన్వేషణకై జీవుణ్ణి ముంచుతాడు. అపుడు ఒక మెరుపు మాదిరిగా ఆత్మ సాక్షాత్కరిస్తుంది. అతని మనస్సును ఒక్కమాటు లాగి, గుంజి పరమఏకాంతస్థితి ఏమిటో చూపిస్తాడు.

జీవ బ్రహ్మల ఐకమత్యాన్ని గూర్చి ఎందరో మహాత్ములు శ్లోకరూపంలో, పాటలు రూపంలో అందించారు. ఈశ్వరుడు జగత్తులో దోబూచులాడడమే కాదు, ముక్తినిచ్చేటపుడు కూడా తనను తాను మఱుగు పరుచుకొంటాడు.

అంటే సగుణ రూపాన్ని, ఈశ్వరత్వాన్ని, ఈశ్వరుని అసలు రూపం నిర్గుణత్వమే. జ్ఞానమార్గంలో ద్వైత స్థితిని ఇష్టపడం కనుక అతడు అనుగ్రహిస్తున్నా అది పైకి కనబడదు. అనగా జీవుడనే ముసుగు తొలగగా, ఈశ్వరుడనే ముసుగును తాను తొలగించుకొని రెంటినీ నిర్గుణ పరబ్రహ్మముతో కలుపుతున్నట్లు ఉంటుంది.

అందుకే మహాత్ములు జ్ఞాన మార్గంలో ఉన్నవారు ఒకనాడు అప్రయత్నంగా ఒక మెరుపు మెరిసినట్లైందని వ్యక్తీకరిస్తుంటారు.

మీరిట్లా అడగవచ్చు. ఈశ్వరుడు ఒకనిని జ్ఞాన మార్గంలో నడిపించి సిద్ధిని ప్రసాదిస్తాడని అన్నారు కదా, ఆత్మసాక్షాత్కారం పొందినవారు అట్లా జరిగిందని చెప్పడం లేదేమిటని. దీనికి జవాబు నేను ఈశ్వరుడనని,

ఈశ్వరుడు వచ్చి ఏదో పొట్లం ఇచ్చినట్లుగా ఇదిగో జ్ఞానం అని ఈయడు. అతడు సగుణ రూపంలో ఉంటూనే తానిట్లు ప్రకటించకుండా మహాత్ములకందిస్తాడు.

కొందరికితడు జ్ఞానోపదేశ గురువుగా అవతరించి జ్ఞానాన్ని ఇస్తాడు. ఇట్లా భిన్నభిన్నంగా అనుగ్రహాన్ని అందీయడాన్ని అరుణగిరినాథుడు తన కందర్ అనుభూతిలో నిలబడని దొంగ అన్నాడు. వస్తువులన్నీ అదృశ్యమైపోయాయని ఒకచోట కీర్తించాడు.

ఆదొంగ, వల్లిని దొంగలించివాడే. అనగా సుబ్రహ్మణ్యుడే. ఇంకా స్పష్టంగా అది నన్ను మ్రింగినా ఎదురుగా నిలబడిందన్నాడు.

మాణిక్యవాచకులు నేనుశివంగా మార్చబడ్డానని నన్ను ఈశ్వరుడు నిర్గుణ పరబ్రహ్మములో లీనం చేసాడని అన్నాడు.

శివఅనగా సగుణ బ్రహ్మ శివం అనగా నిర్గుణ బ్రహ్మము. ఎవ్వడూ ఈశ్వరుడుకాలేడని, బ్రహ్మము కాగలడుగాని బ్రహ్మకాలేడని చెప్పాను లోగడ.

తిరువాచకంలో మాణిక్య వాచకులు పరమేశ్వరుని నిలబెట్టి ఇట్లా అడిగాడు. మన ఇద్దరిలో ఎవడు తెలివైన వాడని? ఎందుకూ పనికిరాని నాకు అఖండానందమిచ్చావు, ఇప్పుడు చెప్పు అని సరదాగా అన్నాడు. అరుణగినాథులు పరమేశ్వరుణ్ణి దొంగగా కీర్తించారు. మాణిక్య వాచకులు మూర్ఖునిగా అతణ్ణి నుతించారు.

నమ్మాళ్వార్‌కీ ఇట్టి అనుభూతి కల్గింది. ఇట్లా పరమాత్మ, జీవాత్మయై, జీవాత్మను తనలో లీనం చేసికొవడాన్ని కీర్తించారు.

వారి తిరువాయిమొళిలో అద్వైత భావనతో ఇట్లా అన్నారు. కాలిన ఇనుప పాత్రపై, ఒకనీటి చుక్క పడిన వెంటనే శబ్దం వచ్చి పీల్చినట్లు గ్రహించావని అన్నారు.

కామాక్షిపై పంచశతిర్రాసిన మూకకవి అట్లాగే అన్నాడు. గురుపాద పద్మాలను శరుణు జొచ్చినవానిపై అమ్మవారు అపార కరుణతో సగుణ బ్రహ్మనే కాక నిర్గుణ పరబ్రహ్మమునధిరోహించుటకు మోక్షమనే మేడ ముందరి వసారాకు మెట్లు ఏర్పాటు చేస్తుందని అన్నాడు:-

సత్కృత దేశిక చరణాః
సబీజ-నిర్బీజ యోగ నిశ్రేణ్యా
అపవర్గసౌధ వలభీమారోహం
త్యంబకేఽ పి తవకృపయా

మరొక సందర్భంలో ఆమె దయా పూరిత దృక్కులనుండే అనుగ్రహం చూపిస్తుంది. ఏమాశ్చర్యము? ఇట్లు-అడవి, స్నేహితుడు - శత్రువు, యువతి బింబోష్ఠం - మట్టి ముద్దలకు భేదం చూడకుండా అద్వైత సమభావన కల్గుతుందని అన్నాడు:-

శివ శివ పశ్యంతి సమం
శ్రీకామాక్షి కటాక్షితాః పురుషాః
విపినం భవనం అమిత్రం మిత్రం
లోష్ఠంచ యువతి బింబోష్ఠం

సేక్కియార్ కూడా శివభక్తులలో అట్టి సమభావన ఉంటుందని అన్నాడు. అయితే అద్వైత మోక్షాన్ని కాదంటూ భక్తినిచూపించుటలోనే అట్టి భావన అని అన్నాడు.

అప్పయ్యదీక్షితులు, అద్వైతమే సరియైన మోక్షమని అంటూ పరమేశ్వరుడు కొన్ని ఉమ్మెత్త పూవులతో, తుమ్మిపూలతో అర్చిస్తే తృప్తిపడి దానికి బదులుగా మోక్షాన్నిస్తాడని అన్నారు. భక్తిని చూపిస్తే ఈశ్వర ప్రసాదం వల్ల ముక్తి లభిస్తుందని అన్నారు.

రామచంద్రమూర్తియే అద్వైత భావాన్ని కల్గిస్తాడని సమర్థరామదాస స్వామి వారన్నారు.

ఇట్లా ప్రతి అద్వైతికి ఇక ఇష్టదేవత ఉంది, ఆ దేవతే జ్ఞానసిద్ధిని కల్గించునట్లు పేర్కొన్నారు.

శంకరులు స్తోత్రాలలో సమస్త దేవతలను నుతించారు. వారు కూడా ఈ విషయంలో వెనుకంజ వేయలేదు.

మీరిట్లా అడుగవచ్చు "అద్వైతులు భక్తి ఉపాసన గురించి చెప్పారంటున్నారు, భక్తికర్మలను చేస్తూ జ్ఞానమార్గంలో పయనించాలని అంటున్నారు. అయితే అనేక జ్ఞానుల కథలలో భక్తి ఉపాసన చేసినట్లు కర్మానుష్ఠానం చేసినట్లు కనబడకుండా కేవలం జ్ఞాన సాధనయే చేసినట్లుందేమిటి? ఇకకొందరు మామూలు జీవితాలను గడుపుతూ అప్రయత్నంగా అద్వైతానికి మళ్లి జ్ఞాన మార్గం త్రొక్కినట్లుందికదా! దీనికి మీరేమంటారు?

పైన పేర్కొన్నన బడిన వారందరూ గత జన్మలలో కర్మానుష్ఠానం, భక్తి ఉపాసలను చేసినవారే. బాగా చేయగా మిగిలిన దానిని చేయడానికి పుట్టినట్లుగా ఉంటారు. వారిలో కొంతమందికి కొన్ని కోరికలు, తీరకుండా మిగిలియుండవచ్చు. ఈజన్మలో కొన్ని ప్రాపంచికమైన పనులను నిర్వహిస్తూ ఉండవచ్చు. మబ్బులుతొలగగా సూర్యునికాంతి ఉజ్జ్వలంగా ఉన్నట్లు వారిలో అప్రయత్నంగా ఆధ్యాత్మిక అనుభూతి కల్గుతుంది.

ఎంతో సాధన చేసిన కొందరికి కర్మ శేషం, ఉండగా దానిని పూర్తి చేయడం కోసం జన్మించి తరిస్తూ ఉంటారు. వారినే యోగభ్రష్టులని గీత చెప్పింది. గత జన్మలలో సాధన చేయగా, మిగిలిన దానిని పూర్తి చేసికోవడం కోసం జన్మనెత్తుతారు.

గత జన్మలలోనే పూర్తిగా చేసారు కనుక కొందరిలో కర్మ, భక్తులతో

పనిలేకుండా పుడుతూ ఉంటారు. వారు తిన్నగా జ్ఞానమార్గాన్ని ఎన్ను కొంటారు.

మన మార్గం

మనవంటి సామాన్యులకు నిష్కామకర్మ, భక్తి వల్ల జ్ఞానమార్గం పట్టుబడుతుంది. దాని వల్ల తృప్తిపడకుండా వీటిని సాధనాలుగానే భావించి అద్వైతమే లక్ష్యం అంటూ ముందుకు సాగాలి.

ప్రస్తుతం ప్రాపంచిక వాసనలతో గడుపుతున్నాం. ఈమురికి పోవాలంటే మామూలు కర్మలను క్రమశిక్షణతో పూర్తిచేసి మురికిని పోగొట్టుకోవాలి. అనగా ముందు ధర్మమార్గంలో నడిచి తరువాత బ్రహ్మమార్గానికి శ్రీకారం చుట్టాలి. ధర్మమార్గమనగా సత్కర్మానుష్ఠానమే. అవే స్వధర్మాలని, స్వకర్మలని అంటారు.

రోగంపోయిన తరువాత మృష్టాన్నాన్ని భుజిస్తాం. కర్మల వల్ల వచ్చినవి, మానసిక దౌర్బల్యం వల్ల వచ్చిన వాటిని ముందు తొలగించుకొని ఆత్మా మృతపానం చేయాలి. మానసికమంటె సంశయాలని భ్రాంతులని భావించకండి. అసలు మనస్సే ఒకరోగం. ఆకర్మలు కూడా ఉదాత్తమైన భావాలతో కూడియుండాలి. చివరకు ఆత్మవిచారణ.

మిగతా మార్గాలతో సంబంధం

ముందు కర్మలను చేస్తున్నా దాని ఉపాంగాలను విస్మరించకూడదు. అందు భక్తికి తగిన ప్రాధాన్యమీయాలి. అద్వైత భావనను లక్ష్యంగా పెట్టుకొని ధ్యానమూ కొనసాగించాలి. అట్లే సద్గ్రంథ పఠనమూ.

భక్తి ఉపాసనలలో పట్టుదొరికిన కొద్దీ కర్మలపట్ల అశ్రద్ధ కలుగుతూ ఉంటుంది. కర్మ మార్గంలో అట్టి సడలింపు ఉండదు. నిత్యనైమిత్తిక కర్మలు

విధిగా చేయవలసిందే. అనగా సంధ్యావందనాదులు, గ్రహణ స్నానాలవంటివి.

భక్తి ముదిరిన దశలో నేను కర్మలను విదిలేసానండోయి అని చాటింపు వేయనవసరంలేదు. ఇట్లా చేస్తే ప్రాథమిక దశలోనున్న వారికి తప్పుడు సంకేతాలిచ్చినట్లౌతుంది. జ్ఞాని కూడా అట్లా చేయరాదని గీతలో మూడవ అధ్యాయంలో అన్నాడు. ఇది మరిచిపోకూడదు.

జ్ఞానమార్గంలో పండిన కొద్దీ ఈశ్వరుడే బాసటగా ఉండి నడిపిస్తాడు. ఆదశలో అతడు సన్యాసి కావచ్చు. కర్మలు, పూజలను అతడు విడిచిపెట్టవచ్చు. లేదా జనకుని మాదిరిగా రాజ్యమేలుతున్నా కర్మలను చేస్తూ ఉండవచ్చు. లేదా కొందరు కర్మలను చేస్తూ ఉండవచ్చు. లేదా కొందరు అద్వైతుల మాదిరిగా భక్తినీ స్వీకరించవచ్చు.

పరిపక్వత దానంతట అదే

కర్మనుండి భక్తికి ఎప్పుడు? భక్తి నుండి ఎప్పుడు ఆత్మ విచారణ? గంటను మ్రోగిస్తూ పూజ ఎంతవరకు చేయాలి? ధ్యానమెప్పుడు? ఎపుడు ధ్యానాన్ని విడిచి పెట్టాలి? మొదలైన ప్రశ్నలు వేస్తూ కాలక్షేపం చేయకండి. కర్మలు చేస్తున్నకొలదీ ఏది ఎప్పుడూ ఆపి దేనికెంత ప్రాధాన్యమీయాలో అదే తెలుస్తుంది. బలవంతంగా ఎట్టి సాధనలూ చేయకూడదు. సహజమైన ప్రీతితో సాగాలి.

ఎంతకరకూ ఈ సాధనలు సాగాలంటే శంకరులే సమాధానం చెప్పారు. ఊకపోయేవరకూ ధాన్యాన్ని దంచవలసిందే కదా! పిండి అయ్యేటంత వరకూ తిరగలిని త్రిప్పవలసిందే కదా! అట్లాగే ఆత్మసాక్షాత్కారం అయ్యేటంత వరకూ వినడం, స్తోత్రపఠనం, ధ్యానం మొదలైనవి సాగుతూ ఉండవలసిందే, ఎప్పుడు ఆపాలి అని ప్రశ్నవేయడానికి ముందు సాధనలు చేస్తూ ఉండవలసిందే.

ధర్మమే మందు

కర్మరోగాన్ని పోగొట్టడం ప్రథమ కర్తవ్యం. రోగం ఎప్పుడు పోతుంది? వైద్యుని దగ్గరకు వెళ్లాలి. ఇచ్చిన మందును వాడాలి. ఈ రోగం కుదిర్చేవైద్యుడెవరు? అతడే మనువు. అతడే ధర్మశాస్త్ర కర్త. అతడిచ్చేమందు కర్మలను విధించేధర్మం. తైత్తిరీయ సంహితలోనే మనువు చెప్పినది భేషజమని ఉంది. భేషజమనగా మందు.

మందెప్పుడైతే చెప్పారో పథ్యాన్ని కూడా చెబుతారు. ఫలానాది తినాలి, ఫలనాది తినకూడదని, దానికి పరిమితిని విధిస్తాడు. అట్లాగే ధర్మశాస్త్రాలు చేయవలసినవాటిని, చేయకూడనివాటిని విధిస్తాయి.

ఇష్టం లేకపోయినా చేదు మాత్రను మ్రింగవలసివస్తుంది. కఠినమైన పథ్యాన్ని వాడవలసి వస్తుది. అట్లాగే ధర్మశాస్త్రాల విషయంలోనూ, నమ్మకంతో, భక్తితో సాగాలి సుమా!

ధర్మకర్మలు చేస్తున్న కొద్దీ వాటి పట్ల ప్రీతి ఏర్పడుతుంది. అవి సంకెళ్లలా ఉండకుండా తియ్యని కూష్మాండ లేహ్యంలా ఉంటాయని లోగడ చెప్పానుకదా!

అనవసరపు నింద

అద్వైతం అనుసరిస్తే అధర్మమార్గానికి దారి తీస్తుందని, ధర్మా ధర్మాలను వారు మాయ అంటారని తెలియక కొందరు నిందిస్తూ ఉంటారు.

జీవాత్మ పరమాత్మలకు భేదం లేదంటారు. కనుక ఈశ్వర, ఉపాసనను కూడా అద్వైతులు వద్దంటారని ఈసడిస్తూ ఉంటారు.

కేవలం జ్ఞానమార్గంలో పయనించే వారి నుద్దేశించే అద్వైత శాస్త్రాలుంటాయని గుర్తుంచుకోండి. అద్వైతం మీదే దృష్టి సారించాలని చెప్పే సందర్భంలో కర్మ భక్తులకు ప్రాధాన్యమీయరని ఆ గ్రంథాలంటాయి.

మొదటి నుండే అన్నిటినీ విడిచి అద్వైత సాధన చేయండని ఏరచయిత, ఏ గ్రంథమూ చెప్పదు, చెప్పదు.

కేవలం ఉత్తమ సాధకులైనవారు మాత్రమే జ్ఞాన మార్గంలో ప్రవేశించాలని ప్రాథమిక మాధ్యమిక స్థాయిలో ఉన్నవారు కర్మాదులను చేయవలసిందే అని మాటి మాటికీ మనలను హెచ్చరిస్తారు. శంకరులు.

అద్వైతులైయుండి అప్పయ్య దీక్షితులు, మధుసూదన సరస్వతి స్తోత్రాలు చేయలేదా? గోవింద దీక్షితులు అనేక యజ్ఞ యాగాదులను చేయలేదా? వారు సాంఘికసేవ కూడా చేసారు కదా!

సాంఖ్యం, పూర్వమీమాంస, న్యాయశాస్త్రం మొదలైనవి అద్వైతంతో విభేదిస్తాయి. యోగ శాస్త్రము కూడా సంపూర్ణంగా దీనితో ఏకీభవించదు. అయినా గొప్ప అద్వైతియైన వాచస్పతిమిశ్రులు పై అన్ని శాస్త్రాలకు వ్యాఖ్యాలు వ్రాసేరు.

అద్వైతాచార్యులైన విద్యారణ్యస్వామి వారు సర్వ దర్శన సంగ్రహం వ్రాయలేదా? ఇందన్ని సంప్రదాయాలూ వివరింపబడ్డాయి. నాస్తిక మతానికి చెందిన లోకాయత సిద్ధాంతాన్నీ వారు వివరించారు. వీరి ఉదారభావాన్ని గుర్తించారా?

ద్వైతానికి చెందిన మధ్వ సిద్ధాంతంపై విశిష్టాద్వైత సిద్ధాంతంపై, శ్రీకంఠాచార్యుని శైవసిద్ధాంతం పై కూడా అప్పయ్య దీక్షితులు గ్రంథాలు వ్రాసేరు. వీటిని ఆ మతాలవారే పరమ ప్రమాణ గ్రంథాలుగా భావిస్తారు.

అద్వైతులు, తమకు విరుద్ధంగా ఉండే ద్వైతానికి తగు ప్రాధాన్యం ఇచ్చారు. భగవత్ ప్రేమను కాదనలేదు. కర్మ భక్తులను త్రోసిరాజనలేదు.

శంకరులెన్ని స్తోత్రాలు చేయలేదు? ఎన్ని అలయాలను ఉద్ధరించలేదు? అట్లా యంత్ర ప్రతిష్ఠలు, తీర్థయాత్రలు ఎన్నో, ఇప్పటికీ శంకర మఠాలలో

వేద కర్మలకు, వేదాధ్యయనానికి, పూజకు, కుంభాభిషేకాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు కదా! ఇదంతా ద్వైతం కాదా! దీనిని పూర్తిగా త్రోసివేసారా?

అద్వైతం గురించి చెబుతున్నాను కనుక దీని లక్ష్యాన్ని మరువద్దని అంటున్నా. ఎవరైనా నాదగ్గరకు వచ్చినపుడు సంధ్యావందనం చేయండి, అగ్ని కార్యం చేయండి, అమ్మవారి సన్నిధిలో ఆవునేతి దీపం వెలిగించండి వైద్యశాలలో ప్రసాదాన్ని పంచిపెట్టండి, రోజూ పిడికెడు బియ్యాన్ని ఒకపాత్రలో యాచకులకై వేసియుంచండి మొదలైనవి చెబుతూ ఉంటాను. ఇదంతా ద్వైత భావనతో కాదా? అసలైన ద్వైతభావం పోగొట్టడానికే అనగా, జీవాత్మ పరమాత్మల భేదం.

ధర్మాధర్మములు - అద్వైతి

మాయా సిద్ధాంతాన్ని తప్పుగా అర్థం చేసికొని ధర్మం కూడా మాయేయని ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించవచ్చని అర్థాలు లాగుతూ ఉంటారు. అందరికీ ఈ మాయాసిద్ధాంతాన్ని శంకరులు బోధించలేదు. వారే కాదు, ఏ అద్వైతికూడా.

జగత్తు మాయయని అందరూ అన్నా ఏది పుణ్యమో, ఏది పాపమో, ఏది ధర్మమో ఏది అధర్మమో తెలిసికొని ఇకమాయా బంధం నుండి విడివడేటంత వరకూ ఈ భేదం తప్పదని, పుణ్య కర్మలను మాత్రమే చేయాలని అందరూ అన్నారు.

హఠయోగంలో సిద్ధిపొందిన తరువాత గాజుపెంకులు తిన్నా జీర్ణం చేసికొనగలడు. అయితే అతడు తిన్నాడని మాములు వ్యక్తి తింటే ఏమవుతుంది? జీవత్వం పోగొట్టుకొని ఆత్మస్థితుడైయున్నవానికి, ఏఅధర్మమైనా, ఏపాపమైనా అంటదు. ఈ నియమం సామాన్యులకు వర్తిం చదు. కనుక సామాన్యులు ధర్మమనే ఔషధాన్ని తప్పక స్వీకరించవలసిందే!

జ్ఞాని - కర్మఫలాలు

జ్ఞాని ధర్మాధర్మ - పుణ్యపాపాలకు అతీతుడు. ఆత్మకంటె తక్కువ స్థాయిలోనున్న ద్వైతస్థితిలో పైనియమాలకు కట్టుబడవలసిందే. జ్ఞానికి మాయ అంటదు. కాని సామాన్యుడు అందులో మునిగిన వాడేకదా!

ఏదీ అంటదని అజ్ఞాని కూడా పాపంలో తగుల్కొనకూడదు. అతడు ఆత్మస్థితుడైయుంటాడని, బుద్ధికి అతీత స్థితిలో ఉంటాడని, సంకల్ప వికల్పాలకు దూరంగా ఉంటాడని భగవానుడన్నాడు కదా! బుద్ధేస్తు పరసస్తు సః కనుక మనమాదిరిగా విషయాల గురించి ఆలోచించడు. అది నిర్వికల్పస్థితి.

అనేక జన్మల పుణ్యపాపకర్మలన్నీ సంచితమని వ్యవహరింపబడగా, ఈ జన్మఎత్తడానికి ఉపయోగించే కర్మను ప్రారబ్ధమంటారు. కనుక ఆ జ్ఞాని కూడా ప్రారబ్ధకర్మను అనుభవించవలసిందే. పై సంచితంలో కొన్ని రాబోయే జన్మకు విత్తనాలుంటాయి. ఇతని జ్ఞానం వల్ల సంచితం, అగామి కర్మ, దగ్ధమైపోతుంది. కాని ప్రారబ్ధకర్మ దగ్ధంచేయబడదు. అది ధనుస్సు నుండి బాణాన్ని విడిచిపెట్టడం వంటిది. దానిని .ఆపలేము. అది చేరవలసిన చోటునకు చేరుతుంది. అమ్ములపొదిలోని బాణాలను (సంచితం) తీసివేయవచ్చు. ఇక బాణాలను సంధించకుండా (అగామి) ఉండవచ్చు. విడిచిన బాణం లక్ష్యాన్ని చేరుకోకుండా ఆపగలమా? కనుక జీవితం ఉన్నంత వరకూ ప్రారబ్ధాన్ని జ్ఞాని కూడా అనుభవించవలసిందే? ఏదో సంకల్పించి పనులు మాత్రం చేయడు.

ప్రారబ్ధం అనుభవిస్తున్నట్లు మన కంటికి కనబడుతుంది. ఏదైనా రోగం వచ్చిందనుకొన్నాం. ఎవరైనా ఇతనిని మోసగాడని దూషించవచ్చు. అయినా ఈ రోగాన్ని కాని, ఈ అవమానాన్ని కాని ఏమాత్రం పట్టించుకోడు. మన

మాదిరిగా బాధపడుతున్నట్లుగా కూడా కనబడడు (ఉదా:- రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి వంటివారు)

లేదా గతజన్మల మంచి కర్మలవల్ల ఆరోగ్యం, కీర్తివచ్చినా, అతణ్ణి శిష్యులు సింహాసనంపై కూర్చోబెట్టినా, కాషాయబట్టలు కట్టినా కూడా ఏమాత్రం సంతోషించడు.ఏదీ కోరడు, ఏదీ ప్రత్యేకంగా చేయడు. ప్రారబ్ధకర్మానుసారం జరిగేవి జరుగుతూ ఉంటాయిలే అని ఉపేక్షిస్తాడు.

భగవానుని మాట ప్రకారం **"జ్ఞానాగ్నిః సర్వ కర్మాణీ భస్మసాత్ కురుతే"** అనగా జ్ఞానాగ్ని సర్వకర్మలను బూడిద చేస్తుందని అనడం వల్ల ప్రారబ్ధం కూడా పోతుందని చెబుతారు. దీపం వెలిగిస్తే మొత్తం చీకటి పోవడం లేదా అని ప్రశ్నిస్తారు. నిజమే ఈ కర్మలు, ఫలాలు ఇవన్నీ మాయ వల్లనే వచ్చాయికదా! మాయపోతుందని అంత చటుక్కున చెప్పకూడదు. ప్రారబ్ధం మాత్రం అనుభవించవలసిందే.

విడిచిపెట్టిన బాణాన్ని మంత్రశక్తి ద్వారా తిరిగి దాని లక్ష్యం చేరకుండా రప్పించవచ్చని మీరనవచ్చు. ఆత్మ జ్ఞానము, మంత్రశక్తికి అతీతమని గుర్తించండి.

శంకరులు సర్వకర్మ అనే మాటను ప్రారబ్ధం మినహా అని చెప్పారు. అయితే వారే వివేకచూడమణిలో కొంతభిన్నంగా ఇట్లా అన్నారు. జ్ఞానికికూడా ఆత్మబుద్ధి శరీరంతో కొద్దిపాటిగా అంటిపెట్టుకొనియుంటుందని, ఇట్లా శరీరభావన, ఆత్మబుద్ధి సమూలంగా నిర్మూలింపబడినపుడు మాత్రమే ప్రారబ్ధం ఉండదన్నారు. అసలిట్టి జ్ఞానికి జన్మ కర్మలు, వట్టి కలగా ఉంటాయని అతడు కలలో అనుభవించిన దాని శేషం మెళకువగానున్నపుడు అనుభవించునట్లుగా ఉంటుందని, ఇంకా తనకు కూడా ప్రారబ్ధం ఉందని సామాన్యులకు తెలియజేయడం కోసమే. ద్వైత ప్రపంచంలో ఉన్నా ద్వైతప్రపంచం అతనికి అంటదనే రీతిలో సామాన్యులకు తెలియచేయడం కోసం అట్లా ఉంటాడు.

అయితే గీతా సందేశానికి, వివేక చూడామణి వివరణకు తేడా ఏమిటని అడుగవచ్చు. గీత అనేక సంప్రదాయాల వారికి ఉద్దేశింపబడింది. ఇక వివేక చూడామణి కేవలం జ్ఞానులనుద్దేశించి వివరింపబడింది: జ్ఞాని శరీరయాత్ర చేస్తున్నాడేమిటి? ఇదంతా ప్రారబ్ధం కాకపోతే మరొకకారణం ఉంటుందా? అనిపించేటట్లుంటాడు.

జ్ఞాని స్థితిలో సామాన్యుడుండదని సామాన్యులు కర్మ, భక్తి మార్గాలను అనుసరించవలసిందే అని చాలా సార్లు చెప్పాను. అయితే పై రెండు గ్రంథాలకు సమన్వయం అందిస్తాను.

జ్ఞానం కలిగిన తరువాత ఆత్మానందం అనుభవిస్తూ ఉండాలని ప్రపంచానికి సంబంధించిన ద్వంద్వ భావాలలో చిక్కుకోకూడదని శాస్త్రం చెప్పింది కదా! దీనిని ఋజువు చేయాలంటే పై లక్షణాలను కలిగియుండి జ్ఞాని ఇట్లా ఉంటాడని లోకానికి తెలియాలి కదా! ఇందుకోసమే ఈశ్వరుడు జ్ఞానినిట్లా ఉంచాడు. సుఖదుఃఖాలెన్ని తటస్థించినా జ్ఞాని చెక్కుచెదరకుండా అన్నిటిని సమభావంతో చూస్తాడని దృష్టాంతంగా జ్ఞాని ఉండాలి కదా!

ఇహపరలోకాలకు భేదం చూడదని చెప్పడం కోసమైనా జ్ఞాని ఇట్లా ఉండాలికదా! జ్ఞానం కలిగిన తరువాత వెంటనే శరీరాన్ని విడిచి పెడితే జ్ఞానం ఈలోకంలో సాధింపబడదని మరణానంతరమే సాధ్యమని లోకులు భావిస్తారు కదా! అంటే లోకజీవనానికి జ్ఞానం భిన్నమని సంకేతం ఇచ్చినట్లౌతుంది కదా!

మరొక కారణం ఉంది. ఈశ్వరుడు ఈ జ్ఞానులను సాధనాలుగా వాడుకొంటాడు. వారి ద్వారా తన పనులను నిర్వహిస్తాడు. ఇట్టి మహోత్తమ స్థితి ఒకటుందని ఆదర్శప్రాయంగా వారిని ఉంచుతాడు.

వసంతంలో కలకలలాడే ప్రకృతి తన సంతోషం కోసం అట్లా ఉండదు.

అది దాని లక్షణం. అట్లాగే లోకహితాన్ని అపేక్షించకుండా అప్రయత్నంగా లోకహితం చేస్తాడు.

తానుతరించి తననడవడిక ద్వారా ఇతరులను తరింపచేస్తాడు. వారిని ఉద్ధరించాలనే గట్టి ప్రయత్నమూ చేయడని గుర్తించండి. మరిఎట్లా సాధ్యం? అది ఈశ్వరసంకల్పము మాత్రమే.

జనకుడట్టి వాడు, జ్ఞాని అట్లా ధర్మ ప్రబోధం చేస్తాడని భగవానుడే అన్నాడు. అయితే ధర్మధర్మాలను స్వీకరించడం, స్వీకరించకపోవడం అంటూ జ్ఞానికి ఉండదు. ఈశ్వరుడితనిని పనిముట్టుగా స్వీకరించినపుడు అధర్మం తనకు అంటదనే భావంతో అధర్మాన్ని, పాపాన్ని ఏమాత్రం చేయడని గుర్తించండి.

ధర్మాధర్మాలు, పుణ్యపాపాలు చేయడనే మాట కేవలం వేదాంత స్థాయిలో చెప్పబడింది. బౌద్ధికమైన స్థాయిలో మాత్రమే.

కనుక అద్వైతం, పాపం చేసినా తప్పు లేదని చెప్పిందని చెప్పడం తప్పుగా అర్థంచేసి కోవడం వల్లనే. శాస్త్రాలను దురన్వయం చేయడం వల్లనే!

కొన్ని సంకట పరిస్థితులు సంక్రమిస్తూ ఉంటాయి. విశేష ధర్మాన్ని రక్షించడం కోసం కొన్ని అధార్మికమైన పనులను చేయవలసి వచ్చే సందర్భాలుంటాయి. అపుడు అధార్మికంగా కనబడినా ఆ అధర్మం జ్ఞానికి అంటదు. భారత యుద్ధంలో కృష్ణుడే కొన్ని అధార్మిక కృత్యాలను ప్రోత్సహించినట్లు కన్పిస్తోంది. ఒక మహాప్రయోజనం కోసం అట్లా చేయవలసి వచ్చింది. దీనిని సాధారణీ కరణం చేయకూడదు. కనుక కొద్దిపాటి అద్వైత వాసన ఉన్నవారు తగుదునమ్మా అనిపూనుకోరాదు.

ముందు అధర్మకృత్యాలను నిర్మూలించి ధార్మిక కృత్యాలుచేసి, ఈరెంటినీ చిట్టచివర దశలో విడిచి పెట్టాలంటుంది. ఈ స్థితిని అర్థం చేసికోవాలి.

భగవానుడు సర్వధర్మాన్ పరిత్యజ్య అని గీత చివరిలో చెప్పాడు. ముందున్న మాటలేమిటి? పై మాటకు విరుద్ధంగా ఉపదేశించలేదా? నేను సన్యాసం పుచ్చుకొంటానంటే ఒక నపుంసకునిలా ప్రవర్తిస్తున్నావని అర్జునుణ్ణి మందలించలేదా? తరువాత కర్మ-భక్తి- జ్ఞానమార్గాలను క్రమక్రమంగా ఉపదేశించాడు కదా! అంతా చెప్పి విశ్వరూప సందర్శనమైన వెనుక అన్ని ధర్మాలను విడిచి నన్నే శరణుజొచ్చుని చిట్టచివర అన్నాడు.

అట్లాగే అద్వైత శాస్త్రాలు, చిట్టచివర దశలోనే అన్ని కర్మలను, ధర్మాలను విడిచిపెట్టమంటున్నాయి.

అయినా ఇట్లా అర్థం చేసికోవాలి. కర్మలో ధర్మాన్ని విడిచిపెట్టమని చెప్పడంకాకుండా కర్మలను చేస్తూ కర్మఫలాలపై దృష్టిని పెట్టవద్దని చెప్పింది. కనుక మన్వాది స్మృతికర్తలు, మనశంకరుల వంటి జ్ఞానులు ధర్మమనే ఔషధాన్ని స్వీకరించాలని, చిట్టచివర దశలోనే అన్నిటిని విడిచి పెట్టాలని ఘోషించారు. అందుకే శంకరులిక్కడ చక్కని వివరణ ఇచ్చారు. అన్ని ధర్మాలనే మాటలో అన్ని అధర్మాలను విడిచిపెట్టాలనే అర్థం గ్రహించాలని అన్నారు.

కనుక ప్రాథమిక దశలో అధర్మాలను విడిచిపెట్టాలని కేనోపనిషత్ మంత్రాలను శంకరులు పేర్కొన్నారు. దుష్టప్రకృతి మారనంత కాలం ప్రజ్ఞానం పట్టుబడదని ఆమంత్రానికి అర్థం. ఈ మాట అన్ని దశలలోనూ అందరికీ వర్తిస్తుంది కదా!

తరువాత ఉత్తమాధికారులు ధర్మాధర్మాలను రెంటినీ త్యజించాలనే మహాభారత శాంతి పర్వ వచనాన్ని పేర్కొన్నారు. త్యజ ధర్మం అధర్మంచ అని ధర్మాలను విడిచిపెట్టమని గీతలో ఉంది కదా అని ధర్మాచరణకు సున్న చుట్టకూడదు.

సారాంశాన్ని అందిస్తా. ముందు అధర్మాన్ని విడిచి మీమాంసకులు చెప్పిన ధర్మకార్యాలును చేయుట- తరువాత ధర్మాధర్మఫలాలను త్యజించుట-

తరువాత బ్రహ్మ జిజ్ఞాసకై సాధన చేయుట - అనగా నేను చేస్తున్నాననే భావనలేకుండుట - ఈశ్వరార్పణ బుద్ధితో చేయుట (అనగా భగవానుడు చెప్పిన సర్వధర్మాలను విడిచి నన్నే శరణుజొచ్చనే మాట) - చివరకు ధర్మా ధర్మ విచారణ లేకుండుట - ఇట్టి మెట్లను అర్థం చేసికోకుండా అద్వైతాన్ని నిందించడం బాగుందా?

ఇదేమీ లేకుండా ఒక పురుగు పక్షి మాదిరిగా ముందే ఎగరగలదా? గొంగళిపురుగు, సీతాకోకచిలుకగా మారిన తరువాత ఎగురగలదు. అట్లాగే సాధనలోనూ. అట్లాగే అందరూ సాధనచేయలేరు. కనుక అనేక దశలను గుర్తించారు.

ఎందుకింతా సుదీర్ఘంగా చెబుతున్ననంటే ఈనాడు కొందరు వేదాంతోపన్యాసాలు చెప్పేవారు. కర్మకాండలక్కరలేదని బోధిస్తున్నారు. వారందరూ పెద్ద పెద్ద డిగ్రీలు కలవారే! అనేక గ్రంథాలను రచించిన వారే. అసలు వీరిలో ఒక్కరైనా అనుష్ఠానవేదాంతి ఉన్నాడా అని వెదకడంమొదలు పెడితే చివరకు వెదకడమే మిగులుతుంది. ఒక మూల ధార్మికవ్యతిరేకులు, నాస్తికులుండగా ఇట్టి వాచా వేదాంతలవల్ల కూడా సంఘానికి ప్రమాదం ఉంది. వాళ్లను నింధించడం కోసం నేను చెప్పడం లేదు. వారి దోషాన్ని సవరించుకొంటే వారికే మేలు, ఇతరులకూ మేలు.

ధర్మం - ప్రేమ

జ్ఞానులు ధర్మాధర్మాలకు అతీతులైనా అధర్మం ఎన్నడూ చేయరు. అందరి పట్ల దయతో, ప్రేమతో ఉంటారు. ఇంతకంటె ఆదర్శవ్యక్తి మరొకడు లేడనే రీతిలో ప్రవర్తిస్తారు. అందరికీ హితం చేస్తారు:-

సర్వ భూతహితే రతాః

సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వామామ్

ప్రేమను చూపించడంలో జ్ఞానిని మించినవాడెవ్వడూ లేడు. శంకరులెక్కడో ఏకాంతస్థలంలో ఉండి ఆత్మనిష్ఠులై "ప్రేమంటే ద్వైతానికి చెందింది, అది మాయ, ధర్మాధర్మాల గురించి పట్టించుకోనేల ? ప్రజలు బాగుపడనీ, పడకపోనీ నాకేల? వీరి పట్ల నేనెందుకు ప్రేమ చూపించాలి? ఎందుకు సాయం చేయాలి? అని అనుకోకుండా ఆసేతుహిమాచలం పర్యటించి ఉపదేశాలిచ్చి, అనేక గ్రంథాలు వ్రాసి లోకానికి ఎంత సేవ చేసారో మనకు తెలియదా?

ఆపైన మరొక అభియోగం. మాయా సిద్ధాంతమే మన కొంప తీసిందని, క్రియాశూన్యులను చేసిందనే వారున్నారు. శంకరులెంత పనిచేసారో చదువలేదా? వినలేదా?

ఒక చక్రానికి ఇనుప కమ్మిని అమర్చాలంటే ముందు దానిని వేడి చేస్తూ చల్లారుస్తూ తొడుగుతాం కదా! లేకపోతే అతుక్కోదు. అట్లాగే ఆత్మస్థితిని పొందాలంటే దుష్టగుణాల సంకోచం, శిష్టగుణాల వ్యాకోచం ఉండాలి కదా! ఆవ్యాకోచం ప్రేమ వల్లనే సాధ్యం.

నిష్క్రియత్వం, సరియైన కర్మానుష్ఠానం వల్లనో, సంఘసేవ వల్లనో సిద్ధిస్తుంది. సరిగా నిద్ర పట్టడం లేదని ఎవరైనా అంటే కష్టపడి పనిచేస్తూ ఉంటే నిద్రతనంతట తానే వస్తుందని అంటారు కదా! అట్లాగే ఆత్మకూడా కర్మానుష్ఠానం వల్లనే చిక్కేది.

అట్లాగే ప్రాపంచిక వాసనల నుండి దూరంగా ఉండాలంటే ప్రేమయొక్క పరిధిని విస్తృతం చేయడం వల్లనే సాధ్యం. చేసిన కొద్దీ సంకోచం నుండి వ్యాకోచం- సమత్వబుద్ధి అలవడుతుంది. ఇవేమీ లేకుండా ఆత్మజ్ఞానం పట్టుబడదు. అది వచ్చినా అటి వట్టి జడప్రాయంగా, శుష్కంగా ఉంటుంది. రకరకాల భావాలను అణచడం మాటలా? ముందే అందరి పట్ల అఖండప్రేమను చూపించడం మాటలా?

ఏవో గడగడా మాట్లాడుకొంటూ ఉంటే అందరూ నిశ్శబ్దంగా ఉండండని

అంటే ఉంటారా? ఒక క్షణం మాట్లాడకుండా ఉన్నా మళ్లీ మొదలు పెడతారు కదా! ఇంకా గట్టిగా ప్రసంగిస్తూనే ఉంటారు. ఉవ్వెత్తుగాలేచే భావాలను ఆపడం కూడా ఇటువంటిదే. ఎవరైన మాట్లాడుతూ ఉంటే నిశ్శబ్దం, నిశ్శబ్దం అనే మాటలే ఎక్కువ శబ్దాన్ని కల్గిస్తాయి. (ఈమాట స్వామి అంటున్నపుడు అందరూ నవ్వారు). దానికి బదులు, రామా రామా అనడం మేలు. ఆ మాటలనే భజన రూపంలో వినిపిస్తే అందరూ నామ సంకీర్తనలోనే మునిగిపోయి మిగతా భావాలు ఆకొంతసేపైనా వారి దరిచేరవు కదా! రాగతాళాల మార్పుతో మనలో దివ్యానందం కల్గుతుంది. మిగతా కబుర్లు ఉండవు. ఈ నామసంకీర్తన నిశ్శబ్దంగా సాగిందా? లేకపోయినా మాములు వృథా ప్రసంగాల కంటె నయం కదా? అట్లా నామసంకీర్తనంలో మునుగుట చివరకు మౌనానికి దారి చూపిస్తుంది.

అట్లాగే అనేక భావాల నడుమ ప్రేమ ఇట్లా మనిషి ఉన్నతిని తీసికొని వస్తుంది. చివరకు మనస్సు మౌన స్థితిని పొందుతుంది. అదే అద్వైతం. కనుక వృథా సంభాషణ, నామసంకీర్తనంగా మారి మౌనస్థితికి దారి చూపించింది.

మనస్సు మాటుమాయం కావాలంటే ప్రేమయే శరణ్యం

మానసిక వృత్తులను అరికట్టడమే యోగశాస్త్రలక్ష్యం. అంతేకాని బ్రహ్మానందం, లేదా ఆత్మానందం గురించి చెప్పదు. మనస్సు కోరే కోరికలను నియమిస్తే చాలు, అయినా అట్టి స్థితి వట్టి జడమూ కాదు. గాఢనిద్రలోని తమోవస్థ కాదు. ఆ స్థితి మనస్సుతో సంబంధం లేకుండా సమాధిస్థితిలో ఉంటుందని చెబుతారు. అయితే బౌద్ధులు చెప్పే శూన్యస్థితి కాదు. అద్వైతులు చేప్పే సచ్చిదానందస్థితి కూడా కాదు. అది మనస్సు కుప్పకూలిన జీవన స్థితి.

మనస్సు, శూన్యం కావాలని చెబుతారు. ఇదీ అంత చిక్కేది కాదు కనుక దీనిని పొందడానికి ప్రేమ మొదలైనవి పెంపొందించుకోవాలని దానినే ప్రతిపక్ష భావన అంటారని పతంజలి అన్నాడు.

దానికై పెక్కు యమనియమాలను తన యోగశాస్త్రంలో అందించాడు. మనస్సు నరికట్టడానికి అనేక నియమాలను చెప్పాడు. దుష్టశక్తులు, దుష్టభావనలు మనిషిని క్రుంగదీస్తుంటాయని అతడు చెప్పకపోలేదు.

దుష్టభావనలను పారద్రోదలం కోసం సద్భావనలను కలిగి యుండాలని వాటిని ద్రోలగలిగితేనే సాధ్యమని అన్నాడు. అవిరెండు రకాలు ఒకటి ఇంద్రియ విషయాలలో లాగే మనఃప్రవృత్తి, మరొకటి అంతిమ లక్ష్యాన్ని చేరుకొనే సద్భావాలు. లాగేవి, క్లిష్ట ప్రవృత్తులు. క్లేశం నుండి అనగా బాధనుండి క్లిష్టం వచ్చింది. దీనికి విరుద్ధమైనది అక్లిష్టం. కామక్రోధాదులనే క్లిష్టవృత్తులు అంత చటుక్కున లొంగుతాయా? అణచబడతాయా? ప్రేమ, ఉదారభావం, పవిత్రత మొదలైనవి అక్లిష్టవృత్తులు. ఈ రెండూ అణిగినపుడు సమాధిలభిస్తుందని అన్నాడు.

క్లిష్టవృత్తులు మనిషిని బంధించినట్లుగా అక్లిష్టవృత్తులు జీవుణ్ణి బంధించవు. రెండూపోతే కైవల్య సమాధి. ఏక్లిష్టవృత్తి ఎప్పుడైతే ఉద యించిందో దానికి విరుద్ధమైన అక్లిష్టవృత్తితో అణచాలని అన్నాడు.

అన్నిటి కంటె ప్రేమకు అధిక ప్రాధాన్య మిచ్చి అది నాల్గురకాలుగా ఉంటుందని వర్గీకరించాడు. అవి మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్షలు. ఇతరుల పట్ల సఖ్యభావం మైత్రి. ఇతరులు బాధపడుతూఉంటే చూపేది కరుణ ఉత్తముల పట్ల ప్రేమను చూపి వారికి ఆనందం కల్గించడం ముదిత, నీచుల పట్ల ప్రేమను చూపించడం సాధ్యం కాకపోయినా వారికి దూరంగా పట్టించుకోకుండా ఉండడం ఉపేక్ష.

ఉత్తమ లక్ష్యం లేకపోతే ఉన్నత స్థితి రాదు

పై చెప్పిన అక్లిష్టవృత్తులు, క్లిష్టవృత్తుల మాదిరిగా మనిషిని క్రుంగదీయవు. దానికి బదులు మనిషిని ఉన్నత స్థితికి తీసికొనివచ్చి చివరకు అదృశ్యమైపోతాయి. అశాస్త్రీయకర్మలు మనిషిని అధఃపాతాళానికి లాగినట్లు కాకుండా, శాస్త్రీయకర్మలు ఫలాపేక్షలేకుండాచేస్తే ఉత్తమ స్థితిలోనే ఉంచుతాయి. ఇవి విజ్ఞానానికి దారి చూపిస్తాయి. అట్లాగే సగుణా రాధనను కేవలం ద్వైత భావనతో చేసినా జీవుణ్ణి నిర్గుణంలో కలుపునట్లు చేస్తుంది.

దీనికొక ఉదాహరణను చెప్పవచ్చు. దుష్టవృత్తులు లేదా దుష్టులు మనలను ఆక్రమించినపుడు ధార్మిక కృత్యాలు, ఉపాసనవంటి రక్షక భటులు మనలను ఆదుకొంటారు. మన సమస్యలు తీరేవరకు వీళ్లు మనలను చూస్తారు. దొంగలను తరిమిన తరువాత రక్షకభటులు తప్పుకొంటారు. అట్లా ఉత్తమ గుణాలు కూడా చెడ్డ గుణాలను తరిమిన తరువాత తప్పుకొంటాయి.

మనం లక్ష్యంచేరుకోవడానికి చాలా కాలం పడుతుంది. మనం గట్టిగా ప్రార్థిస్తే ఈశ్వరుడు ఆదుకొంటాడు. తనంతట తాను భారం వేసికోడు. ఎందుకంటున్నానో గమనించండి. ధార్మిక కృత్యాలు, ప్రేమ, సగుణ ఉపాసనలే మన లక్ష్యమైతే అంతటితోనే సరిపుచ్చుకోవాలి. ఎవనికి అద్వైతమే లక్ష్యంగా ఉంటుందో. అట్టి జ్ఞానము పైవాటి కంటె ఉన్నతమైనది. ఎంత వయస్సు వచ్చినా కర్మకాండలో మునిగిన వారు భక్తి జ్ఞాన సాధనల వైపుకి వెళ్లరు. ఇక సంఘసేవ చేసే వారి మనఃప్రవృత్తి మారదు. ఇక తీర్థయాత్రలు చేసే వారు కూడా ఇంకా ఫలనాక్షేత్రం చూడలేదని అసంతృప్తితో ఉంటారు. ఇక నామసంకీర్తన చేసేవారు కూడా దానితోనే ఆగిపోతారు. ఇట్లా ఏదో వ్యాపకం పెట్టుకొన్నవారు దానితోనే సరిపుచ్చుకొని ఆత్మవిచారణకు పూనుకోరు.

ఎందుకిట్లా జరుగుతోంది? ఎన్నో జన్మల కర్మలు మనిషిని గుంజివేస్తాయి.

కనుక ద్వైతంలోనే మునిగిపోతారు. మరల జన్మ వచ్చినా అంతే. అయితే అందుత్తములు యోగభ్రష్టులుగా జన్మిస్తారు.

అయితే ఎందరో మహాత్ములు ద్వైత సాధనలో ఉన్నా మహాత్ములుగానే మరల జన్మిస్తారని అంటారు. అయితే ఎన్ని జన్మలెత్తినా ద్వైత ప్రపంచం నుండి దూరంగా ఉండలేరు. ఎందుకిట్లా జరుగుతోంది? నీవడిగినది నేనిస్తానని భగవానుడు అనడం వల్లనా? లేకమాకు అద్వైతం లక్ష్యంకాదు ద్వైతమే అని వారనడం వల్లనా?

ఇదంతా పోలీసులు రక్షించినా వారి పట్ల మమకారం చూపించడం వంటిది. వారు దుష్టభావాలను తరిమినా సద్గుణాల వెంట తిరిగుతున్నట్లనిపించడం లేదా?

దేవాసుర సంగ్రామంలో ముందు అసురులను తరమాలి. దేని ద్వారా? దేవశక్తుల ద్వారా? ఇంకా దేవతలను పట్టుకొని వ్రేళ్లాడుతూ ఉంటేవారు మనకంటె భిన్నులనే భావం ఉంటోంది కదా? వారు ఆత్మకాదు. అంతవరకూ నిర్గుణతత్త్వం పట్టుబడదు. గుణాలు మనస్సునకు చెందినవి. ఆత్మ, దాని కంటె భిన్నం కదా! కనుక మంచిని, చెడును విసర్జించగలగాలి. ఆత్మశాంతికి ఈదేవతలు విదేశీయులుగానే ఉంటారు. విదేశీయులనగా శత్రువులనే అర్థంలో వాడడం లేదు. వీరు ఆత్మకు బాహ్యులే కనుక యుద్ధాలకతీతమైనది, ఏకాంత స్థితిలోనున్న దానిని పట్టుకోవాలి.

ఎక్కడీ యుద్ధం జరుగుతోంది? జీవునిలో. ఎవరీజీవుడు? మనస్సే ఆత్మకు ఈ యుద్ధాల స్పర్శ ఉంటుందా? కనుక జీవభావన నశించాలి. అనగా మనస్సు పోవాలి. కామక్రోధాదులను తరిమిన తరువాత పవిత్రమనస్సుతోనే ఉండండని, దేవశక్తులతో నింపండని భగవానుడనలేదు. బుద్ధికంటె అతీతమైన ఆత్మస్థితిలో ఉండండని చెప్పాడు.

దేవశక్తులు నొప్పించవే!

పైన దేవశక్తులను రక్షకభటులతో పోల్చాం. ఇవి కూడా మనలను ఆత్మవైపుకి మళ్లించవు. వాటి గుప్పిట్లో ఉండిపోతాం. వారిచ్చే సుఖసంతోషాలలో మునిగిపోతాం. కొన్ని దేవశక్తులు మధ్యమతరగతికి, కొన్ని అధమ తరగతికి చెందినవి కూడా.

ఒక సాధకుడు కొన్ని సిద్ధులను సంపాదిస్తాడు. అందులోనే "మునగానాం తేలానాం"గా ఉంటాడు. అట్లా దేవ శక్తులు ఇతణ్ణి బంధిస్తాయి. వీటికంటె మరొక ఉన్నతమైన దశ ఉందని గుర్తు చేయనీయవు.

ఈశ్వరునిపై అచంచల విశ్వాసం ఉంటే ఈశక్తులేమీ ఇతణ్ణి బాధించలేవు. నిర్గుణ రూపమే కానవసరంలేదు. సగుణ రూపాన్ని భజించినా అతడే నిర్గుణ రూపంలో ఐక్యమవడానికి దోహదం చేస్తాడు.

ఈశ్వరశక్తితో సమానమైన దేవతలు జీవుని ఆత్మసాక్షాత్కార మార్గానికి అడ్డుచెప్పవు. అప్పయ్యదీక్షితులు ఈశ్వరుడు, అమ్మవారు, మహావిష్ణువులను రత్నత్రయంగా అనేక కారణాలు చూపించి పేర్కొన్నారు. అట్లాగే గణపతి, సుబ్రహ్మణ్యుడు, గణపతి, సరస్వతి, రామ, కృష్ణావతారాలను భజించినా ఉత్తమగతి కల్గుతుంది.

మనలక్ష్యాన్ని బట్టి ఈశ్వరకృప

ఇక్కడ రెండువిషయాలు తప్పక గ్రహించాలి. గ్రామదేవతలను కూడా ఈశ్వరలేదా పరమాత్మ స్వరూపాలని, కేవలం క్షుద్రదేవతలుగా భావించకుండా ఉండగలగాలి. వారిలోనూ పరమాత్మ దాగియున్నాడని భావించాలి. అపుడు ఉత్తమ జ్ఞానాన్ని ప్రసాదిస్తారు.

రెండవది – మనకంటె భిన్నంగా ఈశ్వరుడున్నాడు. ఇట్టి ద్వైతస్థితిలో

నన్నుండనీ నాకు అద్వైతం అక్కరలేదు, అనినపుడు జ్ఞానం వినా మిగిలినవి ప్రసాదిస్తాడు. నీవనుకొన్నట్లే ద్వైతంలోనే ఉండిపో అని అంటాడు.

ఇంకామరి కొందరున్నారు. వారు భక్తిలోనే ఉండిపోయి అదే లక్ష్యంగా ఉంటూ అద్వైతం గురించి అసలు వినియుండని వారుంటారు. ఒకవేళ ఆ తీవ్ర భక్తిలో అద్వైత జ్ఞానం పట్టుబడినా అదే లక్ష్యమని భావించకపోయినా అట్టి జ్ఞానాన్ని స్వీకరిస్తారు. ఇట్టి భావసంపద, కలవారికి ఈశ్వరుడు తన నిర్గుణ రూపానుభవాన్ని కల్గిస్తాడు. చివరకు వారికి జ్ఞానమోక్షాన్ని ప్రసాదిస్తాడు.

నీవెట్లా ఆరాధించినా, నా నిజరూపాన్ని, అర్థం చేసికొనేటట్లు చేస్తానని భగవానుడన్నాడు కదా! ఈమాట వల్ల అద్వైతమే లక్ష్యంగా సాధన చేసేవారికీ, సగుణరూపంలో ధ్యానం చేస్తూ నిర్గుణ తత్త్వాన్ని తెలియని వారికీ వర్తిస్తుంది. తీవ్ర ద్వైతమార్గంలో ఉన్నా, మెరుపు మెరిసినట్లు వారికి తెలియకుండానే అద్వైత స్థితి వచ్చినా, అట్టి స్థితిని తిరస్కరించరని గుర్తించండి.

తిరుమూలర్, తిరువళ్ళువార్ అమృతవాక్కులు

కనుక జీవుని లక్ష్యానికి అనుగుణంగా ఈశ్వరుడు ద్వైతస్థితినో, అద్వైత స్థితినో ప్రసాదిస్తాడు.

తిరుమూలర్, ఉగ్రమైన కోరికను, చంపు. ఈశ్వరుని పట్ల కోరికను కూడా చంపుమని ఘాటుగా అన్నాడు.

బంధాలు పోవాలంటే బంధాలు లేనివాణ్ణి పట్టుకో అని తిరువళ్ళువర్ అన్నాడు.

పై మాటలు రెండూ భిన్నంగా ఉన్నట్లు కన్పిస్తాయి. ఈరెండూ పై రెండు తరగతులవారి నుద్దేశించినవే. రెండూ పాటించదగినవే.

కొందరిట్లా భావిస్తారు అసలు సత్యస్వరూపం నాకు సాక్షాత్కరించనీ అద్వైతజ్ఞానం వల్ల వచ్చే నిర్గుణత్వం, నేను ద్వైతస్థితిలో సగుణ రూపాన్ని ధ్యానించినా అది నాపై అనుగ్రహం చూపించుగాక. ఇట్లా అనేవారి నుద్దేశించి తిరుమూలర్ చెప్పలేదు. సగుణారాధకుల, తీవ్రభక్తి సాధనను గురించే వారితో ఇట్లా అంటాడు. సగుణ రూపంలోనే అతణ్ణి సాక్షాత్కరించు కోవాలని అనుకోకు. ఇంతకంటె ఈశ్వరునికి మించిన రూపం ఉందేమో! అట్టిదినాకు ప్రాప్తించుగాక అనే ధోరణిలో ఉండాలని అన్నాడు. ఈశ్వరునిపట్ల అనే మాటకు అర్థం నీవు కోరినంతమేరకూ ఇస్తాడని, నీవు సగుణ రూపం కోరితే సగుణ రూపాన్ని మించినది ఈయడని.

శంకరులు సగుణోపాసనను జ్ఞాన సిద్ధి కోసమే చెప్పారు. అట్లాగే తిరువళ్లువర్ ఈశ్వరుని ఉపాసించమని అన్నాడు. వీరు ఈశ్వరునితో బంధం ఏర్పరచుకొన్నా అది వారి అంతిమలక్ష్యం కాదు. అన్ని కోరికలు పోయిన స్థితియది. అట్టి వారిని చూచి వారిని ద్వైతస్థితిలో ఉంచడు. ఈశ్వరుడు. ఎందుకంటే వారి సేవను, స్వీకరిస్తూ వారి పట్ల ఎప్పుడైతే అనుగ్రహం చూపించాడో అది అద్వైత స్థితికే చెందుతుంది కదా! ఇక్కడ తిరువళ్లువర్ బంధాలు లేనివాడనే పదం వాడాడు. నీవు ఏ ఈశ్వరుణ్ణి పట్టుకొన్నావో అతడు బంధాలు లేనివాడని అద్వైత ధోరణిలో చెప్పాడు. బంధాలు త్రెంపుకోవాలని భావించేవారు, సమర్థులు కాని వారైతే వారికి తిన్నగా జ్ఞానం పట్టుబడదు. మనం కొలిచేది కోరికలు లేని వస్తువే అని లక్ష్యమైనపుడు అట్టి వస్తువు వీరి నిమిత్తమై వీరి పట్ల జ్ఞాన సిద్ధిని కల్గిస్తాడు.

ఇక్కడొక మాట గుర్తించండి. అంతరంగా ఈశ్వరునకు బంధాలు లేని స్థితియేయుంది.

మన చర్చ కోరికలతో మొదలుపెట్టాం కదా! అసుర ప్రవృత్తుల్ని

అర్థగించాలని తెలుసుకొన్నాం. ఇవి కూడా మనకు ఆటంకం కల్గిస్తాయని తెలిసింది. సగుణ ఈశ్వరుని పట్ల కోరిక కూడా ఆత్మజ్ఞానానికి ప్రతిబంధకమని తెలిసికొన్నాం. నిరాకార నిర్గుణ బ్రహ్మతత్త్వం ఒంటబట్టనంత వరకూ ఈశ్వరుడు, తనమాయాశక్తి ద్వారా చిన్న చిన్న లక్ష్యాలు నెరవేర్చగంతో సరిపుచ్చుకొంటాడని తెలిసికొన్నాం. అతడు మనమీద జాలి చూపించి జ్ఞాన మార్గం వైపుకి మళ్లిస్తాడని భావించవచ్చు.

అయినా అతడెప్పుడో జాలి చూపిస్తాడని అతనిపై భారం వేయకుండా అద్వైతాన్నే లక్ష్యంగా చేసికొని కోరికలను సమూలంగా నాశనం చేయాలి. మిగిలిన సాధనాలపై, సిద్ధులపై లక్ష్యం ఉండకుండా సాగాలి.

మొదటినుండి అద్వైత భావం

అది వెంటనే పట్టుబడేది కాదు. రోజూ కొంతసేపైనా అద్వైతాన్ని గూర్చి ఆలోచించగలగాలి. సహజంగా దానిపై మక్కువ ఏర్పడకపోయినా మనస్సునట్లా మళ్లించగలగాలి. ఎంత సత్కార్యమైనా, ఈశ్వరుడు అనుగ్రహం చూపిస్తున్నాడని అనిపించినా ఇవేమీ ఆత్మకావనే దృఢాభిప్రాయం కలిగియుండాలి. ప్రస్తుతం అనుభవించేది మాయలో భాగం మాత్రమే ఇవేమీ శాశ్వతనందాన్ని ప్రసాదించలేవు. నేనునిస్సంగుణ్ణి. ఆకాశం దేనిని అంటనట్లుగా ఉండేవాణ్ణి, నేను నిష్క్రియుణ్ణి అనే భావనతో కొంతసేపైనా ఉండగలగాలి. నేను చేస్తున్నానంటే ఇట్లా అంటున్నది అబద్ధపునేను, అసలు నేను కాదనే భావన కలిగియుండాలి. ఆత్మను గురించి ఆలోచించడం కూడా ద్వైతం కదా అని మీరు ప్రశ్నించవచ్చు. ద్వైతభావాలు రెండు రకాలుగా ఉంటాయి. ఒక రకం కేవలం ద్వైతంలో ముంచేవి. ఆత్మవిచారణ, రెండవతరగతికి చెందింది. అన్ని ఆలోచనలు అణగిన స్థితియే ఆత్మస్థితి, ఇట్లా విచారణచేయగా చేయగా ఆలోచనా రహితస్థితి వస్తుంది.

బాధలే బంధం నుండి విముక్తినిస్తాయి

కొద్దిసేపైనా ధ్యానంలో ఉండలేకపోతున్నామని బెంబేలు పడవద్దు, మాయ వేసిన ముడిలో చిక్కుకున్నాంకదా! ఒకటా, రెండా, అనేకమైన ముడులు వేసింది. ఆచిక్కుముళ్లు విడువనంతకాలం బాధలు తప్పవు. వీటిని విడదీయాలంటే సత్కర్మలే శరణ్యం. ఆ సత్కర్మలు చేస్తున్నా అనేకమైన ఇబ్బందులొస్తాయని లోగడ చెప్పాను. సంఘసేవ చేస్తున్నా ఒకప్పుడు నిద్రాహారాలు త్యజించవలసివస్తుంది. ఇవేమీచేయకుండా నేను ఆత్మనని కొద్దిసేపు చింతించగలిగితే అన్ని ఆందోళనలకు తెరపడుతుంది. అదీ చేయలేకపోతున్నాం. కర్మ, భక్తి మార్గాలలో కష్టాలెదురైనా కొంత ఓపిక పట్టగలిగియుండాలి.

పెద్ద బాధ పోవాలంటే సూదిమందును వాడడం లేదా? శస్త్రచికిత్సలు చేయించుకోవడం లేదా! అపుడు కలిగే బాధను కూడా తట్టుకోలేనంటే ఇంకా రోగ బాధపడవలసి వస్తుంది కదా! అట్లాగే కర్మ, భక్తి, మార్గాలలో ఉండేకష్టాలటువంటివి.

సంగీత కచ్చేరిలో శ్రుతికి అనుగుణంగా రాగాలాపన ఉంటే సంతోషించ గలం. భిన్నంగా ఉంటే అంతా గందరగోళమే. సంగీతాన్ని నాదబ్రహ్మగా శబ్దబ్రహ్మగా భావించి అందు లీనం కాగలిగితే పరమశాంతి లభించునట్లుగా సత్కర్మలు, చివరకు నిష్క్రియమైన స్థితికి తీసికొనివస్తాయి. సగుణోపాసన, నిర్గుణపాసనకు దారిచూపిస్తుంది.

నేను చేయడం లేదా, ఈశ్వరుడే చేయిస్తున్నాడనే భావనతో కర్మలు చేయగలిగితే అది నిష్కామకర్మ. అంటే సంగరహితుడై చేయాలన్నమాట. అన్నిటిని అతనికే అర్పిస్తున్నాననే అర్పణభావమే భక్తి.

భారం కాకుండా పనులు చేయుట

అతనిచేత సంఘకార్యాలను ఈశ్వరుడు చేయిస్తున్నా పని భారం లేకుండా అపుడు జీవుడుంటాడు. ఎట్లా? నిద్రబోతున్నా పిల్ల, పాలు త్రాగినట్లుగా. అట్టి స్థితి సామాన్యునకు అంతసులభంగా పట్టుబడదు. ఇట్టి పైస్థితిని భద్రగిరి అనే మహానుభావుడు ఇట్లా వర్ణించాడు. నిద్రపోకుండా నిద్రాసుఖాన్ని ఎప్పుడు ఆస్వాదించగలము? అని

జగత్కల్యాణం కోసం జ్ఞానులందరినీ ఈశ్వరుడు నియమించడు. కొందరు ఏకొండ గుహలలోనో ఉండి నిర్వికల్పసమాధి నిష్ఠులైయుంటారు. కొందరు జ్ఞానామృతాన్ని పంచిపెడతారు. మామూలు వ్యక్తుల మాదిరిగా కొందరు ధార్మిక కృత్యాలు నిర్వహిస్తూ ఉంటారు. ఆదర్శప్రాయంగా ఉంటారు. ఈ పనులన్నీ ప్రపంచ వ్యవహారాల క్రిందకు రావచ్చు. వీళ్లుమామూలు మనుష్యులే అని అనిపించేటట్లుగా జ్ఞానులచే ఈ పనులు చేయిస్తాడు. వారిని ఆదర్శంగా తీసికొని కర్మభక్తులను ఉత్తమ సిద్ధికై మనం ఉపయోగించాలి. చిట్టచివర అద్వైత స్థితి పట్టుబడకపోయినా ఆరంభంనుండే నెమ్మదినెమ్మదిగా ఆత్మనిష్ఠులం కావడానికి ప్రయత్నించాలి.

మురికిగానున్న మడుగులో గాని, అలలురేగిన నీటిలో అడుగుభాగాన్ని చూడగలమా? అట్లాగే కర్మకాండ అనేమురికి పోయినపుడే చూడగలం. కర్మద్వారా చిత్తానికి అంటుకొన్నచెత్తా చెదారాన్ని తుడవగలగాలి. భక్తి ఆ అల్లకల్లోల స్థితిని అణచివేస్తుంది.

కర్మలకు భక్తిని జోడించగా ఎటువంటిదంటే పిండిలో నేతిని కలపడం వంటిది. అది మెత్తబడుతుంది. రుచికూడా వస్తుంది కదా! ఆ ఈశ్వరభక్తి ద్వైతస్థితిలోనే ఉండిపోకుండా ప్రయత్నించాలి. నేను చేస్తున్నాననే భావన

రానీయకూడదు. అందుకై మొదటి నుండి ఆత్మచింతను చేయాలని మాటిమాటికీ చెబుతున్నా.

మొదటి నుండీ మూడుమార్గాలు

కర్మ, భక్తి జ్ఞానాలను కలిపే సాధన చేయాలని గీతోపదేశం. కలిసినపుడొక భాగం ఎక్కువగా మరొకటి తక్కువగా ఉండవచ్చు. అయినా అన్నీ ఉండవలసిందే. అందుకే మూటినీ చెప్పాడు.

నేనెందుకు జ్ఞానిని కాకూడదు? యుద్ధం ఎందుకుచేయాలని అర్జునుడడిగినపుడు యుధ్యస్వ=యుద్ధం చేయి అని ఆదేశించాడు. అంతే కాదు విగత జ్వరః అన్నాడు (3-30)

అంటే ఏమిటి? జర్వం లేకుండా అని మామూలు అర్థం. యుద్ధంలో అర్జుననకు నిజంగా జ్వరం వచ్చిందా? బంధువులతో బంధమనే జ్వరమది. మనస్సు కుతకుతలాడుతోంది. అది ఒక రకంగా జ్వరమే. తనకేదో జ్ఞానం అబ్బినట్లు, సన్న్యాసినవుతా, బిచ్చమెత్తుకొని బ్రతుకుతా అనినపుడు ఆసందర్భంలో కర్మమార్గాన్నే బోధించాలి. అది చెబుతూ నిష్కామ కర్మ గురించి విపులంగా బోధించాడు భగవానుడు. అట్టి ప్రాథమిక దశ లోనున్నవారికి కర్మమార్గాన్నే బోధించాలి. ఈ పరిస్థితిని అర్థం చేసికోకుండా అసలు గీత, కర్మయోగాన్నే చెప్పింది, జ్ఞానమార్గం చెప్పలేదని కొందరు వ్యాఖ్యానించారు.

ఎవరికి దీనిని ఉపదేశించాడు? రజోగుణంతో కూడిన అర్జునునికి, అట్టి పెక్కుమందికీ కూడా.

ఆ కర్మయోగంతో భక్తి కలిస్తే ఆకర్మ శుష్కకర్మగా ఉండదని, నన్ను స్మరిస్తూ యుద్ధం చేయి అని అన్నాడు. "మామ్ అనుస్మర యుధ్యస్వ" (8-7) నీవు బాహ్యంగా యుద్ధం చేసినా నీలోపలి భావాలు నావైపునకే

మళ్లియుండాలని హెచ్చరించాడు. భక్తి, ఇక్కడ ఆలంబనంగా ఉంటుంది.

ఇపుడు, అర్జునుడు కర్మయోగాన్ని స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాడు. లేదా శరణాగత భక్తితో ఉండగలడుగాని, ఈదశలో బ్రహ్మనిర్వాణ దశను చేరుకోలేడు. అందుకే చివరగా గీతలో అన్ని ధర్మాలు విడిచి శరణాగతితో ఉండుమని అన్నాడు.

కేవలం కర్మయోగంచెబితే అంతటిలో ఆగిపోతాడు, అపుడు ఆత్మస్థితితో ఉండిపో అనినా కుదరని మాట, జ్ఞానమార్గం ధర్మా ధర్మాలకు అతీతం కదా! దానిని ఇపుడే బోధిస్తే ఎలా?

"నువ్వే కాదు, అది ఎవ్వరికీ సాధ్యం కాదు, నేనే నిన్నందులో ప్రవేశపెట్టాలి మొదటి నుండీ జ్ఞాన మార్గంలో ఉన్నవారికీ నేనే కారకుడని అనిపించేటట్లుగా కనబడను. నీవిషయం వేరు జ్ఞానం గురించి తరువాత ఆలోచిద్దాం. ముందుగా శరణా గతిని పొందు అది ప్రస్తుతానికి చాలు. నీఅసలు లక్ష్యమేమిటో తరువాత వివరిస్తానులే" అని శరణాగతిని బోధించాడు.

ఈక్రమ పద్ధతిని కొందరు అర్థం చేసికోకుండా అసలు గీత, భక్తి మార్గానికే చెందిందని వ్యాఖ్యానించారు.

కేవలం కర్మమార్గంలో ఉండమని చెప్పలేదు. అందని అద్వైత మార్గంలో ఉండమని ఇపుడు బోధించలేదు. ప్రస్తుతదశ, శరణాగతియే.

భగవానుడిట్లా భావించియుంటాడు. అసలు సంగతి మరుగు పరిస్తే ఎలా? ఆత్మ పట్టుబడినా పట్టుబడకపోయినా ఆత్మగురించి ప్రాథమిక జ్ఞానం కల్గించవద్దాయని జ్ఞానాన్ని ఉపదేశించాడు. జ్ఞానమార్గంలో పొంద వలసిందంటూ ఏమీ లేదు. పొందబడేదేతాను. మొదట జ్ఞానమే పరమ లక్ష్యమని బోధిస్తే ఇక యుద్ధం చేయడం ఉంటుందా?

చివరి అధ్యాయంలో నిష్క్రియమైన జ్ఞాన సన్న్యాస యోగాన్ని బోధించాడు. అది బోధయొక్క చివరి దశ. అర్జునునికి మనస్తత్వానుగుణంగా బోధించాడే గాని తార్కిక ధోరణిలోకాదు, భక్తి శరణాగతి తత్వం అతనికి ఒంటబడుతుందని, నప్పుతుందని, భావించి శరణాగతితో ముగించాడు.

చివరి అధ్యాయం చివరిలో సన్న్యాసాన్ని స్వీకరించి కామక్రోధాదుల నుండి దూరుడైయున్నవానికి బ్రహ్మానుభవం కల్గుతుందని అన్నాడు. అపుడతడు సమస్తప్రాణుల పట్ల సమభావం కల్గియుండి బ్రహ్మాభూతుడౌతాడని అన్నాడు. ఇంతటితో చెప్పి ఊరుకొంటే అర్జునుని స్థితి ఎట్లా ఉంటుంది? నిచ్చెనతో మేడపైకి ఎక్కించి నిచ్చెననే లాగి వేసినట్లుంటుంది. అట్లాకాకుండా అట్టి బ్రహ్మాభూతుడు నాపట్ల పరమభక్తిని చూపిస్తాడని అన్నాడు. అంతే శరణాగతి చెప్పాడన్నమాట.

అంతకుముందే విశ్వరూపాన్ని ప్రదర్శించి చూపాడు. దానివల్ల ఇతనిపై అర్జునునకు అపారగౌరవం ఏర్పడింది. ప్రపత్తిని అర్జునుడు చూపించ గలిగాడు.

పరాభక్తియే ప్రపత్తియని చివరకది జ్ఞానమేయని శంకరులన్నారు.

అయితే గీతలో అద్వైతానికి పునాది ఎక్కడ పడింది?

ఉపదేశానికి ముందే ఈ అద్వైతమనే విత్తులను చల్లాడు. మొదటి నుండి అది అంతర్లీనంగా ఉండడం కోసమే.

రెండవ అధ్యాయం 11వశ్లోకం నుండి గీతోపదేశం మొదలు. అంతకుముందున్నది ఉపోద్ఘాతం. బ్రతికిన వారి గురించి, చనిపోయిన వారి గురించి జ్ఞానులు చింతించరని మొదటే అన్నాడు. ఏదీ శాశ్వతం కాదు. అపరిమితం ఏదీ కాదు. ఒక్క ఆత్మయే శాశ్వతం, అపరిమితం.

శరీరమేపోయేది మొదలైన మాటలు అద్వైతానికి చెందవా? ఇట్లా 20 శ్లోకాలలో వివరించాడు. తరువాత స్వధర్మాకర్మానుష్ఠానం గురించి వివరించాడు. కనుక బ్రహ్మమునుండి మొదలు పెట్టి కర్మను తరువాత ఎత్తుకొన్నాడు. నీ స్వధర్మం ప్రకారం ఆలోచించినా యుద్ధం చేయవలసిందే. ధర్మయుద్ధం కంటె క్షత్రియునకు కావలసిందేమిటని అన్నాడు.

ఇంతకు ముందు మనమేమిచెప్పాం? ముందు పూర్వమీమాంస (కర్మ) తరువాత ఉత్తరమీమాంస (జ్ఞానం) అనే వరస చెప్పాం. అట్లా కాకుండా బ్రహ్మతత్త్వాన్నే ముందుచెప్పి తరువాత కర్మానుష్ఠానాన్ని చెప్పాడు.

అతని ప్రధాన ఉద్దేశం అర్జునునకు స్వధర్మకర్మలను చెప్పుటయే. అయినా ఆదినుండి బ్రహ్మ జ్ఞానం గురించి కొంతైనా తెలిసియుండాలని అదే పరమగమ్యము కనుక మొదటి నుండీ దానితో పరిచయముండాలని అట్లా ఆరంభించాడు:-

ఏషాతే అభిహితా సాంఖ్యే

బుద్ధిర్యోగే త్విమాం శృణు (2-39)

అనగా సాంఖ్యమనబడే జ్ఞానోపదేశం ఉపదేశింపబడింది. (అప్పటికీ నీకు జ్ఞానోదయం కలుగకపోతే) నిష్కామకర్మ యోగాన్ని గురించి చెబుతా.

అంటూ మూడు గుణాల నుండి దాటడం కోసం, బంధాలనుండి విముక్తి కోసం అ కర్మయోగం ఉపయోగిస్తుందని స్థితప్రజ్ఞుని లక్షణాలను విపులంగా వివరించి ముగించాడు.

ఏది ధర్మమో తెలియని స్థితిలోనున్న అర్జునునకు యుద్ధం చేయడమే ధర్మమని చెప్పి స్థితిప్రజ్ఞుని లక్షణాలను చెప్పాడు. అనగా ధర్మాధర్మాస్థితిని దాటాలని సూచించాడు.

ఈరోజు నుండి మొదలు పెట్టండి

మీరందరూ అర్జునులే అతని మాదిరిగా మీరూ విషాదయోగంలో ఉన్నారు. కృష్ణోపదేశాన్ని విని అర్జునుడు తరించినట్లుగా మీరూ తరించాలని స్వామిని వేడుకొంటున్నాను. నామానసిక ఆందోళన పోయింది. నా సందేహాలు తీరాయి, నీవల్ల ఎఱుక సిద్ధించిందని అర్జునుడన్నట్లుగా మీరూ తీర్చిదిద్దబడాలి.

కనుక సత్కర్మలు చేయండి. భక్తితో వినయంతో పరమేశ్వరుని భజించండి. మానసిక వృత్తులు లేని ఆత్మపై ఇప్పటి నుండి దృష్టిని సారించండి. కొంతసే పైనా ప్రశాంతంగా కూర్చొని నిష్క్రియమైన ఆత్మను గురించి ఆలోచించండి. క్రమక్రమంగా బంధాలు తొలగుతాయి. అసుర వృత్తులను గెంటివేయడంతో బాటు దేవవృత్తులకూ దూరంగా ఉండండి. ముందు సగుణారాధననుండి నిర్గుణారాధనకై యత్నించండి.

మంచికీ మించియుండాలి

మంచివాటికీ దూరంగా ఉండాలని ఎందుకంటున్నానో చూడండి. ప్రపంచయుద్ధంలో బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సు, రష్యాలు మిత్ర దేశాలుగా ఏర్పడి హిట్లర్ (జర్మనీ) ముస్సోలనీలను (ఇటలీ) ఎదుర్కొన్నాయి. వీరు అసుర ప్రవృత్తికి చెందిన వారు. వీరిని పైవారు ఓడించారు. తరువాత ఏం జరిగింది? పై వారే తమలో తాము విడిపోయి కొట్లాడుకోలేదా? ప్రచ్ఛన్న యుద్ధం సాగలేదా? రష్యా అమెరికాలు పోటాపోటీగా వ్యవహరించలేదా? దాని వల్ల ప్రపంచదేశాలు గడగడలాడలేదా?

ఇక స్వాతంత్ర్యసంగ్రామంలో తెల్లదొరలను తరిమాం, మననాయకులు దేవతలని భావిద్దాం. తెల్ల దొరలది అసురప్రవృత్తి అందాం. స్వాతంత్ర్యం

వచ్చిన తరువాత పోరాడిన పార్టీలో ఎన్నో చీలికలువచ్చి ఒకర్ని ఒకరు అసురులని తిట్టుకోలేదా?

కనుక దేవప్రవృత్తులు శాశ్వతంగా ఉండిపోవని చెప్పడానికే ఇదంతా చెప్పాను. అట్లే కర్మయోగం, భక్తియోగం అయిన వెనుక సాంఖ్య (జ్ఞాన) యోగాన్ని పట్టుకొని పైవాటికి దూరంగా ఉండగలగాలి. చివరకు ఆత్మ ధ్యానమే శరణ్యం. దానికి మొదటినుండి పునాది వేయాలి. పోరాటాలు లేని పరమశాంతస్థితిని చేరుకోవాలి. ఈ జన్మలో సాధించకపోయినా ఏనాటికైనా సాధిస్తాం.

ఆత్మధ్యానం అందరికీ తప్పనిసరి

మానవజన్మనెత్తడమే దుర్లభమని శంకరులన్నారు కదా! జంతూనాం నరజన్మ దుర్లభం దీని సార్థకత, ఆత్మ విచారణ చేసినపుడే!

మాకు తీరుబడి లేదని కుంటి సాకులు చెప్పకండి. అశాశ్వతమైన వాటికి ఎంత ఆరాట పడుతున్నామో. ఎంత కాలాన్ని వృథా చేస్తున్నామో కాస్త ఆలోచించండి.

మాయాశక్తిని ప్రయోగించి భగవానుడు అనేక పరీక్షలకు గుర్తిచేస్తున్నాడు.

మామూలు వ్యవహారాలు సాగవలసిందే. తీరక లేదంటే ఎలా? ఇది ఎట్లా ఉందంటే ఉద్యోగం చేయడానికి తీరిక దొరికింది కాని జీతం పుచ్చుకోవడానికి తీరికలేదని అన్నట్లుంది. ద్వైతకార్యాలు అశాంతికే దోహదం చేస్తాయి.

మనకాసంకల్పం లేకపోవడం వల్లనే ఇదంతా జరుగుతోంది. ఆత్మవిశ్వాసం లేకపోవుట, ఈశ్వరుని పట్ల అచంచల విశ్వాసం లేకపోవడం వల్లనే శాంతికి దూరంగా ఉంటున్నాం.

ఎందుకా సంకల్పం లేదు? జ్ఞానావసరాన్ని గుర్తించకపోవడం వల్లనే. ఎండలో తపించిన వాడు చల్లని నీడ దొరికితే బాగుండునని అనుకోవడం లేదా? అట్టి జ్ఞానమనే ఇంటి తలుపుతట్టడానికి ఉద్యుక్తులం కావాలి. అందుకే మఠాలస్థాపన. నావంటి వారిపై మిమ్ములను కర్తవ్యోన్ముఖులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉంది.

తీవ్రాలోచనతో తెలిసికోవాలి

నాకేమీ బాధలులేవని ఎవడైనా అనగలడా? లేదు. ఈ ఆందోళనలకు కారణమేమిటి? ఏదో పనిచేయాలని క్షణం తీరిక లేకుండా ఉంటున్నాం. అన్నీ పొందాలనే ఆశ శాంతికి విఘాతం కల్గిస్తోంది. క్రియలు చేస్తున్నాం క్రియా రహిత స్థితిలోనే శాంతి.

ఎందుకు పనిచేస్తున్నావు? కోరిక తీరడం కోసం. ఆ కోరికలకు అంతం ఉందా? ఆలోచించండి. అందుకే మీపనులు మీరుచేస్తున్నా, స్వార్థమైన కోరికలతోనే మొదలు పెట్టకండని, దానికి బదులు సంఘప్రయోజనం కోసం పనులు చేయండని పెద్దలన్నారు. ఎన్నోపనులు చేయవలసివస్తుంది కాబట్టి ఒక్కొక్కరికి ఒక్కొక్క స్వధర్మాన్ని బోధించారు. ఈ ఇంద్రియాలను భగవంతుని వైపుత్రిప్పితే స్వార్థ ప్రయోజనం తగ్గుతుంది. క్రియలను శరీరంతో చేస్తాం. అంతకంటె సూక్ష్మమైన మనస్సును శుద్ధిచేసికోవాలంటే ఈశ్వరునివైపుకి మళ్లించి కోరికలను తగ్గించుకోవచ్చు.

ఆభక్తిలో కూడా పరమేశ్వరుని నిజరూపం అవగతం కాదు. నీ భావాన్ని బట్టి దర్శనం ఉంటుంది. భక్తి తీవ్రతలో నిన్ను నీవు మరిచిపోతావు. అందులో కూడా నీ నిజరూపాన్ని దర్శించలేవు. ఆ మనస్సు కూడా అణగినపుడే పరమశాంతి లభిస్తుంది. ఆ మనస్సు వేదాంత జ్ఞానంతో నింపబడినపుడు మాత్రమే. అది మొదటినుండీ సాగాలిసుమా!

ఆత్మపై ధ్యానమేమిటి? అది ధ్యానానికి లొంగేదా? అది మనస్సునకు అతీతం కదా! అయినా ఇది సంసారానికి అతీతమని భావించినపుడు ఉన్నత భావాలు కలుగవా? అట్లా కొంతకాలం సాగనీయండి. ఆభావన యొక్క తీవ్రత వల్లనే అది వ్యక్తీకరింపబడుతుంది.

అమ్మవారు మాయను ధరించి మనులను ముంచి లీలగా చూస్తూ వీటికి అంటీముట్టకుండా ఉంది. అమ్మా! నీజ్ఞాన స్వరూపాన్ని చూపమని ప్రార్థిస్తే ఆమెయే కరుణిస్తుంది. ఆమెయే సంకల్పించాలి. ఆమె సంకల్పమూ మార్గము ఒక్కటే. అంతకంటె ఆమె సంకల్పమే అంతిమలక్ష్యం, మార్గానికి అంతమూ. ఆమె మనలను సాధనాలుగా చేసికొంది. మమ్ములను మంచి సాధనాలుగా తీర్చిదిద్దుమని ఆమెనే ప్రార్థిద్దాం, జ్ఞాన భిక్షను ప్రసాదించుమని వేడుకొందాం.

జ్ఞాన వైరాగ్యసిద్ధ్యర్థం భిక్షాందేహిచ పార్వతి

☆ ☆ ☆

అనువాదకుని పరిచయం

దేవరకొండ శేషగిరిరావు, గోకులం దగ్గర, అశోక్ నగర్,
వెంకటాద్రి రెసిడెన్సీ, కాకినాడ. సెల్ :- 9959288443

రచనలు: కామకోటి స్వామివారి 1. అద్వైత సాధన 2. గురుసంప్రదాయం, 3. అద్వైతం 4. శివసంహిత 5. ఘేరండ సంహిత 6. అనేక రామాయణాలలో సుందరకాండ 7. విజ్ఞానభైరవ తంత్రం 8. లాక్షానందతరంగిణి 9. యోగయాజ్ఞవల్క్య సంహిత

ప్రతులకు : నవోదయా బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్

10. దశమహావిద్యలు 11. ఉత్పలదేవుని శివస్తోత్రావళి 12. అప్పయ్య దీక్షిత వరద రాజస్తవం 13. ఆత్మార్పణస్తుతి

ప్రతులకు: ఋషిపీఠం ప్రచురణలు, చిక్కడపల్లి, హైదరాబాద్

14. దినచర్య 15. యక్షప్రశ్నలు 16. ధర్మ సందేహాలు 17. గోరుముద్దలతో 18. వసుభాగుని పంచతంత్రకథలు 19. మంత్రయోగ సంహిత 20. పురాణాలలో రత్న పరీక్ష 21 పండుగలు - ఓషధులు - వైద్యం 22 సుభాషితరత్నాకరం 23. చాణక్య నీతిసూత్రాలు 24. తీర్థ యాత్ర 25. అభినవ గుప్తుని గీతార్థసంగ్రహం

ప్రతులకు: గొల్లపూడి వీరాస్వామి, కోటగుమ్మం, రాజమండ్రి

26. విగ్రహ పరమార్థం 27. శివస్వరోదయం

ప్రతులకు: రోహిణీ పబ్లికేషన్స్, కోటగుమ్మం, రాజమండ్రి

28. ఆనంద రామాయణం

ప్రతులకు: శివకామేశ్వరి గ్రంథమాల, కృష్ణలంక, విజయవాడ

29. మనదేవతలు - గణపతి 30. నటరాజు 31. శివుడు 32. విష్ణువు 33. కుమారస్వామి 34. సూర్యుడు 35. శక్తి 36. గ్రామాది దేవతలు 37. రూపగోస్వామి - పద్యావళి 38. లలితా సహస్రనామాలు 39. కబీర్‌పాటలు పాండురంగవిఠల 40. పార్వతి + లక్ష్మి + సరస్వతి

ప్రతులకు: రామకృష్ణ మఠం, దోమలగూడ, హైదరాబాద్

43. తంత్రపరిచయం 44. కులార్ణవతంత్రం

ప్రతులకు: శ్రీ జె. జగన్నాథ శర్మ, మాధవరం, వయా అంబాజీపేట

45. తంత్రం - వైద్యం 46. పురాణాలు - పర్యావరణం

ప్రతులకు: సాహితీ ప్రచురణలు, సూర్యారావుపేట, విజయవాడ

47. భారతీయ సంస్కారములు 48. శివసహస్రనామములు

ప్రతులకు: తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి

49. భారత కథలు- అంతరార్థం 50. భావమయం జగత్ 51. భావాంబర విహారం (ఇవి నేడు లేవు)

వృత్తి: (విశ్రాంత) ఆంగ్లోపన్యాసకత్వం
ప్రవృత్తి : భారతీయ సంస్కృతికి అర్థకత్వం

మా ఇతర ప్రచురణలు

కంచి పరమాచార్య
అమృతవాణి

ద్వితీయ భాగము

నమో: నమ:

శ్రీ దేవరకొండ శేషగిరిరావు

తృతీయ భాగము

షట్పదీస్తోత్రము

శ్రీ దేవరకొండ శేషగిరిరావు

చతుర్థ భాగము

సనాతన ధర్మంలో సంఘసేవ

శ్రీ దేవరకొండ శేషగిరిరావు

ప్రచురణ

మహా విద్యాపీఠం

ఎయిర్‌ఫోర్స్ అకాడమీ రోడ్, దుండిగల్, హైదరాబాద్ - 500 043